

ఈనాడు

విజయవాడ 14-8-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 5
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




చరిత్రలోనే కనీవిని ఎరుగని తక్కువ తరుగు
బంగారం కొనేటప్పుడు మీరు పెద్ద మొత్తంలో డబ్బులు ఆదా చేస్తారు.
ఇలాంటి వేలాది డిజైన్లలో అందమైన నగలు, ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
KERALA BENGALI 6%
BOMBAY LAPPA 6%
LAPPA FANCY 6%
KERALA FANCY 6%
KERALA SAKOPARA 6%
KERALA FANCY 6%
CALCUTTA 8%
BOMBAY FANCY 9%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
BOMBAY FLOWER STEP 10%
CB U SHAPE 11%
BOMBAY DYE NAGAS 12%
BOMBAY DULL POLISH 12%
PACHI 12%
DIVINE 12%
LAPPA FANCY 6%
BOMBAY LAPPA 6%
KERALA BENGALI 6%
CHOKER KERALA SAKOPARA 6.5%
CALCUTTA 8%
BOMBAY FANCY 9%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
NELLORE 9.5%
BOMBAY U SHORT 10%
CB CHOKER 11%
CB U SHAPE 11%
CB U SHAPE 11%
BOMBAY DYE NAGAS 12%
BOMBAY DYE NAGAS 12%
PSI DYE NAGAS 12%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
BLACKBEADS 10%
తరుగు V.A. 10%
ఇలాంటి వందలాది బ్లాక్ బీడ్స్ డిజైన్లు, కేవలం 10% తరుగుకే మా వద్ద లభిస్తాయి.
ఇలాంటి రకరకాలైన డిజైన్లలో అందమైన కడా నగలు, ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
2% PUNJABI KADA
5% CNC KADA
5% CNC KADA
8% CASTING JUMPER
8% CASTING JUMPER
9% DEEPA CNC
9% DEEPA CNC
వందలాది డిజైన్లలో ఇలాంటి కమ్మలు / జుమ్కీలు మా వద్ద తక్కువ తరుగులో లభిస్తాయి. ఇక్కడ కొన్ని కమ్మలు / జుమ్కీలు మాత్రమే చూపించాం.
5.5% 5.5% 5.5% 5.5% 5.5% 5.5%
8% 8% 8% 8% 8% 8%
ఇలాంటి రకరకాలైన డిజైన్లలో అందమైన బ్రేస్‌లెట్ నగలు ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
బ్రేస్‌లెట్
MC DELHI V.A.3%
CASTING LADIES STONE 8%
CASTING LADIES STONE 8%
CASTING MC CHAIN PLAIN 8%
BOMBAY TENDALKAR 8%
KATTIYAR STAMPING 8%
LOTUS SAND 8%
RKT MC CHAIN PLAIN 10%
CB 11%
రకరకాలైన కాస్టింగ్ ఉంగరాలు (రాళ్ల పొదిగిన / రాళ్లు లేని) ఇదే తరుగులో మా వద్ద లభ్యం. ఇక్కడ కొన్ని ఉంగరాలు మాత్రమే చూపించాం.
5.5% 5.5% 5.5% 5.5% 8% 8% 8% 8% 8% 8% 8%
8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8%
8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8%
8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8% 8%
ఇండియాలోనే అతి తక్కువ ధరకు వజ్రాభరణాలు
రూ. 54000 / క్యారెట్
1 Carat = 200 Milligrams
ఇతర షోరూం మాదిరిగా తరుగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!
నాణ్యత సర్టిఫికెట్ | కలర్ & క్లారిటి | ఎక్స్ఛేంజ్ పాలసి
నగల బుకింగ్ పథకం
OLD GOLD EXCHANGE
5 to 11 month scheme
ఖర్చు లేకుండా, పాత నగల అదే బరువుకు కొత్త నగ!
100% తరుగు లేదు
డబ్బులు చెల్లించి కూడా ఈ పథకంలో చేరవచ్చు !
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
Lalithaa
www.lalithaajewellery.com
PLEASE WATCH MY VIDEOS
@M.KIRANKUMAR_TELUGU
MY PERSONAL INSTAGRAM PAGE
విజయవాడ • వైజాగ్ • గోపాలపట్నం • విజయనగరం • అనకాపల్లి • గాజువాక • శ్రీకాకుళం
భీమవరం • అమలాపురం • రాజమహేంద్రవరం • గుంటూరు • ఒంగోలు • నరసారావుపేట
కర్నూలు • కడప • సూళ్లూరుపేట • గూడూరు • నెల్లూరు • చిత్తూరు • తిరుపతి • తుని
కాకినాడ • అనంతపురం
లక్షలాది డిజైన్లు! | 100% HUID Customer Care: 90 99 999 916
VIRAL VIDEO 2.5+M VIEWS

ఈనాడు

విజయవాడ 14-8-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 5
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వణికించిన వాన

అత్యధికంగా చుండూరులో 27.24, చేబ్రోలులో 23.4 సెం.మీ. వర్షం

- గుంటూరు, విజయవాడల్లో రోడ్లపై 2-3 అడుగుల ఎత్తున వరదనీరు
- కాజ, ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారులపై ప్రవాహం
- వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి.. ఇద్దరు గల్లంతు
- దిగువ ప్రాంతాల్లో ప్రజల్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం

ప్రకాశం బ్యారేజికి పోటెత్తిన వరద..

ఈనాడు – అమరావతి, బృందం

మంగళవారం రాత్రి 9 గంటలకు మొదలై బుధవారం తెల్లారేదాకా ఒకటే కుండపోత.. గంటల వ్యవధిలోనే 15-20 సెం.మీ. వర్షం.. ఎడతెరిపి లేని వర్షాలతో గుంటూరు, విజయవాడ నగరాల్లోని పలు ప్రాంతాలు చెరువుల్ని తలపించాయి. రోడ్లపై 2-3 అడుగుల ఎత్తుకు పైగా నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి ప్రవేశించింది. అత్యధికంగా బాపట్ల జిల్లా చుండూరు మండలంలో 27.24, గుంటూరు జిల్లా చేబ్రోలులో 23.4, దుగ్గిరాలలో 22.58, తాడికొండలో 22.50, మంగళగిరిలో 19.48, నాగాయలంక 19.1, పెదకాకానిలో 18.68, తుళ్లూరులో 18.02, తెనాలిలో 17.84 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాజ, ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారుల పైకి నీరు చేరడంతో రోడ్డంతా వాగులా తయారైంది. పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. వేర్వేరు ఘటనల్లో నలుగురు మరణించగా.. ఇద్దరు గల్లంతయ్యారు. నాగార్జునసాగర్, పులిచింతల నుంచి నీటి విడుదలకు తోడు భారీవర్షాలతో వరద చేరడంతో కృష్ణానదికి వరద పెరిగింది. ప్రకాశం బ్యారేజి 70 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. అక్కడ మొదటి ప్రమాదహెచ్చరిక జారీచేశారు. దిగువప్రాంతాల్లో ప్రజల్ని అప్రమత్తం చేశారు. సుమారు లక్ష ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా.



కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం రాముడుపాలెంలో ఈదురుగాలులకు పడిపోయిన అరటిచెట్లు

■ బుధవారం ఉదయం కొంత తెరిపి ఇచ్చినా.. సాయంత్రం నుంచి మళ్లీ మొదలైంది. ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 18.8, ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలో 14.3, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 13.3, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 11.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది.



గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం విశదలకు వెళ్లే రోడ్డులో వాగు పొంగి వరద నీటిలో చిక్కుకున్న కారు. అందులో ఉన్న ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు

జలదిగ్బంధంలో గుంటూరు, విజయవాడ

■ గుంటూరు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఏటీఅగ్రహారం, చుట్టుగుంట, రామిరెడ్డి నగర్, శ్రీరామ్‌నగర్, (మిగతా 11లో)



జలదిగ్బంధంలో గుంటూరులోని మురుగుపేట

ప్రజల్ని అప్రమత్తం చేయండి

చెరువులు, కాలువ గట్లు పటిష్ఠం చేయండి

భారీవర్షాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

11లో

బంగాళాఖాతంలో అల్పపీడనం

పోర్టులకు మూడో నంబరు హెచ్చరిక

11లో

మరోసారి అమెరికాకు మోదీ!

- 26న ఐరాస సమావేశాల్లో ప్రసంగించనున్న ప్రధాని
- ట్రంప్‌తో భేటీ ఖరారుకు విదేశీ వ్యవహారాలశాఖ కసరత్తు



ఐరాస: అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో మరోసారి ఆ దేశంలో ప్రధాని మోదీ పర్యటించనున్నట్లు తెలుస్తోంది. న్యూయార్క్ వేదికగా సెప్టెంబరులో జరగనున్న ఐక్యరాజ్య సమితి 80వ సమావేశాలకు మోదీ హాజరుకానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలు సెప్టెంబరు 9న ప్రారంభం కానుండగా.. 23-29 మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరగనున్నాయి. 26న భారత ప్రభుత్వ అధిపతి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని ఐరాస తాత్కాలిక వక్తల జాబితా పేర్కొంది. కాగా అదే రోజు ఇజ్రాయెల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల ప్రభుత్వాధినేతలు సైతం ప్రసంగాలు చేయనున్నారు. అయితే ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఐరాసకు చెందిన ఈ ప్రతిష్ఠాత్మక సమావేశాల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా పలు దేశాల ప్రభుత్వాధినేతలతో భారత ప్రధాని భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యేకించి ట్రంప్, మోదీ భేటీకి అధికారికంగా షెడ్యూల్‌ను ఖరారు చేయించేందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ కసరత్తు మొదలుపెట్టిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు జస్టిస్‌ల ప్రమాణం



జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

ఈనాడు, అమరావతి: హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ బుధవారం ప్రమాణం చేయించారు. అంతకుముందు అదనపు న్యాయమూర్తులుగా ఉన్న ఈ నలుగురిని 'శాశ్వత' న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారధి చదివి వినిపించారు. మొదటి కోర్టు హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, ప్రమాణం చేసిన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివప్రతాప్, రాష్ట్ర పీపీ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే

ఏ కంపెనీ ముందుకొస్తుంది?

నామమాత్రపు ధరతో భూకేటాయింపులను చిన్నచూపు చూడకూడదు

విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆలోచన

'కాగ్నిజెంట్'కు భూకేటాయింపుపై విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: ప్రముఖ కంపెనీలను ఆకర్షించాలంటే ప్రోత్సాహకాలు ఇవ్వడం తప్ప మరో మార్గం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అభిప్రాయపడింది. పెట్టుబడులను ఆకర్షించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలిస్తోందని తెలిపింది. ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే పెట్టుబడులు పెట్టేందుకు ఏ కంపెనీ ముందుకొస్తుందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే బెంగళూరు, హైదరాబాద్‌లకు కంపెనీలు తరలిపోతాయని పేర్కొంది. (మిగతా 2లో)



జగన్ అసహనం.. అరాచకాలు సాగనందుకే

ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: పులివెందుల ప్రజలు ఇప్పుడిప్పుడే వైకాపా నాయకుల అరాచకాల నుంచి బయట పడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ పులివెందులలో ఎప్పుడూ చేసే అరాచకాలు ఈసారి సాగనందుకే అసహనంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'వైఎస్ హయాం నుంచి అక్కడ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగలేదు. ఇక జగన్ నైజం అందరికీ తెలిసిందే. అక్కడ నామినేషన్ వేయడానికే భయపడే పరిస్థితి. అలాంటిది ఈ ఎన్నికల్లో 11 మంది నామినేషన్లు వేశారు. రెండు పోలింగ్ బూత్‌లలో ఎప్పుడైనా రీపోలింగ్ జరిగిందా? శాంతిభద్రతల నిర్వహణ పటిష్ఠంగా జరిగింది కాబట్టే ప్రజలు ధైర్యంగా బయటకు వచ్చి ఓటు వేశారు' అని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం నిలబడింది: లోకేశ్

పులివెందులలో 45 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యం నిలబడిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎప్పుడూ బలవంతపు (మిగతా 2లో)

తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు

పులివెందుల ఉపఎన్నిక చూసి జగన్‌కు ప్రజాస్వామ్యం గుర్తొచ్చింది

ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

11లో

పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలను రద్దు చేయాలి

- కేంద్ర బలగాల భద్రతలో తిరిగి నిర్వహించాలి
- అప్పుడు ప్రజలు ఎవరికి ఓటేస్తారో చూద్దాం
- సీఎం చంద్రబాబుకు జగన్ సవాల్
- చంద్రబాబుకు బహుశా ఇదే చివరి ఎన్నిక.. రామా కృష్ణా అనుకుంటే పుణ్యమైనా వస్తుందని వ్యాఖ్య



ఈనాడు, అమరావతి: 'పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో వైకాపా ఏజెంట్లు లేకుండా చేసి పోలింగ్ నిర్వహించారు. ప్రతీ కేంద్రానికి సంబంధించిన వెబ్ క్యాస్టింగ్‌ను, బూత్ ఆవరణలోని సీసీ టీవీ ఫుటేజ్‌ని వైకాపా అభ్యర్థులకు ఇచ్చే ధైర్యం మీకుందా' అని సీఎం చంద్రబాబును.. వైకాపా అధ్యక్షుడు జగన్ సవాల్ చేశారు. 'చంద్రబాబు నిన్న పులివెందుల రూరల్ ఓట్లను దౌర్జన్యంగా వేసుకున్నారు. చంద్రబాబూ.. మీ పరిపాలన మీద మీకు నమ్మకం ఉంటే, ప్రజలు మీకు ఓటు వేస్తారనే నమ్మకం ఉంటే, ఈ ఉప ఎన్నికలను రద్దు చేసి కేంద్ర బలగాలను తీసుకువచ్చి వారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా తిరిగి ఎన్నికలు నిర్వహించండి. అప్పుడు ప్రజలు ఎవరికి ఓటేస్తారనేదీ సవాల్‌గా తీసుకుందాం. మీ జీవితానికి బహుశా ఇదే ఆఖరి ఎన్నిక కావచ్చు.. రామా కృష్ణా అనుకునే వయసులో కనీసం ఆ మాటలన్నా అనుకుంటే పుణ్యమైనా వస్తుంది. ఇప్పటికైనా (మిగతా 2లో)

జగన్ భీమవరం పర్యటనలో కార్యకర్తల బరితెగింపు

నృత్యాలు చేస్తూ హంగామా.. ట్రాఫిక్‌కు ఆటంకం

జోరువానలో ప్రయాణికులకు ఇక్కట్లు

8లో

సురక్షితంగా లేని భవనాల్లో తరగతులు వద్దు

పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: తరగతుల నిర్వహణకోసం.. సురక్షితంగా లేని బడి భవనాలకు అవసరమైతే మరమ్మతులు చేయాలని, లేదంటే వాటిని కూల్చివేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల భద్రతకు మార్గదర్శకాలు విడుదల చేసింది. భవనాలు సురక్షితంగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించింది. కూల్చివేత తర్వాత ఆ స్థలాన్ని క్రీడలు, వృత్తి నైపుణ్యం, మధ్యాహ్న భోజనం పథకానికి ఉపయోగించుకోవచ్చని తెలిపింది. కూల్చివేసినా.. మరమ్మతులు చేపట్టినా తరగతుల నిర్వహణకు తాత్కాలికంగా సురక్షిత ప్రత్యామ్నాయ భవనాన్ని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. జిల్లా విద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరమ్మతులు, కూల్చివేతల పురోగతిపై క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, నెలవారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

ఇదీ సంగతి!



'ఓటు' పోటు మాటలు

బిహార్ జాబితాపై అధికార, విపక్షాల వాగ్బాణాలు

- ఓటుచోరీతోనే రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ గెలిచారు
- వారంతా రాజీనామా చేయాల్సిందే
- పౌరసత్వానికి ముందే సోనియాకు ఓటుహక్కు: భాజపా
- సీబీఐ, ఈడీ తర్వాత ఈసీని వాడుతున్నారన్న తేజస్వి



ఓటరు జాబితాలో మృతి చెందినట్లు చూపించిన వారితో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

దిల్లీ: ఓటర్ల జాబితా రూపకల్పన, ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరుపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం ముదురుతోంది. స్వతంత్ర వ్యవస్థల్ని కేంద్ర సర్కారు గుప్పిట్లోకి తీసుకుంటోందని విపక్షం ఆరోపిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు ఓటుచోరీతోనే గెలిచారని భాజపా కొత్త ఆరోపణలు చేసింది. ఇటలీకి చెందిన సోనియా గాంధీ భారతదేశ పౌరసత్వం తీసుకోకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు నమోదైందని గుర్తుచేసింది. బిహార్ శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఈసీతో భాజపా కుమ్మక్కయి ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు ఉండేలా చూసుకుంటోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ చెబుతున్నారు.

'మృత' ఓటర్లతో టీ తాగాను: రాహుల్

బిహార్‌కు చెందిన కొంతమంది 'మృత'ఓటర్లతో కలిసి తేనీరు తాగే భాగ్యం తనకు కలిగిందని, ఆ అవకాశం కల్పించిన ఈసీకి ధన్యవాదాలు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిహార్‌కు చెందిన ఏడుగురు ఓటర్లు దిల్లీలో రాహుల్‌ను కలిశారు. వారు మృతి చెందారంటూ ఇటీవల ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, తనకు ఎన్నో గమ్మత్తైన అనుభవాలున్నా ఇలా 'మృతుల'తో టీ తాగడం మహాగొప్పగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత అత్యంత (మిగతా 2లో)

2028 నాటికి

క్యాన్సర్ ఆసుపత్రి సిద్ధం

- నందమూరి బాలకృష్ణ వెల్లడి
- తుళ్లూరు సమీపంలో నిర్మాణ పనులకు భూమి పూజ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో రూ.750 కోట్లతో చేపడుతున్న క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను 2028 నాటికి పూర్తి చేస్తామని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్- రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. రాజధానిలోని తుళ్లూరు సమీపంలో అత్యాధునిక క్యాన్సర్ కేర్ క్యాంపస్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 'వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మాణం రెండు దశల్లో పూర్తిచేస్తాం. క్యాన్సర్ తీవ్రత పెరుగుతున్నందున అధునాతన చికిత్స, పరిశోధన విభాగాలు, సౌకర్యాలతో క్యాన్సర్ కేర్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలో బసవతారకం ఆసుపత్రి నిర్మాణానికి 2019 ఫిబ్రవరి 14నే భూమిపూజ (మిగతా 2లో)



ఆసుపత్రికి భూమిపూజ చేస్తున్న బాలకృష్ణ. చిత్రంలో బ్రాహ్మణి తదితరులు



విలేకర్లతో మాట్లాడుతున్న బాలకృష్ణ. చిత్రంలో డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ఆసుపత్రి సీఈఓ కృష్ణయ్య, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ పోలవరపు రాఘవరావు, జేఎస్ఆర్ ప్రసాద్ తదితరులు

2028 నాటికి క్యాన్సర్ ఆసుపత్రి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

చేసినా, తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో పనులు ఆపాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల ప్రారంభానికి మళ్లీ భూమిపూజ చేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్యం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల గురించి ఆలోచిస్తారు' అని బాలకృష్ణ అన్నారు.

నాణ్యమైన వైద్యం అందాలన్నది అమ్మ కోరిక

'క్యాన్సర్‌తో బాధపడుతున్న పేద రోగులకు అతి తక్కువఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం అందించాలన్నది అమ్మ కోరిక. నాన్న ఎన్టీఆర్ చొరవతో అమ్మ కోరిక మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటైన బసవతారకం ఆసుపత్రి దినదినాభివృద్ధి చెందుతూ దేశంలోనే అత్యుత్తమ క్యాన్సర్ ఆసుపత్రిగా సేవలు అందిస్తోంది' అని బాలకృష్ణ తెలిపారు. క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ బసవతారకం ఎంతో గొప్ప మనిషని, అమెరికాలో తన దగ్గర వైద్యానికి వచ్చినప్పుడు తెలుగు వారందరికీ క్యాన్సర్‌కు అద్భుతమైన వైద్యం అందించాలని కోరారని తెలిపారు. అమరావతిలో నిర్మించే ఆసుపత్రి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బసవతారకం క్యాన్సర్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు నారా బ్రాహ్మణి, పోలవరపు రాఘవరావు, గడ్డం దశరథరామిరెడ్డి, జేఎస్ఆర్ ప్రసాద్‌లతో పాటు.. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు పి.నారాయణ, సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసహనం.. అరాచకాలు సాగనందుకే

(మొదటి పేజీ తరువాయి)

ఏకగ్రీవం జరిగే చోట ఈ ఎన్నికల్లో 11 మంది పోటీలో నిలబడ్డారన్నారు. 2024 ఎన్నికల్లో వైకాపాకు ఎన్ని సీట్లు వచ్చాయో.. అంతమందే పులివెందులలో పోటీ చేయడం విచిత్రమన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం చూసి వైకాపా ఓర్వలేకపోతోందని ధ్వజమెత్తారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నామినేటెడ్ పదవులు రాని వారు నిరాశపడాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తెలిపారు. రాష్ట్రానికి సెమీకండక్టర్ యూనిట్ రావడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

వచ్చేనెల 3లోగా తెదేపా రాష్ట్ర కమిటీ

'సుపరిపాలనలో తొలి అడుగు' 13 నియోజకవర్గాల్లో సరిగ్గా జరగలేదు

ఉరవకొండ, పొన్నూరు, పాలకొండ తదితర నియోజకవర్గాలు వెనకబడటంపై చంద్రబాబు అసంతృప్తి

సరిగా పనిచేయని ఇన్‌ఛార్జుల మార్పు ● పార్టీ సంస్థాగత వ్యవహారాలపై సుదీర్ఘ సమీక్ష

ఈనాడు, అమరావతి: తెదేపా రాష్ట్ర కమిటీ నియామక ప్రక్రియను వచ్చే నెల మూడో తేదీలోగా పూర్తి చేయాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం సుదీర్ఘంగా సమీక్షించారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పార్టీ కార్యాలయంలో ఉన్నారు. మంత్రి నారా లోకేశ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సంస్థాగత వ్యవహారాలు చూసే పార్టీ కార్యాలయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాలవారీగా పార్టీ కార్యవర్గాల నియామకాన్ని ఈ నెల 25లోగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగిన తీరును నియోజకవర్గాలవారీగా సమీక్షించారు. 13 నియోజకవర్గాల్లో 30 వేలకంటే తక్కువ ఇళ్లకు పార్టీ నాయకులు వెళ్లడంపై అసహనం వ్యక్తంచేశారు. వాటిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండతోపాటు, పొన్నూరు, పాలకొండ తదితర నియోజకవర్గాలు ఉన్నాయి. పార్టీ ఇన్‌ఛార్జులు ఉన్న నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల కార్యక్రమం సరిగ్గా జరగలేదని గుర్తించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల



మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు వినతి పత్రాలు ఇస్తున్న ప్రజలు

నుంచి వివరణ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఆ నియోజకవర్గాల్లోనూ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టంచేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జుల పనితీరు బాగాలేని చోట మార్పులు, చేర్పులపై చర్చించారు. పనితీరు అసలు బాగాలేని నియోజకవర్గ ఇన్‌ఛార్జులను తొలగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆ 13 నియోజకవర్గాలు మినహా... మొత్తం మీద 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం బాగా జరిగిందని సీఎం సంతృప్తి వ్యక్తంచేశారు. 40 రోజుల్లో 1.20 కోట్ల కుటుంబాలను పార్టీ నాయకులు కలిశారని తెలిపారు. రోజుకు సగటున 1.80 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు.

బీమా సొమ్ము ఎమ్మెల్యేలే ఇవ్వాలి

పార్టీ కార్యకర్తల సంక్షేమానికి చేపడుతున్న చర్యలపైనా సీఎం సమీక్షించారు. ప్రమాద, జీవిత బీమా చెల్లింపులు ఎలా జరుగుతున్నాయన్నదానిపై ఆరా తీశారు. గడచిన కొన్ని నెలల్లో 400 మందికి బీమా చెల్లింపులు జరిగితే... వారిలో 100 మంది కుటుంబాలకే ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేశారని కార్యాలయ ప్రతినిధులు తెలియజేశారు. మిగతా వారికి ఎమ్మెల్యేలు ఎందుకు ఇవ్వలేదని సీఎం అసహనం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు స్వయంగా వెళ్లి ఇస్తేనే...కష్టకాలంలో పార్టీ అండగా ఉందన్న భరోసా కార్యకర్తల్లో కలుగుతుందని సీఎం పేర్కొన్నారు.

25న అనంతపురంలో 'స్త్రీశక్తి' సభ

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం 'స్త్రీశక్తి'ని శుక్రవారం ప్రారంభించాక... ఈ నెల 18 నుంచి 24 వరకు వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా దానిపై పార్టీ శ్రేణులతో ప్రచార కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 25న అనంతపురంలో మహిళలతో భారీ ఎత్తున 'స్త్రీశక్తి' సభను నిర్వహిస్తారు. సీఎం హాజరవుతారు.

★ పార్టీ కార్యాలయానికి వచ్చినప్పుడు, తిరిగి వెళ్లే ముందు ముఖ్యమంత్రి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

వజ్రకరూరు సర్పంచికి జాతీయ పురస్కారం

'సర్పంచ్ సంవాద్' పోటీల్లో ప్రథమ స్థానం



మోనాలీసా

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: 'భారత నాణ్యత మండలి' దేశంలోని సర్పంచులకు ఆన్‌లైన్‌లో నిర్వహించే 'సర్పంచ్ సంవాద్' పోటీల్లో అనంతపురం జిల్లా వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి మండ్ల మోనాలీసా జాతీయస్థాయిలో జులై మాసానికి మొదటి స్థానంలో నిలిచారు. 'చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయత్' అనే అంశం మీద తన ఆలోచనలను పంచుకుని రూ.35 వేల నగదు బహుమతికి ఎంపికయ్యారు. ఈ పోటీల్లో ఆమె ఒకటిన్నర నిమిషం నిడివి గల వీడియో ద్వారా పిల్లల బాగోగులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. నేటి పిల్లలే భావి పౌరులు. వారే భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధికి కారకులు. వారిని ఆ కోణంలో గుర్తించి విద్యాబుద్ధులు నేర్పి, ఆరోగ్యం, ఆటలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తే ఉన్నతంగా రాణిస్తారన్నది సర్పంచి మండ్ల మోనాలీసా అభిప్రాయం. ఎంఏ, బీఈడీ చదువుకున్న ఆమె గతంలో ఐదేళ్లపాటు ఒప్పంద విధానంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఈ అనుభవంతో ఆమె పలు అంశాలను స్థానికంగా అమలు చేశారు.

పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలను రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మారండి' అని వ్యాఖ్యానించారు. జగన్ బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

ఓటరుకో రౌడీని తెచ్చారు

'ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు 700 మంది పోలీసులను నియమించారు. మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య, ఆదినారాయణరెడ్డి, తెదేపా నేత బీటెక్ రవి తమ నియోజకవర్గాల నుంచి మనుషులను దించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి నాలుగైదు వందల మంది తెదేపా నాయకులొచ్చారు. వీళ్లంతా కలిపితే ఏడెనిమిది వేల మంది, అంటే ఒక్కో ఓటరుకు ఒక రౌడీని తెచ్చారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కళ్లెదుటే దొంగ ఓట్లు వేశారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి చిన్నకొత్తపల్లి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి దౌర్జన్యం చేశారు. తెదేపా మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు వరుసకు అల్లుడైన డీఐజీ కోయ ప్రవీణ్ పచ్చచొక్కా వేసుకుని అక్కడ దౌర్జన్యకాండకు తోడుగా నిలిచారు. పోలీసులు ఎవడెవడు ఎక్కడుండాలి? సీఐ ఎవడుండాలి? ఎస్సై ఎవడుండాలి? అని ఎంచుకుని నియమించారు' అని ఆరోపించారు.

ఆంధ్రాలో ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ మాట్లాడరేం?

ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటంలో మీరూ చేరతారా అని ఒక విలేకరి అడగ్గా.. 'అసలు దేశంలో ఓట్లలో భారీ అక్రమం జరిగింది ఏపీలోనే. గతేడాది ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు సుమారు 48 లక్షలు ఎక్కువ. రేవంత్‌రెడ్డి (తెలంగాణ సీఎం) ద్వారా చంద్రబాబు రాహుల్‌గాంధీతో హాట్‌లైన్‌లో టచ్‌లో ఉన్నారు. అందుకే ఏపీలో ఓట్ల చోరీ గురించి రాహుల్ మాట్లాడరు. కళ్ల ముందే చంద్రబాబు ఇన్ని కుంభకోణాలు చేస్తున్నా, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఏపీ ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ ఏనాడైనా ప్రశ్నించారా? కానీ ప్రతిపక్షంలో ఉన్న నాపైన మాత్రం వైల్డ్ కామెంట్స్ చేస్తున్నారు' అని విమర్శించారు.

కేపీఎంజీ వ్యవహారంపై తలాతోక లేని సమాధానం

మద్యం కుంభకోణంలో కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ వ్యవహారం గురించి విలేకరి అడగబోగా.. జగన్ స్పందిస్తూ. . 'కేపీఎంజీకి ప్రభుత్వంతో ఏం సంబంధం? ఏదైనా ప్రభుత్వ శాఖ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన సలహాలు తీసుకునేందుకు కన్సల్టెన్సీని ఆ శాఖాధిపతి నియమించుకుంటారు. ఆ సంస్థ సలహాలిస్తే, వాటిని శాఖలో అమలు చేసి ఉండొచ్చు. అయినా కేపీఎంజీ అనేదేమీ చిన్న గ్రూప్ కాదు, చాలా ప్రసిద్ధమైన సంస్థ' అని అర్థంపర్థం లేకుండా సమాధానమిచ్చారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు నానీ పాల్కీవాలా

పుస్తకావిష్కరణలో కొనియాడిన వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణకుమారి, రాజేంద్రప్రసాద్, రాజమౌళి, రామబ్రహ్మం, అశోక్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: పలు రంగాల్లో ఖ్యాతి గడించిన నానీ పాల్కీవాలా బహుముఖ ప్రజ్ఞావంతుడని సీనియర్ ఐఏఎస్ అధికారి ఎ.వి.రాజమౌళి అన్నారు. బుధవారం విజయవాడలో 'ఆధునిక కాలపు మహనీయుడు నానీ పాల్కీవాలా' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎ.వి.రాజమౌళి, టాటా సెంట్రల్ ఆర్కైవ్స్ మాజీ చీఫ్ ఆర్కైవిస్ట్ నార్ల రాజేంద్రప్రసాద్, ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి తదితరులు హాజరయ్యారు. రాజమౌళి మాట్లాడుతూ రాజ్యాంగ నిపుణుడు, విద్యావేత్త, దౌత్యవేత్త, రచయితగా పాల్కీవాలా సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కుటుంబరావు, చలపతిరావు, గోపాలరావు, పరిమి పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో సుగులూరు చిన్నన్న మృతి



సుగులూరు చిన్నన్న

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని చౌకీ జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వడ్లరామాపురానికి చెందిన విజయ్ ఎలియాస్ సుగులూరు చిన్నన్న ఎలియాస్ నాగన్న (40) మృతి చెందారు. పదో తరగతి వరకు చదివిన ఈయన నక్సలిజం వైపు ఆకర్షితుడయ్యారు. దళంలో వివిధ క్యాడర్లలో పనిచేసిన నాగన్న ప్రస్తుతం దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఈయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది.

'ఓటు'పోటు మాటలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యంగ్యంగా 'ఎక్స్'లో పేర్కొన్నారు. వారి వీడియోను దీనికి జతచేశారు. మృతిచెందినవారికి ప్రయాణ టికెట్లు అక్కర్లేదు కాబట్టి వెళ్లి దిల్లీ చూసిరండి అని ఆయన వారికి చెబుతున్నట్లు దానిలో ఉంది.

ప్రజా ఉద్యమంగా మారుస్తామన్న కాంగ్రెస్

ఓటుచోరీపై ఇక ప్రజల్లోకి వెళ్లి పోరాడతామని, దీనిని ప్రజా ఉద్యమంగా మార్చబోతున్నామని.. గురువారం జిల్లా కేంద్రాల్లో లోక్‌తంత్ర బచావో ర్యాలీలు నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రాహుల్, ఇండియా కూటమిలోని ఇతర నేతలు బిహార్‌కు వెళ్లి ఈ నెల 17 నుంచి 'ఓట్ అధికార్ యాత్ర'లు నిర్వహిస్తారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు. సెప్టెంబరు ఒకటిన పట్నాలో ఈ ఆందోళన ముగుస్తుందని చెప్పారు. దీనికి ముందు, వెనుక ఇతర కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఓటుచోరీ పేరుతో కాంగ్రెస్ ఒక వీడియో రూపొందించి విడుదల చేసింది. తప్పుడు ఓట్లు ఎలా వేస్తున్నారో వివరించింది. దీనిని కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకున్నారు. తప్పుడు ఓటర్ల జాబితా ఆధారంగా 2024 సార్వత్రిక ఎన్నికలు జరిగాయని భాజపా అంటున్నందువల్ల ఆ ఎన్నికలను చెల్లనివిగా ప్రకటించాలని, ప్రధాని మోదీ ఎన్నిక నిజమైనదో కాదో తెలియడానికి వారణాసి ఓటర్ల జాబితాలను బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రచార విభాగాధిపతి పవన్ ఖేడా డిమాండ్ చేశారు.

ఎస్ఐఆర్‌కు మద్దతు ఇస్తే లోక్‌సభను రద్దుచేయండి: తృణమూల్

ఎస్ఐఆర్ కసరత్తుకు ప్రధాని నరేంద్ర మోదీ నిజంగా మద్దతు ఇస్తున్నట్లయితే వెంటనే లోక్‌సభను రద్దుచేయాలని తృణమూల్ సీనియర్‌నేత అభిషేక్ బెనర్జీ కోల్‌కతాలో డిమాండ్ చేశారు. ఎంపిక చేసిన కొన్ని రాష్ట్రాల్లోనే కాకుండా ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా చేయాలని విజ్ఞప్తి చేశారు.

రిగ్గింగుతో నెగ్గింది విపక్ష నేతలే: ఠాకుర్

విపక్ష నేతలు రాహుల్‌గాంధీ (రాయ్‌బరేలీ), ప్రియాంకాగాంధీ (వయనాడ్), అభిషేక్ బెనర్జీ (డైమండ్ హార్బర్), అఖిలేశ్ యాదవ్ (కన్నౌజ్)లు ఓటుచోరీ ద్వారానే ఆయా లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించారని భాజపా ఆరోపించింది. వారంతా తమ సభ్యత్వాలకు రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకుర్ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఒక్క వయనాడ్‌లోనే 93,499 మంది ఓటర్లపై అనుమానాలున్నాయని, రాయ్‌బరేలీలో ఇలాంటివారు 2.99 లక్షల మంది ఉన్నారని చెప్పారు. డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్, సమాజ్‌వాదీ నేత డింపుల్ యాదవ్ కూడా రిగ్గింగు ద్వారానే ఆయా ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. తప్పులు చేసినవారే అరిచి గీ పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని, సోనియాగాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరును చేర్చారని భాజపా నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. పౌరసత్వం లేనివారికి కాంగ్రెస్ హయాంలో ఓటుహక్కు ఎలా కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

'భాజపా కార్యకర్తలకు రెండేసి ఐడీలు'

బిహార్‌లోని భాజపా నేతలు, కార్యకర్తలకు ఒకే అసెంబ్లీ స్థానంలో రెండేసి చొప్పున ఓటరు ఐడీలను ఈసీ జారీ చేస్తోందని తేజస్వీ యాదవ్ మరోసారి ఆరోపించారు. ఓటరు జాబితాను తారుమారు చేసేందుకు భాజపాతో కలిసి ఈసీ పనిచేస్తోందని పట్నాలో విమర్శించారు. ముజఫర్‌పుర్ మేయర్ నిర్మలాదేవి (భాజపా)కి కూడా ఒకే అసెంబ్లీ స్థానంలో రెండు ఓటరు ఐడీలు ఉన్నాయని చెప్పారు. గత ఎన్నికల్లో విపక్షాలపైకి సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను విభాగాలను భాజపా పంపిందని, అవన్నీ పెద్దగా ప్రభావం చూపడం లేదని ఈసీని రంగంలోకి దింపిందని విమర్శించారు. 2020లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రం మొత్తంమీద తమకు, ఎన్డీయేకు మధ్య ఓట్ల తేడా 12,000 మాత్రమేనని, కొన్నిచోట్ల 12.. 50.. 500 వ్యత్యాసంతో ఓడిపోయామని తేజస్వి చెప్పారు. ముజఫర్‌పుర్ మేయర్‌కు ఈసీ నోటీసులు పంపింది. ఈసీ మాజీ ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ మన దేశంలోనే ఉన్నారని, విదేశాలకు వెళ్లిపోలేదని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. 2024 సార్వత్రిక ఎన్నికలు ఆయన హయాంలోనే జరిగాయి.

లాటరీ విధానంలో బార్ లైసెన్సుల జారీ

● 840 బార్లకు నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: మూడేళ్ల కాలపరిమితితో నూతన బార్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఖరారు చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకూ ఈ విధానం అమల్లో ఉంటుంది. లైసెన్సుల జారీకి మొత్తం 840 బార్లను నోటిఫై చేసింది. లాటరీ విధానంలో లైసెన్సుదారును ఎంపిక చేస్తారు. ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఈ మేరకు బార్ పాలసీ విధివిధానాలు ఖరారు చేస్తూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

■ ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ ప్రకారం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే బార్ తెరిచి ఉంచాలి. కొత్త విధానంలో ఉదయం 10 నుంచి రాత్రి 12గంటల వరకూ తెరవచ్చు. క్వార్టర్ రూ.99కు లభించే మద్యం.. బార్లలో విక్రయించడానికి అనుమతి లేదు. ■ గీత కార్మిక కులాల కోసం 10% బార్లు రిజర్వు చేశారు. వీటికి సాధారణ బార్ల లైసెన్సు రుసుముల్లో 50 శాతమే రుసుముగా నిర్ణయించారు. ■ తిరుపతి మినహా రాష్ట్రంలోని మిగతా విమానాశ్రయాల్లో బార్ల ఏర్పాటుకు అనుమతిస్తారు. దాని విధివిధానాలు విడిగా ఖరారు చేస్తారు.

ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే ఏ కంపెనీ ముందుకొస్తుంది?

(మొదటి పేజీ తరువాయి)


రాష్ట్రంలో ఐటీ కంపెనీల ఏర్పాటు వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని.. నామమాత్రపు ధరతో భూకేటాయింపులను చిన్నచూపు చూడకూడదని, భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించింది. పెట్టుబడులు రాకుంటే వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలిపోతుందని, ఖాళీ భూములు తప్ప.. రాష్ట్రానికి ఆదాయం ఎక్కడ నుంచి వస్తుందని ప్రశ్నించింది. వివిధ సంస్థలకు భూకేటాయింపు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కౌంటర్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంపెనీలకు భూకేటాయింపులను సవాలు చేస్తూ ఇప్పటికే దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంతో ప్రస్తుత పిల్‌ను జతచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

■ విశాఖ జిల్లా మధురవాడ పరిధిలో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్‌కు 22 ఎకరాలను..(ఎకరానికి 99 పైసల చొప్పున) కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాలు చేస్తూ 'సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ రైట్స్' సంస్థ విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎన్.నమ్మిగ్రేస్ హైకోర్టులో పిల్ వేశారు. న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ..'రూ.1109 కోట్ల విలువ చేసే 22 ఎకరాలను కాగ్నిజెంట్ సంస్థకు విక్రయించేందుకు యత్నిస్తున్నారు. లీజు పద్ధతిలో ఇవ్వాల్సిన భూములను నిబంధనలకు విరుద్ధంగా ఏపీఐఐసీ విక్రయిస్తోంది' అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ నూతన పారిశ్రామిక విధానానికి అనుగుణంగా భూములు కేటాయిస్తున్నామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామని చెప్పారు.

జాతి సాంస్కృతిక చిరునామా మాతృభాష

● మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాతృభాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదు.. జాతి సాంస్కృతిక చిరునామా అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. బుధవారం హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం-మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం నిర్వహణలో సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ 2024 ఏడాదికి అజో-విభో-కందాళం ఫౌండేషన్(అమెరికా) అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణకు, 2025 ఏడాదికి తెలుగు భాషాభివృద్ధి మండలి(సోలాపుర్) అధ్యక్షుడు కమటం మల్లికార్జున్‌కు మండలి వెంకట కృష్ణారావు 'సంస్కృతి' పురస్కారాలను ప్రదానం చేసి మాట్లాడారు. మండలి వెంకట కృష్ణారావు ప్రజాసేవకుడే కాదు.. తెలుగు భాషా సంస్కృతికి ప్రతీక అని కొనియాడారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవ శ్లాఘనీయమన్నారు. తెలుగువర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ.. మండలి వెంకటకృష్ణారావు కుమారుడు మండలి బుద్ధప్రసాద్ 2007 నుంచి రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలుగు భాష సంస్కృతి వ్యాప్తికి కృషి చేస్తున్న వారిని నగదు పురస్కారంతో సత్కరిస్తూ.. తన తండ్రి పేరును చిరస్మరణీయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి, మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం డైరెక్టర్ డా.పద్మప్రియ, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు వర్సిటీలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న అప్పాజోస్యుల సత్యనారాయణ, కమటం మల్లికార్జున్. చిత్రంలో మండలి బుద్ధప్రసాద్, వి.నిత్యానందరావు, కె.వి.రమణాచారి

గ్రహం అనుగ్రహం

14-8-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
పంచమి: ఉ. 6-10 షష్ఠి తె. 3-48 తదుపరి సప్తమి
రేవతి: ఉ. 11-42 తదుపరి అశ్విని
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: ఉ. 9-27 నుంచి 10-57 వరకు తిరిగి తె. 3-24 నుంచి 4-54 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-58 నుంచి 10-49 వరకు తిరిగి మ. 3-01 నుంచి 3-52 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.46; సూర్యాస్తమయం: సా.6.24

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.5	25.0
విశాఖపట్నం	35.0	26.0
తాడేపల్లిగూడెం	33.2	26.8
శ్రీకాకుళం	33.0	26.0
అనంతపురం	29.7	23.0
ఒంగోలు	28.2	24.6
గుంటూరు	28.0	26.0
కర్నూలు	27.3	22.8
తిరుపతి	26.0	24.4
కడప	26.0	24.0

రొయ్యల ఎగుమతులకు కొత్త మార్కెట్లు అన్వేషించాలి: మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: రొయ్యల ఎగుమతులకు ఎంపెడా సహకారంతో కొత్త మార్కెట్లను అన్వేషించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని అవకాశంగా మలచుకోవడంతోపాటు.. ఇతర దేశాల మార్కెట్లపైనా దృష్టి పెట్టాలన్నారు. బుధవారం సచివాలయంలో ఏపీ రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి సంస్థ (అప్సడా) కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మారీకల్చర్, రిజర్వాయర్ కేజ్ కల్చర్ విధానాలకు కమిటీ ఆమోదం తెలిపింది. 'సుంకాల వ్యవహారంపై సీఎం చంద్రబాబు కేంద్రంతో సంప్రదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీని కంపెనీ చట్టం కింద ఏర్పాటు చేసి.. ఎఫ్‌పీఓలు, ఆక్వారంగంలోని వ్యాపారులను సభ్యులుగా నమోదు చేయాలి' అని అచ్చెన్నాయుడు సూచించారు. 'కొన్నిచోట్ల ఆక్వా చెరువుల్లో చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి లైసెన్సులు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం' అని హెచ్చరించారు. 'ఆక్వా రైతులంతా అప్సడా చట్టం కింద చెరువులు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో లైసెన్సు ప్రక్రియ వేగవంతం అవుతోంది. ఎగుమతి చేసే ఉత్పత్తుల నాణ్యత, ట్రేసబిలిటీకి ఇది ఉపయోగపడుతుంది. డి.పట్టా, ఎసైన్డ్, సీజేఎఫ్ఎస్ భూముల్లో రొయ్యలు, చేపలు పెంచే రైతులకు సాగు ధ్రువీకరణ పత్రం అందిస్తాం. ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సాయం పొందొచ్చు. తీర ప్రాంతాల్లో సీవీడ్ సాగు ప్రోత్సహించడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి' అని సూచించారు. సమావేశంలో అప్సడా వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో రేపు ప్రత్యేక గ్రామసభలు

ఈనాడు, అమరావతి: మూడు కీలక అంశాలపై గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 15న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను బుధవారం ఆదేశించింది. పునరుత్పాదక ఇంధన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పశుసంవర్ధకశాఖ సహకారంతో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించి వాటి సంరక్షణ చర్యలు తీసుకోవడం, పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంపై ప్రధానంగా గ్రామసభల్లో చర్చించి తీర్మానాలు చేయాలని కేంద్రం సూచించింది. స్థానిక సంస్థల పాలనలో ప్రజల భాగస్వామ్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ మేరకు రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక గ్రామసభల నిర్వహణకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది.


ఈనాడు

క్రీడాసంస్కృతికి కొత్త చివుళ్లు

అవినీతి, బంధుప్రీతి, ఎంపిక ప్రక్రియలో అక్రమాలు, పారదర్శకత కొరవడటం, క్రీడాపాలనలో ఉత్తమ పద్ధతులను అనుసరించకపోవడం... ఇవే మన దేశంలో ఆటలూ ఆటగాళ్ల ఉన్నతికి ప్రతిబంధకాలవుతున్నాయి. రాజకీయ నాయకులూ వ్యాపారులు క్రీడాసంఘాల నిర్వహణలో తలదూర్చకపోతే- భారతావని సహజ సత్తాకు తగినన్ని ఒలింపిక్ పతకాలు కచ్చితంగా వస్తాయి. మద్రాస్ హైకోర్టు ఇలా మూడేళ్ల క్రితమే స్పష్టీకరిస్తే- ఫెడరేషన్లలో అంతర్గత కుమ్ములాటలు క్రీడలను దెబ్బతీస్తున్నాయని దిల్లీ ఉన్నత న్యాయస్థానం మొన్న ఏప్రిల్‌లో అక్షరసత్యం పలికింది. స్వార్థ ప్రయోజనాలకోసం క్రీడాసమాఖ్యలను గుప్పిట్లో పెట్టుకునే పెద్దమనుషుల పెడపోకడలపై సుప్రీంకోర్టు సైతం ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. సంవత్సరాల తరబడి సమాఖ్యల్లో తిష్ఠవేస్తున్న కొందరు పెత్తందారులు క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. తమ భ్రష్టాచారాలతో దేశ ప్రతిష్ఠను మసకబార్చుతున్నారు. లోపభూయిష్ఠమైన వ్యవస్థకు సంస్కరణల శస్త్రచికిత్స చేసేందుకంటూ కేంద్రం తీసుకొచ్చిన 'జాతీయ క్రీడాపాలనా బిల్లు' తాజాగా పార్లమెంట్ ఆమోదం పొందింది. అందులోని నియమ నిబంధనలు పక్కాగా అమలుకు నోచుకుంటే సమాఖ్యల తీరుతెన్నులు గాడినపడటమే కాదు- క్రీడాపాలకులు జాతికి జవాబుదారీగా ఉండాలన్న ప్రజాభీష్టమూ నెరవేరుతుంది!

సమాఖ్యల్లో ఆధిపత్య పోరు, ఎన్నికల నిర్వహణలో లోపాలతో దేశీయంగా 49 ఆటలు వివాదాల కొలిమిలో చిక్కుకున్నాయి. 2015 నుంచి ఈ ఏడాది మార్చి మధ్యలో క్రీడా సంబంధిత అంశాలపై న్యాయస్థానాలూ ట్రైబ్యునళ్లలో 770 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కేంద్రం ఇటీవల పేర్కొన్న సమాచారం ప్రకారం- ప్రస్తుతం కోర్టుల్లో అటువంటివి 350 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. క్రీడాభివృద్ధిని వెనక్కి లాగుతున్న వివాదాల సత్వర పరిష్కారానికి నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ సాయపడుతుంది. విచ్చలవిడితనానికి పేరుమోసిన సమాఖ్యలను దారిలోపెట్టడానికి నేషనల్ స్పోర్ట్స్ బోర్డ్ అక్కరకొస్తుంది. ఫెడరేషన్లలో ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ఎలక్షన్ ప్యానెల్ ఏర్పాటు ఉపకరిస్తుంది. ఈ మేరకు క్రీడాపాలనలో మేలిమి మార్పులకు శ్రీకారం చుట్టగలిగిన చట్టాన్ని చేసేందుకు 2011లో మొదలైన ప్రయత్నాలు ఇప్పటికి సఫలీకృతమయ్యాయి. దీంతో క్రీడా సంబంధిత కార్యకలాపాలను సమర్థంగా నియంత్రించేందుకు ప్రత్యేక శాసనాలు కలిగిన అమెరికా, చైనా, బ్రిటన్, జపాన్ తదితర దేశాల సరసన ఇండియా చేరినట్లయ్యింది!

క్రీడావ్యవస్థకు పట్టిన మకిలిని వదిలించడం ఒక ఎత్తు అయితే- ప్రతిభావంతులను గుర్తించి సానబట్టడం మరో సవాలు. అందుకోసం మెరుగైన శిక్షకులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. కానీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలోనే 664 కోచ్ పోస్టులు ఖాళీగా పడిఉన్నాయి. ఇక రాష్ట్రాల్లోని 'శాప్'లలోనైతే రెగ్యులర్ కోచ్‌ల సంఖ్య చాలా తక్కువ. తాత్కాలిక శిక్షకులతో నామమాత్రంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దాంతో దాతల ఉదారతకు నోచుకున్న క్రీడాకారులే బరిలో ముందడుగు వేయగలుగుతున్నారు. కేటాయింపులను పెంచడం, క్రీడా వసతులను పరిపుష్టం చేయడం, మైదానాల బాగుసేత, కోచ్‌ల నియామకాలపై ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తేనే- ఆసక్తి, సామర్థ్యం కలిగిన వర్ధమాన ఆటగాళ్లు వెలుగులోకి రాగలరు. శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరించే ఆటలు- పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చేందుకు తగిన నైపుణ్యాలనూ మప్పుతాయి. వాటిని నవతరం చెంతకు చేర్చాలంటే ముందు వ్యాయామ విద్యను చదువుల్లో అంతర్భాగం చేయాలి. తద్వారా దేశంలో క్రీడాసంస్కృతికి కొత్త చివుళ్లు తొడగాలి!



నిరంతరం అప్రమత్తంగా ఉండటం, లోచూపు, ప్రణాళికాబద్ధంగా పనిచేయడం... ఈ మూడూ మన మేధస్సును పెంచుతాయి. అప్పుడు విజయం దానంతటదే వస్తుంది.

– వేదాద్రి మహర్షి, తత్వవేత్త

అనిశ్చితిలోనే నిశ్చితి

'అనిశ్చితే నిశ్చితి. అభద్రతతో జీవించడంలోనే భద్రత' ఉంటుంది అని గణితశాస్త్రజ్ఞుడు జాన్ అలెన్ పౌలస్ అంటారు. అనిశ్చితిని మనం స్వీకరించలేకపోతే అది భయంగా మారుతుంది. అదే స్వీకరిస్తే ఉల్లాసానికి, సృజనాత్మకతకు దారితీస్తుంది. ఉన్నదున్నట్లుగా స్వీకరించడం మనం ఎదుర్కొనే సవాలు. నిశ్చితికోసం వెతకడం అర్థ రహితం. అనిశ్చితిలోనే మన శక్తులను మనం తెలుసుకోగలుగుతాం. పరిస్థితులు ఎప్పుడెలా మారతాయో చెప్పలేం. శక్తికొద్దీ వాటిని ఎదుర్కోవాలి. కొన్నిసార్లు అద్భుతమైన ఫలితాలు చూస్తాం. కాని అవి మనం ఊహించినవి కాకపోవచ్చు. అయినా హుందాగా వాటిని స్వీకరిస్తూ ముందుకు సాగాలి. ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకుంటూ ఎదుగుతూనే ఉండాలి.

ఒక సన్యాసి తన జీవితంలో బౌద్ధసూత్రాలను తు.చ.తప్పకుండా పాటిస్తూ వచ్చాడు. అయితే ఓ రోజు రాత్రి చీకట్లో నడుస్తుండగా కీచుమన్న శబ్దంతో పాటు కాలికింద ఏదో నలిగినట్లు అనిపించింది. కప్పను కాలితో తొక్కి చంపేశాననుకుని చాలా బాధపడ్డాడు. నిద్ర కూడా సరిగా పట్టలేదు. పొద్దున్నే ఆ ప్రదేశానికి వెళ్లి చూస్తే నలిగి పడి ఉన్న వంకాయ కనిపించింది. తాను ఏ ప్రాణికీ హాని చేయలేదని తెలిశాకే అతడిలో అశాంతి మాయమైంది.



అంతర్యామి

ఏవేవో భయంకరమైన విషయాలన్నీ ఊహించుకుంటాం. దుఃఖపడతాం. చెడు జరగక ముందే జరిగినట్లుగా ఊహించుకుని భద్రత లేదనుకుంటాం. ఏ క్షణంలో ఏమవుతుందో ఎవరికీ తెలియదు. జీవితం అంటేనే అనిశ్చితి. అంతమాత్రాన దాని గురించే ఆలోచిస్తూ కూర్చుంటే- అది ఒత్తిడికి దారితీస్తుంది. భౌతిక, మానసిక ఆరోగ్యానికి భంగం కలిగిస్తుంది. ఏ పనీ చేయలేం. అన్నీ చెడుగా ఊహించుకునే బదులు మంచి విషయాలు తలచుకోవాలి. ఏకాగ్రత పెంపొందించుకుని వర్తమానంలో జీవించడం నేర్చుకోవాలి. భవిష్యత్తు గురించి ప్రశ్నలు వేధిస్తే ఆందోళన, నిరాశ కలుగుతాయి. నిస్సహాయత ఎదురవుతుంది. చేపట్టిన పని సత్ఫలితాన్ని ఇస్తుందో లేదో తెలియదని అసలు చేయకపోవడం వివేకవంతుల లక్షణం కాదు. కష్టమో నష్టమో వెనకటి తరాల వారంతా చేయాలనుకున్నది ధైర్యంగా చేశారు కాబట్టే నాగరికత ఇంత దూరం వచ్చింది. మనకీ సౌకర్యాలన్నీ సమకూరాయి. అనిశ్చితి తాలూకు భయాలను వెనక్కి నెట్టి మన కర్తవ్యాన్ని నెరవేర్చాలి. పనిచేయడం వరకే మన కర్తవ్యం, ఫలితం మన చేతిలో లేదని భగవద్గీత చెబుతోంది.

చాలావరకు నిత్యజీవితంలో అనిశ్చితిని ఎదుర్కొనడానికే ప్రయత్నిస్తాం. భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకుంటాం. ప్రవర్తనను అదుపులో పెట్టుకుంటాం. అయితే అది అన్ని విషయాల్లోనూ చూపలేరు కొందరు. అలాంటి వాళ్లు శరీరంపట్ల, మనసుపట్ల శ్రద్ధ వహించాలి. కంటినిండుగా నిద్రపోవాలి. మనసును ఉల్లాసంగా ఉంచుకోవాలి. అంతా మంచే జరుగుతుందని, కోరుకున్న ఫలితం వస్తుందని ఆశించాలి. ఒకవేళ రాకపోతే మళ్లీ ప్రయత్నించాలి. అంతేకానీ నిరుత్సాహపడకూడదు. సహనాన్ని పెంపొందించుకోవాలి. నిత్యజీవితంలో మార్పులు స్వీకరించినట్లు పెద్ద సవాళ్లను కూడా స్వీకరించడం... అభిలషణీయం, ఆరోగ్యదాయకం.

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

ట్రంప్ ఒత్తిళ్లు... తాటాకు చప్పుళ్లు!

రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై అదనపు సుంకాల పేరుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆక్రోశం వెళ్లగక్కారు. ఈ సందర్భంలోనే ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ మాస్కో వెళ్లి పుతిన్, ఇతర నాయకులతో చర్చలు జరిపారు. మోదీ తరఫున పుతిన్‌ను భారత సందర్శనకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ట్రంప్ దూకుడు ప్రదర్శిస్తున్న సమయంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం విశేష వ్యూహ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించిన తరవాత- 'నా మిత్రుడితో చక్కగా సవివరంగా మాట్లాడా'నని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్ తాజా పరిణామాలను తనతో పంచుకున్నందుకు పుతిన్‌కు ధన్యవాదాలు తెలిపానన్నారు. ద్వైపాక్షిక అజెండా సాధనలో పురోగతి గురించి చర్చించడంతో పాటు రెండు దేశాల మధ్యనున్న ప్రత్యేక వ్యూహపరమైన భాగస్వామ్యాన్ని మరింత బలపరచుకోవాలని ఇద్దరు నేతలు నిశ్చయించారు. పుతిన్ భారత్ రాక కోసం ఆనందంగా నిరీక్షిస్తున్నానని మోదీ పేర్కొన్నారు. కాగా, ఉక్రెయిన్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పుతిన్‌కు మోదీ సూచించారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది భారత్-రష్యా 23వ వార్షిక సభలో పాల్గొనడానికి పుతిన్ దిల్లీ వస్తారని వివరించింది.



ఉమ్మడిగా ఎదుర్కోవడానికి...

భారతదేశం రష్యా నుంచి తగ్గింపు ధరకు చమురు కొనడంపై మునుపటి బైడెన్ ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదు. భారతదేశ ఆర్థిక ప్రగతికి చవక చమురు దిగుమతి దోహదపడుతుందని బైడెన్ సర్కారు అర్థం చేసుకుంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తరవాత ఈ విధానానికి నీళ్లు వదిలారు. భారత ఎగుమతులపై 50శాతం సుంకాలతోపాటు జరిమానా కూడా విధిస్తానని హెచ్చరించారు. భారత్-అమెరికా సంబంధాలు వృద్ధి చెందాలంటే రష్యాకు దిల్లీ దూరం జరగాలన్నది ఆయన అభిమతం. ట్రంప్ బెదిరింపులను లెక్కచేయకుండా మోదీ నేరుగా పుతిన్‌తో సంభాషించడం ద్వారా చమురు ఎవరి నుంచి ఎలా కొనాలన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛా, సార్వభౌమాధికారం భారత్‌కు ఉన్నాయని స్పష్టం చేశారు.

రక్షణ, ఇంధన రంగాలలో బలీయంగా ఉన్న భారత్-రష్యా బంధం మౌలిక వసతులు, అణుశక్తి, ఆధునిక టెక్నాలజీ వంటి రంగాలకూ విస్తరించింది. తమ మధ్యనున్న ప్రత్యేక, వ్యూహపరమైన భాగస్వామ్యం బయటి ఒత్తిళ్లకు, స్వల్పకాలిక అంతర్జాతీయ పరిణామాలకూ అతీతమని ఉభయ దేశాలు చాటుతున్నాయి. ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీల్లో చైనాలోని టియాన్ జిన్ నగరంలో షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశం జరగనుంది. ఈ క్రమంలో పుతిన్‌తో మోదీ సంభాషించడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు దేశాలు ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా కారిడార్ ప్రాజెక్టులో కలసికట్టుగా ముందడుగు వేయనున్నాయని తెలుస్తోంది. అమెరికా తెస్తున్న ఒత్తిడిని ఉమ్మడిగా ఎదుర్కోవడానికి భారత్, రష్యాలు సిద్ధమవుతున్నాయి. ఉక్రెయిన్ పరిణామాల గురించి పుతిన్ మోదీతో చర్చించడమూ విశేషమే. ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించడంలో మధ్యవర్తి పాత్ర పోషించే అవకాశం భారత్‌కు దక్కవచ్చు.

ఇండియా లాగే బ్రెజిల్ కూడా ట్రంప్ నుంచి 50శాతం సుంకాల బాదుడును ఎదుర్కొంటోంది. ఆ దేశ అధ్యక్షుడు లులా డ సిల్వా కూడా మోదీతో టెలిఫోన్‌లో సంభాషించడం మరో కీలక పరిణామం. ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై ఉభయులూ చర్చించారన్నది భారత విదేశాంగ శాఖ ప్రకటన సారాంశం. వాణిజ్యం, టెక్నాలజీ, ఇంధనం, రక్షణ, వ్యవసాయం, ఆరోగ్య రంగాలతోపాటు రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలను బలపరచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి పెట్టాయి.

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా కూటమి (బ్రిక్స్)లో మరిన్ని దేశాలు చేరడంతో బ్రిక్స్ ప్లస్‌గా అవతరించింది. బ్రిక్స్‌ను డాలర్‌కు ఎసరు పెట్టే కూటమిగా, అమెరికాకు వ్యతిరేకమైన సంఘంగా ట్రంప్ పరిగణిస్తున్నారు. భారత్, బ్రెజిల్ రెండింటిపై ట్రంప్ 50శాతం సుంకాలు విధించడం చూస్తే బ్రిక్స్‌ను ట్రంప్ శత్రువుగా పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ మాజీ డైరెక్టర్ ఏఎస్ రాయ్ వ్యాఖ్యానించారు. అమెరికా ఆధిపత్యం లేని నూతన ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి బ్రిక్స్ ప్రయత్నిస్తున్నట్లు ట్రంప్ అనుమానిస్తున్నారు. బ్రిక్స్‌లో పోనుపోను మరిన్ని దేశాలు చేరడం, మరికొన్ని చేరడానికి ఆసక్తి చూపిస్తుండటం అమెరికా అధ్యక్షుడికి ససేమిరా నచ్చడం లేదు. బ్రిక్స్ దేశాలు సొంత కరెన్సీల్లో వ్యాపారం చేయడం ద్వారా డాలర్ ఆధిపత్యాన్ని కూలదోయడానికి ప్రయత్నిస్తున్నాయని ట్రంప్ ఆందోళన చెందుతున్నారు. అయితే భారతదేశం డాలర్‌కు పూర్తిగా స్వస్తి చెప్పడానికి సిద్ధంగా లేదు.

బహుళధ్రువ ప్రపంచం కోసం...

అమెరికా ఆడమన్నట్లు ఆడటానికి భారత్ సిద్ధంగా లేదని పుతిన్‌తో సంభాషించడం ద్వారా మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారని జిందాల్ అంతర్జాతీయ వ్యవహారాల సంస్థకు చెందిన స్వస్తి రావు విశ్లేషించారు. బ్రిక్స్‌లో చైనా కొమ్ముకాయడానికి భారత్ చేరలేదనీ, రష్యాతో కలసి సొంత పంథాను చాటుకోవడమే న్యూదిల్లీ లక్ష్యమనీ ఆమె వివరించారు. బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు వర్ధమాన దేశాలకు పెట్టుబడులు అందిస్తోంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగగల ఈ బ్యాంకు అనేక దేశాలకు ఆకర్షణీయంగా మారింది. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో బ్రిక్స్ వంటి వేదికల ద్వారా స్థిరత్వ సాధనకు ఇండియా ప్రయత్నిస్తోంది. పాశ్చాత్య దేశాలకు ఇండియా వ్యతిరేకం కాదు... అదే సమయంలో బహుళధ్రువ ప్రపంచాన్ని భారత్ ఆశిస్తోంది. అలాగే రష్యా పూర్తిగా చైనా ప్రాబల్యంలోకి వెళ్లకుండా చూడటమూ భారత్ లక్ష్యమే. అందుకే వర్తమాన ప్రపంచంలో తాను స్వతంత్ర శక్తినని ఇండియా చాటుకుంటోంది. పుతిన్-మోదీ సంభాషణను ఈ కోణం నుంచే చూడాలి.

– అరూణిం భుయాన్



చూపునిచ్చే దేవుడు

వ్యక్తిత్వ వికాసం అంటే తమను తాము అభివృద్ధి చేసుకోవడమే కాదు, చుట్టూ ఉన్నవారికీ కాస్తో కూస్తో ఉపయోగపడాలి. సమాజంలోని సమస్యల పట్ల స్పందించాలి. తన వంతు కర్తవ్యం నెరవేర్చాలి. అలాంటి దృక్పథం అలవర్చుకున్న వారే సమాజంపై తమదైన ముద్ర వేయగలరు.

నేపాల్‌లోని హిమాలయ పర్వత ప్రాంతంలో 1954లో జన్మించారు సందుక్ రూయిత్. రోడ్డు, కరెంటు లాంటి కనీస వసతులేవీ లేని కుగ్రామమది. ఆయన తోడబుట్టిన అయిదుగురిలో ముగ్గురు చిన్న వయసులోనే వేర్వేరు అనారోగ్యాలకు బలయ్యారు. పదిహేనేళ్ల వయసులోనే తనకు అత్యంత ఆప్తురాలైన సోదరి క్షయవ్యాధితో కన్నుమూయడం ఆయనను కలచివేసింది. ఎలాగైనా తాను డాక్టరై అందరికీ ఆరోగ్యాన్ని అందించాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నారు సందుక్. డార్జిలింగ్, కాఠ్‌మాండూలలో హైస్కూల్ విద్య పూర్తిచేసిన ఆయన లఖ్‌నవూలో మెడిసిన్ చదివారు. నేపాల్‌లో కొన్నాళ్లు జనరల్ ఫిజీషియన్‌గా పనిచేసి కంటివైద్యంలో స్పెషలైజేషన్ కోసం దిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. పూర్తయ్యాక స్వదేశానికి వెళ్లి త్రిపురేశ్వర్‌లోని కంటి ఆసుపత్రిలో ఎనిమిదేళ్లు పనిచేశారు. అదే సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా వచ్చిన ఆస్ట్రేలియా కంటి నిపుణుడు డాక్టర్ ఫ్రెడ్ హాలోస్ సందుక్‌కి మెంటార్‌గా వ్యవహరించారు. సందుక్‌లోని సేవాభిలాషను, పట్టుదలను గమనించిన ఆయన కంటిశుక్లం శస్త్ర చికిత్సలో మరింత నైపుణ్యం సంపాదించడానికి ఆస్ట్రేలియాలో శిక్షణ పొందే అవకాశం కల్పించారు. ఆ తరవాత నెదర్లాండ్స్, అమెరికాలకూ వెళ్లి తన ప్రావీణ్యానికి మరిన్ని మెరుగులు దిద్దుకున్నారు.

అప్పట్లో కంటిశుక్లం వల్ల పూర్తిగా చూపు కోల్పోయే వారి సంఖ్య లక్షల్లో ఉండేది. ఆ శస్త్రచికిత్స సౌకర్యం, ఖరీదు పేద వారికి అందుబాటులో ఉండేవి కాదు. డాక్టర్ సందుక్ అభివృద్ధి చేసిన చిన్న కోత ద్వారా కంటిశుక్లం శస్త్రచికిత్స పద్ధతి ఒక విప్లవమనే చెప్పాలి. దీనికయ్యే ఖర్చు చాలా తక్కువ. నేపాల్‌లో ఇంట్రాఆక్యులర్ లెన్స్‌లు వాడి శస్త్రచికిత్సలు చేసిన తొలి వైద్యుడు ఆయనే. ఈ శస్త్ర చికిత్సలను ఆసుపత్రుల్లోనే కాకుండా ఊళ్లలో చెట్లకిందే శిబిరాలు పెట్టి, పడవలపై ప్రయాణిస్తూ కూడా నిర్వహించారు. నేపాల్‌లో ఆయన స్థాపించిన తిల్గంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆఫ్తాల్మాలజీ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని వైద్యులకు శిక్షణ ఇచ్చే ప్రఖ్యాత కేంద్రంగా పేరొందింది. నార్త్ కొరియా నుంచి ఇథియోపియా వరకు, మంగోలియా నుంచి మయన్మార్ వరకు 30కి పైగా దేశాల్లో 1.8లక్షల మందికి చూపు ప్రసాదించిన ఘనత డాక్టర్ సందుక్‌ది. అందుకే ఆయన 'గాడ్ ఆఫ్ సైట్'గా పేరుగాంచారు.

తనలాగా మరెవరూ ఆప్తులను కోల్పోయి బాధపడకూడదని, ఆరోగ్యం అందరి హక్కు అని భావించి ఆ దిశగా తన శక్తిసామర్థ్యాలను వెచ్చిస్తున్నారు డాక్టర్ సందుక్. సేవే పరమావధిగా జీవిస్తున్న ఆయనకు భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ'తోపాటు రామన్ మెగసెసే, ఆసియా గేమ్ ఛేంజర్ తదితర అవార్డులెన్నో లభించాయి.

– పి.వి.రాయుడు

క్షయ కోరల్లో...

సాంక్రామిక వ్యాధుల్లో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో క్షయ ఒకటి. దీన్ని తేలిగ్గా తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ సకాలంలో గుర్తించకపోవడం, మెరుగైన చికిత్స అందకపోవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆఫ్రికా దేశాల్లో అలాంటి వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. 2021లో ప్రపంచవ్యాప్తంగా ప్రతి లక్ష జనాభాకు క్షయ మరణాల రేటు 16.6. పలు ప్రాంతాలు, దేశాల్లో అది ఎంతంటే...

సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్	327
లిసోటో	325
గబూన్	287
ఘనా	85.9
సియెరా లియోన్	78.3
పాకిస్థాన్	32.8
ఇండియా	29
జపాన్	0.407
యూకే	0.180
అమెరికా	0.114

(ఆధారం: ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక-2024)

నిషేధమా నియంత్రణా... ఏది సబబు?

దేశంలో 'అద్దె గర్భం' చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. బేబీ మంజీ వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా(2008) కేసులో అద్దె గర్భాలను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గర్భధారణ 21వ రాజ్యాంగ అధికరణ పరిధిలోని ప్రాథమిక హక్కు అని దేవికా బిశ్వాస్ వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా(2016) కేసులో సర్వోన్నత న్యాయస్థానం తీర్మానించింది. వ్యాపారపరమైన అద్దె గర్భధారణను నిషేధించాలనీ, ప్రతిఫలం ఆశించకుండా పరోపకారం కోసమే గర్భం ధరించడాన్ని సమ్మతించాలనీ లా కమిషన్ 2009లోనే సిఫార్సు చేసింది. ఆ మేరకు కేంద్రం 2021లో సరోగసీ(నియంత్రణ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది అద్దె గర్భ వ్యాపారాన్ని నిరోధిస్తూ... భారత పౌరులు, ప్రవాస భారతీయుల కోసం 'పరోపకారార్థ గర్భధారణ'ను మాత్రమే అనుమతించింది.

మాతృత్వమంటే- ప్రేమ ఫలితం, త్యాగ ఫలం, భావోద్వేగ బంధం. అలాంటి అమ్మతనం నేడు వ్యాపార వస్తువు అవుతోంది. ఇటీవలి కాలంలో అద్దె తల్లుల మరణాలు, అండ దానం, బిడ్డ కస్టడీకి సంబంధించిన వివాదాలు ఎక్కువవుతున్నాయి. అవకరాలతో పుట్టిన పిల్లల్ని వదిలేయడం, శిశువుల అక్రమ రవాణా వంటివీ పెచ్చుమీరుతున్నాయి.

అనుమతులు తప్పనిసరి

థాయ్‌లాండ్, నేపాల్, మెక్సికో, కంబోడియా దేశాలు కూడా అద్దె గర్భాలను నిషేధిస్తూ చట్టాలు చేశాయి. దాంతో ఈ వ్యాపారం లేదా పరిశ్రమ ఉక్రెయిన్, జార్జియా, లావోస్, మలేసియా, అర్జెంటీనా, కొలంబియా, నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికాలకు తరలిపోయింది. అయినప్పటికీ 2020-25 మధ్య హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో అద్దె గర్భ వివాదాలు, శిశువుల అక్రమ రవాణా కేసులు పెద్దసంఖ్యలో వెలుగుచూశాయి. పేద మహిళల నుంచి రూ.90 వేలకు శిశువును కొని రూ.35లక్షలకు విక్రయిస్తున్న ముఠాను అధికారులు పట్టుకున్నారు. ఐవీఎఫ్ చికిత్సల పేరిట దందా నడిపిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఒకే క్లినిక్‌తో సంబంధమున్న 12 కేసులను గుర్తించారు. హైదరాబాద్‌లో 158 సంతాన సాఫల్య కేంద్రాలకే అధికారిక గుర్తింపు ఉంది. అనధికారంగా నడుస్తున్నవెన్నో లెక్కలేదు!

వైద్యం, బీమా ఖర్చులు తప్ప మరే ఆర్థిక ప్రతిఫలాన్నీ ఆశించకుండా పరోపకారార్థ గర్భధారణ చేయడానికి సరోగసీ నియంత్రణ చట్టం(2021), దానికి 2024లో చేసిన సవరణలు అనుమతిస్తున్నాయి.




దంపతుల్లో భార్యకు 25-50 ఏళ్లు, భర్తకు 26-55 ఏళ్ల వయసు ఉండాలి. వితంతువులూ విడాకులు తీసుకున్న మహిళలకైతే 35-45 ఏళ్ల వయసుండాలి. వీరెవరికీ సొంత సంతానం, దత్తత తీసుకున్న పిల్లలు ఉండకూడదు. సొంతంగా పిల్లల్ని కనే పరిస్థితి లేనందువల్లే సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకుంటున్నామని జిల్లా వైద్య మండలి నుంచి అనుమతి తీసుకోవాలి. గుర్తింపు కలిగిన క్లినిక్‌లోనే సరోగసీ జననాలు జరగడంతో పాటు ఇలా పుట్టే బిడ్డల జన్యు సంబంధాన్ని తప్పనిసరిగా ధ్రువీకరించాలి. ఈ బిడ్డలపై తల్లిదండ్రుల హక్కులను ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వు ద్వారా నిర్ధారించాలి. ఏయే సందర్భాలలో వీర్యకణ దానం, అండ దానం చేయవచ్చో 2024నాటి సవరణలు నిర్దేశించాయి.

తగిన రక్షణలతో...

భారత్ అద్దె గర్భాలను పూర్తిస్థాయిలో నిషేధించాలని పట్టుదలగా ఉన్నా, దీనివల్ల చట్టవిరుద్ధ సరోగసీ పెరిగిపోవచ్చు. పిల్లల్ని దత్తత తీసుకోవడానికి చాలా మంది దంపతులు ముందుకు రారు. తీసుకోవాలనుకున్నా వారికి నచ్చిన శిశువులు దొరకరు. తమ జన్యువులతో పుట్టే పిల్లలే వారికి ముద్దు. ఇలాంటి వారు పేద మహిళలకు ధనాశ చూపి అద్దె గర్భానికి ఒప్పించడం ఎక్కువవుతుంది. మొత్తంగా సరోగసీని నిషేధిస్తే ఈ తరహా నల్లబజారు విస్తరించవచ్చు. నేపాల్, కెన్యా వంటి పేద దేశాల్లో ఇది ఇలాగే విస్తరించిన సంగతిని ఇక్కడ గమనించాలి. కాగా, కేంద్రీయ దత్తత సంస్థ తరహాలోనే కేంద్రీయ సరోగసీ నియంత్రణ ప్రాధికార సంఘాన్ని ఏర్పరచాలని పార్లమెంటరీ కమిటీ నివేదిక గతంలో ప్రతిపాదించింది. సాధికార సరోగసీ క్లినిక్‌ల ద్వారా 21ఏళ్లు దాటిన మహిళలనే మారుటి గర్భిణులుగా అనుమతించాలని అది సూచిస్తోంది. వీరికి కనీసం ఒక్క సొంత బిడ్డయినా ఉండాలి. కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు మారుటి తల్లుల మాతృభాషలోనే ఒప్పందం రూపొందించి దానిపై సంతకం తీసుకోవాలి. వారికి నగదు రూపంలో కాకుండా ఇతర మార్గాల్లో పారితోషికం ఇవ్వాలి. ప్రసవం విఫలమైన పక్షంలో తల్లికి తగిన రక్షణలు కల్పించాలి. సరోగసీ ద్వారా పుట్టిన బిడ్డ పౌరసత్వాన్ని చట్టబద్ధంగా నిర్వచించి సాధికార గుర్తింపు ఇవ్వాలి. ఈ అంశాలన్నింటినీ పరికిస్తే- మారుటి గర్భధారణను పూర్తిగా నిషేధించడం కంటే... మహిళా హక్కుల్నీ స్వయం నిర్ణయాధికారాన్నీ గుర్తించేలా, నైతికంగా, పారదర్శకంగా అమలయ్యేలా దాన్ని నియంత్రించడమే మేలు!

– వీవీఎస్ శైలజ

సహాయ ఆచార్యులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల, హైదరాబాద్



కృష్ణమ్మ ఉరిమినది..!

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ


బ్యారేజీ గేట్లు ఎత్తడంతో సముద్రంలోకి వెళ్తున్న నీరు

ఈనాడు, అమరావతి

ఓ వైపు ఎడతెరిపి లేని వర్షాల విజృంభణ.. మరోవైపు తరుముకొస్తున్న వరద.. ఇంకోవైపు పొంగి పొర్లుతున్న వాగులు, వంకలతో క్షణక్షణం కలవరమే. వెరసి ఉమ్మడి కృష్ణాలో జనజీవనం అస్తవ్యస్తమైంది. చాలాప్రాంతాల్లో అడుగుతీసి బయటపెట్టలేని దైన్యం ఆవరించింది. నగర,

వరదతో పోటెత్తిన వాగులు, వంకలు

పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు నీట మునిగి ప్రజలు అవస్థలు పడ్డారు. గంపెడాశలు పట్టుకున్న అన్నదాత ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. రాకపోకలు, విద్యుత్తు సరఫరా నిలిచిపోగా ఎగువ నుంచి వస్తున్న వరద.. . ప్రళయ మేఘంలా కమ్మిన నేపథ్యంలో ప్రజల ఆందోళన రెట్టింపైంది.

వదంతులు నమ్మవద్దు

మధురానగర్: పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు బుడమేరుకు నీళ్లు వచ్చాయే తప్ప వరదలు కాదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. బుధవారం విజయ దుర్గానగర్ బుడమేరు మధ్యకట్ట ప్రాంతంలో ఆయన పర్యటించారు. ప్రస్తుతానికి వరద ముప్పు లేదనీ.. బుడమేరుకు వరదలని వచ్చే వదంతులను నమ్మవద్దన్నారు. తర్వాత బుడమేరు, ఏలూరు కాలువలను అనుసంధానించే లాకులను ఎత్తి బుడమేరు వరదను కొంత ఏలూరు కాలువలోకి మళ్లించే ఏర్పాట్లు చేయించారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

12 గంటల్లో ఉగ్రరూపం..

ఎగువన భారీ వర్షాలతో వరద విరుచుకుపడుతోంది. ఉదయం 6 గంటలకు బ్యారేజీ 70 గేట్లలో 5 గేట్లు 5 అడుగులు మాత్రమే ఎత్తగా... సాయంత్రం 6 గంటలకు 39 గేట్లు పూర్తిగా ఎత్తేసి... 3.6 లక్షల క్యూసెక్కులు దిగువకు వదిలారు. రాత్రి ఏడు గంటలకు నీటి విడుదల 3.97 లక్షల క్యూసెక్కులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాలువలకు 2,613 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆపదా... సంప్రదించండి...

కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ పెట్టారు. **91549 70454** నంబరుకు ఎలాంటి సహాయం కావాలన్న ప్రజలు సంప్రదించవచ్చు. భారీ వర్షాలు వరదల నేపథ్యంలో ప్రాంతాల వారీగా అధికారులను కేటాయించారు. నగరంలో 32 వరద ప్రభావిత వార్డుల్లో 32 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. **వరదలకు సంబంధించి సహాయం, సమాచారం కోసం వాట్సాప్ నంబరు 81819 60909 ఏర్పాటు చేశారు. ఫోన్ నంబర్లు: 0866-2427485, 2424172**

బ్యారేజీ వద్ద ప్రవాహం (క్యూసెక్కుల్లో)

సమయం	ఇన్‌ఫ్లో	అవుట్ ఫ్లో
ఉదయం-6	1,99,950	1,89,625
ఉదయం-9	2,54,135	2,49,000
మధ్యాహ్నం-12	3,19,133	3,19,133
మధ్యాహ్నం-3	3,35,742	3,32,625
సాయంత్రం-6	3,63,438	3,60,825
రాత్రి-11	3,97,250	3,97,250

పాఠశాలలకు నేడు సెలవు

భారీ వర్షాలు, వరద ఉద్ధృతి కారణంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు డీఈవో సుబ్బారావు తెలిపారు. **- విజయవాడ సిటీ**

నగర జీవనం అస్తవ్యస్తం...

✧ భవానీపురం ప్రియదర్శి కాలనీ, సింగ్‌నగర్ శివారులోని పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. పటమట పీఅండ్‌టీ కాలనీ మొత్తం జలమయమైంది. పాతబస్తీ, కొత్తపేట, కేబీఎన్ కళాశాల తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగి దారులు మునిగాయి. ఆయా ప్రాంతాల్లో నగరపాలక అధికారులు మోటార్లు పెట్టి నీటిని తోడారు. విద్యాధరపురం బస్సు డిపో వాన నీటితో నిండింది. ఏపీఐఐసీ కాలనీ, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రెండడుగుల మేర వర్షం నీరు నిలిచింది. చాలా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరగడం, హోర్డింగులు నేలకూలడం వంటి నష్టాలు జరిగాయి.



వత్సవాయి: లింగాల వద్ద కాజ్‌వేకు తాకుతూ పారుతున్న వరద


వెలగలేరు రెగ్యులేటర్ వద్ద సాధారణ పరిస్థితి

బుడమేరు వైపే చూపు...

నగరంలో ఎడతెరపి లేని వర్షం, డ్రెయిన్లు పొంగడంతో బుడమేరు నిండింది. గుర్రపుడెక్క, తూడు అడ్డుపడడంతో గుణదల పెద్ద వంతెన పై నుంచి బుడమేరు వరద నీరు ప్రమాదకరంగా ప్రవహించి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధురానగర్, విజయదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో బుడమేరు కట్టమీద ఉన్న దాదాపు 40 ఇళ్లు నీట మునిగాయి. బుధవారం మధ్యాహ్నానికి నీట మునిగిన ఇళ్లలో నీరు బయటకు పోగా.. మళ్లీ వానొస్తే నీట మునిగే వీలుంది.


జూపూడి జాతీయ రహదారిపై వరద నీటితో వాహనదారుల అవస్థలు


భవానీపురంలో ఇంట్లోకి నీరు చేరడంతో మంచంపైనే వృద్ధురాలు


మధురానగర్ సమీపంలో ఇళ్లల్లోకి చేరిన నీరు

పొంగిపొర్లిన ఏరులు...

★ ఇబ్రహీంపట్నం గ్రామీణం జూపూడి వద్ద ఎన్‌హెచ్-65 మీద వర్షం నీరు చేరింది. ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షణలో వాహనాలు పంపారు. ★ వైరా ఏరు పొంగడంతో దాములూరు దగ్గర రహదారిపైన ప్రమాదకరంగా నీరు ప్రవహిస్తూ... ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల్లో 40 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ★ నందిగామ విద్యుత్తు ఉపకేంద్రంలోకి నీరు చేరి.. నందిగామ, అనాసాగరంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ★ పెనుగంచిప్రోలు-ముళ్లపాడు మధ్యలో గండి వాగు ఉద్ధృతితో విజయవాడ-పెనుగంచిప్రోలు మధ్య రాకపోకలు నిలిచాయి. ★ నందిగామ, జగ్గయ్యపేటల్లో ఇటీవలే వరినాట్లు వేశారు. ప్రస్తుతం అపరాలు, మొక్కజొన్న, పత్తి సాగు జరుగుతోంది. అధిక వర్షాలతో పొలాలు నీట మునిగాయి. ★ కట్టలేరు, మున్నేరులకు వరద ఉద్ధృతితో నందిగామ పరిసరాల్లో రాకపోకలు స్తంభించాయి. ఈదురు గాలల ప్రభావానికి విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.


విజయవాడ కలరా ఆసుపత్రి సెంటర్‌లో దుకాణాల్లోకి చేరిన నీరు


గుణదల వద్ద వంతెనపైకి చేరిన నీటిలో చోదకుల అవస్థలు


విజయవాడ బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్ పద్మవ్యూహం



కూడలి వద్ద చప్టా మీదుగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు వరద

మూడు కుటుంబాల్లో తీరని విషాదం

విజయవాడ వన్‌టౌన్: భారీ వర్షాలకు విజయవాడ పాతబస్తీ ప్రాంతం అతలాకుతలమైంది. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 12:30 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. కొత్తపేటకు చెందిన పాతబస్తీ తెదేపా 53వ డివిజన్ అధ్యక్షుడు **టీవీ మధుసూదన్‌రావు(50)** మెడికల్ దుకాణం నిర్వహిస్తుంటారు. వ్యాపారం ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా.. మార్గం మధ్యలో చేపల మార్కెట్ గులామ్‌మోహిద్దీన్ వీధిలో భూగర్భ డ్రెయినేజీ పనుల నిమిత్తం తీసిన గోతిలో భారీగా నీరు చేరడంతో గర్తించలేక ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. పైకిలేచేందుకు నాలుగుసార్లు ప్రయత్నించగా.. అప్పటికే మురుగునీరు తాగేశారు. స్థానికులు కొందరు ఆయన్ని పైకి లాగారు. నడుచుకుంటూ ఇంటికెళ్లారు. అనంతరం వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.




మధుసూదన్‌రావు మృతికి కారణమైన గుంత

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..



తెదేపా 53వ డివిజన్ బూత్ కన్వీనర్ **షేక్ మోర్తజా(38)** వన్‌టౌన్‌లోని ఓ బంగారం దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జోరు వర్షంలో కేఆర్ మార్కెట్ నుంచి గణపతిరావు రోడ్డులోని ఆయన నివాసానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. పాతబస్తీ బీఆర్పీరోడ్డులోని జెండా చెట్టు కూడలిలో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతి చెందారు. ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు.

చెట్టును ఢీకొని మృత్యువాత

పటమట: ఇంటికి త్వరగా వెళ్దామనే తొందరలో వర్షానికి రోడ్డుపై పడి ఉన్న చెట్టును గమనించక ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి ఎలక్ట్రీషియన్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. గుణదలవాసి **తూళ్లూరి మహేష్‌బాబు(33)** యనమలకుదురులో ఎలక్ట్రికల్ షాపు నడుపుతున్నారు. ఆయన భార్య స్వాతి స్టాఫ్ నర్సు. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. మంగళవారం రాత్రి యనమలకుదురు నుంచి ద్విచక్ర వాహనంపై లయోల కళాశాల మీదుగా గుణదలలోని ఇంటికి మహేష్ వెళ్తున్నారు. ఆ సమయంలో కురిసిన భారీ వర్షానికి లయోలా కళాశాల ఎదురుగా చెట్టు కూలి డివైడర్ మీద పడింది. ఇంటికి త్వరగా వెళ్లాలనే కంగారుతోపాటు రోడ్డు కూడా చీకటిగా ఉండటంతో పడి ఉన్న చెట్టును మహేష్ గమనించలేదు. ద్విచక్రవాహనం వేగంగా ఉన్నందున చెట్టు మహేష్ ముఖానికి బలంగా తగిలి అక్కడే పడిపోయారు. ముఖానికి తీవ్ర గాయాలై మహేష్ అక్కడికక్కడే మృతిచెందారని సీఐ ప్రకాష్ తెలిపారు.



నగరంలో స్తంభించిన ట్రాఫిక్

ఈనాడు - అమరావతి: నగరం బుధవారం జలమయమైంది. వాన నీరు, మురుగు రోడ్లపైనే నిలిచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం నుంచి బెంజి సర్కిల్, బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, మొగల్రాజపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆగి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ★ పటమట, ఎన్టీఆర్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, జమ్మిచెట్టు రోడ్లపై భారీగా నీరు నిలిచింది. అందరూ ఇళ్లకు తిరిగి వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బంది పడ్డారు. రాత్రి 10 గంటల వరకు ఇదే పరిస్థితి. ★ ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయం కావడం, దీనికితోడు రోడ్లపై పెద్దఎత్తున నీరు నిలవడంతో పరిస్థితి మరింత గందరగోళంగా తయారైంది. ★ బెంజి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు రోడ్డు పూర్తిగా జలమయమై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచాయి. బెంజి సర్కిల్‌కు రెండు వైపులా ఆగిపోయాయి. ఈ ప్రభావం కోల్‌కతా - చెన్నై జాతీయ రహదారిపై పడింది. కనకదుర్గ వారధిపై వాహనాలు భారీగా ఆగాయి. ★ నిర్మల కాన్వెంట్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. మార్గ్ కృష్ణాయ హోటల్ వద్ద బందరు రోడ్డుపై నీరు భారీగా నిలిచి వాహనాలు కదల్లేక పోయాయి. ★ బెంజి సర్కిల్ చుట్టుపక్కల రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. ★ మొగల్రాజపురం, మధు సర్కిల్, జమ్మిచెట్టు రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ★ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. మదర్ థెరిసా విగ్రహం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది.

వాన నీటి కాలువ పనులపై.. ఎందుకింత జాప్యం?

డీఆర్సీలో అధికారులను నిలదీసిన మంత్రి సత్యకుమార్ యాదవ్


సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎంపీ శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు తదితరులు

ఈనాడు, అమరావతి - భవానీపురం, న్యూస్‌టుడే: 'విజయవాడ నగరంలో వాన నీటి కాలువల డ్రెయినేజీ పనులకు 2019లో ప్రతిపాదించినా.. ఇంతవరకూ డీపీఆర్ కూడా తయారుచేయకపోవడం ఏంటని' జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధికారులను నిలదీశారు. డీపీఆర్ తయారీలో సమస్యలు ఏమున్నాయని ప్రశ్నించారు. వెంటనే వాన నీటి కాలువలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన డీఆర్సీ సమావేశంలో మంత్రి సత్యకుమార్, ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి పనులపై దృష్టి పెట్టండి... సత్యకుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు సత్వరం స్పందించి.. చర్యలు చేపట్టాలని సూచించారు. నగర ఖ్యాతిని చాటేలా.. విజయవాడ ఉత్సవ్ ఈ ఏడాది నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అందరం కలిసి కృషి చేయాలన్నారు. 2024-25లో తలసరి ఆదాయం రూ.3,53,150 ఉందనీ, 2025-26 నాటికి రూ.6,38,946కు చేర్చాలనేది లక్ష్యమని తెలిపారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి అవసరమని సూచించారు. పీ4 విధానం అమలుతో జిల్లాను ముందు వరసలో నిలబెట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

గత సమావేశ సమస్యలు... 32 శాతమే పరిష్కారం: ప్రజాప్రతినిధులు తెలియజేసే సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత డీఆర్సీలో 55 సమస్యలను గుర్తించగా.. వాటిలో కేవలం 19 మాత్రమే (32 శాతం) పరిష్కరించారన్నారు. మిగతావి ఆయా విభాగాధిపతుల వద్దే ఉన్నాయనీ, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎరువులు పూర్తిగా ఉన్నాయనీ, తప్పుడు ప్రచారాలను రైతులు నమ్మొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు.

విజయవాడను గ్రేటర్‌గా మార్చాలి.. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, నగరంలో స్వయం సహాయక సంఘాల ద్వారా డ్వాక్రా బజార్లను పెట్టాలన్నారు. ఎర్రకట్టపై వంతెన ఆధునికీకరణ, వాన నీటి కాలువల నిర్మాణం, మూడు కాలువ గట్ల సుందరీకరణపై దృష్టి పెట్టాలన్నారు. నగరం, చుట్టుపక్కల పంచాయతీలతో కలిపి గ్రేటర్ విజయవాడను మార్చాలని సూచించారు. గ్రేటర్ విజయవాడ వల్ల చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందే వీలుందన్నారు.

రూ.167 కోట్లతో పనులు... కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రూ.167 కోట్లతో 1,661 పనులను చేపట్టామనీ, ఇందులో 1,339 పూర్తి చేసినట్లు తెలిపారు. ★ ఎ.కొండూరుకు కృష్ణా జలాలు అందించే ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ కోరారు. ★ ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, యార్లగడ్డ వెంకట్రావులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, జేసీ ఎస్.ఇలక్కియా, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీఈవో వై.శ్రీలత పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

● నగరంలో మంగళవారం రాత్రి, బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షం నీటి కాలువలు, అవుట్‌ఫాల్, అంతర్గత డ్రెయిన్లు పొంగిపొర్లాయి. శివారు, పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. బుడమేరు, కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● పాతబస్తీ, భవానీ పురం, మొగల్రాజపురం, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్డు, ఏపీఐఐసీ కాలనీ, సింగ్‌నగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులు నీట మునిగాయి. వన్‌టౌన్ జెండా చెట్టు, కృష్ణవేణి మార్కెట్, లోబ్రిడ్జి, రాజీవ్ గాంధీ పార్కు ప్రాంతాల్లో రెండు అడుగుల మేర నీరు చేరింది. డ్రెయిన్లలో వ్యర్థాలు అడ్డు పడుతున్న నేపథ్యంలో నీరు వేగంగా ముందుకు కదలడం లేదు. వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ద్విచక్ర వాహనాలు తడిచి మరమ్మతులకు గురయ్యాయి.

గోతులు తీసి వదిలేశారు.. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మిస్తున్నారు. డ్రెయినేజీలకు మరమ్మతులు చేస్తున్నారు.



బుడమేరు వంతెన వద్ద నిలిచిన గుర్రపుడెక్కను పొక్లెయిన్‌తో తొలగింపు

నీటి పైపులు అమర్చుతున్నారు. అందుకు రహదార్లు తవ్వి గోతుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఆ గోతులు వాన నీటితో నిండి ప్రమాదకరంగా మారాయి. ● వర్షాల కారణంగా ముగ్గురు మృతి చెందారు. వన్‌టౌన్ కొత్తపేట ప్రాంతంలో తీసిన ఓ గుంతలో పడి ఓ తెదేపా నాయకుడు మరణించారు. లయోలా కళాశాల సమీపంలో రహదారిపై కూలిన చెట్టుకు ద్విచక్ర వాహనంతో ఢీకొని ఒకరు కన్నుమూశారు. ద్విచక్రవాహనం అదుపు తప్పి మరొకరు మృత్యువాత పడ్డారు.

ఇళ్లల్లోకి నీరు చేరిక

పాతబస్తీ చేపల మార్కెట్ సమీపంలోని ఇళ్లలోకి, భవానీపురం ప్రియదర్శిని కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, రైతుబజార్ ప్రాంతాల్లోకి అడుగు నీరు చేరింది. విద్యాధరపురం బస్ డిపో, ఆర్టీసీ వర్క్‌షాపు జలమయమయ్యాయి. నందమూరి నగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, విశాలాంధ్ర కాలనీ, కండ్రిక, రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లోని ఇళ్లలోకి వాన నీరు రాగా.. ప్రజలు తోడి బయట పోశారు. ఏపీఐఐసీ కాలనీలోని రహదార్లు నీట మునిగాయి. కృష్ణా నదిలో ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో బ్యారేజ్ ఎగువ కరకట్ట వెంట ఇళ్లలోకి మెల్లగా నీరు వస్తోంది. కృష్ణలంక, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల్లోని రిటైనింగ్ వాల్ దిగువ నుంచి కొద్దిపాటి నీరు ఇళ్లలోకి వస్తున్న నేపథ్యంలో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు యత్నిస్తున్నా... వారు కదలడం లేదు. ● బుడమేరులో ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు మైక్ ప్రచారం చేస్తున్నారు. నగరపాలక సంస్థ మాన్‌సూన్ రస్పాన్స్ బృందాలు ఆయా ప్రాంతాల్లో వర్షం నీటిని తోడుతున్నాయి.



పోలంపల్లి డ్యాం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

మునేరుకు కొనసాగుతున్న వరద ఉద్ధృతి

పెనుగంచిప్రోలు, వత్సవాయి, న్యూస్‌టుడే: తెలంగాణలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు వరద చేరుతోంది. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఏటిలో వరద పెరిగింది. పోలంపల్లి డ్యాం వద్ద నీటి మట్టం 9 అడుగులకు చేరింది. దిగువ కృష్ణా నదికి 11 వేల క్యూసెక్కుల వరదల పారుతోంది. ఇది పెరిగిన నేపథ్యంలో వత్సవాయి, పెనుగంచిప్రోలు రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. లింగాల, పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద సిబ్బంది బందోబస్త్ చేశారు. రెండు మండలాల తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసిన అధికారులు పరిస్థితిని ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారు. లింగాల కాజ్‌వే వద్ద వరద పెరిగితే కాజ్‌వేపై రాకపోకలు నిలిపేందుకు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు అధికారులు తెలిపారు.

నేడు.. రేపు.. సిటీ బస్‌పోర్ట్‌కు వచ్చే బస్సుల మళ్లింపు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సిటీ బస్‌పోర్ట్ నుంచి ఈ నెల 15న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 14 నుంచి 15 వరకు సిటీ బస్‌పోర్ట్‌కు వచ్చే అన్ని బస్సులను మళ్లిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎంవై దానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ☛ సిటీ బస్‌పోర్ట్‌కు వచ్చే సిటీ బస్సులు రైల్వేస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్‌కు నడుపుతారు. ☛ నూజివీడు, విస్సన్నపేట, సత్తుపల్లి బస్సులు సింగ్‌నగర్, ఏలూరు లాకులు, రైల్వేస్టేషన్, కేఆర్ మార్కెట్ అండర్ బ్రిడ్జి, వినాయకుని గుడి, మున్సిపల్ ఆఫీస్, రాజీవ్‌గాంధీ పార్కు మీదుగా పీఎన్‌బీఎస్‌లోకి చేరుకుంటాయి. 43వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి నూజివీడు, విస్సన్నపేట బస్సులు, 46వ ప్లాట్‌ఫాం నుంచి సత్తుపల్లి బస్సులు నడుపుతారు. ☛ రూట్ నంబరు 218 విజయవాడ నుంచి మైలవరం వయా వెలగలేరు, రూట్ నంబరు 350 విజయవాడ నుంచి మైలవరం వయా ఇబ్రహీంపట్నం ఆర్డినరీ బస్సులు రైల్వేస్టేషన్ నుంచి నడుపుతారు. ☛ రూట్ నంబరు 350 విజయవాడ నుంచి మైలవరం వయా ఇబ్రహీంపట్నం మెట్రో బస్సులు 45వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి నడపనున్నారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని కోరారు.

48 గంటల్లో టెండర్లు పిలవకుంటే ధర్నా చేస్తా

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అల్టిమేటం

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం నుంచి నూజివీడు వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు 48 గంటల్లోగా టెండర్లు పిలవకపోతే నాయకులతో కలిసి సీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానని ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అల్టిమేటం జారీ చేశారు. రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, ర.భ. సీఈ శ్రీనివాసరెడ్డి పలు కారణాలతో టెండర్లు పిలవకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మైలవరం మండలం తోలుకోడు పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే 'న్యూస్‌టుడే'తో మాట్లాడి సీఈ తీరును దుయ్యబట్టారు. తీవ్రంగా దెబ్బతిన్న రహదారి అభివృద్ధికి నిధుల కేటాయింపునకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి చుట్టూ తిరిగి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. కానీ గత ప్రభుత్వ గుత్తేదారును దృష్టిలో పెట్టుకొని, తనకు వ్యతిరేకంగా ఆ నిధులతో వేరే వైపు నుంచి పనులు చేపట్టేలా సీఈ ఆదేశాలిచ్చారన్నారు. ఆ విషయం తెలుసుకుని తాను, ర.భ. మంత్రి బీసీ జనార్దన రెడ్డి, ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే దృష్టికి తీసుకెళ్లగా సీఈ తీరుపై వారు మండిపడ్డా, రోజుకో కొర్రీ వేస్తూ ఇబ్బందులు కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. వైకాపా నుంచి తెదేపాలోకి వచ్చానని సీఈ తనపై దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కందులపాడు, విస్సన్నపేట రహదారికి కేంద్రం నుంచి రూ.40 కోట్ల వరకు తాను మంజూరు చేయిస్తే, టెండర్ల మతలబుతో వాటిని రద్దయ్యేలా చేశారన్నారు. జి.కొండూరు నుంచి గంగినేనిపాలెం రోడ్డు దుస్థితికి, నియోజకవర్గంలో మూడు ప్రధాన రహదారుల అధ్వాన స్థితికి సీఈ వైఖరే కారణమని, ఆయా విషయాలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి సైతం తీసుకెళ్లానన్నారు. బుధవారం మరోసారి మంత్రి జనార్దనరెడ్డిని కలిసి పరిస్థితిని వివరించగా, సీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

స్వాతంత్ర్య దినోత్సవానికి భద్రత కట్టుదిట్టం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 15వ తేదీన విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవం భద్రతా ఏర్పాట్లను బుధవారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర



స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

బాబు, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. పోలీస్ పరేడ్‌ను పర్యవేక్షించారు. అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వేడుకలో పాల్గొనేందుకు వీవీఐపీలు, వీఐపీలు, ప్రజలు స్టేడియానికి అధిక సంఖ్యలో హాజరవుతారు కనుక కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అన్నారు. స్టేడియం, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా భద్రత పరంగా లోపాలు లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏడీజీ మధుసూదనరెడ్డి, ఐజీ బి.రాజకుమారి, డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రానున్న రెండు, మూడు రోజులు కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పులిచింతల, మునేరు క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి కృష్ణా నదికి వరద నీరు పోటెత్తే అవకాశం ఉందని అన్నారు. బుధవారం సాయంత్రానికి 3 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోందని, అది 5 లక్షలకు పెరిగే అవకాశం ఉందని అన్నారు. వార్డు సచివాలయాలను యూనిట్‌గా తీసుకుని 24 గంటలు పనిచేసేలా వరద పర్యవేక్షక బృందాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలని చెప్పారు. కలెక్టరేట్‌లో 91549 70454 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, బుడమేరుకు వరదంటూ వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దని కోరారు. నగరంలో అక్కడక్కడా వర్షపు నీరు మాత్రమే చేరిందని, వరద నీరు కాదని అన్నారు. ప్రస్తుతానికి నగరానికి వరద ముప్పులేదని తెలిపారు. బుడమేరు రెగ్యులేటర్ వద్ద నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం చినలంక, పెదలంక ప్రాంతాల్లోని వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. వాగుల ప్రవాహాన్ని కూడా నిరంతం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

వరద సహాయక చర్యలపై ఎంపీ ఆరా

పటమట, న్యూస్‌టుడే: కృష్ణా నదికి ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి క్రమంగా ఉద్ధృతి పెరుగుతున్నందున విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టర్ లక్ష్మీశను బుధవారం ఎంపీ కలిసి నదికి నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, మందులు వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. చేపల వేటకు వెళ్లకుండా మత్స్యకారులకు అవగాహన కల్పించడంతో పాటు వెలగలేరు రెగ్యులేటర్ వద్ద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

గన్నవరాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని వినతి

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ సమీపంలోని గన్నవరం నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని మంత్రి సత్యకుమార్‌ను గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు కోరారు. ఆ మేరకు బుధవారం విజయవాడ రైతు శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఆర్సీ సమావేశంలో వినతిపత్రం అందజేశారు. జిల్లాల పునర్విభజన సమయంలో విజయవాడకు సమీపంలో ఉన్న గన్నవరంను కృష్ణా జిల్లాలో కలపడం ద్వారా ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. నాడు జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న గన్నవరంను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విజయవాడ గ్రామీణ మండలాలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీనం చేయాలన్నారు. ఎన్టీఆర్ పుట్టిన నిమ్మకూరు కృష్ణాజిల్లాలో ఉంటే, విజయవాడకు ఎన్టీఆర్ జిల్లా పేరు పెట్టడం తగదన్నారు. కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు, ఎన్టీఆర్ జిల్లాను కృష్ణా జిల్లాగా పేరు మార్చాలన్నారు.

అమరావతి ఖ్యాతి పెంచేలా మట్టి గణేశుడి విగ్రహం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని అమరావతి ఖ్యాతి పెంచేలా 72 అడుగుల మట్టి గణేశుడి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మట్టి గణేశుడి విగ్రహ నమూనా చిత్రపటాన్ని ఎంపీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ డూండీ గణేశ్ సేవా సమితి వారు ఏర్పాటు చేస్తున్న మట్టి గణేశుడి విగ్రహం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ ఎలాంటి విఘ్నాలు లేకుండా అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి కావాలని కాంక్షిస్తూ డూండీ గణేశ్ సేవా సమితి వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తోందన్నారు. సెప్టెంబరు 1 నాటికి వినాయకుడి విగ్రహం సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి నాయకులు గడ్డం రవి, ముక్తేశ్వరరావు, సూకల నాగేశ్వరరావు, వీవీకే నరసింహారావు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహ నమూనా చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), డూండీ రాకేష్, నిర్వాహకులు

వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక రహదారులు జలమయం అయ్యాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి బుధవారం రాత్రి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ.. 2014-19లో నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు రూ.500 కోట్లు మంజూరు చేస్తే, తరువాత వచ్చిన పాలకులు వాటిని దారి మళ్లించాలని ఆరోపించారు. ఫలితంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. డ్రెయిన్లు ఆక్రమణలకు గురికావడం కూడా ఓ కారణమని తెలిపారు. ఆక్రమణలను తొలగించాలని ఇప్పటికే అధికారులకు సూచించగా, వర్షాల వల్ల తొలగించడం కష్టంగా ఉందని చెప్పారని, వర్షాలు తగ్గిన తర్వాత ఆక్రమణలు తొలగించి డ్రెయిన్లు విస్తరిస్తారని మంత్రి వెల్లడించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వర్షాలు, వరదల వల్ల సమస్యలు ఉత్పన్నం కాకుండా నగరపాలక సంస్థ తీసుకున్న కొన్ని ముందస్తు చర్యల్లో కొన్ని ఇబ్బందులు నెలకొన్నాయని తెలిపారు. వర్షం నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి సిబ్బంది సాయంతో తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రోడ్లపై వర్షం నిలుస్తున్న అంశాన్ని ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లానని, వారు అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు 15 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు.



వర్షంలో పర్యటిస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ

ముందే ఓటమి అంగీకరించిన జగన్‌రెడ్డి

మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'ప్రజాస్వామ్యం, ఓటింగ్ ప్రక్రియల పవిత్రతపై ఓ గంట ఉపోద్ఘాతం ఇచ్చిన తర్వాత.. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తమ ఓటమిని అంగీకరిస్తూ వైకాపా అధినేత జగన్ బహిరంగంగానే ఓటమి సంతకం చేశారు. పోలింగ్ ప్రక్రియ పవిత్రతపై అధ్యయనం చేసినందుకు ఆయనకు అభినందనలు' అంటూ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎద్దేవా చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పవిత్రతను తుంగలో తొక్కి.. ఇప్పుడు రెండు స్థానాల్లో తమ ఓటమి ఖాయమని తెలిసి.. జగన్ నీతులు వల్లించడం చూస్తే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. పోలింగ్ అధికారులు, పోలీసుల బాధ్యతలు, బూత్ ఏజెంట్ల హక్కులు, ఫాం 12, 32 ప్రాధాన్యం జగన్‌రెడ్డి బుధవారం వివరించడం చూస్తే.. కనీసం పత్రికా సమావేశం కోసమైనా వాటిని ఇన్నాళ్లకు క్షుణ్ణంగా అధ్యయనం చేసినందుకు అభినందనలన్నారు. ఆయన గతంలో అధికారంలో ఉండగా.. ఈ అధ్యయనం చేసి ఉంటే నాడు ప్రజాస్వామ్యం అత్యాచారానికి గురయ్యేది కాదంటూ సత్యకుమార్‌యాదవ్ మండిపడ్డారు. జగన్‌రెడ్డి హయాంలో ప్రతిపక్షాలను కనీసం నామినేషన్లు కూడా వేయనివ్వకుండా చేసి.. ఏకగ్రీవాలు ప్రకటించుకోలేదా..? అని మంత్రి ప్రశ్నించారు.

జగనే రాహుల్ గాంధీకి టచ్‌లో ఉన్నాడు..

'దేశంలో ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు ఎంత కీలకపాత్ర పోషిస్తున్నారో అందరికీ తెలుసు. అది తట్టుకోలేకే జగన్ తన అక్కసునంతా వెళ్లగక్కుతున్నారు. రాహుల్ గాంధీతో చంద్రబాబు టచ్‌లో ఉన్నారంటూ జగన్ అంటున్నారు. కానీ.. వాస్తవంగా జగనే రాహుల్‌గాంధీతో టచ్‌లో ఉన్నాడు. కాంగ్రెస్ నుంచి విడిపోయిన ఆ తాను ముక్కే వైకాపా' అంటూ సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు.

నేటి నుంచి మహిళా వన్డే క్రికెట్ టోర్నీ


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మూలపాడులోని ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో ఈ నెల 14వ తేదీ నుంచి ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ మహిళా వన్డే క్రికెట్ టోర్నీ జరుగనుంది. ఈ టోర్నీలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు తలపడనున్నాయి. ఈ పోటీల నుంచి ప్రతిభగల మహిళా క్రికెటర్లను ఏసీఏ సెంట్రల్ జోన్ జట్టుకు ఎంపిక చేస్తామని ఏసీఏ వర్గాలు వెల్లడించాయి. డీవీఆర్ మైదానంలో గుంటూరు, పశ్చిమ గోదావరి, సీపీ మైదానంలో కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

స్వల్పంగా ప్రవహిస్తోన్న బుడమేరు

జి.కొండూరు, న్యూస్‌టుడే : అల్పపీడనం ప్రభావంతో మైలవరం నియోజకవర్గంలో కురుస్తున్న వర్షానికి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌కు వరద నీరు చేరుతోంది. దీంతో జి.కొండూరు వైపు పులివాగు, మైలవరం వైపు నుంచి బుడమేరు స్వల్పంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతానికి ప్రమాదం ఏమి లేదని పై నుంచి వస్తున్న వరద ప్రవాహం బుడమేరు డైవర్షన్ ఛానెల్ ద్వారా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలో కలుస్తోందని నీటి పారుదల సహాయక ఇంజినీర్ వెంకటేష్ తెలిపారు. రాత్రికి ఎడతెరపి లేకుండా వర్షం కురిస్తే వరద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని బుడమేరు పరివాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సినిమాలైనా, రాజకీయాలైనా సమాజ హితమే లక్ష్యం

తుళ్లూరు, న్యూస్‌టుడే: చలన చిత్రాలు తీసినా, రాజకీయాలు చేసినా అంతిమంగా సమాజానికి సేవ చేయటమే తమ కుటుంబ లక్ష్యమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అమరావతిలోని తుళ్లూరు, అనంతవరం గ్రామాల మధ్య బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేని బసవతారకం ఆసుపత్రి ఉన్నత స్థితికి చేరడంలో దేశ విదేశాలకు చెందిన ఎందరో దాతల సహాయ, సహకారాలు వెలకట్ట లేనివన్నారు. తుళ్లూరుకు చెందిన తెదేపా నేత, మాజీ ఉమ్మడి గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కొమ్మినేని సాంబశివరావు ఆసుపత్రి నిర్మాణానికి రూ.1,01,116 చెక్కును విరాళంగా అందించారు. తొలి విరాళం అందించిన ఆయన్ను బాలకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రాజధాని రైతులు పాల్గొన్నారు.



బాలకృష్ణకు విరాళం చెక్కు అందిస్తున్న కొమ్మినేని సాంబశివరావు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన నూతులపాటి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నర్రా వాసు, తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, మాజీ అధ్యక్షులు వల్లమూడి జగన్మోహనరావు, చెరుకూరి ఆనందరావు, సీఈవో వెంకట రవికుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల నిర్మాణానికి త్వరలో టెండర్లు

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో లేని 105 నియోజకవర్గాల్లో పీపీపీ విధానంలో ఆసుపత్రులను నిర్మించడానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మైలవరంలో నూతనంగా నిర్మించిన ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి మంత్రి బుధవారం ప్రారంభించారు. వైద్య ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగానే పీపీపీ విధానంలో 100 నుంచి 300 పడకల వరకు గల ఆసుపత్రులను నిర్మించడానికి సీఎం ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్‌లోకి జాతీయ రహదారి కాలువల్లోని నీరు వస్తోంది. దీంతో ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. **- స్వతంత్ర కుమార్, స్థానికుడు**

✔ ఆ ప్రాంతంలో జాతీయ రహదారి నీరు రావడం వాస్తవమే. దీనిపై ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూనే ఉన్నాం. **- వెంకటరత్నం, పారిశుద్ధ్య అధికారి**

? కృష్ణాకు వరద నీరు వస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలైన ఫెర్రీ, ఇసుక రేవు నివాసితులకు పునరావాస కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేశారో రెవెన్యూ సిబ్బంది తెలియజేయలేదు. **- శ్రీనివాసు, ఇబ్రహీంపట్నం ఫెర్రీ**

✔ అన్ని ప్రాంతాల వారికి పునరావాస కేంద్రంగా ట్రక్ టెర్మినల్‌ను ఏర్పాటు చేశాం. అక్కడున్న కొన్ని నిర్మాణాల్లో వసతులు కల్పించాం. సద్వినియోగం చేసుకోండి. **- తహసీల్దారు వెంకటేశ్వర్లు - ఇబ్రహీంపట్నం**

? మైలవరం ప్రాంతంలో నివాసాల మధ్యన ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు పెరుగుతుండడంతో పందులకు నిలయంగా మారుతున్నాయి. దీంతో ఇబ్బందిగా ఉంది. **- సత్యవతి, మైలవరం**

✔ స్థలాల యజమానులను గుర్తించి, పిచ్చిచెట్ల తొలగింపునకు చర్యలు చేపడతాం. **- ఎండీ రఫీ, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, మైలవరం

అప్రమత్తతే ఆయుధం.. తెలుసుకో సత్యం

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై చైతన్య సదస్సు



ప్రసంగిస్తున్న ఏసీపీ ప్రసాదరావు



హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే : అంతర్జాలంలో దాక్కుని చేసే సైబర్ మోసాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు అన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'సైబర్ మోసాలపై చైతన్య' సదస్సులో మోసాల తీరును ఆయన వివరించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు పెట్టడంతో మార్ఫింగ్‌కు అవకాశం ఉంటుందని, లైకుల కోసం చూస్తే జీవితం పలచనవుతుందన్నారు. మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు నిజమో, కాదో తెలియని స్థితిలో పిల్లల జీవితాలు నాశనం అవుతాయన్నారు. అవాంఛిత మెయిల్స్, లింకులను క్లిక్ చేయడం ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని, దీనికి అప్రమత్తతే ఆయుధమన్నారు. తెలిసిన వ్యక్తుల పేరిట ఆన్‌లైన్‌లో డబ్బుల కోసం వినతులు పంపితే, నేరుగా వారితో మాట్లాడి ధ్రువీకరించుకోవాలని, ఆ తర్వాత నగదు లావాదేవీలు చేయాలన్నారు. ఉద్యోగాల కోసం ఏజెంట్లను ఆశ్రయించడం మంచిది కాదన్నారు. ఎస్సై కె.సుధాకర్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలతో మోసాలు పెరిగాయన్నారు. అటువంటి ఘటనలు వృత్తి పరంగా అనేకం వచ్చాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహనకు 'ఈనాడు- ఈటీవీ' ప్రయత్నం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు మోసాలపై అవగాహన పెంచుకోవాలని, అనవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల జోలికి పోవద్దని ఆయన హితవు పలికారు.

అవగాహన కలిగింది



సైబర్ నేరాలను ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో సమాచారం పంచుకోవడం మంచిది కాదని, ఉద్యోగాల కోసం ఏజెంట్లను నమ్మవద్దన్నారు. **- యామిని శివప్రియ, తేజస్వి**

ఏసీపీ వివరించారు



సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలన్న విషయాన్ని ఏసీపీ చక్కగా వివరించారు. మోసాల తీరుపై అవగాహన ఉంటే, మేము ముప్పు నుంచి తప్పించుకుంటాం. **- మేఘన, హాసిని**

ప్రభావాన్ని గుర్తించాలి



యువత, ప్రజలు సామాజిక మాధ్యమ ప్రభావం, దుష్పరిణామాలను తెలుసుకోవాలని సదస్సులో వివరించారు. అత్యాశకు పోతే, అసలుకే మోసం వస్తుందని పోలీస్ అధికారులు ఉదాహరణలతో చెప్పారు. **- సందీప్, జయసూర్య**

శిక్షణతో నైపుణ్యాలకు పదును

మైలవరం, న్యూస్‌టుడే : శిక్షణా తరగతులతో విద్యార్థుల్లోని నైపుణ్యాలకు పదును పెరుగుతుందని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ



ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ రవి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ళా రవి పేర్కొన్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల శిక్షణ తరగతులను పూర్తి చేసుకున్న వారికి బుధవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్స్‌లో కృత్రిమ మేధ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు భవిష్యత్తులో మరిన్ని శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉప ప్రిన్సిపల్ పి.రంగారావు, విభాగాధిపతి ఎన్.వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు మెరుగైన సేవలు

మైలవరం, న్యూస్‌టుడే : సహకార సంఘాల ద్వారా గ్రామాల్లోని రైతులకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని తోలుకోడు సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కోటగిరి వెంకటేశ్వరరావు, ఇద్దరు సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని ఆయన అభినందిస్తూ, సకాలంలో రైతులకు అండగా ఉండాలని సూచించారు. నాయకులు శోభన్ బాబు, కుమార్ రెడ్డి, లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తోలుకోడు పాలక వర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొర్లమండ పీఏసీఎస్ ఛైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన కట్టా నరసింహారావును తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, రాజా, వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులు అభినందించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు వేముల వెంకటేశ్వరరావు, చల్లపల్లి శ్రీనివాసరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



కొరమండ : నరసింహారావును అభినందిస్తున్న రాయల బ్రదర్స్

అంతా వర్షం.. తెచ్చెను కష్టం



వాహనాలకు సూచిక బోర్డులు చూపుతున్న ట్రాఫిక్ పోలీసులు



ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యంలో పరిస్థితి



పైడూరుపాడులో నీట మునిగిన పొలాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే : రెండ్రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. జాతీయ రహదారులు సైతం నీటిలో కనిపించకుండా పోయాయి. దీంతో బుధవారం సాయంత్రం హైదరాబాద్- విజయవాడకు రాకపోకలు సాగించే వాహనాలు జూపూడి వద్ద నిలిచాయి. తెలంగాణ జిల్లాల నుంచి ప్రవహిస్తున్న వాగు నీటి ప్రవాహం కృష్ణాకు చేరుకునే క్రమంలో మండల శివారులోని ఏనుగుగడ్డ, పులిగడ్డ వాగుల్లోకి ప్రవేశించడంతో వాగుల ఉద్ధృతి తీవ్రంగా ఉంది. దీంతో మండల శివారు దాములూరు, చిలుకూరులోని పొలాలు జలమయమయ్యాయి. మూలపాడు, కేతనకొండ, జూపూడి వద్ద ఉన్న పంట పొలాలు చెరువులుగా మారాయి. కొండపల్లిలోని లోతట్టు ప్రాంతాల్లోకి నీళ్లు వెళ్లడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యం, కొండపల్లి ముత్యాలచెరువు, ఎస్టీ కాలనీ, ఈలప్రోలు జగనన్న కాలనీ ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా మారింది.

జి.కొండూరు, న్యూస్‌టుడే : హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు లోలెవల్ వంతెన వద్ద బుధవారం సాయంత్రం వరద నీరు ప్రవహించింది. వర్షం ఆగకుండా కురుస్తున్నందున స్థానిక పోలీసులు ఇరువైపులా రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. ప్రవాహం పెరిగితే బారికేడ్లు పెట్టి పూర్తిగా రాకపోకలు నిలిపేస్తామని జి.కొండూరు ఏఎస్సై రాఘవయ్య తెలిపారు.



హెచ్.ముత్యాలంపాడు వద్ద ప్రవహిస్తున్న బుడమేరు వరద

గొల్లపూడి, న్యూస్‌టుడే : వర్షంతో గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. గొల్లపూడిలోని కొన్ని అపార్టుమెంట్లలోని సెల్లార్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాత పుస్తకాల వితరణ

మైలవరం న్యూస్‌టుడే : మండలంలోని మొర్సుమిల్లికి చెందిన బోజడ్ల అశోక్ జయంతిని పురస్కరించుకొని బుధవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాత పుస్తకాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడపాటి శ్రీనివాసరావు, వడ్డే నాని, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ



సరకులు పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : కుదపలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ జె.సుశీలాదేవి బుధవారం తనిఖీ చేశారు. నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రక్షిత నీటి సరఫరా ట్యాంకులను చూశారు. నీటి సరఫరా గురించి గ్రామస్థులను ఆరా తీశారు. కార్యక్రమంలో వీఆర్వో నాగజ్యోతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రైవేటు సంస్థల పరం చేయవద్దు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్ బోర్డు ఆసుపత్రిని సంస్థ ఆధ్వర్యంలోనే ఉంచి అన్ని ఆధునిక వసతులు కల్పించాలని ఎన్టీటీపీఎస్ కార్మికులు కోరుతున్నారు. బోర్డు ఆసుపత్రి నిర్వహణ ప్రైవేటు సంస్థలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని సంస్థ కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం బోర్డు ఆసుపత్రి వద్ద వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బోర్డు ఆధ్వర్యంలో కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అలాకాక ప్రైవేటుకు అప్పగిస్తే కార్మికులకు ప్రైవేటు సంస్థల్లో చికిత్స చేయించుకొనే స్తోమత ఉండదన్నారు. ఈ నిర్ణయంపై పునఃసమీక్షించి పునరాలోచన చేయాలన్నారు. లేని పక్షంలో దశల వారీ ఆందోళనలు తప్పవన్నారు. వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రైతులు సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. రంగాపురం, నాగులూరులో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువులకు బదులుగా నానో యూరియా, డీఏపీ వాడటం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించగలరని చెప్పారు. ఉద్యాన శాఖ అధికారి నరేంద్ర కుమార్, తహసీల్దార్ జె.సుశీలాదేవి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు మండలం ముష్టికుట్లలో..

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని ముష్టికుట్ల, చింతలపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో పద్మ పాల్గొని మాట్లాడారు. రైతులందరూ తమ సమీపంలోని మీసేవా, బ్యాంకు, పీఏసీయస్‌లో పంట బీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. ముష్టికుంట్ల సర్పంచి జి.కోటేశ్వరరావు, పీఏసీయస్ ఛైర్మన్ గద్దె.అనిల్, చింతలపాడు సర్పంచి చాట్ల.దానయ్య, పలువురు పాల్గొన్నారు.

గ్యాస్ బండకు అదనంగా వసూళ్లు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానికంగా ఉన్న పద్దమ్మతల్లి ఇండేన్ గ్రామీణ్ విత్రక్ ఏజెన్సీ డీలర్ గ్యాస్ బండలకు అదనంగా వసూళ్లు చేయడంతో అదనపు భారం పడుతుందని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. 5 కి.మీ లోపు ఉన్న వారికి బండ బిల్లు ధర చెల్లిస్తే ఎలాంటి రవాణా ఛార్జీ తీసుకోకుండా దాన్ని ఇవ్వాల్సి ఉంది. కానీ దీనికి విరుద్ధంగా అదనంగా రూ.40లు వసూలు చేస్తున్నారని రాఘవాపురం బీసీ కాలనీకి చెందిన వినియోగదారుడు 'న్యూస్‌టుడే'కి తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. దీనిపై విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజును వివరణ కోరగా ఈ విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదన్నారు. డీలర్‌కు అదనపు వసూళ్లు చేయరాదని చెబుతామన్నారు.

సభ్యుల గైర్హాజరుతో సమావేశం వాయిదా

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కోరం లేక బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి సమక్షంలో ప్రకటించారు. 17 మంది సభ్యులకు గాను మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్ బాబా ఒక్కరు మాత్రమే దీనికి హాజరయ్యారు. ఎంపీపీపై వ్యతిరేకతతోనే సొంత పార్టీ వైకాపా సభ్యులు వరుస సమావేశాలకు డుమ్మాకొట్టి సమస్యలను గాలికి వదిలేయడంతో ఎన్నుకున్న ప్రజలు మండిపడుతున్నారు.



సభకు హాజరైన ఎంపీపీ మెర్సీ వనజాక్షి, తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి తదితరులు

ప్రాణాలు నిలిపిన ఉచిత ఇంజెక్షన్

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరుకు చెందిన ఎమ్.రాము(45), మండల పరిధిలోని రోలుపడికి చెందిన ఎమ్.నాగేశ్వరరావు(70) అనే వ్యక్తులకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు గమనించి బుధవారం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఉన్న వైద్యులు సకాలంలో స్పందించి ఒక్కోకరికి రూ.45,000 విలువ గల ఇంజెక్షన్ ఇచ్చి ఇద్దరి ప్రాణాలను కాపాడారు.

నిర్వాహకులకు నోటీసులు

మైలవరం, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న మాంసంతో విక్రయాలకు అనుమతులు లేవని పంచాయతీ కార్యదర్శి రఫీ తెలిపారు. అందులో భాగంగా పట్టణంలోని మాంసం విక్రయ దుకాణాల నిర్వాహకులకు నోటీసులను అందజేసినట్లు ఆయన చెప్పారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో మాంసం విక్రయాలు నిషేధించడమైనదని ఈవో హరికృష్ణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున దుకాణాలన్నీ పూర్తిగా మూసి వేయాలని, ఎవరైనా మాంసం విక్రయిస్తే పంచాయతీరాజ్ చట్టం అనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంక్షేమ పథకాలు వర్తించకపోవడం దుర్మార్గం



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతిబసు డిమాండ్ చేశారు. యూనియన్ రెండో మహాసభను కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వం పర్మినెంటు చేస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. ఇంత వరకూ ఆ హామీ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తించక పోవడం దుర్మార్గమన్నారు. సమ్మెల ప్రభావంతో వేతనాలు పెంచుతామని ఇచ్చిన జీవోలు అమలు కావడం లేదన్నారు. కార్మికులకు సాధారణ సెలవులు అమలు చేయడంతో పాటు ఏకరూప దుస్తులు అందివ్వాలన్నారు. మహేష్, సురేష్, కృష్ణా, అప్పారావు, శ్రీను పాల్గొన్నారు. ఈ మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నిర్వహణ లోపం.. రైతులకు శాపం

న్యూస్‌టుడే, జి.కొండూరు

సకాలంలో సాగు నీరందక భూములు ఎండిపోతున్నాయని కవులూరు రైతులు ఆవేదన చెందుతున్నారు. కవులూరు- ఈలప్రోలు గ్రామాల పరిధిలోని తారకరామ ఒకటో నంబర్ ఎత్తిపోతల పంపుహౌస్ నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారిందని అన్నదాతలు వాపోతున్నారు. దాదాపు ఈ పంపుహౌస్ కింద 850 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో మొత్తం నాలుగు మోటార్లు ఉండగా ఒకటే నీరు ఎత్తి పోయడంతో నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉందని పలువురు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సాగు ఆలస్యమైందని, దీనికి తోడు నీరందక అవస్థలు పడుతున్నామంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మోటార్ల మరమ్మతులపై దృష్టి సారించి సాగునీరు అందించాలని కర్షకులు కోరుతున్నారు.

మరో మార్గంలో ప్రవహిస్తూ..

కవులూరు- ఈలప్రోలు వెళ్లే కాలువ గట్టు గతేడాది వరద కోతకు గురైందని, దీనికి తోడు పంపుహౌస్‌లో ఒక మోటారు మాత్రమే పని చేస్తుడటంతో నీరు దిగువకు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. గండి పడిన మేర నీరంతా మరో మార్గంలో ప్రవహిస్తూ దిగువకు తక్కువ నీరు చేరుతోందని, ఈ క్రమంలో తమ పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని చెబుతున్నారు. ఈ గండికి తక్షణమే మరమ్మతులు చేస్తే కాలువలో పక్కకు వెళ్లే నీరు దిగువకు ప్రవహించి తమ పొలాలు పండుతాయని చెబుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు తారకరామ ఎత్తిపోతల నిర్వహణపై దృష్టి సారించి తమకు సాగునీరందివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఒక పంపు మాత్రమే పని చేస్తున్న పంపుహౌస్



గతేడాది కాలువ గట్టుకు పడిన గండి



ఓ పోలింగ్ కేంద్రంలో గొడుగులతో వేచి ఉన్న ఓటర్లు

వైకాపా పిలుపు పట్టని పులివెందుల ఓటరు

రీపోలింగ్‌లో స్వేచ్ఛగా ఓటింగ్

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, పులివెందుల: పులివెందుల తమ అడ్డాగా చెప్పుకొనే వైకాపా నేతలను ఓటర్లు లెక్కచేయలేదు. ఆ పార్టీ నేతలు ఇచ్చిన బహిష్కరణ పిలుపును తోసిపుచ్చి స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నిక ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. అచ్చవెల్లి, ఈ.కొత్తపల్లి గ్రామాల్లోని 3, 14 పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో రీపోలింగ్‌ను బుధవారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి రీపోలింగ్‌కు ముందే మీడియా సమావేశం నిర్వహించారు. తాము రీపోలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఓటేసేందుకు వెళ్లవద్దని ఆయా గ్రామాల్లోని ప్రజలకు సూచించారు. వర్షం కారణంగా ప్రారంభంలో ఓటర్లు మందకొడిగా కనిపించారు. మధ్యాహ్నం సమయానికి బారులుతీరారు. అచ్చవెల్లిలో 492 మందికి గాను 337 మంది (68.50%), ఈ.కొత్తపల్లిలో 1,273 మందికి గాను 691 మంది (54.28%) మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైకాపా బహిష్కరణ పిలుపును పట్టించుకోకుండా ఓటేయడం చర్చనీయాంశంగా మారింది. వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు. పులివెందుల, ఒంటిమిట్ట స్థానాల ఓట్ల లెక్కింపును తాము బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

హైకోర్టులో జీపీల నియామకం

జీవోలు జారీచేసిన న్యాయశాఖ కార్యదర్శి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాదులు ఎస్.బాలమోహన్‌రావు, జీవీఎల్ మూర్తి ప్రభుత్వ న్యాయవాదులు (జీపీ)గా నియమితులయ్యారు. మరోవైపు ఏపీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు తరఫున న్యాయవాది షేక్ కరీముల్లాను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వీరు మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం వేర్వేరుగా ఉత్తర్వులిచ్చారు.

స్త్రీశక్తి పథకాన్ని సీఎం ప్రారంభించాకే జీరో ఫేర్ టికెట్ల జారీ

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించిన తర్వాతే జీరో ఫేర్ టికెట్ల జారీ మొదలుకానుంది. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు.. అన్ని డిపోలకు సమాచారం ఇచ్చారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి శుక్రవారం విజయవాడలో ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుంది. ఆ తర్వాత ఐదు రకాల బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఛార్జీ తీసుకోకుండా జీరో ఫేర్ టికెట్లు జారీ చేయనున్నారు.

సీఎం చంద్రబాబుకు నాదెండ్ల బ్రహ్మం చౌదరి కృతజ్ఞతలు



ఈనాడు, అమరావతి: తనను కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించినందుకు గాను సీఎం చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు నాదెండ్ల బ్రహ్మం చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ వ్యాఖ్యలు

- మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

ఈనాడు, అమరావతి: పులివెందుల జడ్పీటీసీ స్థానం ఉప ఎన్నికలను ఉద్దేశించి మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. 'ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలకు చాలా ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి. ప్రజలంతా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు' అని పేర్కొన్నారు.

- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఏదో ఒకదానికి మహాకవి గుర్రం జాషువా పేరు పెట్టాలని వరప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘానికి వినతిపత్రం అందించారు.

గ్రూప్-2 క్రీడా కోటా తాత్కాలిక ప్రాధాన్యత జాబితా

ఈనాడు, అమరావతి: గ్రూప్-2 క్రీడా కోటాకు సంబంధించి శాప్ సాంకేతిక కమిటీ రూపొందించిన తాత్కాలిక ప్రాధాన్యత, తిరస్కరణ జాబితాను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై ఉన్న అభ్యంతరాలను ఈ నెల 20 రాత్రి 11 గంటలలోపు కమిషన్‌కు ఈ-మెయిల్ ద్వారా తెలపాలని సూచించారు. నిర్ణీత తేదీ నాటికి వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను తుది పరిశీలన కోసం శాప్‌కు అందిస్తామన్నారు.

మేధా టవర్‌లో బాన్‌బ్లాక్ టెక్నాలజీ సంస్థ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో 'స్మార్ట్ బస్ ఐఓటీ డివైజ్'లను పైలట్ ప్రాజెక్టు కింద అమర్చనున్నట్లు 'బాన్‌బ్లాక్ టెక్నాలజీ' సీఈఓ గోవిందరాజన్ తెలిపారు. గన్నవరంలోని ఏపీఐఐసీ-ఎస్ అర్బన్ హైటెక్ సిటీలోని మేధా టవర్‌లో ఆ సంస్థ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. తమ సంస్థ ద్వారా ఫార్మా, ఆటోమోటివ్, రిటైల్, ఆరోగ్య, ఆహార రంగాలకు సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తామని.. 300 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. 'విజయవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, తిరుపతిల్లో ప్రారంభించే బస్సుల్లో ఈ డివైజ్‌లు అమర్చుతాం. 360 డిగ్రీల్లో పనిచేసే కెమెరాల ద్వారా రియల్‌టైమ్‌లో బస్సు కదలికలను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

జగన్ పర్యటనలో కార్యకర్తల బరితెగింపు

ఈనాడు, ఏలూరు, భీమవరం, న్యూస్‌టుడే బృందం: మాజీ సీఎం జగన్ బుధవారం భీమవరంలో పర్యటన ముగించుకుని వెళ్తుండగా వైకాపా కార్యకర్తలు బరితెగించారు. జోరువర్షంలో నడిరోడ్డుపై చొక్కాలు విప్పి నృత్యాలు వేస్తూ హంగామా సృష్టించారు. దీంతో పట్టణంలోని ఉండి రోడ్డులో అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు, ప్రయాణికులు వర్షంలో అవస్థలు పడ్డారు. కార్యకర్తలు డ్యాన్సులు వేస్తూ ఆగి ఉన్న లారీలపైకి ఎక్కి జెండాలను ఊపుతూ విన్యాసాలు చేశారు. పోలీసులు వారిని తప్పించి, రాకపోకలను పునరుద్ధరించారు.



రప్పా.. రప్పా ఫ్లెక్సీని చూపుతున్న వైకాపా కార్యకర్త



భీమవరం హెలిప్యాడ్‌లో జగన్ హెలికాప్టర్ దిగుతుండగా బారికేడ్లు ఎక్కుతున్న వైకాపా కార్యకర్తలు



మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె, అల్లుడిని ఆశీర్వదిస్తున్న జగన్

బారికేడ్లు దాటి.. హెలిప్యాడ్ వైపు

ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొనేందుకు జగన్ బుధవారం సాయంత్రం భీమవరం వచ్చారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో భీమవరంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. హెలికాప్టర్ దిగేటప్పుడు కూడా కార్యకర్తలు బారికేడ్లు దాటి లోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. హెలిప్యాడ్ నుంచి కల్యాణవేదిక వరకు ద్విచక్రవాహనాలు, కార్లతో కార్యకర్తలు ర్యాలీగా చేరుకున్నారు. కల్యాణ వేదికపైకి జగన్ వెళ్లినప్పుడు జైజగన్, సీఎం, సీఎం అంటూ నినాదాలు చేశారు. దీంతో కల్యాణ మండపంలో గందరగోళం ఏర్పడింది. జగన్ వధూవరులను ఆశీర్వదించి వేదిక దిగి వెళ్లేటప్పుడు కూడా కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. కొందరు రప్పా రప్పా ఫ్లెక్సీలు, మరికొందరు కాబోయే సీఎం అంటూ, మీకు ఏసు తోడుగా ఉంటారంటూ ఫొటోలను ప్రదర్శించారు. కల్యాణ వేడుకకు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, సీహెచ్.రంగనాథరాజు, వైకాపా జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

వైకాపా నేతలంటే వణుకెందుకు?

- ఎంపీ అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవటానికి భయపడిన కడప జిల్లా పోలీసులు
- తప్పించుకుని పారిపోతున్నా స్పందించని వైనం
- పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు



ఎంపీ అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు పులివెందులలోని జగన్ క్యాంప్ కార్యాలయానికి వెళుతున్న డీఐజీ కోయ ప్రవీణ్, కడప ఎస్పీ అశోక్ కుమార్

ఈనాడు, కడప: కొంతమంది క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బంది ఇప్పటికీ వైకాపా నేతల కనుసన్నల్లోనే పని చేస్తున్నారా? వైకాపా నేతలు పేట్రేగిపోతున్నా.. వారి పట్ల భయభక్తులు ప్రదర్శిస్తూ ప్రాథమిక విధులను సైతం విస్మరిస్తున్నారా? పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా.. వైఎస్సార్ కడప జిల్లాలోని కొంతమంది పోలీసుల వ్యవహారశైలి చూస్తే ఇదే నిజమనిపిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునే సమయంలో ఉన్నతాధికారులకు సహాయ నిరాకరణ చేయటం, ఆయన పోలీసుల నుంచి తప్పించుకుని వెళ్లిపోతే.. వెంటనే పట్టుకోకుండా మధ్యాహ్నం వరకు చోద్యం చూడటం వంటివి తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది సరిగ్గా వ్యవహరించకపోవటంతో చివరికి డీఐజీ రంగంలోకి దిగాల్సి వచ్చింది. అది ఓర్వలేకే బుధవారం విలేకర్ల సమావేశంలో డీఐజీ కోయ ప్రవీణ్‌పై జగన్ విరుచుకుపడ్డారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి సహాయనిరాకరణ చేసిన ఇదే పోలీసులు తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డిని ముందస్తు అరెస్టు చేసి, సునాయాసంగా ఇడుపులపాయ పోలీస్‌స్టేషన్‌కు తరలించేశారు.

30 మంది ఉన్నా ముందుకు రాలేదు..

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులు మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకే పులివెందులలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. డీఎస్పీ మురళీనాయక్, వేముల సీఐ ఉలాసయ్యలు అవినాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. వారి బృందంలోని సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఏ మాత్రం సహకరించలేదు. అవినాష్‌రెడ్డిని పట్టుకోవటానికి భయపడి చోద్యం చూస్తూ నిలబడ్డారు. దీంతో డీఎస్పీ, సీఐ.. అవినాష్‌రెడ్డిని మోసుకుంటూ బయటకు తీసుకొచ్చి అతికష్టం మీద ఉదయం 6 గంటలకు పోలీసు వాహనంలోకి ఎక్కించారు. అక్కడి నుంచి ఎర్రగుంట్ల వైపు తరలిస్తుండగా.. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అడ్డుకున్నారు. అవినాష్‌రెడ్డి తప్పించుకుని సుధీర్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అయినా పోలీసులు ఆయన్ను నిలువరించలేదు. దీంతో అవినాష్‌రెడ్డి వేంపల్లె, వేముల, పులివెందుల రింగ్‌రోడ్డు దగ్గరున్న మూడు చెక్‌పోస్టులను దర్జాగా దాటుకుని పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయానికి చేరుకోగలిగారు. అవినాష్‌రెడ్డి, వైకాపా నేతలంటే క్షేత్రస్థాయి సిబ్బందిలో ఎంత భయముందో చెప్పటానికి ఇదే తార్కాణం. జగన్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్న అవినాష్‌రెడ్డి.. పోలింగ్ సందర్భంగా అల్లర్లు సృష్టించటానికి అక్కడి నుంచే వ్యూహాలు పన్నారు. అయినా సరే క్షేత్రస్థాయి సిబ్బంది ఆయన్ను నిలువరించలేదు. దీంతో చివరికి డీఐజీ కోయ ప్రవీణ్, కడప ఎస్పీ అశోక్‌కుమార్ జగన్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అవినాష్‌రెడ్డి అప్పటికే లోపల తలుపులు వేసుకుని ఉండటంతో గట్టిగా పిలిచి హెచ్చరించారు. ఆయన్ను అక్కడి నుంచి కదలనివ్వకుండా గృహనిర్బంధం చేయించారు.

ఒంటిమిట్టలోనూ సహకారం!

ఒంటిమిట్టలో జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా.. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల వైకాపా నేతలు పోలింగ్ కేంద్రాల్లోకి అక్రమంగా చొరబడి, దొంగ ఓట్లు వేసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. తమ పట్ల వీరవిధేయతలు ప్రదర్శించే కొందరు పోలీసులు.. ఉన్నతాధికారులకు సహాయ నిరాకరణ చేయటంతో వైకాపా నేతలు చెలరేగిపోయారు.

సవరించిన టెట్ మార్కులతో డీఎస్సీ స్కోర్ కార్డులు

ఈనాడు, అమరావతి: సవరించిన టెట్ మార్కులతో మెగా డీఎస్సీ స్కోర్ కార్డులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం సవరించిన టెట్ మార్కులతో స్కోర్ కార్డులు విడుదల చేశారు. వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే అభ్యర్థి ఐడీ నంబరు ద్వారా వెబ్‌సైట్‌లో వివరాలను సరి చేసేందుకు గురువారం ఒక రోజు సమయం ఇచ్చినట్లు తెలిపారు.

40 రోజుల్లో 1.20 కోట్ల ఇళ్లను సందర్శించాం

- తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



ఈనాడు, అమరావతి: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 40 రోజుల్లో 1.08 లక్షల మంది కార్యకర్తల ద్వారా 1.20 కోట్ల ఇళ్లను సందర్శించినట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ప్రజలు పొందిన లబ్ధి, ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నట్లు వివరించారు. ప్రశాంతమైన పాలన సాగుతోందని ప్రజలు అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి కార్యకర్తల పనితీరును సమర్థవంతంగా అంచనా వేసినట్లు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతమైంది. తెదేపా నాయకులు ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు గత ప్రభుత్వ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులు, వాలంటీర్ల ద్వారా జరిగిన అరాచకాలు, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన వంటి అంశాలను తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో 70 శాతం ఇప్పటికే అమలు చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడంతో ఇది 90 శాతానికి చేరుకుంటుంది. పెన్షన్ రూ. 1000 పెంచి, ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేయడంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. సీఎం చంద్రబాబు విదేశీ పర్యటనల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, కంపెనీలు వస్తున్నాయి' అని వివరించారు.

పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడిన వారికే పదవులు...

'పార్టీ కష్టకాలంలో నిలబడిన వారికి నామినేటెడ్ పదవులిచ్చాం. కేవలం సిఫార్సుల ఆధారంగా కాకుండా, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన వారిని గుర్తించి ఇచ్చాం. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఉన్న బీమా ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన 400 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున ఇప్పటివరకు రూ. 20 కోట్లు అందించాం. ప్రతి ఎమ్మెల్యే శుక్ర, శనివారాల్లో నియోజకవర్గాల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన అన్ని ఫిర్యాదులను (గ్రీవెన్స్) పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పర్యవేక్షిస్తున్నారు. గత పది నెలల్లో వచ్చిన 6 లక్షల ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలే. గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి మంత్రి లోకేశ్ చర్యలు తీసుకొంటున్నారు.. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఈ ఏడాది రూ. 400 కోట్లు విడుదల చేశాం. గత ప్రభుత్వ హయాంలో ఇది రూ. 50 కోట్లు కూడా దాటలేదు' అని పేర్కొన్నారు.

నిత్యాన్నదాన సత్రాన్ని కబ్జా చేసిన అవినాశ్‌రెడ్డి అనుచరుడు

- సీఎంకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఈనాడు, అమరావతి: శ్రీశైలంలోని ముదిరాజ్ నిత్యాన్నదాన సత్రాన్ని వైకాపా ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిల అనుచరుడు గంగాధరం కబ్జా చేశారని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన పలువురు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా ఎంత మందికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, న్యాయం చేయాలని కోరారు. పలు సమస్యలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాధితుల నుంచి చంద్రబాబు స్వయంగా వినతులు స్వీకరించారు. వైకాపా ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పథకం ద్వారా రావాల్సిన రాయితీలు ఎగ్గొట్టి మోసం చేసిందని హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ) ప్రతినిధులు వాపోయారు. పెండింగ్ బకాయిల్ని మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనారోగ్య సమస్యతో ఇబ్బందిపడుతున్న తన కుమారుడికి రూ.పది వేల పింఛన్ మంజూరు చేయాలని తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలానికి చెందిన వెంకటేశ్వరరావు కోరారు. ఏళ్లుగా నడుపుతున్న రేషన్ దుకాణాన్ని తొలగించారని.. దాన్ని తిరిగి మంజూరు చేయాలని శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పార్వతి విజ్ఞప్తి చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనకు ఆర్థిక సాయం అందించాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన శివప్రసాద్ వినతిపత్రం అందజేశారు.

ఏపీకి మరికొంతకాలం సాయం చేయండి

- ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి ఛైర్మన్ మహేంద్రదేవ్‌కు లంకా దినకర్ వినతి



మహేంద్రదేవ్‌తో సమావేశమైన లంకా దినకర్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రస్తుతం అందిస్తున్న సాయాన్ని మరికొంత కాలం కొనసాగించాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్, నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ సుమన్‌బేరీలకు 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ విజ్ఞప్తిచేశారు. బుధవారం ఆయన వీరిద్దర్నీ వేర్వేరుగా కలిసి ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు. తాను రాష్ట్రంలో 26 జిల్లాల్లో నిర్వహించిన సమీక్షల అనంతరం వచ్చిన అవగాహన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక ఒత్తిడిలో ఉందని తెలిసిందని, ఇప్పుడిప్పుడే ఆర్థిక వ్యవస్థలు గాడిలో పడుతున్నాయని వారికి తెలిపారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్ పూర్తిస్థాయిలో నిలదొక్కుకొనేంత వరకూ సాయాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే 20 సూత్రాల అమలు కమిటీని సాధ్యమైనంత త్వరగా పునర్వ్యవస్థీకరించి దానికి 'వికసిత భారత్ కార్యక్రమాల అమలు కమిటీ'గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి సూచికల సమీక్ష కేంద్రం ఏర్పాటుచేసి, దాన్ని ప్రస్తుతం 20 సూత్రాల అమలు కమిటీ చేస్తున్న సమీక్షలతో అనుసంధానం చేయాలన్నారు.

16, 17 తేదీల్లో పోలవరం ముంపు ప్రాంతాల్లో సీపీఎం అగ్రనేతల పర్యటన

ఈనాడు, అమరావతి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్‌లు ఈ నెల 16, 17 తేదీల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత, ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. నిర్వాసితుల పునరావాసం నత్తనడకన సాగుతోందని విమర్శించారు.

పీపీపీ విధానంలో కొత్త వైద్య కళాశాలల అభివృద్ధి

ఈనాడు, అమరావతి: కొత్త వైద్య కళాశాలల నిర్మాణం-నిర్వహణను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పీపీపీ) చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న తొమ్మిది వైద్య కళాశాలల పనులను సరైన జాగ్రత్తలు తీసుకుని నిలిపివేయాలని (సేఫ్ లెవెల్/క్లోజర్) ఆదేశించింది. రెండో దశలో చేపట్టిన మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని.. మూడో దశలోని నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ వైద్య కళాశాలల విషయంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు జరిగిన పనులను విజిలెన్స్-క్వాలిటీ కంట్రోల్ బృందాలు పరిశీలిస్తాయి. ఆడిట్ అభ్యంతరాలు, కోర్టు కేసులను పరిష్కరించిన తర్వాత గుత్తేదారు నుంచి లిఖితపూర్వక సమ్మతి తీసుకుని ఒప్పంద రేట్ల ప్రకారం బిల్లులు చెల్లిస్తారు. నిధుల కొరత, ఇతర ప్రతిబంధకాలతో ఆయా వైద్య కళాశాలల నిర్మాణం నెమ్మదించడంతో పీపీపీ విధానంలో వీటిని పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ఉన్నతాధికారులతో జరిగిన సమావేశాల్లో పలు మార్గదర్శకాలు రూపొందించారు. ప్రభుత్వం ఆమోదం దక్కిన తరువాత ముందుగా రెండో దశలోని నాలుగు కళాశాలలకు టెండర్లు పిలుస్తారు.

'అంధ టీచర్లకు ముఖహాజరు మినహాయించాలి'

ఈనాడు, అమరావతి: అంధ ఉపాధ్యాయులకు ముఖ హాజరు నమోదు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. 'అంధ ఉపాధ్యాయుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ముఖహాజరు నమోదు నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రస్తుత విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అంధ ఉపాధ్యాయులు ముఖహాజరు నమోదు చేయడం లేదనే కారణంతో మెమో జారీ చేయడం దారుణం. ఏ ప్రభుత్వ శాఖలోనూ వీరికి ముఖహాజరు నమోదు లేదు. విద్యాశాఖలో అందుకు విరుద్ధంగా ఆదేశాలివ్వడం సరికాదు' అని పేర్కొన్నారు.

నువ్వేమన్నా ముఖ్యమంత్రివా.. నీకేం అధికారముంది?

- నాడు ఎస్ఈసీ రమేష్‌కుమార్‌పై జగన్ చిందులు
- అధికారాలున్నా ఎస్ఈసీ డమ్మీ అయిపోయిందంటూ ఇప్పుడు సన్నాయి నొక్కులు

ఈనాడు, అమరావతి: 'నువ్వేమన్నా ముఖ్యమంత్రివా? నీకేం అధికారం ఉంది? రాష్ట్రంలో అధికారం ఎన్నికల కమిషనర్‌దా? ముఖ్యమంత్రిదా' అంటూ 2020లో నాటి ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై ముఖ్యమంత్రిగా ఒంటికాలిపై లేచిన జగన్.. ఇప్పుడు మాత్రం ఎస్ఈసీ చాలా శక్తిమంతమైనదని, కానీ డమ్మీ అయిపోయిందంటూ వ్యాఖ్యానించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్ర ఎన్నికల సంఘం చాలా పవర్‌ఫుల్. కానీ, ప్రస్తుతం డమ్మీ కంటే దారుణమైన పాత్ర పోషిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన స్థానంలో ఉన్న వ్యక్తులు, ఇంత దిగజారిపోయిన పరిస్థితుల మధ్య ఈ వ్యవస్థ నడుస్తుండటం చాలా దురదృష్టకరం. ఇవన్నీ కోర్టుల ముందుంచుతాం. వైకాపా హయాంలో సగం పూర్తయిన స్థానిక సంస్థల ఎన్నికలను.. కరోనా లేకపోయినా నాటి ఎస్ఈసీ (నిమ్మగడ్డ రమేష్‌కుమార్) ఏడాదిన్నర వాయిదా వేశారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి వేరే అవకాశం లేకపోయింది. అదీ రాష్ట్ర ఎన్నికల సంఘానికున్న పవర్. కానీ, ప్రస్తుత ఎస్ఈసీ ఆ అధికారాన్ని వినియోగించడం లేదు' అని వ్యాఖ్యానించారు.

నాడు ఎస్ఈసీకి సామాజికవర్గాన్ని ఆపాదించి..

కరోనా విస్తృతి కారణంగా 2020 మార్చిలో 15న నాటి ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎన్నికల వాయిదా వేశారు. అప్పుడు సీఎంగా ఉన్న జగన్ వెంటనే గవర్నర్ వద్దకు వెళ్లి ఎస్ఈసీని పిలిపించి మాట్లాడాలని, ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని రద్దు చేయించాలని పట్టుబట్టారు. తన క్యాంపు కార్యాలయానికి వచ్చి హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టి.. రమేష్‌కుమార్‌పై చిందులేశారు. సామాజికవర్గాన్ని ఆపాదించి ఆయనపై ఆరోపణలు గుప్పించారు. తన మాట వినలేదని నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ను ఎస్ఈసీ పదవి నుంచి తప్పించేందుకు జగన్ అధికార దుర్వినియోగం చేశారు. రమేష్‌కుమార్ స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని ప్రకటించిన నెల రోజుల్లోనే ఎస్ఈసీ పదవీకాలాన్ని మూడేళ్లకు కుదిస్తూ ఆర్డినెన్స్ తెచ్చారు. వెంటనే రమేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించి, విశ్రాంత న్యాయమూర్తి వి.కనగరాజ్‌ను ఎస్ఈసీగా నియమించేశారు. రమేష్‌కుమార్‌ను ఎస్ఈసీగా పునర్నియమించి పూర్తి పదవీకాలం కొనసాగించాలని హైకోర్టు ఆదేశించినా బేఖాతారు చేశారు. విషయం గవర్నర్ దాకా వెళ్లాక విధిలేని పరిస్థితుల్లో రమేష్‌కుమార్‌ను ఎస్ఈసీగా పునర్నియమించారు.

జగన్, వైకాపా ముఠాపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఈసీకి తెదేపా నేతల వినతిపత్రం



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నేతలు వర్ల రామయ్య, అనురాధ, బోడె ప్రసాద్, దేవినేని ఉమా

ఈనాడు, అమరావతి: జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో సక్రమంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులపై బెదిరింపులు, దూషణలకు పాల్పడిన వైకాపా నేతలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని తెదేపా నేతలు బుధవారం కోరారు. అనంతరం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలిలో చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు విలేకర్లతో మాట్లాడారు. 'పోలీసులను కించపరచడం చట్టరీత్యా నేరం. పోలీసులు అరెస్టుచేసిన ఎంపీ అవినాష్‌రెడ్డి తప్పించుకుని పారిపోవడం కూడా నేరమే. ఎన్నికలయ్యాక మంత్రిని లేకుండా చేస్తానని ఒంటిమిట్ట వైకాపా అభ్యర్థి అనడం కూడా నేరమే. వీటిని పరిగణనలోకి తీసుకుని జగన్, ఆయన ముఠాపై వెంటనే చర్యలు తీసుకోవాలి' అని కమిషనర్‌ని కోరినట్లు తెలిపారు.

మా హోటళ్లకూ జీవో 131 వర్తింపజేయాలి

- రాష్ట్ర హోటళ్ల అసోసియేషన్ విజ్ఞప్తి
- ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి మీనాకు వినతిపత్రం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని స్టార్‌యేతర హోటళ్లకు జీవో 131 వర్తింపజేయాలని రాష్ట్ర హోటళ్ల అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. త్రీ స్టార్, అంతకంటే ఎక్కువ రేటింగ్ ఉన్న హోటళ్లకే జీవో వర్తింపజేస్తున్నారని, అనేక స్టార్‌యేతర హోటళ్లు కూడా విస్తీర్ణం, సౌకర్యాలు, సేవల పరంగా అంతే స్థాయిలో ఉన్నందున వాటికీ అవకాశం కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనాను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని రవికుమార్, జోన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కార్యనిర్వాహక సభ్యులు వీరమాచినేని హేమంత్‌కుమార్, ఐలాపురం రాజు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్టార్‌యేతర హోటళ్లు వేల మందికి ఉపాధి కల్పిస్తూ లక్షల మందికి సేవలు అందిస్తూ రాష్ట్రానికి పన్ను ఆదాయం సమకూర్చుతున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రస్తుతం వీటిని 2బీ బార్ల తరహాలో పరిగణించడంతో అధిక ఖర్చులు, లైసెన్స్ నిబంధనలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. త్రీ స్టార్ హోటళ్లకు వర్తించే విధంగా రూ.25 లక్షల వార్షిక లైసెన్స్ ఫీజు విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. లాటరీ విధానం నుంచి మినహాయించాలని సూచించారు.

నేటి నుంచి అనర్హుల పింఛన్ల రద్దుకు నోటీసులు

- గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త సదరం ధ్రువీకరణ పత్రాలు అందుబాటు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆరోగ్య, దివ్యాంగుల కేటగిరీల్లో పింఛన్లు తీసుకుంటున్న అనర్హుల ఏరివేతకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో అనర్హులుగా గుర్తించినవారికి నోటీసులు, పింఛన్ల రద్దు ఉత్తర్వులు జారీచేయనుంది. ఈ ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించి ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి స్పష్టం చేసింది. వైద్యుల ధ్రువీకరణలో నిర్దేశిత 40 శాతం కన్నా తక్కువ వైకల్యం నమోదైన వారి పింఛన్లను రద్దు చేయనున్నారు. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉండి తీవ్రమైన అనారోగ్యం లేకున్నా రూ.15 వేల పింఛను తీసుకుంటున్నవారి కేటగిరీని రూ.6వేలకు మార్చనున్నారు. అదే విధంగా దివ్యాంగులు కాకుండా, 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉండి వృద్ధుల కేటగిరీలోకి వచ్చే వారిని రూ.4వేల పింఛనులోకి చేర్చనున్నారు. దీనికి అనుగుణంగా కొత్త సదరం ధ్రువీకరణ పత్రాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఉచితంగా జారీచేస్తారు. వైద్య బృందాలు నిర్ధారించిన వైకల్యశాతంలో ఏమైనా తేడాలున్నట్లు లబ్ధిదారులు గుర్తిస్తే వారికి అప్పీలు చేసుకునే అవకాశం కూడా కల్పిస్తారు.

నర్సింగ్ విద్యాసంస్థల ప్రతిపాదనల పరిశీలనకు కోర్ కమిటీ


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నర్సింగ్ విద్యాసంస్థల చిరునామా, పేరు మార్పు, సీట్ల పెంపు లాంటి ప్రతిపాదనల సమగ్ర పరిశీలనకు ప్రభుత్వం నలుగురు సభ్యులతో కూడిన కోర్ కమిటీని నియమించింది. ఇప్పటివరకు ఉన్నత స్థాయి కమిటీ (హైపవర్ కమిటీ), ఏపీ నర్సింగ్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ (ఏపీఎన్ఎంసీ) సభ్యులు వేర్వేరుగా నర్సింగ్ విద్యాసంస్థల్లో తనిఖీలు చేసేవారు. ఇకపై ఒకే విధానంలో సమగ్ర నివేదికలకు వీలుగా కోర్ కమిటీని ఏర్పాటు చేసింది. వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) ఛైర్మన్‌గా.. అకడమిక్ వ్యవహారాలు చూసే డీఎంఈ, ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్‌తోపాటు హైపవర్ కమిటీ ప్రతినిధి ఒకరు సభ్యులుగా ఉంటారు. ఏటా జనవరి 1 నుంచి 30 వరకు నర్సింగ్ విద్యాసంస్థల నుంచి కొత్త ప్రతిపాదనల స్వీకరణ, ఫిబ్రవరిలో పరిశీలన, మార్చి- ఏప్రిల్‌లో తనిఖీలు, మే చివరి వరకు తనిఖీ నివేదికల పరిశీలన, జూన్ మొదటి వారంలో తుది నివేదిక ప్రభుత్వానికి పంపుతారు. విద్యా సంవత్సర క్యాలెండర్, కార్యాచరణ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి, నిర్ణీత గడువులో విద్యాసంస్థలు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. తుది నివేదిక ఆధారంగా ప్రభుత్వం అవసరమైన ఉత్తర్వులు జారీ చేస్తుందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

వసుంధర

vasundhara@eenadu.in

తెలుగు మహిళకు బ్రిటన్ పౌర పురస్కారం!

దేశం కాని దేశం వెళ్తే... అక్కడ మనం నిలదొక్కుకోవడమే కష్టం! అలాంటి చోట తన సేవాపథంతో చెరగని ముద్ర వేశారామె. గత నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారు. బ్రిటన్ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన సీబీఈ అవార్డుని అందుకున్నారు తెలుగు మహిళ పూర్ణిమ తణుకు. ఆమెను వసుంధర పలకరించగా...



పూర్ణిమ



మా కుటుంబంలో తాతగారితో సహా చాలామందే ప్రజాసేవలో ఉన్నారు. ఆ ప్రభావమే నామీదా ఉండటంతో నేనూ సేవాబాటలో నడిచా. మా స్వస్థలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేట. సొంతూరిలోనే ప్రాథమిక విద్య పూర్తయ్యాక... అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ కాలేజీలో డిగ్రీ చదివా. ఆపై ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ చేశా. నాన్న విశ్వేశ్వరయ్య, టైపు ఇన్‌స్టిట్యూట్ నడిపేవారు. అమ్మ రత్నాంబ, గృహిణి. లండన్‌లో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకట సూర్యనారాయణతో పెళ్లవడంతో ఇక్కడే స్థిరపడ్డా. మొదట ఇంజినీరింగ్ కంపెనీలో కెరియర్ ఆరంభించా. తర్వాత యువత, పిల్లలకోసం పనిచేసే 'రీజనరేషన్ ట్రస్ట్'కి మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించా. ఆపై జైళ్లలో ఉన్నవారికి విద్యను అందించేందుకు కృషి చేసిన తొలి ఆసియా మహిళగానూ గుర్తింపు దక్కించుకున్నా.

అవార్డులెన్నో...

ప్రస్తుతం నేషనల్ డే నర్సరీస్ అసోసియేషన్ (ఎన్‌డీఎన్ఏ)కు ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నా. ఇది యూకేలో బాలల సంరక్షణ, హక్కులకోసం పనిచేసే అతిపెద్ద ఛారిటీ-మెంబర్‌షిప్ అసోసియేషన్. 2004లో ఈ సంస్థలో చేరా. అప్పటికి 20 మంది సిబ్బందితో చిన్నగా ఉండేది. ఇప్పుడు మూడు శాఖలతో 100మందికిపైగా ఉద్యోగులతో శక్తిమంతమైన స్వచ్ఛంద సంస్థగా మార్చగలిగా. యూకేలోని 15000 డే నర్సరీల హక్కుల కోసం పోరాడా. దాదాపు పదిలక్షల మందికి పైగా చిన్నారులు, వారి కుటుంబాలకు అత్యున్నత సంరక్షణ విధానాలు అమలయ్యేలా చేయగలిగా. ఇంగ్లండ్ సహా 22 దేశాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. ఇలా 20 ఏళ్ల పాటు ఎన్‌డీఎన్ఏకు నాయకత్వం వహిస్తూ బాలల విద్యకు చేయూత అందించినందుకుగానూ పలు పురస్కారాలు దక్కాయి. 2011లో బ్రిటన్ పౌర పురస్కారాల్లో ఒకటైన ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ (ఓబీఈ)ను కింగ్ చార్లెస్ చేతుల మీదుగా తీసుకున్నా. తాజాగా కమాండర్ ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ)ని చార్లెస్ సోదరి ప్రిన్సెస్ అనీ అందించారు. ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, నోబెల్ గ్రహీత హెరాల్డ్ పింటర్, రగ్బీ ఆటగాడు జొనాథన్ పీటర్ విల్కిన్సన్‌తోపాటు మనదేశం నుంచి ఈ గౌరవాన్ని పొందినవారిలో లీనా నాయర్ ఒకరు. ఈ అవార్డు అందుకున్న తొలి తెలుగు మహిళను నేనే కావడం గర్వంగా ఉంది.

కళలపై ఇష్టంతో...

వృత్తిపరమైన ఈ ప్రయాణానికి భిన్నంగా... మరో పక్కనా ఆసక్తులకూ ప్రాధాన్యం ఇచ్చా. చిన్నప్పుడు నృత్యంపై ఉన్న ఇష్టంతో గురువులు శ్రీమతి అద్దంకి స్వరాజ్యం, శ్రీ నల్ల సత్యనారాయణల వద్ద భరతనాట్యం నేర్చుకున్నా. ఇక్కడకి వచ్చాక మా పాప శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకోవాలన్న ఆసక్తి చూపించడంతో తిరిగి దానిపై దృష్టిపెట్టా. కర్ణాటకకు చెందిన డా.గీతతో కలిసి 25 ఏళ్ల క్రితం సౌత్ ఏషియన్ అకాడమీ పేరిట కళాపరిషత్ ఏర్పాటుచేశా. దీనికి 20 ఏళ్ల పాటు బోర్డు ఛైర్‌పర్సన్‌గా పనిచేశా. వివిధ రాజకీయ పార్టీలతో ఎర్లీ ఎడ్యుకేషన్ పాలసీలపై కలిసి పని చేస్తున్నా.

– మోహనరావు బనిశెట్టి, రాజమహేంద్రవరం

మీకు తెలుసా?

నవజాత శిశువుల చెవులు, భుజాల మీద సన్నని, మృదువైన వెంట్రుకలు ఉంటాయి కదా... ఇవి వెర్నిక్స్ అనే మైనంలాంటి పదార్థం చర్మానికి అతుక్కునేందుకు సాయపడతాయి. ఈ వెర్నిక్స్ శిశువు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంతోపాటు సహజ మాయిశ్చరైజర్‌గానూ పనిచేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.

శోధిత

వేధింపులు సహించొద్దు...



జీవితంలో ఏదో ఒక దశలో వేధింపులు ఎదుర్కొన్న అమ్మాయిల శాతం ఎక్కువే. అయితే, వీటిని తేలిగ్గా తీసుకోకూడదంటున్నారు పరిశోధకులు. ఎందుకంటే... వీటివల్ల దీర్ఘకాలంలో మహిళల్లో హృద్రోగాలు వచ్చే ముప్పు అధికమని హార్వర్డ్ యూనివర్సిటీ తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ఇందుకోసం 60వేలమందికి పైగా మహిళలపై అధ్యయనం చేశారు. వీరి ప్రకారం... వేధింపులు ఎదుర్కొని వారితో పోలిస్తే ఎదుర్కొన్న మహిళల్లో గుండెపోటు, పక్షవాతం... వంటివి వచ్చే ప్రమాదం 41శాతం ఎక్కువ. ఇక, అది చేయొద్దు, ఇది చేయొద్దు, అలా ఉండాలి... ఇలా ఉండాలి... అంటూ తరచూ నియంత్రణ ఎదుర్కొన్న వారిలో అయితే ఈ ప్రమాదం 70 శాతానికి ఎగబాకింది. గృహహింస, ఆర్థిక ఇబ్బందులు... వంటి వాటివల్ల కలిగే ఒత్తిడి, భయం దోశగులు మన ఆరోగ్యానికి ఎంత హాని చేస్తాయో ఇవి అంతకంటే ఎక్కువ నష్టం కలిగిస్తాయి. గతంలో జరిగిన ఈ ఘటనలు పదే పదే గుర్తుకురావడం, అప్పుడు వచ్చే భయంతో కనులు, ఒత్తిళ్లను పీలవటం వల్ల మానసిక సమస్యలతోపాటు దీర్ఘకాలంలో శారీరక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి, ఈ వేధింపులు కేవలం న్యాయపరమైనవో లేదా వ్యక్తిగత సంబంధించినవో కాదని ఆరోగ్యానికి సంబంధించినవి కూడా అని గుర్తించాలని పరిశోధకులు చెబుతున్నారు. అవసరమైతే కుటుంబం, స్నేహితులు, నిపుణుల సాయం వెంటనే తీసుకోవాలని సూచిస్తున్నారు.

డియర్ వసుంధర



డా. జానకి శ్రీనాథ్

ప్రొటీన్ ఎక్కువైతే మొటిమలు వస్తాయా..!

బరువు తగ్గాలని ఈ మధ్యే నేను జిమ్‌కు వెళ్తున్నా, డైట్ చేస్తున్నా, దానిలో భాగంగానే ప్రొటీన్ సప్లిమెంట్స్‌ను తీసుకుంటున్నా. కొన్ని రోజులుగా నా మొహం మీద మొటిమలు బాగా పెరిగిపోతున్నాయి. నా జీవనశైలి మార్పులే ఇందుకు కారణమా? – ఓ సోదరి

బయటదొరికే ప్రొటీన్ పొడర్లు, సప్లిమెంట్లలో వే ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. ఇది కొందరిలో ఐజీఎఫ్(ఇన్సులిన్-లైక్ గ్రోత్ ఫ్యాక్టర్)1ని రిలీజ్ చేస్తుంది. దాంతో చర్మంలో సీబమ్ ఉత్పత్తి పెరుగుతుంది. దీనివల్ల నూనె ఉత్పత్తి ఎక్కువై రంధ్రాలు మూసుకుపోయి, మొటిమలు ఏర్పడతాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతుంది. పర్యవసానంగా చర్మం ఎర్రబడటం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇది చాలా అధ్యయనాల్లో నిరూపితమైంది కూడా. మీరు తీసుకుంటున్న సప్లిమెంట్లలో ప్రొటీన్ మోతాదు ఎంత ఉందో చూసుకోండి. మొక్కల ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వండి. దీంతోపాటు మీ ఆహారంలో అధిక చక్కెర, బయోటిన్ సప్లిమెంట్స్, స్వీట్లు లాంటివి ఎక్కువగా తీసుకుంటున్నారేమో గమనించుకోండి. ముఖం మీద మొటిమలు పెరగడానికి ఇవి కూడా కారణమే. వీటిని తగ్గించుకుని, సమతులాహారం తీసుకుంటే బరువు తగ్గడంతోపాటు చర్మ సమస్యలూ రాకుండా ఉంటాయి.

కడుపు నొప్పికి కారణం అదేనా..!

మా అమ్మాయికి ఈమధ్యే ప్రసవం అయ్యింది. బాబుకి తల్లిపాలు సరిపడక అప్పుడప్పుడు పోతపాలు ఇస్తున్నాం. రాత్రుళ్లు తరచూ ఏడుస్తున్నాడు. వైద్యులకు చూపిస్తే తల్లికి పాలు, పాల సంబంధిత ఉత్పత్తులు, బాదం, జీడిపప్పు, శెనగ పలుకులు లాంటివి పెట్టొద్దు అన్నారు. వీటికి బదులుగా ఏం పెట్టొచ్చు. – ఓ సోదరి

బాబు ఏడవడానికి కడుపులో నొప్పి కారణం కావొచ్చు. ఇది పోత పాల వల్లే వస్తుందని చెప్పలేం. కొన్ని రకాల గ్యాసెస్ ఉత్పత్తి కావడం వల్ల, పాలు తాగేటప్పుడు గాలి ఎక్కువగా చేరినా వస్తుంది. కూర్చుని దిండు ఆధారంగా తీసుకుని, సరైన పొజిషన్‌లో పాలివ్వమని చెప్పండి. పోత పాలు ఇచ్చేటప్పుడు కూడా ఇలానే చేయమంటారు. తర్వాత బిడ్డకు త్రేన్పు వచ్చేదాకా భుజంపై వేసుకుని, వీపుపై తట్టమంటారు. సమస్య గురించి చెప్పినప్పుడు ఇవన్నీ సంబంధిత వైద్యులు మీకు సూచిస్తారు. వీటిని పాటించడం వల్ల... ఈ సమస్యను అధిగమించవచ్చు. ఇవి చేశాక కూడా పరిస్థితి ఇలానే ఉంటే... తల్లి ఆహారాన్ని మార్చమంటారు. మన ఆహారపు అలవాట్ల ప్రకారం కాల్షియం కోసం, పాలు బాగా పడాలని పాలు, పాలసంబంధిత ఉత్పత్తుల మీద ఆధారపడుతుంటాం. అయితే, మీ అమ్మాయి ఉన్న పరిస్థితుల్లో వైద్యులు చెప్పినట్లు కొన్ని రకాల నట్స్, పాలు, పెరుగు లాంటివి తినకపోవడమే మేలు. బదులుగా రాగులు, సోయాతో చేసిన పాలు, పాలపదార్థాల్నీ... ఆకుకూరలు, నువ్వులు వంటివి అమ్మాయికి ఇవ్వండి. ఇవన్నీ తల్లి శరీరానికి కావాల్సిన పోషకాల్ని అందిస్తాయి. రెండు వారాల పాటు ఇలా చేసి, బిడ్డ పరిస్థితి గమనించండి. మార్పు వస్తే కొనసాగించండి. లేదంటే సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.

సెలవు కాదు... బాధ్యత!



ఆగస్టు 15 శుక్రవారం, ఆపై శని, ఆదివారాలు... వరసగా మూడురోజులు సెలవులే. లాంగ్ వీకెండ్... ఎంచక్కా ఫ్యామిలీతో టూర్ వేయొచ్చు. లేదా ఒక్కోరోజు ఒక్కోలా ప్లాన్ చేయాలి. సోషల్‌మీడియాలో తెగ ట్రెండ్ అవుతోందీ పోస్ట్. ఒకప్పుడు స్వాతంత్య్ర దినోత్సవం వస్తోందంటే హడావుడి అంతా పిల్లలదే! అందరి దగ్గరా డబ్బులు సేకరించి రంగుల కాగితాలు కొని అలంకరించేవాళ్లు. తరగతి గదిని స్వయంగా శుభ్రం చేసి బోర్డు మీద 'స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ రంగు రంగుల చాక్‌పీస్‌లతో తీర్చిదిద్దేవారు. 'ది బెస్ట్ క్లాస్' అని టీచర్లతో మెప్పు పొందడం అప్పుడో సరదా! ఇక, ఆగస్టు 15 నాడు... పిల్లలు, టీచర్లు స్వాతంత్య్ర సమరయోధుల గురించి చెప్పడం, 'జనగణమన' పాడుతూ జెండాకి వందనం చేయడం... తలచుకుంటేనే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. దేశభక్తి మనసులో ఉప్పొంగుతుంది. ఇదంతా పూర్తయ్యాక జెండాలను చేత పట్టుకుని వీధులన్నీ తిరుగుతూ దేశభక్తి గేయాలను పాడతారు విద్యార్థులు. దీనికోసం ఎన్ని రోజుల ముందు నుంచి సాధన చేస్తారో. అది చూసేవాళ్లకే కనుల పండుగే.

అలాంటి రోజును అమ్మానాన్నలు సెలవు దినంగా చెబుతున్నారు. హాజరు ఎలాగూ తీసుకోరు కాబట్టి, వెళ్లకపోయినా పర్లేదన్న భావన. డెకరేషన్, ర్యాలీ వంటివి లేవేమో కానీ... జెండా ఎగురవేయడం, జనగణమన పాడటం, దేశ విముక్తి కోసం ప్రాణాలర్పించిన వారిని తలచుకోవడం వంటివి తప్పక ఉంటాయి. వాటికి వాళ్లని దూరం చేస్తున్నామని మర్చిపోతున్నారు. వాళ్ల ఆరోజు కేటాయించేది కొన్ని గంటలే! కానీ దేశాన్ని ప్రేమించడం, మన స్వేచ్ఛకోసం ఎందరు త్యాగాలు చేశారో, స్వేచ్ఛ, స్వాతంత్య్రాల విలువేంటో తెలుసుకుంటారు. ఇప్పుడివన్నీ వీళ్లకెందుకు అని ఆలోచించకండి. వీటి ద్వారానే చుట్టూ ఉన్నవారిని ప్రేమించడం, కలిసిమెలిసి సాగడం వంటివి తెలుస్తాయి. మనవాళ్ల కోసం ఏదైనా చేయాలన్న భావన కలిగినప్పుడే సృజనాత్మకతకీ చోటు ఉంటుంది. స్ఫూర్తీ కలుగుతుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయి, బాధ్యతగా మెలగడమూ తెలుస్తుంది. స్వాతంత్య్ర వేడుకకు దూరం చేస్తే... వీటన్నింటికీ దూరం చేసినట్లే. అందుకే... దీన్నో సెలవు రోజులా కాకుండా మన చరిత్ర, ధైర్యం, పోరాట పటిమ వంటివి తెలుసుకునే మార్గంగా ఆలోచించండి. తప్పక వేడుకల్లో పాల్గొనేలా చేయండి.

చదవడానికి ప్రేరణ కావాలి..!

'పరీక్షలు బాగా రాయాలి. అందరికన్నా ఎక్కువ మార్కులు నీకే రావాలి' ఇలా చెప్పని అమ్మలు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఎప్పుడైనా ఆలోచించారా... ఈ మాటలతో మీకు తెలియకుండానే ఎంత ఒత్తిడిని ఇస్తున్నారో వాళ్లకి? దీనివల్ల చిన్నారులెంత ఆందోళనకు గురవుతారో తెలుసా? కర్ణాటక ప్రభుత్వం గతేడాది 570 మంది విద్యార్థులపై ఓ సర్వే నిర్వహించింది. దాని ప్రకారం... దాదాపు 480 మంది పిల్లలు ర్యాంకుల ఒత్తిడికి గురవ్వడానికి తల్లిదండ్రులే కారణమని తేలింది. ఊపిరి సలపని కమాండ్స్‌ని ఒకదాని తర్వాత ఒకటి ఇస్తూ... మీ అంచనాలన్నీ ఆ పసి హృదయాలపై రుద్దుతుంటే వారికి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. ఆ ఆందోళనతో చదివేది, వినేది అర్థం కాక,



బట్టీ పడుతూ పిల్లల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. బాగా చదవమని, మంచి మార్కులు తెచ్చుకోమని చెప్పండి. అంతేకానీ, ఏ గ్రేడ్ వస్తేనే గొప్పనీ, అల్లరి చేయకుంటేనే మంచిదనీ మాత్రం వాళ్ల మీద మీ అభిప్రాయాల్ని రుద్దేందుకు ప్రయత్నించకండి. దీనివల్ల వాళ్లు బాల్యానికి దూరమవుతారు. అనవసరపు ఆందోళనలు, మానసిక సమస్యలు తలుపుతడతాయి. దీనికి బదులుగా, విజయగాథలు చెప్పండి. చుట్టూ ఉన్న ప్రపంచంలో సక్సెస్ అవుతున్న వారి జీవితాలను ఉదహరించండి. ఆ విజయం అందుకోవడానికి వాళ్లు ఎన్ని అపజయాల్ని దాటారో వివరించండి. బాగా చదువుకుంటే మీరూ ఆ స్థానాన్ని చేరుకోవచ్చని ప్రేరణ ఇవ్వండి. అప్పుడే తల్లిదండ్రులుగా మీ బిడ్డకు మంచి భవిష్యత్తును ఇచ్చినవారవుతారు. పాటిస్తారు కదూ!

జ్ఞాపకాలకు... ఖర్చెంత?



అసలే పెళ్లిళ్ల సీజన్... నిశ్చితార్థం నుంచీ తాళి కట్టే వరకూ ప్రతిదీ వేడుకగా జరగాలని కోరుకుంటున్నారీతరం అమ్మాయిలు. వీటన్నింటినీ ఫొటోలూ, వీడియోలుగా చిత్రించి ఈ జ్ఞాపకాల్ని పదిలం చేసుకోవాలనుకుంటున్నారు. ఆలోచన బాగుంది... కొత్తదేమీ కాదు... ఎప్పట్నుంచో మనం చేస్తున్నదే... దీనికేముంది అనుకునేరు! దీనికయ్యే ఖర్చు చూస్తే తెలుస్తుంది... అసలు కథ. హల్దీ, మెహందీ, సంగీత్, ప్రీ, పోస్ట్ వెడ్డింగ్ షూట్స్ అంటూ తడిసి మోపెడు అవుతోంది ఖర్చు. వీటన్నింటికీ కలిపి తక్కువలో తక్కువ రూ.2లక్షల నుంచీ పది లక్షల వరకూ ఖర్చవుతుంది. మొత్తానికి ఒక మిడిల్‌క్లాస్ ఉద్యోగి ఏడాది జీతం, ఒక్క వెడ్డింగ్ షూట్‌తో తుడిచి పెట్టుకుపోతుంది. పోనీ ఇంత ఖర్చయినందుకు... ఆల్బమ్‌గా మలచుకునే అవకాశం ఉంటుందా అంటే... అదీ లేదు. షూట్ టైమ్‌లో కుప్పలు తెప్పలుగా ఫొటోలూ వీడియోలూ తీయించుకుంటున్నారు. వాటిలో నచ్చినవి ఎంచుకుని ఆల్బమ్ చేయించుకునే ఖాళీ కూడా ఉండటం లేదు. దాంతో అవన్నీ ఏ హార్డ్ డిస్క్‌లలోనో, పెన్‌డ్రైవ్‌ల్లోనో బందీ అవుతున్నాయి. దాన్ని తెరచి చూసే సమయం కూడా ఉండటం లేదు ఎవరికీ. జ్ఞాపకాల్ని దాచుకోవాలి... అవే ఒత్తిడిలో మనసుకి సాంత్వన కలిగించేవి. ఒంటరితనంలో బాసటగా ఉండేవి. మన వాళ్ల ఆనందాల్ని, ఎప్పుడో జరిగిన అనుభూతుల్ని గుర్తుకు తెచ్చేవి... కానీ వాటికి అయ్యే ఖర్చు గురించీ ఆలోచించండి. మనం తయారుచేయించుకునే ఆల్బమ్, వీడియో ఎన్నిసార్లు చూస్తాం, వాటి జీవితకాలం లాంటి అంశాల్నీ దృష్టిలో ఉంచుకుని ఖర్చు చేయండి. అంతేకానీ, గొప్పలకు పోయి అప్పులు చేసి మరీ షూట్లకు ఖర్చు పెట్టొద్దు. పొదుపంటే ఆదాయంలో చేసేదేనా... ఒక్కసారి ఈ ప్రణాళిక ఫాలో అయి చూడండి, ఎన్ని డబ్బులు సేవ్ అవుతాయో.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్ని నడిపిస్తున్న వారిలో 20 శాతమే మహిళలు. చిరు వ్యాపారుల్లో మాత్రం 70 శాతం మహిళలే. తమ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో వీళ్లు పనిచేస్తున్నారు. పెద్ద వ్యాపారాల్లో ఉన్న మహిళలు విజయవంతమై... చిన్న వ్యాపారాల్లో ఉన్నవాళ్లూ విస్తరణ గురించి ఆలోచించేలా స్ఫూర్తి నింపాలి. అదే మహిళలు తమకుతాముగా చేసుకునే గొప్ప సాయం.



- రుచీ కల్రా, సహ-వ్యవస్థాపకురాలు, ఆఫ్ బిజినెస్, ఆక్సిజో

బంగారం - వెండి



13న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,180	93,350	1,18,511
విజయవాడ	99,470	92,900	1,17,700
ప్రొద్దుటూరు	1,00,550	92,510	1,17,500
రాజమహేంద్రవరం	1,01,350	92,900	1,25,000
విశాఖపట్నం	1,00,980	92,900	1,25,000
తమిళనాడు	-----	92,900	1,26,000

వారి స్ఫూర్తికి... జాతీయ స్థాయి కీర్తి!

మహిళలు సంఘటితమైతే అసాధ్యాన్నీ సుసాధ్యం చేయగలరు. అందుకు ఉదాహరణే... విజయనగరం జిల్లాలోని గంట్యాడ, రాజాం మండలాల స్వయం సహాయక సంఘాల సభ్యులు. స్వయంకృషితో పేదరికాన్ని దూరం చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అందించే ఆత్మనిర్భర్ సంఘటన్ పురస్కారాలకూ ఎంపికయ్యాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచాయీ సంఘాలు.





పొదుపు ఉద్యమంలో చేరితే జీవితాలు మారతాయన్న అధికారుల మాట నమ్మి గంట్యాడ మండలంలోని కొందరు మహిళలు ముందుకొచ్చారు. శ్రీలక్ష్మీ మహిళా పొదుపు సంఘంగా ఏర్పడి, రోజుకు రూపాయి చొప్పున నెలకు రూ.30 పొదుపు చేశారు. ఆరు నెలల తర్వాత రూ.25 వేలు రుణం తీసుకున్నారు. చిరు వ్యాపారాలు ప్రారంభించి పొదుపు కొనసాగిస్తూనే... వాయిదాలూ చెల్లించేవారు. సకాలంలో అప్పు తీర్చడంతో బ్యాంకు ఇచ్చే రుణ మొత్తం పెంచుతూ వచ్చింది. సంఘం సభ్యులు వివిధ వ్యాపారాలు ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. ఆర్థికంగా ఎదుగుతోన్న వీళ్లను చూసి, మిగతా మహిళలూ ప్రేరణ పొందారు. అలా సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. పొదుపు ఉద్యమంలో చేరి కుటుంబాన్ని ప్రగతి పథంలో నడిపించడమే కాదు, అత్యవసరమైన సభ్యులకు తక్కువ వడ్డీకి రుణాలిస్తూ సమష్టిగా ముందుకు సాగుతున్నారు. ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ప్రస్తుతం గంట్యాడ మండలంలో 1,701 స్వయం సహాయక సంఘాల్లో 18,333 మంది సభ్యులు... రాజాం మండలంలో 1,426 స్వయం సహాయక సంఘాల్లో 14,553 మంది సభ్యులు ఉన్నారు.

వరుసగా మూడోసారి

గంట్యాడ మండల మహిళా సమాఖ్య... ఏపీ మ్యాక్స్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని స్వయం ప్రతిపత్తి సంఘంగా ఎదిగింది. మూడేళ్లుగా వరుసగా జాతీయ అవార్డుకు ఎంపికైంది. వాయిదా సకాలంలో చెల్లించడం, ఆదాయంలో 30 శాతమే ఖర్చులుండేలా చూసుకోవడం వీరి విజయానికి కారణాలు. ఏటా తప్పకుండా ఆడిట్ నిర్వహిస్తారు. దీనికి తగ్గట్టే అధికారులూ నైపుణ్యాభివృద్ధితోపాటు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలపై మహిళలకు శిక్షణనివ్వడం వీరికి కలిసొచ్చింది. గంట్యాడ సమాఖ్య మహిళలు జ్యూట్ బ్యాగులు, బేకరీ, డెయిరీ ఉత్పత్తులు, సబ్బులు, ఫినాయిల్, లిక్విడ్ సోప్ వంటివాటి తయారీతో ఆదాయం పొందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్నీ సమర్థంగా నిర్వహించారు. సెర్ప్, డీఆర్‌డీఏ సంస్థలు ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయానికి వీరికి అవకాశం కల్పిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు ఉత్పత్తులు పంపడమే కాదు... గ్రామ, మండల స్థాయుల్లో వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుని విక్రయాలూ పెంచుకుంటున్నారు. ప్రైవేటు సంస్థలతోనూ భాగస్వామ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు.

సేవలోనూ ముందే

రాజాం మండల సమాఖ్య రైతులకు అవసరమైన టార్పాలిన్లు అమ్ముతోంది. దళారీలకు అవకాశం లేకుండా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి రైతులకు సరైన ధర అందేలా చూస్తోంది. అంతేకాదు, ఈ మహిళలు సభ్యుల కుటుంబ సమస్యల్ని దగ్గరుండి పరిష్కరిస్తారు. కిచెన్ గార్డెన్స్‌ని ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ, ఆరోగ్యం, పోషకాహారం వంటివాటిపైన ప్రజలకు అవగాహన కల్పించడం వంటివీ చేస్తున్నారు.

– పద్మ శ్రీనివాసరావు, విజయనగరం

ఇంటి తోట

ఐదు రేకల పూలు ఎంతందమో!





కాంతిమంతమైన రంగుల్లో, నక్షత్రాన్ని తలపించే ఆకృతిలో బిళ్లగన్నేరు(వింకారోజ్) మొక్క నిండుగా విరబూస్తుంది. బాల్కనీల్లో పెంచుకున్నా, పోర్టికోల్లో వేలాడదీసినా, ఇంటి ముంగిటా, కాలిబాటల పక్కన నాటినా... ఎంతందంగా ఉంటాయో! మరి వీటి సంరక్షణ ఎలానో తెలుసా?



సులువుగా పెరిగే ఈ మొక్కకు పెద్దగా సంరక్షణ అవసరం లేదు. పూలు మాత్రం ఏడాదంతా పూస్తూనే ఉంటాయి. రెండు మూడు వర్ణాల్లోనూ కనువిందు చేస్తాయి. నిగనిగలాడే పచ్చని ఆకులు, ఐదు రేకలతో నక్షత్రాకారంలో విచ్చుకునే అందమైన పూలతో ఈ మొక్క భలేగా ఆకట్టుకుంటుంది. గులాబీ, తెలుపు, ఎరుపు, ఊదా... వంటి రంగుల్లో ఏడాది పొడవునా విరబూస్తుంది. దీన్ని సాధారణంగా అలంకరణ, ఔషధ గుణాల కోసం పెంచుతారు. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో వాడతారు. మధుమేహం, మలేరియా సహా అనేక వ్యాధులకు దీని సారాన్ని వాడతారు. అయితే, దీన్ని నేరుగా నోట్లో పెట్టుకుంటే విషపూరితమవ్వొచ్చు.

ఎలా పెంచుకోవచ్చు...

గుబురుగా, తక్కువ ఎత్తులో ఎదిగే బిళ్లగన్నేరు మొక్క... వేడివాతావరణం ఉండే ప్రాంతాల్లో చక్కగా ఎదుగుతుంది. వాణిజ్య ప్రయోజనాలకోసం తగిన ఉష్ణోగ్రతలు కల్పిస్తూ, కాంతిని అందిస్తూ గ్రీన్‌హౌస్‌ల్లోనూ పెంచుతారు. తీరప్రాంత ఆవాసాల్లో, ఇసుక నేలల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది పొదలా ఉంటుంది. వీటిని విత్తనాలు, కొమ్మలతో కొత్త మొక్కలను మొలకెత్తించొచ్చు.

కత్తిరిస్తే...పూలు

బిళ్లగన్నేరు మొక్కను నాటే మట్టిలో సేంద్రియ ఎరువుని చేర్చితే... ఆరోగ్యంగా పెరుగుతుంది. మట్టి కనీసం అంగుళం మేర పొడారాకే నీళ్లు పోయాలి. ఎక్కువైతే వేళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. పూలు నిరంతరం పూయడానికి... నెమ్మదిగా విడుదలయ్యే ఎరువుల్ని ఇవ్వాలి. ఈ మొక్కల్ని ఎప్పటికప్పుడు కత్తిరించుకుంటే కొత్త కొమ్మలూ, పూలూ వస్తాయి. వీటికి సాధారణంగా పేనుబంక, తెల్లదోమ, బూజు తెగులు వంటివి రావొచ్చు. ఎప్పటికప్పుడు పరిశీలించి... వ్యాధిసోకిన ఆకుల్ని తీసేయాలి. గాలి ప్రసరణ ఉండేలా చూడాలి. తెగులు నివారణకు సబ్బుద్రావణాన్ని పిచికారీ చేయాలి.

ప్రేమ మైకం.. జైలుకు చేర్చిన వైనం



ఈటీవీ భారత్: ప్రేమ గుడ్డిది అంటే ఇదేనేమో! ఛత్తీస్‌గఢ్‌లోని ఉత్తర బస్తర్ ప్రాంత కాంకేర్ జిల్లాలో కరుణ పటేల్ (22) అనే యువతి తన ప్రియుడు తామ్రధ్వజ్ విశ్వకర్మ (24)కు బైకు కొనిపెట్టేందుకు దొంగగా మారింది. వీరిద్దరూ కలిసి తాళం వేసి ఉన్న బంధువుల ఇంట్లో రూ.95 వేల నగదు, రూ.2 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. దొంగతనమైతే విజయవంతంగా చేయగలిగారు కానీ, పోలీసుల ముందు తడబడి నేరాన్ని దాచలేకపోయారు. ఆరేళ్లుగా సన్నిహితంగా ఉన్న ఈ ప్రేమికులను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు కాంకేర్ అదనపు ఎస్పీ దినేశ్ సిన్హా తెలిపారు.

పిల్లల ఫోన్ ఆట.. పెద్దలకు సంకటం



ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లా గహీరాభేడీ గ్రామ పంచాయతీలో ఓ వినూత్న తీర్మానం చేశారు. గ్రామంలోని పిల్లలు ఫోన్ గేములు ఆడితే తల్లిదండ్రులకు రూ.3,000 జరిమానా విధిస్తామని ఆంక్ష పెట్టారు. ఈ సమాచారం ఇచ్చినవారికి బహుమతిగా రూ.1,000 అందజేస్తామని కూడా ప్రకటించారు. దీంతో వారం రోజుల్లోనే గ్రామంలో చాలావరకు మార్పు కనిపిస్తోంది. పిల్లలు ఫోన్లకు అతుక్కుపోవడం, రోజంతా శారీరక శ్రమ జోలికి వెళ్లకపోవడం వంటివి గమనించి.. ఈ వ్యసనానికి చెక్ పెట్టేందుకు పెద్దలంతా సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ సర్పంచి బెద్‌బాయి తెలిపారు.

దిగొచ్చిన ఐసీఐసీఐ బ్యాంకు

పొదుపు ఖాతా కనీస నిల్వ మొత్తం తగ్గింపు



దిల్లీ: నగరాలు, పట్టణాల్లో కొత్త పొదుపు ఖాతాల కనీస నిల్వ మొత్తాన్ని రూ.50,000కు పెంచిన ఐసీఐసీఐ బ్యాంకు దిగొచ్చింది. దానిని రూ.15,000కు తగ్గించింది. వినియోగదారుల నుంచి వచ్చిన విలువైన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కనీస నిల్వ మొత్తాన్ని తగ్గించాలని నిర్ణయించినట్లు బుధవారం ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి కనీస నిల్వ మొత్తాన్ని రూ.10,000 నుంచి రూ.50,000కు పెంచుతున్నట్లు ఐసీఐసీఐ బ్యాంకు ఇటీవల ప్రకటించింది. దానిని రిజర్వు బ్యాంకు గవర్నర్ సమర్థించారు. అది బ్యాంకుల ఇష్టమని పేర్కొన్నారు. ఆయన ప్రకటన చేసిన రెండు రోజుల్లోనే ఐసీఐసీఐ బ్యాంకు దిగిరావడం గమనార్హం. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనూ రూ.7,500, రూ.2,500కు కనీస నిల్వ మొత్తాన్ని తగ్గించింది.

పుస్తక పఠనం.. అదనపు మార్కులు



తిరువనంతపురం: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, వార్తాపత్రికలు చదివే విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుకానున్న ఈ పథకం కోసం స్కూళ్లలో ప్రత్యేక పీరియడ్ కేటాయిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టి బుధవారం ఫేస్‌బుక్ పోస్టు ద్వారా వెల్లడించారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి, ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక హ్యాండ్‌బుక్ రూపొందిస్తామన్నారు. అలాగే పాఠశాలల్లో నిర్వహించే వార్షిక కళా ఉత్సవాల్లోనూ పఠనానికి ప్రాధాన్యం ఇచ్చే విభాగాన్ని చేర్చనున్నారు.

మృతదేహాన్ని మెట్లపై నుంచి ఈడ్చుకెళ్లిన మార్చురీ సిబ్బంది


పట్నా: బిహార్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుష ఘటన చోటుచేసుకుంది. పోస్టుమార్టం కోసం తీసుకొచ్చిన మృతదేహాన్ని మార్చురీ సిబ్బంది ఈడ్చుకెళ్లారు. పశ్చిమ చంపారణ్ జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో మృతదేహాన్ని స్ట్రెచర్‌పై తరలించకుండా అక్కడి సిబ్బంది మెట్లపై నుంచి ఈడ్చుకెళ్లారు. వీరిలో ఓ పోలీస్ అధికారి కూడా ఉన్నారు. ఈ అమానవీయ ఘటనను అక్కడే ఉన్న ఓ వ్యక్తి చిత్రీకరించడంతో వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టర్ మార్చురీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఒక్కరోజులోనే భారతీయ వీసా

ఈనాడు, దిల్లీ: అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే ఒక్క రోజులోనే భారతీయ వీసా లభించనుంది. గతంలో వీసా జారీకి వారాలు పట్టేది. కేంద్రం ఈ నిబంధనల్లో మార్పులు చేసింది. విదేశీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ విషయం వెల్లడించారు.

ఓటరు జాబితా జడపదార్థం కాదు

మార్పు నిరంతర ప్రక్రియ: సుప్రీం



దిల్లీ: దేశంలో ఓటరు జాబితాల తయారీ, సవరణ కసరత్తును చేపట్టే అధికారం ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఉందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఓటరు జాబితా జడపదార్థమేమీ కాదని, నిరంతరంగా మార్పులు చేర్పులు జరుగుతూనే ఉంటాయని స్పష్టం చేసింది. బిహార్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ముందు బుధవారం కొనసాగింది. 'గతంలో రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితా సవరణ సమయంలో 7 ధ్రువపత్రాలనే అనుమతించారు. ఎస్‌ఐఆర్‌లో ఇప్పుడు 11 పత్రాలను పరిగణనలోకి తీసుకోవడం ఓటరు అనుకూలమే కదా' అని పేర్కొంది. ఆధార్ మినహా ఇతర పత్రాలను ఈసీ పరిగణనలోకి తీసుకుంటున్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ అభిప్రాయంతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వి విభేదించారు. అంగీకరించే ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ అవి అందరికీ అందుబాటులో లేవంటూ పాస్‌పోర్టును ఉదహరించారు. ఎస్‌ఐఆర్‌ను ఈసీ గతంలో ఎన్నడూ నిర్వహించలేదని, చట్టబద్ధత కూడా లేని ఈ కసరత్తును రద్దు చేయాలని ఏడీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదించారు. 'మీ తర్కం ప్రకారం.. ఎస్‌ఐఆర్‌ను ఎప్పటికీ నిర్వహించరాదు. ఓటరు జాబితా కోసం ఒక్కసారి మాత్రమే కసరత్తు చేయాలి. అలాగైతే చనిపోయిన వారు, వలసపోయిన వారు, ఇతర నియోజకవర్గాలకు నివాసం మార్చిన వారి పేర్లను ఎలా తొలగించగలరు? మా ఉద్దేశం ప్రకారం... ఓటరు జాబితా జడపదార్థమేమీ కాదు. దానికి మార్పులు చేర్పులు జరుగుతూనే ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. ఎస్‌ఐఆర్‌కు చట్టబద్ధత లేదన్న వాదన సమర్థనీయం కాదని తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం... ఏదైనా నియోజకవర్గం, లేదా నియోజకవర్గంలోని ప్రాంతాల వారీగా మాత్రమే సవరణ కసరత్తు చేపట్టాలని గోపాల్ శంకరనారాయణ చెప్పారు. విచారణ గురువారం కూడా కొనసాగనుంది.

భేటీ తర్వాత యుద్ధాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలు

పుతిన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, బెర్లిన్: అలాస్కాలో శుక్రవారం జరిగే తమ భేటీ తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ యుద్ధాన్ని ఆపకపోతే అత్యంత తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ తరఫునా భూభాగం విషయంలోనే చర్చలుంటాయని స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్రంప్ చాలా స్పష్టంగా ఉన్నారని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. బుధవారం ఐరోపా నేతలతో ట్రంప్ వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఇందులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పాల్గొన్నారు. సమావేశ వివరాలను మెక్రాన్ మీడియాకు వివరించారు. భవిష్యత్తులో త్రైపాక్షిక సమావేశం (ట్రంప్, పుతిన్, జెలెన్‌స్కీ) జరగాలని ట్రంప్ కోరుకుంటున్నారని తెలిపారు. పుతిన్ మోసం చేస్తున్నారని సమావేశంలో జెలెన్‌స్కీ తెలిపారు.

వీధి శునకాల వివాదంపై త్రిసభ్య ధర్మాసనం



సుప్రీంకోర్టు సుమోటో విచారణ నేడు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలన్న ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ వివాదాన్ని సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరపనుంది. వీధి కుక్కల దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం దిల్లీలో అవి ఎక్కడా కనిపించడానికి వీల్లేదంటూ ఈ నెల 11న తీర్పు వెలువరించింది. ఎనిమిది వారాల్లోగా శునకాలను షెల్టర్లకు తరలించాలని పేర్కొంది. దీనిపై జంతు హక్కుల సంఘాలతో పాటు పలువురు ప్రముఖులు నిరసన తెలిపిన విషయాన్ని కాన్ఫరెన్స్ ఫర్ హ్యూమన్ రైట్స్ తరఫు న్యాయవాది బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జస్టిస్ జె.కె.మహేశ్వరి నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం వీధి కుక్కల సమస్యపై దాఖలైన వ్యాజ్యాలను ఆయా రాష్ట్రాల్లోని హైకోర్టులకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ఆ అంశాన్ని తాను పరిశీలిస్తానని జస్టిస్ గవాయ్ హామీ ఇచ్చారు. కొద్ది సేపటి తర్వాత.. శునకాల వివాదాన్ని సుమోటోగా చేపడుతున్నట్లు త్రిసభ్య ధర్మాసనం వెల్లడించింది. కాగా, సుప్రీం ధర్మాసనం ఆదేశాలతో దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ గత రెండు రోజుల్లో వంద కుక్కలను పట్టుకుని జంతు నియంత్రణ కేంద్రానికి తరలించింది.



రిటైర్మెంట్ కోసం రోజులు లెక్కబెట్టుకుంటున్నారా?

ఏ పనీ చేయాల్సిన అవసరం లేని జీవితం గురించి చాలా మంది కలలు కంటుంటారు. నిజంగా అలా జీవించేవారు జీవచ్ఛవాలతో సమానం. మనుషులకు సవాళ్లను జయించడంలో, లక్ష్యాలను సాధించడంలో ఉండే ఆనందం ఎందులోనూ దొరకదు. అందుకే రిటైర్మెంట్ కోసం రోజులు లెక్కబెట్టుకోకుండా బతికినంత కాలం పనిచేస్తూనే ఉండండి.

– టైలర్ టాట్, ఫిట్‌నెస్ కోచ్

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంగా పంద్రాగస్టు



ఎర్రకోట వద్ద సైనిక బలగాల కసరత్తు

దిల్లీ: ఈసారి స్వాతంత్ర్య దిన వేడుకల్ని 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 15న దేశంలోని 140 ప్రముఖ ప్రదేశాల్లో సాయుధ, పారా మిలిటరీ దళాల అధికారిక బ్యాండ్లు సంగీత ప్రదర్శన నిర్వహించనున్నాయి. ఆపరేషన్ సిందూర్ విజయానికి ప్రతీకగా ఈ ఏర్పాటు చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వైభవానికి సంగీత సౌరభాన్ని అద్దాలన్న ఉద్దేశంతో ఈ ప్రదర్శనలు నిర్వహించి దేశ పౌరులకు అద్భుత అనుభూతిని అందించనున్నట్లు రక్షణశాఖ పేర్కొంది. ఈ వేడుకల ఆహ్వాన పత్రికపై 'ఆపరేషన్ సిందూర్' లోగోను, అద్భుత ఇంజినీరింగ్ నిర్మాణంగా నిలుస్తున్న ప్రతిష్ఠాత్మక చినాబ్ బ్రిడ్జి రేఖాచిత్రాన్ని ముద్రించారు.

యూపీలో మానసిక దివ్యాంగురాలిపై సామూహిక అత్యాచారం



లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలరాంపుర్ జిల్లాలో ఓ మానసిక దివ్యాంగురాలి(21)పై సామూహిక అత్యాచార ఘటన కలకలం రేపుతోంది. మూగ, చెవిటి కూడా అయిన ఆ యువతి తన బంధువులింటి నుంచి ఇంటికి వెళుతుండగా కొందరు యువకులు నాలుగైదు బైక్‌లపై ఆమెను వెంబడించారు. ఓ పోలీస్ అధికారి ఇంటి ముందు ఉన్న సీసీటీవీలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. అందులో బాధితురాలు వెనక్కి తిరిగి చూసుకుంటూ పరుగెత్తుతూ కనిపించింది. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు నాలుగైదు బైక్‌లపై కనిపించారు. యువతి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరకు ఓ పోలీస్ స్టేషన్ దగ్గర పొదల్లో ఆ దివ్యాంగురాలు కనిపించింది. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా అంకుర్ వర్మ, హర్షిత్ పాండేలను నిందితులుగా గుర్తించారు. వారిని పట్టుకునే క్రమంలో కాల్పులు జరిపామని ఏఎస్పీ విశాల్ పాండే తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

అమెరికాలో హిందూ ఆలయంపై దాడి



న్యూయార్క్: అమెరికాలోని హిందూ ఆలయంపై వేర్పాటువాదులు మరోసారి దాడికి పాల్పడ్డారు. ఇండియానా రాష్ట్రం జాన్సన్ కౌంటీలోని అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ ఆలయంపై ఖలిస్థాన్ వేర్పాటువాదులు దాడికి పాల్పడినట్లు ది హిందూ అమెరికన్ ఫౌండేషన్ 'ఎక్స్'లో మంగళవారం తెలిపింది. ఖలిస్థాన్‌కు మద్దతుగా, భారత్‌కు వ్యతిరేకంగా దేవాలయంపై పలు ద్వేషపూరిత నినాదాలు రాశారని వెల్లడించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసే ఇటువంటి విధ్వంసాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాదిలో అమెరికాలోని హిందూ దేవాలయాలపై ఇది నాలుగో దాడిగా నిర్వాహకులు పేర్కొన్నారు. మళ్లీ ఇటువంటి దాడులు జరగకుండా ఆలయం వద్ద భద్రత ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు వెల్లడించారు. ఘటన వెనుక భారత వ్యతిరేక శక్తుల హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. దేవాలయాలపై జరుగుతున్న దాడులపై హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఆందోళన వ్యక్తం చేసింది.

సైనికాధికారులు, శాస్త్రవేత్తల సమాచారం పాక్‌కు

డీఆర్‌డీవో కాంట్రాక్టు ఉద్యోగి అరెస్టు



జైపుర్: పాకిస్థాన్‌కు దేశ రహస్యాలు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడికి కోర్టు రెండు రోజుల పోలీసు రిమాండ్ విధించింది. ఉత్తరాఖండ్ అల్మోరాకు చెందిన మహేంద్ర ప్రసాద్ రాజస్థాన్ జైసల్మేర్‌లోని చందన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజి డీఆర్‌డీవో గెస్ట్‌హౌస్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. పాకిస్థాన్ గూఢచార వర్గాలతో ప్రసాద్ నిరంతరం సోషల్ మీడియాలో సంప్రదింపుల్లో ఉంటూ భారత రక్షణకు సంబంధించిన కీలక సమాచారాన్ని వారికి పంపిస్తున్నాడని అధికారులు గుర్తించారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు, ఫైరింగ్ రేంజికి వచ్చి వెళుతున్న ఆర్మీ అధికారుల వివరాలను పాక్‌కు చేరవేసినట్లు తేలింది.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై విచారణ నేడు

దిల్లీ: కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం ముందు వాదనలు కొనసాగనున్నాయి.

దక్షిణ చైనా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు

మనీలా: దక్షిణ చైనా సముద్రంలోని వివాదాస్పద స్కార్‌బరో షోల్ (చేపల దీవి) ప్రాంతంలో అమెరికా నౌకాదళం రెండు యుద్ధ నౌకల్ని మోహరించింది. ఈ ప్రాంతంలో చైనా నౌకాదళం ఫిలిప్పీన్స్‌కు చెందిన ఒక పడవను తరిమికొట్టిన ఘటన నేపథ్యంలో తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది. స్కార్‌బరో షోల్ తమకే చెందుతుందని చైనా, ఫిలిప్పీన్స్ చెబుతున్నాయి. వియత్నాం, మలేసియా, బ్రూనై, తైవాన్ కూడా ఈ ప్రాంతం తమకే చెందుతుందని పేర్కొంటున్నాయి. చైనా విచక్షణా రహితంగా ఫిలిప్పీన్స్‌కు చెందిన పడవను తరిమేసిన నేపథ్యంలో తాము యుద్ధ నౌకల్ని మోహరించక తప్పలేదని మనీలాలో అమెరికా రాయబారి మేరీ కే కార్ల్‌సన్ అన్నారు.

భారత్, పాక్‌తో మంచి సంబంధాలే..

- వాణిజ్య చర్చల్లో భారత్ తగ్గడం లేదు
- అక్టోబరుకల్లా కొలిక్కి రావొచ్చు..
- అమెరికా విదేశాంగశాఖ వెల్లడి



స్కాట్ బెసెంట్

న్యూయార్క్, వాషింగ్టన్, ఇస్లామాబాద్: భారత్, పాకిస్థాన్‌లతో మంచి సంబంధాలే ఉన్నాయని అమెరికా వెల్లడించింది. రెండు దేశాలతో కలిసి పనిచేయడం ఆ ప్రాంతానికి, ప్రపంచానికి శుభవార్తని పేర్కొంది. వాణిజ్య చర్చల్లో భారత్ వెనక్కి తగ్గడం లేదని, అయినా ఆ దేశంతోపాటు మిగిలిన దేశాలతో అక్టోబరుకల్లా ఒప్పందాలు కుదరవచ్చని స్పష్టం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై పోరాటంలో పాకిస్థాన్‌తో కలిసి పని చేయడానికి అమెరికా ఒప్పందం కుదుర్చుకుంది.

- 'అందరికీ పరిచయమున్న అధ్యక్షుడు, అందరితో మాట్లాడే అధ్యకుడి కారణంగా భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలు బాగున్నాయి. భారత్, పాక్ వివాదం జరిగినప్పుడు మాకు ఒక అనుభవం ఉంది, అది చాలా భయంకరమైనదిగా మారే అవకాశం ఉండింది. దాడులను ఆపడానికి, ఒకచోట చేర్చడానికి మేం చేసిన పనిని ఇప్పటికే వివరించాం. ఆ విపత్తును ఆపడానికి అమెరికాలోని అగ్ర నాయకులు కృషి చేశారు' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ మంగళవారం వివరించారు.
- వాణిజ్య చర్చల్లో భారత్ కొంత గట్టిగానే ఉందని, తలొగ్గడం లేదని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. 'కానీ మేం మంచి స్థాయిలోనే ఉన్నాం. స్విట్జర్లాండ్, భారత్‌లతో అతి పెద్ద వాణిజ్య ఒప్పందాలు పెండింగులో ఉన్నాయి. మా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్, న్యాయవాదుల బృందం ఒప్పందాన్ని సిద్ధం చేసే పనిలో ఉన్నారు. త్వరలో అసాధారణ దేశాలతో అసాధారణ ఒప్పందాలను కుదుర్చుకోబోతున్నాం. అధ్యక్షుడు ట్రంప్.. శాంతి, వాణిజ్య, పన్నుల ఒప్పందాలపై పని చేస్తున్నారు' అని ఆయన తెలిపారు.
- ఉగ్రవాద గ్రూపులను అడ్డుకునే విషయంలో మరింతగా కలిసి పని చేయాలని అమెరికా, పాకిస్థాన్ నిర్ణయించాయి. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), ఐసిస్-ఖోరాసన్, తాలిబన్‌లను కలిసి అడ్డుకోవాలని నిర్ణయించాయి. మంగళవారం ఇస్లామాబాద్‌లో జరిగిన సమావేశంలో రెండు దేశాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. చర్చల్లో ఐరాసలో పాక్ ప్రత్యేక కార్యదర్శి నబీల్ మునీర్, అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి గ్రెగరీ డి.లోగెర్ఫో పాల్గొన్నారు.

బేరింగ్ జలసంధి మీదుగా అలాస్కాకు పుతిన్



యాంకరేజ్ (అమెరికా): ట్రంప్‌తో చర్చల కోసం అలాస్కా వెళ్లనున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ బేరింగ్ జలసంధిపై నుంచి ప్రయాణించే అవకాశముంది. ఇందుకోసం ఇప్పటికే అమెరికా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. తమ గగనతలంలోకి రష్యా అధినేత విమానం ప్రవేశించేందుకు అనుమతి ఇచ్చింది. రష్యా మారుమూల ప్రదేశమైన చుకోట్కా ద్వీపకల్పం నుంచి పుతిన్ విమానం రానుంది. బేరింగ్ జలసంధి వద్ద రష్యా, అమెరికా ప్రధాన భూభాగాలు కేవలం 88 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇక అలాస్కాకు చెందిన లిటిల్ డైమెడ్, మాస్కోకు చెందిన బిగ్ డైమెడ్ ద్వీపాల మధ్య దూరం కేవలం 3 మైళ్లే. కోల్డ్‌వార్ సమయంలో రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచెవ్ ప్రభుత్వం ఈ ప్రదేశాన్ని ఐస్‌కర్టెన్‌గా అభివర్ణించేది. అలాస్కాలో అమెరికా కమాండ్ సెంటర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, లాజిస్టిక్స్ హబ్స్ ఉన్నాయి. ఉత్తర అమెరికాను ముప్పుల నుంచి హెచ్చరించే 'ద నార్త్ వార్నింగ్ సిస్టమ్' ప్రధాన కేంద్రం ఇక్కడే ఉంది. అమెరికా, కెనడాలు సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. ఇక్కడ అత్యాధునిక యుద్ధ విమానాలైన ఎఫ్-22 రాప్టర్లున్నాయి. యాంకరేజ్‌లోని ఎల్మెండోర్ఫ్-రిచర్డ్సన్ సైనిక స్థావరంలో దాదాపు 32వేల మంది ఉన్నారు. దీనిని సందర్శించిన తొలి అధ్యక్షుడిగా పుతిన్ రికార్డు సృష్టించనున్నారు.

కిమ్‌కు పుతిన్ ధన్యవాదాలు

ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌తో పుతిన్ ఫోన్‌లో మాట్లాడారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిశ్చయించుకున్నారని ఉత్తర కొరియా మీడియా తెలిపింది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి సైనికులను పంపినందుకు కిమ్‌కు పుతిన్ కృతజ్ఞతలు తెలిపారని వెల్లడించింది.



స్వాతంత్ర్య వేడుకలు పురస్కరించుకొని 'హర్ ఘర్ తిరంగ' ప్రచారంలో భాగంగా బుధవారం దిల్లీలోని తన నివాసంపై జాతీయ జెండాతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆయన సతీమణి సోనాల్ షా

20, 21 తేదీల్లో జైశంకర్ రష్యా పర్యటన



దిల్లీ: విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఈ నెల 20, 21 తేదీల్లో రష్యాలో పర్యటించనున్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌తో ఆయన చర్చలు జరపనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ రష్యాలోనే ఉన్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ పర్యటనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

- ఈ నెలాఖరులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ సోమవారం భారత్‌కు రానున్నారు. అజీత్ డోభాల్‌తో ఆయన చర్చలు జరపనున్నారు. సరిహద్దు అంశాలపై వారి మధ్య చర్చలు జరగనున్నాయి.

ఎయిరిండియా స్పందనపై డీజీసీఏ మండిపాటు

ముంబయి: సిబ్బంది పనివేళల నిబంధన ఉల్లంఘనకు సంబంధించి తామిచ్చిన తాఖీదుకు టాటా గ్రూపు సంస్థ 'ఎయిరిండియా' స్పందనపై 'పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్' (డీజీసీఏ) మండిపడింది. ఇది తమకు సంతృప్తికరంగా లేదని, నిర్దేశిత పౌరవిమానయాన నియమాలకు కట్టుబడి ఉండాలని తెగేసి చెప్పింది. సిబ్బందికి 10 గంటల పనివేళల పరిమితి ఉన్నా ఈ ఏడాది మే 16, 17 తేదీల్లో బెంగళూరు-లండన్ విమానాల విషయంలో దానిని ఎయిరిండియా ఉల్లంఘించిందని డీజీసీఏ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎందుకు చర్యలు తీసుకోరాదో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.

స్వాతంత్ర్య సమరయోధులకు గుడి!



ఈటీవీ భారత్: అదొక మందిరం. కానీ ఇతర మందిరాల కంటే చాలా భిన్నమైంది, ప్రత్యేకమైంది. దానికి గోపురాలు కానీ, గంటలు కానీ అస్సలు ఉండవు. అందులో దేవతామూర్తులు కూడా ఉండరు. అయినా ప్రజలు కులమతాలకు అతీతంగా ఈ మందిరాన్ని సందర్శిస్తుంటారు. అదే 'ఇంక్విలాబ్ మందిర్'. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన వారిని ఎప్పుడూ గుర్తుంచుకోవాలనే ఉద్దేశంతో 2000 సంవత్సరంలో ఈ గుడిని ఏర్పాటు చేశారు. ఇది హరియాణాలోని యమునా నగర్ జిల్లా గుమ్‌థలా రావ్ గ్రామంలో ఉంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ గ్రామంలో ఒక్క మందిరం కూడా లేదు. ఇటీవలే ఈ గ్రామంలో ఒక గురుద్వారాను నిర్మించారు. కురుక్షేత్ర, కైథాల్, యమునా నగర్ జిల్లాల సరిహద్దుల్లోని ఒక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఈ ఇంక్విలాబ్ మందిర్‌ను నిర్మించారు. నిర్మించిన కొత్తలో ఇందులో భగత్ సింగ్ విగ్రహం మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఇందులో దాదాపు 20 మంది దేశభక్తుల విగ్రహాలు ఉన్నాయి. భారత మాత విగ్రహంతో పాటు సుఖ్‌దేవ్, సుభాష్ చంద్రబోస్, మంగళ్ పాండే వంటి స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఈ మందిరంలో ఏర్పాటు చేశారు. ఇందుకు అదనంగా దాదాపు 230 మంది స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను ఈ మందిరంలో అమర్చారు. హరియాణాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా ఇంక్విలాబ్ మందిర్ సందర్శనకు వస్తుంటారు.

రాజీనామా చేస్తే పింఛను, ఇతర సౌకర్యాలు

- అభిశంసనకు గురైతే ఆ ప్రయోజనాలకు దూరం
- నిబంధనలు చెబుతున్నదిదే



జస్టిస్ వర్మ

దిల్లీ: అభిశంసన ప్రక్రియ ప్రారంభిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా త్రిసభ్య కమిటీ నియమించిన నేపథ్యంలో పార్లమెంటు తనను తొలగించకుండా ఉండాలంటే జస్టిస్ యశ్వంత్ వర్మ ముందు మిగిలిన ఏకైక మార్గం రాజీనామాయే. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాతే పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆ సందర్భంగా చట్టసభ సభ్యుల ముందు తన కేసును సమర్థించుకొనే అవకాశం జస్టిస్ వర్మకు లభిస్తుంది. ఆ సమయంలో తాను వైదొలగుతున్నానని జస్టిస్ వర్మ తెలపొచ్చని, మౌఖికంగా చెప్పిన ఆ ప్రకటనను రాజీనామాగా పార్లమెంటు పరిగణిస్తుందని సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల తొలగింపు ప్రక్రియపై అవగాహన ఉన్న అధికారులు తెలిపారు. ఒక వేళ జస్టిస్ వర్మ రాజీనామా చేయాలని నిర్ణయిస్తే పింఛను, హైకోర్టు జడ్జిగా ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాలు ఆయనకు లభిస్తాయి. పార్లమెంటు తొలగిస్తే మాత్రం పింఛను, ఇతర ప్రయోజనాలు లభించవు. రాజ్యాంగంలోని అధికరణం 217 ప్రకారం.. హైకోర్టు జడ్జి లిఖితపూర్వకంగా తన రాజీనామాను రాష్ట్రపతికి పంపొచ్చు. దీనికి ఎలాంటి ఆమోదం అవసరం లేదు. రాజీనామా లేఖ సరిపోతుంది. భవిష్యత్తు తేదీ వేసి కూడా రాజీనామా సమర్పించొచ్చు. అలా చేసినప్పుడు ప్రస్తావించిన తేదీలోపు రాజీనామాను ఉపసంహరించుకొనే అధికారం కూడా ఆ జడ్జికి ఉంటుంది.

ప్రియుడి సాయంతో కన్నబిడ్డను కడతేర్చిన తల్లి




సూరజ్

వారణాసి: పదేళ్ల బాలుడు సూరజ్ హత్యకేసులో అతడి తల్లితోపాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వారణాసి పోలీసులు బుధవారం వెల్లడించారు. రెండేళ్ల కిందట జరిగిన రోడ్డుప్రమాదంలో భర్తను కోల్పోయిన సోనాశర్మ కుమారుడు సూరజ్, కుమార్తె (5)తో కలిసి రామ్‌నగర్ ఠాణా పరిధిలో నివసిస్తోంది. ఫైజాన్ అనే వ్యక్తితో సోనా వివాహేతర సంబంధం పెట్టుకొంది. గత ఆదివారం రాత్రి వీరిద్దరూ పడకగదిలో ఉండగా సూరజ్ చూశాడు. ఈ విషయం బయట చెబుతాడనే అనుమానంతో బాలుడి హత్యకు పథకం వేసినట్లు అదనపు డీసీపీ టి.శరవణన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఫైజాన్ తన స్నేహితుడు రషీద్‌తో కలిసి సూరజ్‌ను ఊరి శివారులోని పొదల్లోకి లాక్కెళ్లాడు. అక్కడ గొంతు నులిమి హత్య చేశాక, బాలుడి మృతదేహం కనిపించకుండా దాచిపెట్టాడు. ముందుగా అనుకొన్నట్టు తన కుమారుణ్ని ఎవరో అపహరించారంటూ సోనాశర్మ రామ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం రాత్రి సూరజ్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు.. బాలుడి తల్లి సోనాశర్మ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటం చూసి విచారించగా అసలు విషయం బయటపడింది. క్రైంసీన్‌లో ఫైజాన్ తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేయగా, పోలీసులు అతడి కుడికాలిపై కాల్పులు జరిపి పట్టుకొన్నారు.

దక్షిణ ఐరోపాలో కార్చిచ్చు: ముగ్గురి మృతి

ఏథెన్స్: దక్షిణ ఐరోపా వ్యాప్తంగా బుధవారం కార్చిచ్చు సంభవించింది. గ్రీస్‌లోని మూడో అతి పెద్ద నగరమైన ఏథెన్స్ పరిధిలో చెలరేగిన మంటలను అదుపు చేయడానికి రాత్రంతా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. మరోవైపు కార్చిచ్చు కారణంగా స్పెయిన్, తుర్కియే, అల్బేనియాలో ముగ్గురు మరణించారు. మృతుల్లో అగ్నిమాపక సిబ్బంది ఒకరున్నారు. ఓ అటవీ శాఖ అధికారి ఉన్నారు. స్పెయిన్‌లో వేల మంది నిరాశ్రయులయ్యారని అధికారులు తెలిపారు.



కార్చిచ్చు కారణంగా గ్రీస్‌లోని కాటో ఆచాయాలో కాలిపోయిన వాహనాలు



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమిలిలో అట్టహాసంగా రైతు సంబరాలు

పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం (భీమునిపట్నం), న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన కింద జమచేసిన రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందించిన సందర్భంగా బుధవారం భీమిలి నియోజకవర్గంలో రైతు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో రైతులు ట్రాక్టర్లతో తరలివచ్చారు. తొలుత ఎమ్మెల్యే గంటా.. తగరపువలస కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. ఇది భీమిలిలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు సాగింది. ఎమ్మెల్యే ట్రాక్టర్‌ను నడుపుతూ రైతులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎదుగుదలను కాంక్షించే వారి లక్షణాలివీ..

- గతం గురించి ఆలోచించకుండా ప్రస్తుతంపైనే దృష్టిపెడతారు.
- తాము చేసే ప్రతి పనికీ ఇతరుల ఆమోదం పొందాలని చూడరు.
- అందరినీ మెప్పించాలని, ప్రతి ఒక్కరూ తమను ఇష్టపడాలని కోరుకోరు.
- తాము మార్చలేని వాటి గురించి ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోరు.
- తమకు ఇష్టం లేని పనులకు నిర్మొహమాటంగా 'నో' చెబుతారు.
- వారి పనులకు పూర్తి బాధ్యత వారే తీసుకుంటారు.

– రోజియాన్, లైఫ్ కోచ్

విద్యుత్ ప్రాజెక్టులు గ్రౌండింగ్ కావాల్సిందే!

• 15 రోజులకోసారి సమీక్షించాలి • విద్యుదుత్పత్తి.. కొనుగోలు వ్యయాలు తగ్గించాలి

విద్యుత్‌శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఈనాడు, అమరావతి: విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని ఇంకా పనులు ప్రారంభించని సంస్థలతో సంప్రదింపులు జరిపి కారణాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల గ్రౌండింగ్ వేగవంతం చేసేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించాలని సూచించారు. విద్యుత్ సరఫరా, ప్రాజెక్టుల గ్రౌండింగ్, విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గింపు వంటి అంశాలపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి బుధవారం సమీక్షించారు. 'పునరుత్పాదక విద్యుత్ రంగం వేగంగా విస్తరిస్తోంది. వాటి నుంచి చౌకగా విద్యుత్ ఉత్పత్తి చేసి ఆ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాలి. రానున్న మూడేళ్లలో 8.9 శాతం విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉంది. ఆ మేరకు హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేసేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. కృత్రిమ మేధను వినియోగించి తక్కువ ఖర్చుతో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి మార్గాలను అన్వేషించాలి' అని సీఎం పేర్కొన్నారు. గురువారం కూడా సమీక్ష కొనసాగనుంది. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డిస్కంల సీఎండీలు పాల్గొన్నారు.

వినియోగదారులపై ఛార్జీల భారానికి అనుమతించం

వినియోగదారులపై ఛార్జీల భారం మోపేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని సీఎం తేల్చి చెప్పారు. 'ప్రత్యామ్నాయంగా నాన్ టారిఫ్ ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను అన్వేషించాలి. ఏపీ ట్రాన్స్‌కో ఏర్పాటు చేసిన ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా రూ.7 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది' అని చంద్రబాబు తెలిపారు. విద్యుత్ కొనుగోళ్లు తగ్గించేందుకు స్వాపింగ్ ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రూ.4.80కు తగ్గించేలా లక్ష్యాన్ని నిర్దేశించినట్లు విజయానంద్ సీఎంకు వివరించారు.

విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గించాలి

రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని చంద్రబాబు కోరారు. '2024 నుంచి ఇప్పటి వరకు 27,445 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యం ఉన్న పవన, సౌర, పీఎస్‌పీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతించాం. సీబీజీ, ఎలక్ట్రోలైజర్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులూ కలిపి ఇప్పటికే 17 ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి. వాటి ద్వారా రూ.3.19 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయి. 3.28 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. రాష్ట్రంలో 65 గిగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఉంది. వాటి నుంచి చౌక ధరకే విద్యుత్ వస్తుంది. థర్మల్ విద్యుత్ యూనిట్ ఉత్పత్తికి రూ.5-6 వరకు ఖర్చు అవుతుంటే.. పవన విద్యుత్ యూనిట్ రూ.4.60కే వస్తుంది' అని ఆయన అన్నారు.



విద్యుత్తు ప్రాజెక్టులపై క్యాంపు కార్యాలయంలో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్, అధికారులు

రూఫ్‌టాప్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. 'రాష్ట్రంలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఇతర వర్గాలకు రూఫ్ టాప్ కింద ఎన్ని యూనిట్లు ఏర్పాటయ్యాయి? పీఎం కుసుమ్ ద్వారా ఫీడర్ స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా వచ్చే విద్యుత్ సరిపోతుందా' అని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ కనెక్షన్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని పేర్కొన్నారు.

ప్రజల్ని అప్రమత్తం చేయండి

భారీవర్షాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచించిన నేపథ్యంలో.. వాగుల ద్వారా వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువ ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కాలువలు, చెరువు గట్లకు గండ్లు పడకుండా.. పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. 'ఎగువ నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ రోజుకు నాలుగు టీఎంసీలను సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు తరలించాలి' అని చంద్రబాబు సూచించారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, అధికారులతో భారీవర్షాలపై సమీక్షించారు. పట్టణ లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆదేశించారు. వరద నిర్వహణ పనుల్లో భాగంగా రూ.40 కోట్లతో బుడమేరు-వెలగలేరు యూటీ నిర్మాణం చేపట్టేందుకు సీఎం అనుమతిచ్చారు. 'మైలవరం సహా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో బుడమేరు, వెలగలేరుకు పెద్దఎత్తున వరద వస్తోంది. కృష్ణానదిలోకి పంపిస్తున్నాం. బుడమేరు డైవర్షన్ ఛానల్ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం' అని అధికారులు సీఎంకు వివరించారు. సమావేశంలో మంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్, జలవనరులశాఖ అధికారులు పాల్గొన్నారు.

■ అల్పపీడన ప్రభావం, వరద పరిస్థితిపై హోం, విపత్తు నిర్వహణశాఖ మంత్రి అనిత కుంచనపల్లిలోని విపత్తు నిర్వహణ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఉత్తరాంధ్ర, మధ్యకోస్తా జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.

1.11 లక్షల ఎకరాల్లో పంటల మునక

గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో 1.11 లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వరి, మినుము, పత్తి, వేరుశనగ పంటలు నీటిలో ఉన్నట్లు పేర్కొంది.

నిండుకుండల్లా జలాశయాలు

ఈనాడు, అమరావతి: కృష్ణానదిపై జలాశయాలు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. ప్రకాశం బ్యారేజికి ఎగువ నుంచి 3.97 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది.

■ బుధవారం రాత్రి 9 గంటల సమయంలో.. కృష్ణానదిపై జలాశయాల్లో నీటినిల్వలు (టీఎంసీల్లో).. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)

జలాశయం	పూర్తి నీటినిల్వ	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
శ్రీశైలం	215.81	201.58	1,89,651	2,73,961
నాగార్జునసాగర్	312.05	308.47	2,54,784	2,96,408
పులిచింతల	45.7	39.36	3,45,289	3,63,711
ప్రకాశం బ్యారేజి	3.07	3.07	3,97,250	3,97,250

తెలంగాణలోనూ జోరువాన..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా బుధవారం ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా చాలా చోట్ల రోడ్లు, కాలనీలపైకి వరదనీరు చేరడంతో జనజీవనం అతలాకుతలమైంది. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జోరువాన కురిసింది. కన్నెపల్లి (మంచిర్యాల జిల్లా)లో అత్యధికంగా 23.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భీమిని (మంచిర్యాల)లో 22.6, రెబ్బెన (కుమురం భీం)లో 22 సెం.మీ. వర్షం పడింది. ఆయా జిల్లాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నిటికీ సెలవు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు

- జడ్పీటీసీ ఉపఎన్నిక చూసి జగన్‌కు ప్రజాస్వామ్యం గుర్తొచ్చింది
- ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: 'పులివెందులలో 40 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేశారు. అది చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు వస్తున్నాయి. అందుకే జగన్‌కు ఆకస్మికంగా ప్రజాస్వామ్యం గుర్తుకొచ్చింది' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. ఉప ఎన్నికల్లో ఓటమికి జగన్ కారణాలు వెతుక్కుంటున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. 2020లో జరిగిన ఎన్నికల్లో కడప జిల్లాలో 79% జడ్పీటీసీ స్థానాలు, 76% ఎంపీటీసీలను దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకున్న మీరు ఈరోజు ప్రజాస్వామ్యమంటూ పెడబొబ్బలు పెడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కేశవ్ బుధవారం సచివాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

మీరు నియమించిన అధికారినీ నమ్మరా?

'రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మీరు నియమించిన అధికారే కదా. వారిపై నమ్మకం లేదా? మేం కూడా మీలాగే ఇతరులు నామినేషన్ వేయకుండా చేయొచ్చు లేదా ఒత్తిడి తెచ్చి ఏకగ్రీవం చేయించవచ్చు కదా? పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయనడానికి 11 మంది నామినేషన్లు వేయడమే నిదర్శనం. క్యాడర్ వెళ్లిపోతుండటం, ప్రజలు ఛీకొడుతుండటం, మద్యం కుంభకోణం కేసులో జరుగుతున్న పరిణామాలతో జగన్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు మూడుసార్లే ప్రెస్‌మీట్లు పెట్టారు. ఇప్పుడేమో నిత్యం గంటన్నర ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్నారు' అని విమర్శించారు.

జగనే రాహుల్‌గాంధీకి నేర్పించి ఉంటారు

'దేశంలో ఓట్ల చోరీ, దొంగ ఓట్లకు మూలం జగన్, వైకాపా. మా ఉరవకొండ నియోజకవర్గంలో 10వేల ఓట్లు తొలగించేందుకు సిద్ధం కాలేదా? దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఓ కార్యదర్శి వచ్చి బాధ్యులైన బీఎల్వోలను, ఇద్దరు జడ్పీ సీఈఓలను సస్పెండ్ చేసింది మరచిపోయారా? ఏపీలో ఓట్లచోరీ చేశానని, ఇక్కడ తెదేపా యాక్టివ్‌గా ఉండటంతో అది ఫెయిలైందని, వేరే రాష్ట్రాల్లో ఇలాంటివి చేస్తుంటారని జగనే.. రాహుల్‌గాంధీకి హాట్‌లైన్‌లో నేర్పించి ఉంటారు. చంద్రబాబుకు ఇది చివరి ఎన్నికని జగన్ అంటున్నారు. మరో పదేళ్లు చంద్రబాబే సీఎం. అసలు జగన్ వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తారో లేదో చూసుకోవాలి' అని కేశవ్ పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

పోర్టులకు మూడో నంబరు హెచ్చరికలు జారీ

ఈనాడు, విశాఖపట్నం: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో బుధవారం ఉదయం అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ గురువారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వైపు కదులుతుందని అంచనా వేస్తోంది. ఇది వాయుగుండంగా మారే అవకాశముందని వెల్లడించింది. దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. గరిష్ఠంగా గంటకు 50 నుంచి 60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్రంలోని విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం పోర్టులకు విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం మూడో నంబరు హెచ్చరికలు జారీ చేసింది.



పల్నాడు జిల్లా అమరావతి నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న వంతెన పైవరకు వచ్చిన పెదమద్దూరు వాగు



విజయవాడలోని బెంజిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్‌కు వెళ్లే రోడ్డుపై జలప్రవాహం



విజయవాడ మధురానగర్ మధ్య కట్ట వద్ద విజయదుర్గా నగర్‌లో ఇళ్లలోకి చేరిన బుడమేరు వరద



బాపట్ల జిల్లా నరసాయపాలెంలో చెరువులా మారిన వరి పొలాలు

వణికించిన వాన

(మొదటి పేజీ తరువాయి)

అమీన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. కార్పొరేషన్, రైతుబజార్లు, మిర్చియార్డుల్లోకి నీరు చేరింది. కంకరగుంట ఆర్‌యూబీ, మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. పీకలవాగు, కొండవీటి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో నగరంలోకి రాకపోకలు నిలిచిపోయాయి. నాగార్జున విశ్వవిద్యాలయం హాస్టళ్లలోకి నీరు ప్రవేశించడంతో విద్యార్థులు నిచ్చెనలతో బయటకు వచ్చారు.

■ విజయవాడలో డ్రెయిన్లు పొంగడంతో మధురానగర్, విజయదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో బుడమేరు కట్టమీద ఉన్న దాదాపు 40 ఇళ్లలో నీరు చేరింది. విజయవాడ పాతబస్తీ, కొత్తపేట, కేబీఎన్ కళాశాల ప్రాంతాల్లో నడుం లోతు నీరు చేరింది. పటమట పీఅండ్‌టీ కాలనీ జలమయమైంది.

■ పెదకూరపాడు, అమరావతి, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మండలాల్లో భారీవర్షాలు కురిశాయి. గుంటూరు-మాచర్ల మార్గంలో అనుపాలెం వద్ద వాగు పొంగింది.

■ ఉమ్మడి కృష్ణాజిల్లాలో చల్లపల్లి, అవనిగడ్డ, పామర్రు, కంకిపాడు, గూడూరు, తదితర మండలాల్లో నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయి.

రాజధాని పనుల నేపథ్యంలో కొండవీటివాగు, పాలవాగుల ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. వరదనీరు వెనక్కి తన్నింది. కృష్ణాయపాలెం, కురగల్లు, ఎర్రబాలెం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. పెదపరిమి-నీరుకొండ గ్రామాల మధ్య కోటెళ్లవాగు పొంగడంతో పెదపరిమి-తుళ్లూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొండవీటి వాగు ఉద్ధృతికి గుంటూరు-అమరావతి నడుమ రాకపోకలు ఆగిపోయాయి. పెదమద్దూరు వద్ద వాగు ఉద్ధృతికి అమరావతి-విజయవాడ దారిలో రాకపోకలు నిలిచిపోయాయి.

రోడ్డెక్కిన వరద.. నిలిచిన టోల్ వసూళ్లు

కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిలో కాజ టోల్‌గేట్ వద్ద రోడ్డుపై వర్షపునీరు ప్రవహించడంతో తెల్లవారుజామున వాహనాల రాకపోకలు నిలిచాయి. బుధవారం ఉదయం 11.30నుంచి టోల్ వసూలు నెట్‌వర్క్ నీటిలో మునిగి, వసూళ్లు నిలిచాయి.

పొలాలు నీట మునిగి.. రైతుకు వేదన

భారీవర్షాలతో లక్ష ఎకరాల్లో పత్తి వరి, మినుము, కూరగాయ పంటలు నీటమునిగాయి. గుంటూరు జిల్లాలో 28వేల ఎకరాలకు పైగా పంటలపై వరద ప్రవహించింది. గుంటూరు చుట్టుగుంట గోదాములోని 2,500 పొగాకు బేళ్లు తడిసిపోయాయి. కాల్వల కట్టలకు గండ్లు పడితే లక్ష హెక్టార్లలో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నలుగురి దుర్మరణం

విజయవాడ 53వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు మధుసూదనరావు మంగళవారం రాత్రి వాహనం అదుపు తప్పి గుంతలో పడిపోయారు. స్థానికులు తీసి ఇంటికి పంపారు. వర్షపునీరు తాగటంతో వాంతులయ్యాయి. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించారు. ఆ వాహనంపైనే ఉన్న డివిజన్ తెదేపా బూత్ కన్వీనర్ మోర్తజా తలకు బలమైన గాయం కావడంతో అక్కడే మృతిచెందారు. లయోలా కాలేజి వద్ద వర్షానికి చెట్టు కూలగా, ద్విచక్రవాహనంపై వస్తున్న మహేశ్‌బాబు దాన్ని ఢీకొని, డ్రెయిన్‌లో పడి చనిపోయారు. పెదకాకాని మండలం నంబూరు-కాజ మార్గంలో చప్టా వద్ద వరదనీటిలో పడి భరత్ అనే బాలుడు మృతిచెందాడు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం వద్ద కృష్ణానది నుంచి పడవను బయటకు తెచ్చే సమయంలో ఇద్దరు గల్లంతయ్యారు. పల్నాడు జిల్లా కోటనెమలిపురి వద్ద వాగులో గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చింది.

■ భారీ వర్షాల నేపథ్యంలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో రైళ్లను 30 కి.మీ వేగంతోనే నడపాలని బుధవారం ఆదేశాలిచ్చారు.



ముంపులో గుంటూరులోని పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్



గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం వంతెనపై ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కొండవీటి వాగు



గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని గౌతమి వసతి గృహంలోకి నీరు

★ వసతి గృహ భవనం నుంచి నిచ్చెన ద్వారా కిందికి దిగుతున్న విద్యార్థులు



కాజ టోల్ గేటు వద్ద వర్షపు నీరు చేరి నిలిచిన వాహనాలు



గుంటూరు మిర్చి యార్డులోకి చేరిన నీరు

ఆ రంగులను పట్టించుకోండి!

రెండు తెలుగు రాష్ట్రాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. వీటిపై వాతావరణశాఖ కొద్దిరోజుల ముందుగానే సూచనలు చేస్తోంది. వర్షం తీవ్రత ప్రజలకు సులభంగా తెలిసేలా ఎల్లో, ఆరెంజ్, రెడ్ ఎలర్ట్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తోంది. అయితే చాలామందికి ఇప్పటికీ వీటిపై సరైన అవగాహన లేక... పట్టించుకోక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఈ రంగుల హెచ్చరికల వివరాలివీ...



ఎల్లో వార్నింగ్

- మధ్యస్థ ప్రభావం ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది.
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కి.మీ.ల ఈదురు గాలులతో కూడిన వానలు పడతాయి.
- కొన్నిచోట్ల రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీళ్లు నిల్చిపోతాయి. జారే రహదారులతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది.
- విద్యుత్తు, మంచినీటి సరఫరాలో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది.
- పాడుబడిన, బలహీనంగా ఉన్న నిర్మాణాలకు నష్టం ఉండొచ్చు.

చేపట్టే చర్యలు

- వాతావరణ శాఖ హెచ్చరికలతో స్థానిక, రెవెన్యూ యంత్రాంగాలు అప్రమత్తమై అవసరమైన చర్యలను చేపడతాయి.
- ట్రాఫిక్ దారి మళ్లింపు, విద్యుత్తు సేవల పునరుద్ధరణ చేపడతారు.

ఆరెంజ్ వార్నింగ్

- ప్రభావం ఎక్కువగా ఉంటుంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి.
- చాలా ప్రాంతాల్లో, రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలబడుతుంది.
- చెట్లు, విద్యుత్తు స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉంటుంది. విద్యుత్తు సరఫరాకు అంతరాయాలు ఏర్పడతాయి.
- పిడుగుల ప్రభావం ఉంటుంది. చెట్ల కింద నిలబడకూడదు. ప్రజలు పక్కా నిర్మాణాల్లో తలదాచుకోవాలి.
- బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలు ఉండకూడదు.

చేపట్టే చర్యలు

- రాకపోకలను నిలిపివేయొచ్చు.
- వరదనీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు.
- అవసరమైతే విపత్తు నివారణ విభాగం సేవలను ఉపయోగించుకుంటారు.

రెడ్ ఎలర్ట్

- చాలా ఎక్కువ ప్రమాదం ఉంటుంది.
- అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయి.
- వరద నీటితో తీవ్ర అవాంతరాలు ఏర్పడతాయి.
- కొన్ని గంటల పాటు విద్యుత్తు, నీరు, ఇతర సామాజిక అవసరాలు నిలిచిపోతాయి.
- చెట్లు, వాటి కొమ్మలు విరిగిపడి ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది.

చేపట్టే చర్యలు

- చెట్లు, విద్యుత్తు స్తంభాలు పడిపోయే అవకాశం ఉండటంతో ముందుగానే అన్ని విభాగాలు అప్రమత్తమవుతాయి.
- ట్రాఫిక్‌ను నియంత్రిస్తారు. మున్సిపల్, రెవెన్యూతో పాటు విద్యుత్తు, నీటిపారుదల శాఖలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతాయి.

గంటలో కురిసే వాన తీవ్రత



తేలికపాటి వాన:	1 సెం.మీ.
మోస్తరు వర్షం:	1-2 సెం.మీ.
భారీ వర్షం:	2-5 సెం.మీ.
అతి భారీ వర్షం:	5-10 సెం.మీ.
మేఘ విస్ఫోటం (క్లౌడ్ బరస్ట్):	10 సెం.మీ.పైన

- ఈనాడు, హైదరాబాద్

ఒంటి చేత్తో విజయం!



ఆదిలాబాద్‌కు చెందిన హస్త కళాకారుడు వినోద్ విజయ్.. 15 ఏళ్లుగా ప్రతిమలు తయారు చేస్తున్నారు. నాలుగేళ్ల కిందట మట్టి విగ్రహాలు తయారు చేసేటప్పుడు ప్రమాదవశాత్తు కుడి చేతిని కోల్పోయారు. అయినా దృఢ సంకల్పంతో ఎడమ చేతితో చిన్న మట్టి కళాకృతులకు రూపునివ్వడం మొదలు పెట్టాడు. ప్రావీణ్యం సాధించి ప్రస్తుతం చిన్న, మధ్య, భారీ ప్రతిమలకు ప్రాణం పోస్తున్నారు. ఇప్పటివరకు 20 వేల విగ్రహాలు తయారు చేశానని చెబుతున్నారు. – ఈనాడు, ఆదిలాబాద్; న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

కుటుంబం @



అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉన్న వ్యాపార సంస్థలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇస్తారనే విషయం తెలిసిందే. కానీ, చెన్నైలో స్థిరపడిన సురానా కుటుంబం ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందింది. అది 21 ఏళ్ల క్రితమే. ఇప్పటికీ ఆ గుర్తింపు కొనసాగుతుండటం విశేషం. ఇందుకోసం సురానా కుటుంబ సభ్యులు ఇంట్లో నిర్వహణకు విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఐఎస్ఓ మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ పాత్రలు, బాధ్యతలు కేటాయించారు. 70 ఏళ్ల వి.ఎస్.సురానా ఇంటి అధిపతి కాగా, ఆయన సతీమణి లీలావతిని ఇంటి ప్రతినిధిగా, కోడలు లక్ష్మిని నిర్వహణాధికారిగా, కుమారుడు, మనవళ్లను శాశ్వత వినియోగదారులుగా, అతిథులను తాత్కాలిక వినియోగదారులుగా పరిగణిస్తారు. ఇంటి నిర్వహణలో అన్నీ షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి. ప్రతి ప్రక్రియకు డాక్యుమెంటేషన్ ఉంటుంది. నెలరోజుల ముందే మెనూ తయారవుతుంది. ఏ రోజు, ఏ పూట ఏం వండాలో కూడా రాతపూర్వకంగా నిర్వహిస్తారు. వంట సామగ్రి మొత్తం సర్టిఫైడ్ దుకాణాల్లోనే కొనుగోలు చేస్తారు. ప్రతి వస్తువుకూ లేబుల్ ఉండేలా చూస్తారు. పనివారు సైతం ఏ సమయంలో రావాలి? ఏం చేయాలనేది కూడా ముందే రాసిపెడతారు. [illegible] 2004లో ఐఎస్ఓ గుర్తింపు దక్కింది. కొన్నేళ్ల క్రితం 'ఐఎస్ఓ 9001:2015'గా ఉన్నతీకరించారు. ఇంట్లో జరిగే కార్యకలాపాలకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆరు నెలలకోసారి అంతర్గత ఆడిటింగ్ చేస్తుంటారు. సంస్థ ప్రతినిధులు కూడా వచ్చి తనిఖీలు చేస్తుంటారు. ఇంటి నిర్వహణలో సమీక్షలు నిర్వహించి లోటుపాట్లు సరిచేస్తారు. ఈ కుటుంబంలో పెద్దలందరూ న్యాయవాదులే కావడం కొసమెరుపు. – ఈనాడు, చెన్నై

పశువులకు వీక్లీ ఆఫ్



లాతెహార్: వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే పశువులకూ మనుషుల్లాగే వారాంతపు సెలవు (వీక్లీ ఆఫ్) అవసరమని అంటున్నారు ఝార్ఖండ్‌లోని లాతెహార్ రైతులు. ఈ మేరకు వారంలో ఒకరోజు మూగజీవాలకు విశ్రాంతి నిచ్చే ప్రత్యేక సంప్రదాయాన్ని చాలా ఏళ్లుగా వీరు అనుసరిస్తున్నారు. జిల్లా కేంద్రమైన లాతెహార్ ప్రాంత రైతుల్లో హిందువులు గురు, ఆదివారాల్లో, క్రైస్తవులు ఆదివారం, ముస్లిం రైతులు శుక్రవారం తమ పశువులకు పూర్తిగా విశ్రాంతి ఇస్తారు. ఈ ప్రాంత గ్రామాల్లో ఐదువందల ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. ఇలా వారంలో ఒకరోజు సెలవుతో రుగ్మతల నుంచి కోలుకొని పశువులు మరింత ఉత్సాహంగా పనిచేస్తాయని పశుసంవర్ధకశాఖ నిపుణులు చెబుతున్నారు. ఏటా దీపావళి ముగిసిన రెండోరోజున ఇక్కడి రైతులు పశువులను పూజించి, ప్రత్యేక వంటకాలు పెట్టడంతో పాటు వాటి వినోదం కోసం క్రీడలు నిర్వహిస్తారు.



43 మంది కలెక్టర్లు.. 22 గదులు

రెండు అంతస్తుల్లో 22 గదులతో అద్భుత నిర్మాణం.. నాటి వైభవానికి ప్రతీకగా నిలిచి సుబేదారి (కలెక్టర్) బంగ్లాగా పేరు పొందింది. హనుమకొండలోని ఈ కట్టడం 13 ఎకరాల్లో సువిశాలమైన గదులతో ఆకట్టుకుంటుంది. చుట్టూ ఎత్తైన చెట్లు, పూలమొక్కలతో ఆ ప్రాంతం నందనవనాన్ని తలపిస్తోంది. దీన్ని వారసత్వ సంపదగా భావితరాలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించి రూ.2 కోట్లతో మరమ్మతులు చేపట్టింది. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో అక్కడక్కడ దెబ్బతిన్న కట్టడానికి డంగు సున్నంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇక్కడ లైబ్రరీ, ఫుడ్‌కోర్టులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే పర్యాటకులకు అందుబాటులో తీసుకొచ్చేందుకు తీర్చిదిద్దుతున్నారు. అసఫ్‌జాహీల కాలంలో 1886లో బ్రిటీష్ అధికారి జార్జిపాల్మర్ భార్య బంగ్లా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పట్లో వరంగల్ పాలనాధికారులుగా సుబేదారులు నివాసం ఉండడం వల్ల హనుమకొండలోని ఈ ప్రాంతానికి సుబేదారి అనే పేరు వచ్చింది. నాటి నుంచి నేటి వరకు సుమారు 43 మంది కలెక్టర్లు ఈ బంగ్లాను నివాసంగా ఉపయోగించుకున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

పండ్లను వీటితో పాటు తింటే మేలు



పండ్లను ప్రొటీన్ లేదా ఆరోగ్యకరమైన కొవ్వులున్న పదార్థాలతో పాటు తింటే ఆరోగ్యానికి మరింత మేలు. ఉదాహరణకు యాపిల్, బాదంను ఒకేసారి తినండి. ఇది శరీరంలో చక్కెర శోషణ ప్రక్రియ నెమ్మదించేలా చేస్తుంది. ఫలితంగా మీకు శక్తి స్థిరంగా అందుతూ శరీరంపై జీవక్రియ సంబంధ ఒత్తిడి తగ్గుతుంది.

– క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ కోచ్

నందీశ్వరా.. నరావతారా..!



ప్రకాశం జిల్లా తర్లుపాడు మండల కేంద్రంలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అరుదైన సహస్రలింగేశ్వరుడు, మానవుని ఆకారంలో కూర్చొని నమస్కరిస్తున్న నందీశ్వరుడి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడా లేని విధంగా శ్రీకృష్ణదేవరాయల వంశస్థులు తర్లుపాడులో అరుదైన ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారని ప్రతీతి. ఒకే రాతిపై 1001 లింగేశ్వరాలను మలచడం విశేషం. మహాశివరాత్రితోపాటు కార్తికమాసంలో పెద్దసంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తుంటారు. తర్లుపాడులో ఓ స్థల పురాణం కూడా ప్రచారంలో ఉంది. శివుడే యాచకుని రూపంలో వచ్చి ఇక్కడ శివాలయం ఎక్కడ ఉందని స్థానికులను అడిగితే.. వారు లేదని చెప్పడంతో ఊరు బయట ఉన్న వనం వద్దకు వెళ్లి నాలుగు పలకరాళ్లు పెట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి వెళ్లారని గ్రామస్థులు చెబుతుంటారు. – న్యూస్‌టుడే, తర్లుపాడు





100 దేశాల ప్రతినిధులు.. 1400 జనాభా పల్లె


వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి గ్రామాన్ని దాదాపు 100 దేశాల ప్రతినిధులు సందర్శించారు. దేశంలో లక్షల పల్లెలున్నా 1400 జనాభా ఉన్న ఈ మారుమూల ఊరు అందరి దృష్టిని ఆకర్షించడానికి కారణం అక్కడి వారి ఐక్యతే. గంగదేవిపల్లి 1995లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. బాలవికాస సంస్థ దీన్ని దత్తత తీసుకుని గ్రామాభివృద్ధికి ఎంతో తోడ్పడింది. దాని చేయూతతో మూడు దశాబ్దాల కిందటే గ్రామంలో రెండు మంచినీటి ట్యాంకులు నిర్మించుకుని స్ఫూర్తిగా నిలిచారు. గ్రామంలోని ఒక్కో సమస్యకు ఒక్కో కమిటీ చొప్పున మొత్తం 26 ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా గ్రామంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించుకున్నారు. ప్రజల భాగస్వామ్యం.. వివిధ కమిటీలతో ఈ పల్లె సాధించిన విజయాలకు 2007లో కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ప్రకటించింది. 2010లో గూగుల్ సంస్థ జాతీయ స్థాయిలో ప్రకటించిన ఉత్తమ గ్రామాల్లో చోటు దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సంసద్ ఆదర్శ గ్రామ యోజనకు ఇదే స్ఫూర్తి. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన అధికారులు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు అమెరికా, చైనా, రష్యా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, శ్రీలంక, పాకిస్థాన్, కంబోడియా తదితర సుమారు వంద దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరై ఈ గ్రామాభివృద్ధిని తెలుసుకుని వెళ్లారు. –న్యూస్‌టుడే, గీసుకొండ

నవ్వితే పోయేదేం లేదు... అనారోగ్యం తప్ప!

ఒత్తిడిలో పడి కొట్టుమిట్టాడుతున్న నేటి తరానికి నవ్వు ఓ వరం. ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో దిగాలు చెందుతున్న పండుటాకులకు ఇదో దివ్యౌషధం. రోజూ 15 నిమిషాల పాటు కడుపుబ్బా నవ్వితే.... కలిగే ప్రయోజనాలు అపారం. శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ఆరోగ్యాన్ని నవ్వు మెరుగుపరుస్తుంది. మనసు నుంచి బాధ, దిగుళ్లను పటాపంచలు చేస్తుంది. ఆయుర్దాయమూ పెరుగుతుంది. నవ్వుకు ఇంత ప్రాధాన్యముంది కాబట్టే లాఫింగ్ క్లబ్బులకు అన్ని వయసుల వారు వరుస కడుతున్నారు.

పురుషులు నవ్వేది తక్కువే..

మహిళలు రోజుకు సగటున 50 నుంచి 60 సార్లు, పురుషులు 8 నుంచి 20 సార్లు మాత్రమే నవ్వుతారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే జీవితంలో మహిళల కంటే పురుషులు నవ్వేది తక్కువేనన్న మాట. నవ్వడం వల్ల డొపమైన్, ఎండార్ఫిన్ హార్మోన్‌లు ఉత్పత్తి అవుతాయి. వీటి వల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. శరీరం సేద తీరుతుంది. నిశిత దృష్టి, సృజనాత్మకత, ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. కాస్త నవ్వినా 43 ముఖ కండరాలు క్రియాశీలం అవుతాయి. ఫలితంగా ముఖంలో రక్త ప్రసరణ చురుగ్గా సాగుతుంది. చర్మం సహజంగా ప్రకాశిస్తుంది. శరీరంలో తెల్ల రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది. రోగనిరోధక శక్తి అధికమవుతుంది.. గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశాలు తగ్గుతాయి. అందుకే హాయిగా నవ్వండి.



జీవితం ఓ నాటకమైతే.. 'నవ్వు' దాని నేపథ్య సంగీతం..! పాత్రలు ఎలా ఉన్నా.. సందర్భాలు ఏవైనా.. ఓ 'చిరునవ్వు' మాత్రం.. అందరికీ ఒకే భావం కలిగిస్తుంది..! ముఖానికి అలంకారం తెస్తుంది. ఒత్తిడిని తరిమేస్తుంది. అందుకే.. మనస్ఫూర్తిగా నవ్వండి..!

నవ్వు 40 రకాలు...

నవ్వడంలో ఒకటి, రెండు రకాలు కాదండోయ్...చిరు మందహాసం నుంచి ముఖంలోని కండరాలు, నరాల్లో కదలిక వచ్చేలా బిగ్గరగా నవ్వడం వరకు 40 రకాల నవ్వులున్నాయి. వీటిలో ఎలా నవ్వినా ఆరోగ్యానికి మంచిదే. నవ్వులోని కొన్ని రకాలు ఇవిగో...

నమస్తే లాఫింగ్: నమస్కారం పెట్టి హాహాహా అంటూ నవ్వడం

మిల్క్‌షేక్ లాఫింగ్: వేడి పాలను తాగుతున్నట్టు ఊహించుకుంటూ నవ్వడం.

లయన్ లాఫింగ్: సింహంలాగా నోరు తెరుస్తూ నాలుకను బయటపెట్టి రెండు చేతుల్ని పంజా మాదిరిగా ఊపుతూ నవ్వడం.







హాట్ సూప్ లాఫింగ్: సూప్ తాగేటప్పుడు నాలుక కాలితే ఏ విధమైన అనుభూతి కలుగుతుందో అలా నవ్వడం.

ఆర్గ్యుమెంట్ లాఫింగ్ : చేతి చూపుడు వేలును చూపిస్తూ ఆర్గ్యుమెంట్ చేస్తున్నట్టు నవ్వడం.

నవ్వితే నాకేంటి: చేతులు రెండూ ముందుకు పెట్టి ఒక చెయ్యి గుప్పిట పట్టి రెండో అరచేతిపై ప్రెస్ చేస్తూ నవ్వడం.

సారీ లాఫింగ్: రెండు చేతులతో చెవులను పట్టుకుని గుంజీళ్లు తీస్తూ నవ్వడం.

ప్రయోజనాలు చాలా...

- యాంటీబాడీల ఉత్పత్తిని పెంచి ఫ్లూ జలుబు వంటి పలు వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు సహాయపడుతుంది.
- ఒంటరిగా ఉండటం, దీర్ఘకాలిక వ్యాధులు లేదా శారీరక సమస్యల వల్ల వచ్చే డిప్రెషన్‌ను తగ్గిస్తుంది.
- నవ్వు మెదడులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే భాగాలను ఉత్తేజితం చేస్తుంది. మానసికంగా చురుగ్గా ఉంచుతుంది.
- కష్ట సమయాల్లో మంచి మానసిక స్థితిని కలిగిస్తుంది. భావోద్వేగ సంతృప్తినిస్తుంది
- హాయిగా నవ్వినప్పుడు ఊపిరితిత్తులు వ్యాకోచిస్తాయి. దీంతో రక్త ప్రసరణ మెరుగవుతుంది.
- నవ్వడం వల్ల ముఖంలోని కండరాలకు వ్యాయామం లభిస్తుంది. ముఖ సౌందర్యం ఇనుమడిస్తుంది.

- ఈనాడు, అమరావతి

చక్షుతో చెప్పుకుందామా..!



మోసపూరిత కాల్స్‌పై నివేదించేందుకూ పోర్టల్

మీరు లక్కీడ్రాలో ఎంపికయ్యారంటూ సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు.. కేవైసీ అప్‌డేట్ చేయాలంటూ బ్యాంకు అధికారుల ముసుగులో ఫోన్లు.. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులకు సలహాలిస్తామంటూ వాట్సప్‌లో లింకులు.. ఈ రోజుల్లో ప్రతిఒక్కరికి సర్వసాధారణమైపోయాయి. వాటిల్లో అత్యధికం సైబర్‌నేరగాళ్లు పంపుతున్నవే. అవి మోసపూరితమైనవని గుర్తించలేక చాలామంది సైబర్‌ముఠాల చేతికి చిక్కుతున్నారు. మరికొందరు ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన లేక మిన్నకుండిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇలాంటి మోసపూరిత కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లపై బాధితులున్న చోట నుంచే ఫిర్యాదు చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్ ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. అదే 'చక్షు - రిపోర్ట్ సస్పెక్టెడ్ స్పామ్ అండ్ అన్‌సొలిసిటెడ్ కమర్షియల్ కమ్యూనికేషన్ పోర్టల్. 'సంచార్‌సాథి'లో అంతర్భాగమైన ఈ పోర్టల్‌లోకి వెళ్లి అలాంటి అనుమానిత కమ్యూనికేషన్లపై ఫిర్యాదు చేస్తే డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ల శాఖ విచారణ జరుపుతుంది. అయితే వీటిపై మూడు రోజుల్లోపే ఫిర్యాదు చేస్తే విచారణకు అవకాశముంటుంది. అలా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 34,80,823 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారు. విచారణ క్రమంలో సైబర్‌మోసగాళ్లు వినియోగించిన 1,66,033 మొబైల్ హ్యాండ్‌సెట్‌లను బ్లాక్ చేశారు.

చక్షును సంప్రదించండి ఇలా..

చక్షు పోర్టల్‌లోకి లాగిన్ అయిన తర్వాత మీడియం(కాల్/ఎస్‌ఎంఎస్/వాట్సప్)ను ఎంపిక చేసుకోవాలి. బాధితులు తమకు సందేశం ఏ రూపంలో వచ్చిందని తెలిపేందుకు ఇది దోహదం చేస్తుంది.

- అలాగే కేవైసీంక్/ఫేక్ కస్టమర్‌కేర్.. ఇలా ఏ కేటగిరీ కింద సందేశం వచ్చిందో వెల్లడించాలి. ఆ సందేశానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఎటాచ్ చేయాలి.
- సందేశం వచ్చిన తేదీ, సమయం పేర్కొనాలి. అలాగే ఫిర్యాదు వివరాలను సంక్షిప్తంగా పేర్కొనాలి.
- బాధితుడి పేరు, ఫోన్‌నంబర్‌ను నమోదు చేసిన అనంతరం వెరిఫికేషన్ కోసం వచ్చిన ఓటీపీని సబ్మిట్ చేస్తే సరిపోతుంది.

- ఈనాడు, హైదరాబాద్

180 దేశాలు.. 1100 రకాల కరెన్సీ



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్‌కు వివిధ దేశాల కరెన్సీ నోట్లు, నాణేలు సేకరించడం అలవాటు. ఆయన కరీంనగర్‌లో ట్రాన్స్‌కో ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. తన పదేళ్ల వయసులో తండ్రి మునీందర్ ఇచ్చిన శివాజీ బొమ్మ ఉన్న రూ.2 నాణెంతో కరెన్సీ సేకరణపై ఆసక్తి కనబరిచారు. 20 ఏళ్లలో 180 దేశాలకు చెందిన 1100 రకాల నాణేలు, కరెన్సీ నోట్లు సేకరించారు. కనుమరుగైన 30 దేశాలకు చెందిన కరెన్సీ కూడా ఈయన వద్ద ఉన్నాయి. ఈస్టిండియాకు చెందిన 1835 నాటి కరెన్సీని కూడా సేకరించారు. రాజుల కాలం, బ్రిటీష్ పాలననాటి నాణేలూ ఉన్నాయి. నుమిస్టా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా బెల్జియంకు చెందిన స్నేహితుడు పరిచయమై 60 దేశాల కరెన్సీ సేకరించారు. ఇటాలియన్‌కు చెందిన వ్యక్తిని పరిచయం చేసుకొని మరికొన్ని దేశాల కరెన్సీ సేకరించినట్లు నవీన్‌కుమార్ తెలిపారు. ఎప్పటికైనా గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించడమే లక్ష్యమని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, గంగాధర


ఆ గ్రామాల పేర్లు ఎంతో గమ్మత్తు!

గిరిజన ప్రాంతాల్లో వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు విభిన్నంగా ఉన్నట్లే అక్కడి గ్రామాల పేర్లు అంతే ప్రత్యేకంగా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట గిరిజన ప్రాంతంలో.. వన్యమృగాలు, పండ్ల చెట్లు, నాణేలు, మూగజీవాల పేర్లతో పలు గ్రామాలు వెలిశాయి. పూర్వీకులు పెట్టిన పేర్లే ప్రస్తుతం కొనసాగుతున్నాయి.


- పులిపుట్టి గ్రామంలో అప్పట్లో పులులు అధికంగా సంచరించేవి. పర్లాఖెముండి గజపతి రాజు కుటుంబీకులు ఇక్కడికి వేటకు వచ్చేవారట. గ్రామం పరిసరాల్లో పులులు తిరగడంతో పెద్దలు దీనికి పులిపుట్టిగా నామకరణం చేశారని చెబుతారు.
- వనసగూడ గ్రామంలో పూర్వకాలంలో పెద్ద పనస చెట్టు ఉండేది. దానికి ఆనుకుని గిరిజనులు ఇళ్లు నిర్మించుకున్నారు. చెట్టు పడిపోయినా పేరు మాత్రం నిలబడింది. జామితోట పేరులోనూ అలాంటి చరిత్రే ఉంది. ఇప్పగూడ చుట్టూ పెద్ద ఇప్ప(విప్ప) చెట్లు ఉండేవి.
- గ్రామాల్లో ఎక్కువగా చింత చెట్లు ఉంటే చింతలగూడ, చింతమానుగూడ, ఈత చెట్లు ఉంటే ఈతమానుగూడ, నేరేడు చెట్లు ఉంటే నేరేడుమానుగూడ, రేగు చెట్లు ఉంటే రేగులగూడ, రేగుమానుగూడలు.. ఇలా ఏ చెట్లు ఉంటే ఆ పేరునే గ్రామాలకు పెట్టారు.
- సీతంపేట మండలం మేకవ, రూపాయి గ్రామాల చరిత్ర ఆసక్తికరం. రూపాయి గ్రామస్థుల వద్ద అప్పట్లో ఎక్కువగా రూపాయి కాసులు(నాణేలు) ఉండేవట. పక్కనే ఉన్న మేకవలో మేకలు అధికంగా ఉండేవట.
- గ్రామాల్లో పెద్దలు ఎవరైనా ఉన్నా, ఓ వ్యక్తి తొలుత నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి స్థిర నివాసం ఏర్పర్చుకున్నా వారి పేర్లతో కొన్ని పల్లెలు ఏర్పడ్డాయి. ఎల్లంగుగూడ, బుడ్డడుగూడ, మాసడుగూడ, లక్కాయిగూడ, సుందరయ్యగూడ, జమ్మడుగూడ, సన్నాయిగూడ ఇలా వచ్చినవే.

– న్యూస్‌టుడే, సీతంపేట





నాడు బిచ్చగాళ్లు నేడు ట్యాక్స్ పేయర్స్



వారణాసిలో వ్యాపార శిక్షణ ఇచ్చిన తర్వాత బిచ్చగాళ్లు యాచన మానేసి, ఇతరులకు ఉపాధి కల్పిస్తూ జీఎస్టీ చెల్లింపుదారులుగా మారారని కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ చెప్పారు. వారణాసి, ఇండోర్ నగరాల్లో బిచ్చగాళ్ల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలతో చాలా మార్పు వచ్చిందన్నారు. బెగ్గర్స్ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు డా.చంద్ర మిశ్ర రచించిన 'ది లాస్ట్ బెగ్గర్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఈ విషయాలు చెప్పారు. –దిల్లీ

పాత మెయిళ్లు తీసేస్తే.. నీటిని పొదుపు చేసినట్లే


పాత ఈ-మెయిళ్లకు, నీటి ఎద్దడికి మధ్య మోకాలికీ బోడిగుండుకూ ఉన్న సంబంధమే ఉందనుకుంటే పొరపాటే. ఎందుకంటే బ్రిటన్‌లో పాత ఈ మెయిళ్లు, ఫొటోలను భద్రపర్చేందుకు క్లౌడ్ వ్యవస్థను వాడుతున్నారు. ఇందుకోసం అవసరమైన భారీ డేటా సెంటర్లలో సిస్టమ్స్‌ను చల్లబర్చేందుకు రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీటిని వాడతారు. ఆ నీరు 10,000 నుంచి 50,000 జనాభా ఉన్న పట్టణానికి సరిపోతుంది. ప్రస్తుతం బ్రిటన్‌లోని పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంది. ప్రభుత్వం జారీ చేసిన కొన్ని మార్గదర్శకాల్లో పాత ఈ-మెయిల్స్, ఫొటోలు డిలీట్ చేయాలనేది కూడా ఒకటి. –ఇంటర్నెట్ డెస్క్

2030 కామన్వెల్త్ క్రీడల బిడ్‌కు ఐఓఏ ఆమోదం

దిల్లీ: 2030 కామన్వెల్త్ క్రీడల కోసం దేశం తరపున బిడ్ వేసేందుకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వ సభ్య సమావేశం (ఎస్‌జీఎం)లో ఐఓఏ కార్యవర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ క్రీడలు నిర్వహించేందుకు ఇప్పటికే భారత్ ఆసక్తి ప్రదర్శించింది. అయితే ఈ నెల 31 లోపు దేశం తరపున అధికారికంగా బిడ్‌ను దాఖలు చేసేందుకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఐఓఏ అందుకు ఆమోదం తెలిపింది. అహ్మదాబాద్‌తో పాటు దిల్లీ, భువనేశ్వర్ నగరాలను సైతం కామన్వెల్త్ క్రీడల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయాలుగా పరిగణిస్తున్నట్లు ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపారు. ''మేమందరం కలిసి ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. మా సన్నాహాలు కొనసాగుతాయి. అహ్మదాబాద్‌ను మాత్రమే ఆతిథ్య నగరంగా భావించట్లేదు. భువనేశ్వర్, దిల్లీల్లోనూ మెరుగైన సౌకర్యాలున్నాయి. క్రీడలు ఎక్కడ జరుగుతాయో త్వరలో వెల్లడిస్తాం. 2026 కామన్వెల్త్ గేమ్ పరిధి తగ్గించారు. కానీ 2030లో మేం 2010లో మాదిరిగానే పూర్తి స్థాయిలో నిర్వహించాలనుకుంటున్నాం'' అని ఉష పేర్కొంది. భారత్‌కు ఎక్కువ పతకాలు వచ్చే అవకాశమున్న షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ లాంటి ఆటలతో పాటు కబడ్డీ, ఖోఖో, యోగా లాంటి మన సంప్రదాయ క్రీడలనూ కామన్వెల్త్‌లో చేర్చేందుకు ప్రయత్నిసామని ఐఓఏ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ చౌబే తెలిపాడు.

ఛాంపియన్


గుల్వీర్.. రికార్డుల వేట


గుల్వీర్ సింగ్

దిల్లీ: భారత సుదీర్ఘ పరుగు వీరుడు గుల్వీర్ సింగ్.. జాతీయ రికార్డుల వేటలో దూసుకెళ్తున్నాడు. 3000 మీటర్ల పరుగులో అతను తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. బుడాపెస్ట్‌లో జరిగిన హంగేరియన్ అథ్లెటిక్స్ గ్రాండ్‌ప్రిలో గుల్వీర్ 3 వేల మీటర్ల రేసును 7 నిమిషాల 34.49 సెకన్లలో పూర్తి చేసి అయిదో స్థానంలో నిలిచాడు. కెన్యా అథ్లెట్ కిప్సాంగ్ మాథ్యూ (7:33.23 సె) విజేతగా నిలిచిన ఈ రేసులో.. హెరీరా (7:33.58-మెక్సికో), ఆస్కార్ చెలిమో (7:33.93) తర్వాతి రెండు స్థానాలు సాధించారు. 27 ఏళ్ల గుల్వీర్ గత రికార్డు 7 నిమిషాల 38.26 సెకన్లు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బోస్టన్ యూనివర్సిటీ మీట్‌లో అతను ఆ టైమింగ్ నమోదు చేశాడు. గుల్వీర్ పేరిట మరో రెండు జాతీయ రికార్డులుండడం విశేషం. అతను 5 వేల మీటర్ల పరుగులో 12 నిమిషాల 59.77 సెకన్లతో, 10 వేల మీటర్ల పరుగులో 27 నిమిషాల 0.22 సెకన్లతో రికార్డులు నెలకొల్పాడు. మేలో జరిగిన కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు సాధిస్తూ ఈ రికార్డులు సాధించాడు. 5 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ ఈ ఏడాది సెప్టెంబరులో టోక్యో వేదికగా జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు.

భారత షట్లర్లకు కఠిన డ్రా

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్


సింధు

పారిస్: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులకు కఠిన డ్రా పడింది. ఈ నెల 25న ఆరంభమయ్యే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ షి యు క్వి (చైనా)ని ఢీకొనబోతున్నాడు. షియుతో ఇప్పటిదాకా నాలుగుసార్లు తలపడ్డ లక్ష్యసేన్ ఒక్కసారి మాత్రమే గెలిచాడు. మూడు మ్యాచ్‌లు ఓడాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ లాంటి టోర్నీలో నంబర్‌వన్ ఆటగాడిని లక్ష్యసేన్ దాటి ముందంజ వేస్తే పతకం సాధించే అవకాశాలున్నట్లే. హెచ్.ఎస్.ప్రణయ్ తొలి రౌండ్లో జోకిమ్ ఓల్డ్‌రాఫ్ రూపంలో తేలికైనా ప్రత్యర్థితోనే తలపడనున్నప్పటికీ.. రెండో రౌండ్లో ప్రపంచ నంబర్.2 ఆంటోన్సెన్ (డెన్మార్క్) ఎదురయ్యే ఆస్కారముంది. మహిళల సింగిల్స్‌లో సింధుకు కూడా తొలి రౌండు తేలికే. ప్రపంచ నం.66 కలోయానా (బల్గేరియా)ను ఢీకొనబోతున్న సింధు.. అందులో గెలిస్తే రెండో రౌండ్లో ప్రపంచ నంబర్ 2 వాంగ్ జి (చైనా)తో సవాలు తప్పకపోవచ్చు. ప్రస్తుతం 15వ ర్యాంకులో ఉన్న సింధు పేలవ ఫామ్‌తో సతమతమవుతోంది. గత ఏడాది కాలంలో పలు టోర్నీల్లో ఆమె ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు మాత్రం మెరుగైన డ్రా పడింది. ఈ జంటకు తొలి రౌండ్లో బై లభించింది. రెండో రౌండ్లో సాత్విక్, చిరాగ్.. భారత్‌కే చెందిన హరిహరన్-రుబెన్ కుమార్ లేదా లియు కువాంగ్-యాంగ్ హాన్ (చైనీస్ తైపీ) ద్వయాన్ని ఢీకొనవచ్చు.


లక్ష్యసేన్

టీ20 పగ్గాలూ గిల్‌కే ఇస్తే..!


గిల్

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా లాంటి క్రికెట్ జట్లకు వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు కెప్టెన్లను నియమించడం మామూలే. ఈ పద్ధతిలో ఆ జట్లు మంచి ఫలితాలూ రాబడుతుంటాయి. కానీ టీమ్ఇండియా మాత్రం భిన్న కెప్టెన్ల విధానాన్ని పెద్దగా ప్రయత్నించింది లేదు. గతంలో టెస్టులు, వన్డేలు మాత్రమే ఉన్నపుడు ఆ రెండు ఫార్మాట్లకూ ఒకే కెప్టెన్ ఉండేవాడు. టీ20ల రూపంలో మరో ఫార్మాట్ తోడైనప్పటికీ.. ఎక్కువ శాతం మూడు ఫార్మాట్లకూ ఒకే కెప్టెన్‌ను కొనసాగించారు. ముందుగా ధోని, తర్వాత కోహ్లి, ఆపై రోహిత్.. ఈ బాధ్యతలను మెరుగ్గానే నిర్వర్తించారు. అయితే రోహిత్ ముందుగా టీ20లకు, ఆ తర్వాత టెస్టులకు గుడ్‌బై చెప్పడంతో ఆ ఫార్మాట్లకు కొత్త కెప్టెన్లు వచ్చారు. పొట్టి క్రికెట్లో సారథ్యాన్ని సూర్యకుమార్ యాదవ్ చేపడితే.. సుదీర్ఘ ఫార్మాట్లో గిల్ నాయకుడయ్యాడు. రోహిత్ వన్డేలకు మాత్రం కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఇలా భారత జట్టుకు మూడు ఫార్మాట్లలో ముగ్గురు కెప్టెన్లు ఉండడం అరుదైన విషయమే. అయితే ఈ విషయంలో సెలక్టర్లు అంత సుముఖంగా లేరని తెలుస్తోంది. మూడు ఫార్మాట్లకు ఒకే కెప్టెన్ ఉంటేనే భారత క్రికెట్‌కు అనుకూలంగా ఉంటుందన్న ఆలోచనతో సెలక్టర్లు ఉన్నట్లు సమాచారం. ఎన్నో అనుమానాల మధ్య టెస్టు సారథ్యం చేపట్టిన గిల్.. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో బ్యాటర్‌గా గొప్పగా రాణించాడు. కెప్టెన్‌గానూ తనదైన ముద్ర వేశాడు. 2-2తో సిరీస్‌లో అంచనాలను మించిన ఫలితం రాబట్టాడు. దీంతో అతడి కెప్టెన్సీపై సెలక్టర్లకు మరింత గురి కుదిరింది. ముఖ్యంగా గిల్‌ను సారథిగా నియమించడంలో కీలక పాత్ర పోషించిన చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్.. అతణ్ని మూడు ఫార్మాట్ల కెప్టెన్‌గా చూడాలనుకుంటున్నాడట. రోహిత్ ఉన్నంత కాలం అతనే వన్డే జట్టు కెప్టెన్‌గా కొనసాగుతాడు. కానీ అతడికి ఇప్పటికే 38 ఏళ్లు నిండాయి. కెరీర్ చరమాంకంలో ఉన్న హిట్‌మ్యాన్ ఇంకెంతో కాలం అంతర్జాతీయ క్రికెట్లో కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. అతను గుడ్‌బై చెబితే.. వన్డే సారథ్యం గిల్ చేతికి రావడం లాంఛనమే. మరోవైపు టీ20 సారథ్యాన్ని కూడా గిల్‌కే అప్పగించడంపైనా ఇప్పుడు సెలక్టర్లు చర్చలు జరుపుతున్నారట. గిల్ ఐపీఎల్‌లోనూ కెప్టెన్‌గా రుజువు చేసుకున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్లో రాణించలేడని దానికి కారణాలు కనిపించడం లేదు. సూర్యకుమార్ కెప్టెన్‌గా మెరుగైన ఫలితాలే రాబట్టినప్పటికీ.. అతడికి 34 ఏళ్లు వచ్చేశాయి. పొట్టి క్రికెట్లో ఓ యువ కెప్టెన్ ఉంటేనే బాగుంటుందనే వాదనా ఉంది. పైగా మూడు ఫార్మాట్లకూ ఒకే కెప్టెన్ ఉంటే బాగుంటుందనే అభిప్రాయాలూ బలంగా వినిపిస్తున్నాయి. భారత్ చివరగా ఆడిన కొన్ని టీ20 సిరీస్‌లకు గిల్ జట్టులో లేడు. అతణ్ని టెస్టులు, వన్డేల్లోనే కీలక ఆటగాడిగా సెలక్టర్లు పరిగణించారు. కానీ ఐపీఎల్‌లో పరుగుల వరద పారించడం, టెస్టుల్లో కెప్టెన్‌గా రుజువు చేసుకోవడంతో టీ20 జట్టులోకి కూడా ఎంపిక చేసి త్వరలోనే కెప్టెన్‌ను చేద్దామనే యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. భారత్ వచ్చే నెలలో ఆసియా కప్ టీ20 టోర్నీలో ఆడబోతోంది. ఆ జట్టులో గిల్ చోటు దక్కించుకోవడం ఖాయం. ఇప్పుడే కెప్టెన్‌ను చేయకపోయినా.. త్వరలోనే ఈ ఫార్మాట్లోనూ అతడికి జట్టు బాధ్యతలు అప్పగిస్తే ఆశ్చర్యమేమీ లేదు.

– ఈనాడు క్రీడావిభాగం

రెండో స్థానానికి రోహిత్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్


రోహిత్

దుబాయ్: ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ రెండో స్థానానికి ఎగబాకాడు. 38 ఏళ్ల రోహిత్ 2025 ఐపీఎల్ సీజన్ తర్వాత మళ్లీ క్రికెట్ ఆడలేదు. రెండో స్థానంలోని బాబర్ అజామ్ వరుస వైఫల్యాలతో మూడో స్థానానికి పడటంతో.. రోహిత్ రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. శుభ్‌మన్ గిల్ నంబర్‌వన్ వన్డే బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి నాలుగో ర్యాంకులో ఉన్నాడు. శ్రేయస్ 8, రాహుల్ 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో కుల్‌దీప్ యాదవ్ రెండో స్థానంలో నిలిచాడు. జడేజా 9వ స్థానంలో ఉన్నాడు. తీక్షణ (శ్రీలంక) నంబర్‌వన్ వన్డే బౌలర్‌గా కొనసాగుతున్నాడు. టీ20 బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్‌కు ఆరో ర్యాంకు దక్కింది. జైస్వాల్ 11వ స్థానంలో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి రవి బిష్ణోయ్ (7వ), అర్ష్‌దీప్ సింగ్ (9వ) టాప్-10లో ఉన్నారు. డఫీ (న్యూజిలాండ్) నంబర్‌వన్ టీ20 బౌలర్.

తిరువనంతపురంలో మహిళల ప్రపంచకప్ మ్యాచ్‌లు!


కొచ్చిన్: వచ్చే మహిళల వన్డే ప్రపంచకప్‌లో కొన్ని మ్యాచ్‌లకు తిరువనంతపురం ఆతిథ్యమిచ్చే అవకాశముంది. ఈ మేరకు ఐసీసీతో చర్చలు జరుగుతున్నాయని కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) అధ్యక్షుడు జయేశ్ చెప్పాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఆతిథ్య హక్కులు కోల్పోవడం తిరువనంతపురానికి కలిసొచ్చింది. షెడ్యూలు ప్రకారం ఫైనల్ సహా నాలుగు మ్యాచ్‌లకు చిన్నస్వామి ఆతిథ్యమివ్వాల్సింది. కానీ జూన్ 4న ఆర్సీబీ ఐపీఎల్ గెలుపు సంబరాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంతో కర్ణాటక ప్రభుత్వం ఆ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఇటీవల చిన్నస్వామిలో కేఎస్‌సీఏ మహారాజా టీ20 ట్రోఫీ నిర్వహణకు కూడా అనుమతి లభించలేదు. దాంతో ఆ టోర్నీని మైసూరుకు తరలించారు. మహిళల ప్రపంచకప్ సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరగనుంది.

ఇంగ్లాండ్ పిచ్‌లు ఇక్కడిలానే..


ఆకాశ్‌దీప్

దిల్లీ: తన మీద తన కంటే కోచ్ గౌతమ్ గంభీర్‌కే ఎక్కువ నమ్మకమని టీమ్ఇండియా యువ ఫాస్ట్‌బౌలర్ ఆకాశ్‌దీప్ అన్నాడు. ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో పది వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఆకాశ్‌దీప్.. ఈ పర్యటనలో తాను విజయవంతం కావడంలో గంభీర్ పాత్ర ఎంతో ఉందన్నాడు. ''గంభీర్ ఎంతో తపన ఉన్న కోచ్. మాలో ఎప్పుడూ స్ఫూర్తి నింపుతుంటాడు. నా మీద నాకున్న నమ్మకం కంటే తనకే ఎక్కువ. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ నన్ను నమ్ముతాడు. 'నువ్వు సాధించగలవు. ఎప్పుడూ ఇదే అంకిత భావంతో ఆడు' అని నాతో అంటుంటాడు'' అని ఆకాశ్‌దీప్ చెప్పాడు. రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉండగా టెస్టు జట్టులోకి వచ్చిన ఆకాశ్‌దీప్.. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్ సారథ్యంలో ఆడుతున్నాడు. కానీ కెప్టెన్ మారినప్పటికీ జట్టులో వాతావరణం అలాగే ఉందని ఆకాశ్‌దీప్ చెప్పాడు. ''శుభ్‌మన్ మెరుగైన కెప్టెన్. సారథ్యం అతడికి కొత్తలా అనిపించలేదు. ఐపీఎల్‌లో రెండు సీజన్లు జట్టును నడిపించాడు. ఆ అనుభవం పనికొస్తోంది. శుభ్‌మన్ సారథ్యంలో గత ఏడాది దులీప్ ట్రోఫీ ఆడాను. కాబట్టి ఇప్పుడు కొత్తగా అనిపించలేదు. అతను ఎంతో మద్దతుగా ఉంటాడు. అలాంటి మద్దతుంటే అన్నీ బాగానే సాగుతాయి'' అని ఆకాశ్‌దీప్ అన్నాడు. ఇంగ్లాండ్‌లో పిచ్‌లు ఈసారి భిన్నంగా స్పందించాయని.. భారత్‌లో ఆడుతున్నట్లే అనిపించిందని ఈ బెంగాల్ పేసర్ చెప్పాడు. ''ఆస్ట్రేలియాలో బంతి బాగా బౌన్స్ అయింది. అందుకు తగ్గట్లు బంతులేశాం. అయితే ఇంగ్లాండ్‌లో పిచ్‌లు మేం ఎన్నో ఏళ్ల నుంచి విన్న, చూసిన తరహాలో లేవు. ఎక్కువసార్లు బంతి స్వింగ్, సీమ్‌కు అనుకూలంగా లేదు. దీంతో భారత్‌లో పిచ్‌లపై ఎలాంటి లెంగ్త్‌ల్లో బౌలింగ్ చేస్తామో అలా ప్రయత్నించాం. ఆ మేరకు సర్దుబాటు చేసుకోవడం కలిసొచ్చింది'' అని ఆకాశ్‌దీప్ చెప్పాడు.

రెజ్లర్ సుశీల్ బెయిల్ రద్దు


సుశీల్ కుమార్

దిల్లీ: మాజీ జూనియర్ జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్ సాగర్ ధన్‌కడ్ హత్య కేసులో ఒలింపిక్ పతక విజేత సుశీల్ కుమార్ బెయిల్‌ను సుప్రీం కోర్టు బుధవారం రద్దు చేసింది. వారం లోపు లొంగిపోవాలని అతణ్ని ఆదేశించింది. సుశీల్, ఇతరులు దాడి చేయడం వల్ల సాగర్ చనిపోయాడన్నది అభియోగం. 2021 మేలో ఈ ఘటన జరిగింది. మే 23న సుశీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఏడాది మార్చి 4న దిల్లీ హైకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. సాగర్ తండ్రి దీన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశాడు. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు సుశీల్‌కు బెయిల్ మంజూరు చేయడం తప్పని పేర్కొంది. అతడు కేసు విచారణను ఆలస్యం చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని అభిప్రాయపడింది.

జమీల్ పదవీకాలం రెండేళ్లు


ఖాలిద్ జమీల్

దిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు పూర్తి స్థాయి కోచ్‌గా ఖాలిద్ జమీల్ బాధ్యతలు స్వీకరించాడని, అతడు రెండేళ్ల పదవిలో ఉంటాడని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) తెలిపింది. అతడు ఒప్పందంపై సంతకం చేశాడని చెప్పింది. జమీల్ ఈ నెల 15న బెంగళూరులోని ద్రవిడ్-పదుకొనె సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో తన తొలి శిబిరాన్ని మొదలు పెడతాడు. నేషన్స్ కప్‌లో ఈ నెల 29న తజికిస్థాన్‌తో భారత్ పోరే కోచ్‌గా జమీల్‌కు తొలి మ్యాచ్. భారత జట్టు అక్టోబరులో సింగపూర్‌తో రెండు ఏఎఫ్‌సీ ఆసియాకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఆడుతుంది. ''చాలా గర్వంగా ఉంది. జాతీయ జట్టు కోచ్‌గా నాకు బాధ్యతలు అప్పగించడాన్ని గౌరవంగా భావిస్తున్నా'' అని జమీల్ అన్నాడు.

మెరిసిన యాస్తిక, రాధ

ఆస్ట్రేలియా-ఎపై భారత్-ఎ విజయం


యాస్తిక

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా-ఎతో మహిళల వన్డే సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట ఆస్ట్రేలియా-ఎ 47.5 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది. రాధ (3/45), మిన్ను మణి (2/38), తితాస్ సాధు (2/37) ఆతిథ్య జట్టును దెబ్బతీశారు. అనిక (92 నాటౌట్) టాప్ స్కోరర్. రేచల్ (51) రాణించింది. యాస్తిక భాటియా (59) మెరవడంతో లక్ష్యాన్ని భారత్ 42 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. షెఫాలి వర్మ (36), ధార గుజ్జర్ (31) రాణించారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్-ఎ 1-0 ఆధిక్యం సంపాదించింది.

ఆఖరి వన్డేలో పాకిస్థాన్ చిత్తు

సిరీస్ 2-1తో విండీస్ వశం


షై హోప్ 120

తరౌబా: వెస్టిండీస్ అదరగొట్టింది. చివరిదైన మూడో వన్డేలో 202 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. కెప్టెన్ షై హోప్ (120) సెంచరీ బాదడంతో మొదట వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి 294 పరుగులు సాధించింది. గ్రీవ్స్ (43 నాటౌట్), రోస్టన్ ఛేజ్ (36), లూయిస్ (37) రాణించారు. ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. జేడెన్ (6/18) విజృంభించడంతో 29.2 ఓవర్లలో 92 పరుగులకే కుప్పకూలింది. ముగ్గురు పాకిస్థాన్ బ్యాటర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. అయిదుగురు డకౌటయ్యారు. సల్మాన్ ఆఘా (30) టాప్ స్కోరర్. 1991 తర్వాత పాకిస్థాన్‌పై వన్డే ద్వైపాక్షిక సిరీస్ గెలవడం వెస్టిండీస్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

బుచ్చిబాబు టోర్నీకి హైదరాబాద్ జట్టిదే

హైదరాబాద్: బుచ్చిబాబు రెండు రోజుల టోర్నమెంట్లో పోటీ పడే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యుల జట్టుకు రాహుల్ సింగ్ నాయకత్వం వహిస్తాడు. హిమతేజ వైస్ కెప్టెన్. బుచ్చిబాబు టోర్నీ ఈ నెల 18న చెన్నైలో మొదలవుతుంది.

హైదరాబాద్ జట్టు: రాహుల్ సింగ్ (కెప్టెన్), హిమతేజ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, రోహిత్ రాయుడు, అభిరత్ రెడ్డి, నితీశ్ రెడ్డి, వరుణ్ గౌడ్, అవినాశ్ రావు, రాహుల్ రాదేశ్, అనికేత్ రెడ్డి, రవితేజ, నిశాంత్, ఆశిష్ శ్రీవాత్సవ, పృథ్వీ రెడ్డి.

స్టాండ్ బైస్: అమన్‌రావు, నితేశ్ రెడ్డి, సాయి ప్రజ్ఞయ్ రెడ్డి, నితిన్ సాయి యాదవ్, కార్తికేయ, అర్ఫాజ్ అహ్మద్.

అయిదో స్థానంలో గుకేశ్

సెయింట్ లూయిస్: సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్లో ర్యాపిడ్ విభాగంలో ఆరు గేమ్‌లు ముగిసే సరికి ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ సంయుక్తంగా అయిదో స్థానంలో ఉన్నాడు. నాలుగో రౌండ్లో సామ్ షంక్‌లాండ్ (అమెరికా) చేతిలో అనూహ్యంగా ఓడిన గుకేశ్.. తర్వాతి రెండు గేమ్‌లను డ్రాగా ముగించాడు. లాగ్రేవ్ (ఫ్రాన్స్), అబ్దుసతరోవ్ (ఉజ్బెకిస్థాన్)లను అతడు నిలువరించాడు. మరో మూడు రౌండ్లు మిగిలి ఉండగా.. 10 పాయింట్లతో కరువానా (అమెరికా) అగ్రస్థానంలో ఉన్నాడు. అరోనియన్ (8, అమెరికా) రెండో స్థానంలో నిలిచాడు. గుకేశ్, డొమింగెజ్ పెరెరా (అమెరికా) ఆరేసి పాయింట్లతో ఉన్నారు.

యూపీ యోధాస్ కెప్టెన్‌గా సుమిత్


సుమిత్ సంగ్వాన్

దిల్లీ: ప్రో కబడ్డీ లీగ్ సీజన్ 12లో పోటీ పడే యూపీ యోధాస్ జట్టుకు స్టార్ డిఫెండర్ సుమిత్ సంగ్వాన్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. అశు సింగ్ ఉపసారథి. మరోవైపు తమిళ్ తలైవాస్‌కు పవన్ సెహ్రావత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అంకిత్ జగ్లాన్‌కు పట్నా పైరేట్స్ సారథ్య బాధ్యతలు దక్కాయి. పీకేఎల్ ఈ నెల 29న ఆరంభం కానుంది.

విదిత్‌కు కార్తికేయన్ షాక్

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ ఏడో రౌండ్లో విదిత్ గుజరాతికి కార్తికేయన్ షాకిచ్చాడు. నల్లపావులతో కార్తికేయన్ పైచేయి సాధించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో గేమ్‌ను అర్జున్ ఇరిగేశి డ్రాగా ముగించగా.. రే రాబ్సన్ (అమెరికా)ను నిహాల్ సరీన్ ఓడించాడు. జోర్డెన్ (నెదర్లాండ్స్), ప్రణవ్ పాయింట్ పంచుకున్నారు. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్ టైటిల్‌కు మరింత చేరువయ్యాడు. ఏడో రౌండ్లో అతడు లియాంగ్ (అమెరికా)పై గెలిచాడు. 5.5 పాయింట్లతో కీమర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అర్జున్, కార్తికేయన్ చెరో నాలుగు పాయింట్లతో ఆ తర్వాత ఉన్నారు. ఛాలెంజర్స్ విభాగంలో పర్ణేశ్ (5.5), ల్యూక్ మెండోంకా (5.5) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. ఏడో రౌండ్లో వైశాలిపై పర్ణేశ్, దిప్తాయన్‌పై ల్యూక్ గెలిచారు. హర్షవర్ధన్ చేతిలో ద్రోణవల్లి హారిక ఓడిపోయింది. ఇనియన్-అధిబన్, ఆర్యన్-అభిమన్యు గేమ్‌లు డ్రాగా ముగిశాయి.

జగన్‌కు మోదీపై పోరాడే దమ్ముందా?

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ సవాల్

ఈనాడు, దిల్లీ: వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మోదీ, అమిత్ షాల ఓట్ చోరీకి వ్యతిరేకంగా పోరాడే దమ్ముంటే గురువారం సాయంత్రం విజయవాడలో వైఎస్ షర్మిల నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ సవాలు విసిరారు. ఓట్ల చోరీ విషయంలో రాహుల్‌గాంధీపై జగన్ వ్యాఖ్యలకు స్పందిస్తూ ఆయన బుధవారం ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. "ఓట్ చోరీ విషయంలో రాహుల్ గాంధీ కేవలం కాంగ్రెస్ కోసమే పోరాడట్లేదన్న విషయాన్ని జగన్ గమనించాలి. ఆయన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్నారు. జగన్‌లా.. రాహుల్ మోదీకి భయపడటం లేదు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారు. బిహార్‌లో ఎస్ఐఆర్ సమస్య తెరమీదికి వచ్చింది. ప్రజల ఓటు హక్కును రక్షించేందుకు రాహుల్‌గాంధీ త్వరలో బిహార్‌లో యాత్ర చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. ఆయన చేస్తున్న పనిని గుర్తించాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది. వాస్తవాలను పక్కనపెట్టి తన సొంత కథనాలు వినిపించడం మానుకుంటే మంచిది. మోదీ, బాబు, పవన్, జగన్ అంతా ఒక్కటే అని మాకు తెలుసు. ప్రజాస్వామ్యంపై మోదీ, అమిత్ షాల దాడికి వ్యతిరేకంగా పోరాడి జగన్ తన దమ్ము నిరూపించుకుంటారని ఆశిస్తున్నాను" అని మాణికం ఠాగూర్ పేర్కొన్నారు.

మరోసారి విచారణకు హాజరుకండి

ఆర్జీవీకి ప్రకాశం పోలీసుల నోటీసులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా పోలీసులు నోటీసులు జారీచేశారు. మద్దిపాడు స్టేషన్‌లో నమోదైన కేసులో ఒంగోలు గ్రామీణ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు... మంగళవారం ఆయనను 11 గంటల పాటు విచారించారు. అనంతరం ష్యూరిటీ బాండ్లతో బెయిల్ మంజూరుచేశారు. ఈ నెలాఖరులోపు మరోసారి విచారణకు రావాలని నోటీసులిచ్చారు. తేదీ ఎప్పుడనేది తర్వాత తెలియజేస్తామన్నారు.

ఇద్దరి పేర్ల వెల్లడి: వ్యూహం సినిమా ప్రమోషన్ సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఎక్స్‌లో చేసిన పోస్టులే వర్మను పోలీసుస్టేషన్ మెట్లెక్కించాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ల మార్ఫింగ్ ఫొటోలు ఎవరు రూపొందించారు, ఎవరి ప్రమేయంతో వాటిని పోస్టు చేశారన్న కోణంలో పోలీసులు ప్రశ్నించారు. తనకు ఇద్దరు సహకరించారంటూ వారి పేర్లను వర్మ వెల్లడించారు. వ్యూహం సినిమా రూపకల్పనపైనా పోలీసులు దృష్టి సారించారు. నిర్మాత, బడ్జెట్ వివరాలు ఆరా తీశారు. తన సామాజిక మాధ్యమాల ఖాతాలనూ సహాయకులు పర్యవేక్షిస్తుంటారని వర్మ చెప్పడంతో... వారు వినియోగించిన పరికరాలపై దృష్టి సారించారు. వర్మ సహాయకులను త్వరలోనే ప్రశ్నించనున్నట్లు తెలిసింది.

జిల్లా, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పుపై..

క్షేత్ర పర్యటనకు మంత్రివర్గ ఉపసంఘం

- 29, 30 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సమావేశాలు
- సెప్టెంబరు 15న ప్రభుత్వానికి నివేదిక

ఈనాడు, అమరావతి: జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు.. వాటి పేర్ల మార్పుతో పాటు కొత్తవాటి ఏర్పాటుపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఈ నెల 29, 30 తేదీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించనుంది. అక్కడి కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో చర్చించి, ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించనుంది. మంత్రివర్గ ఉపసంఘంలోని సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడి.. 13 ఉమ్మడి జిల్లా కేంద్రాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, రంపచోడవరంతో పాటు పోలవరం ముంపు ప్రాంతం ఉన్న ఏడు మండలాల పరిధిలో ఒకచోట సమావేశాలు నిర్వహిస్తారు. దీంతోపాటు సెప్టెంబరు 2 వరకు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ వినతులు స్వీకరిస్తారు. వీటిపై మంత్రులు చర్చించి సెప్టెంబరు 15న ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు హాజరయ్యారు.



జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై సమావేశమైన మంత్రులు సత్యకుమార్, నారాయణ, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దనరెడ్డి, అనిత

పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా..: 'గత ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన సరిగా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి 150 కిలోమీటర్ల దూరం ఉంది. తిరుపతికి దగ్గర్లో ఉన్న వెదురుకుప్పం మండలాన్ని చిత్తూరు జిల్లాలో చేర్చారు. ఇలాంటి వాటన్నిటినీ సరిచేసేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది' అని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. 'కొందరు నియోజకవర్గ మార్పులు కోరుతున్నారు. వాటి హద్దులు మార్చడం సాధ్యం కాదు' అని స్పష్టం చేశారు. సమావేశం తర్వాత మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ.. కొత్త జిల్లాల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 'సెప్టెంబరు 2 వరకే వినతులు తీసుకుంటాం. 15న నివేదిక ఇస్తాం. అభ్యంతరాల స్వీకరణ, తుది నోటిఫికేషన్ ప్రక్రియ అంతా ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పూర్తిచేయాలి' అని వెల్లడించారు.

మంత్రివర్గ ఉపసంఘానికి వచ్చిన వినతుల్లో కొన్ని..

- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఏదో ఒక దానికి కవి గుర్రం జాషువా పేరు పెట్టాలి.
- బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాల-బాపట్ల మధ్య ఏర్పాటు చేయాలి.
- బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలి.
- కృష్ణా జిల్లా మడిచర్ల, కొత్తపల్లి, బిళ్లపల్లి గ్రామాల్ని బాపులపాడు మండలం నుంచి తొలగించి నూజివీడు/ముసునూరు మండలాల్లో కలపాలి.
- వెదురుకుప్పం మండలాన్ని చిత్తూరు జిల్లా నుంచి తొలగించి తిరుపతి జిల్లాలో కలపాలి.
- శ్రీకాకుళం జిల్లా లావేరు మండల కేంద్రంగా మురపాకను మార్చాలి.
- మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మంత్రివర్గ ఉపసంఘానికి వినతిపత్రం సమర్పించారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్‌కు ప్రత్యేక యాప్

- భద్రతాధికారుల నియామకం తప్పనిసరి
- ప్రమాదాల నివారణకు ఫ్యాక్టరీస్ విభాగం నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కార్మికశాఖ ఆధ్వర్యంలోని ఫ్యాక్టరీస్ విభాగం చర్యలు చేపట్టింది. సేఫ్టీ ఆడిట్‌కు ప్రత్యేకంగా యాప్ తీసుకురావడంతో పాటు నిపుణుల సహకారం కోసం విశ్వవిద్యాలయాలతోనూ ఒప్పందాలు కుదుర్చుకుంది. పరిశ్రమల్లో భద్రతాధికారుల నియామకాన్ని తప్పనిసరి చేసింది. గతంలో థర్డ్‌పార్టీ సంస్థలు తనిఖీలు చేయకుండానే చేసినట్లు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినందున పకడ్బందీ వ్యవస్థను తీసుకొచ్చేందుకు ఈ చర్యలు చేపట్టింది. సంక్షేమ అధికారుల నియామకానికి అర్హతల విషయంలోనూ కొన్ని సడలింపులు తీసుకొచ్చింది. పరిశ్రమల్లో కొన్ని లోపాలకు నేరుగా కోర్టు కేసులు పెట్టకుండా జరిమానాలు విధించేందుకు అవకాశం కల్పించింది. ప్రమాదకర 9 పరిశ్రమల్లో మహిళలు పని చేసేందుకు వీలు కల్పించింది.

31లోపు నియామకాలు పూర్తి చేయాలి

సేఫ్టీ ఆడిట్‌కు రూపొందించిన ప్రత్యేక యాప్‌నకు 399 పరిశ్రమలను జియో ట్యాగింగ్ చేశారు. థర్డ్‌పార్టీ తనిఖీ అధికారులు పరిశ్రమ వద్దకు వెళ్లిందీ లేనిదీ దీని ద్వారా గుర్తిస్తారు. తనిఖీ ఏజెన్సీల సిబ్బంది అనుభవం, ఇతర వివరాలు ఈ యాప్‌లో ఇప్పటికే నమోదు చేశారు. రోజుకు రెండు, మూడు కర్మాగారాలతో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. సమావేశంలో గతంలో ఆ పరిశ్రమలో తనిఖీలు చేసిన అధికారులు సైతం ఉంటారు. గతంలో అధికారులు గుర్తించిన లోపాలను ఎంత వరకు సరి చేశారో యాజమాన్యం వివరించాల్సి ఉంటుంది. దీంతోపాటు 1,000 మంది ఉద్యోగులు దాటిన సాధారణ, 250 మందిపైన ఉన్న ప్రమాదకర పరిశ్రమలు తప్పనిసరిగా భద్రతాధికారులను నియమించుకోవాలని ఫ్యాక్టరీ విభాగం నిర్దేశించింది. 2 వేల మంది వరకు ఒక్కరు, 2 వేలపైన 5 వేల లోపు ఉంటే ఇద్దరు అధికారులను నియమించాలనే నిబంధన పెట్టారు. ఈ నెల 31లోపు నియామకాలు పూర్తి చేయాలని కార్మిక శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు..

పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు కల్పించడం, భద్రతకు వర్సిటీల్లోని నిపుణుల సహాయం తీసుకునేందుకు జేఎన్‌టీయూ-కాకినాడ, అనంతపురం, శ్రీవేంకటేశ్వర వర్సిటీలతో ఫ్యాక్టరీస్ విభాగం ఒప్పందాలు చేసుకుంది.

సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలకు శిక్ష విధించండి

- సీబీఐ కోర్టు తీర్పును రద్దు చేయండి
- తెలంగాణ హైకోర్టులో సీబీఐ అప్పీలు

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కృపానందంలకు శిక్ష విధించాలంటూ తెలంగాణ హైకోర్టుకు సీబీఐ విన్నవించింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో 8వ, 9వ నిందితులుగా ఉన్న అప్పటి పరిశ్రమలశాఖ కార్యదర్శి కృపానందం, అప్పటి గనులశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా ప్రకటిస్తూ మే 6న హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ సీబీఐ అప్పీలు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీబీఐ తరఫున శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించబోగా... నిందితుల్లో ఒకరి తరఫున గతంలో తాను వాదనలు వినిపించానని, అందువల్ల ఈ అప్పీలుపై విచారణ చేపట్టలేనంటూ న్యాయమూర్తి తప్పుకొన్నారు. అప్పీలుపై విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ... సంబంధిత న్యాయమూర్తి ముందు ఫైలు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అనంతపురంజిల్లా ఓబుళాపురం, అంతరగంగమ్మ కొండల్లో ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ)కి మైనింగ్ లీజులను కట్టబెట్టడానికి జరిగిన కుట్రలో కృపానందం, సబితల పాత్ర ఉందని అప్పీలులో సీబీఐ పేర్కొంది.

తితిదేకు రూ.కోటి విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు బెంగళూరుకు చెందిన కల్యాణ్‌రామన్ కృష్ణమూర్తి రూ.కోటి విరాళం అందించారు. బుధవారం తితిదే అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో వెంకయ్యచౌదరికి సంబంధిత డీడీని అందజేశారు.



తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి విరాళం డీడీ అందిస్తున్న దాత కల్యాణ్‌రామన్ కృష్ణమూర్తి

ప్రసాదం దుకాణాలకు వైష్ణవ బ్రాహ్మణులే అర్హులంటే ఎలా?

- విష్ణువును పూజించే వారెవరైనా ఆ వర్గం కిందికే వస్తారు కదా
- మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యలు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: విష్ణువును పూజించే బ్రాహ్మణులు మాత్రమే వైష్ణవులు కాదని, ఆయన్ని పూజించే ప్రతి ఒక్కరూ వైష్ణవులేనని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. విష్ణుమూర్తి ఆలయంలో కేవలం వైష్ణవ బ్రాహ్మణులే దుకాణాలు నడపాలనే వాదనను సమర్థించలేమని న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ తేల్చిచెప్పారు. తమిళనాడులోని కాంచీపురం దేవరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రసాద దుకాణాలు నిర్వహించే హక్కును కేవలం వైష్ణవ బ్రాహ్మణులకే ఇవ్వాలని, ఇతరులకిచ్చే ప్రభుత్వ వేలంపాట ప్రక్రియ రద్దుచేయాలని కోరుతూ చెన్నై వెస్ట్‌మాంబళంకు చెందిన ఎల్.రవి అనే వ్యక్తి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. 2002లో వైష్ణవ బ్రాహ్మణుడు కాని వ్యక్తికి దుకాణం ఇచ్చారని.. ప్రసాదం తయారీలో నిషేధిత ఉల్లి, వెల్లుల్లి, మునగ వినియోగించడంతో అప్పట్లో అపచారం జరిగిందని కోర్టుకు విన్నవించారు. ప్రసాదం తయారీ హక్కును వైష్ణవ బ్రాహ్మణులకే ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఆలయ వేలం పాటలో 'వైష్ణవ బ్రాహ్మణులు' అన్నమాటను చేర్చాలని కోరారు. ఇందుకు హైకోర్టు ధర్మాసనం స్పందిస్తూ.. 'కేవలం వైష్ణవ బ్రాహ్మణులకే ఇవ్వాలి' అనే మాటలను తప్పుపట్టింది. ఆలయ ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారమే వేలంపాట నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోందని, పైగా వైష్ణవ ఆలయాల్లో ప్రసాదం తయారీలో 5 ఏళ్ల అనుభవం ఉన్నవారిని ఆహ్వానిస్తోందని, ఇందులో తప్పుపట్టడానికి ఏముందని చెబుతూ పిటిషన్‌ను కొట్టివేసింది.

తమిళనాడు గవర్నర్ రవి నుంచి పట్టా తీసుకునేందుకు విద్యార్థిని నిరాకరణ

చెన్నై(టీనగర్), న్యూస్‌టుడే: తమిళనాడు గవర్నర్ నుంచి పట్టా తీసుకునేందుకు ఓ విద్యార్థిని నిరాకరించారు. తిరునెల్వేలిలోని మనోన్మణీయం సుందరనార్ విశ్వవిద్యాలయం 32వ స్నాతకోత్సవం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా గవర్నర్ ఆర్ఎన్ రవి హాజరై విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందించారు. జీన్ జోసెఫ్ అనే విద్యార్థిని గవర్నర్ వద్దకు వెళ్లకుండా.. పక్కనే ఉన్న ఉప కులపతి చంద్రశేఖర్ వద్దకెళ్లి పట్టా ఇవ్వాల్సిందిగా కోరారు. ఆయన్నుంచి పట్టా తీసుకుని వేదిక దిగి వెళ్లిపోయారు. గవర్నర్ వద్దకు వెళ్లాల్సిందిగా జీన్ జోసెఫ్‌కు కొందరు సైగ చేసినా పట్టించుకోలేదు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు ప్రజలకు వ్యతిరేకంగా గవర్నర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అందుకే ఆయన చేతుల మీదుగా పట్టా తీసుకునేందుకు ఇష్టపడలేదని తెలిపారు.



ఉపకులపతి చంద్రశేఖర్ నుంచి పట్టా అందుకుంటున్న విద్యార్థిని జీన్ జోసెఫ్

రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా స్థానికత నిర్ణయం

- హైకోర్టుకు నివేదించిన ఏజీ
- పిటిషనర్లకు అభ్యంతరం ఉంటే సుప్రీంకు వెళ్లాలన్న ధర్మాసనం

ఈనాడు, అమరావతి: రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా అభ్యర్థుల స్థానికతను నిర్ణయించామని, ఈ మేరకు జీవోలు జారీచేశామని రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం.. స్థానికతకు అర్హత సాధించాలంటే అర్హత పరీక్షకు హాజరయ్యేనాటికి అభ్యర్థులు వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలన్నారు. స్థానికత విషయంలో రాష్ట్రప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఆ ఉత్తర్వులకు అనుగుణంగా నడుచుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. గురువారం ఈ వ్యవహారంపై తగిన ఉత్తర్వులిస్తామని, స్థానికతపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్లకు సూచించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్. రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు మౌఖికంగా స్పష్టంచేసింది.

★ ఇంటర్మీడియట్ తెలంగాణలో చదివామనే కారణంతో వైద్యవిద్య ప్రవేశాలలో తమను స్థానిక అభ్యర్థులుగా పరిగణించకపోవడాన్ని సవాలు చేస్తూ గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన ఎస్కే ఖమరుద్దీన్, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన సనపల వెంకటరమణ, మరో 51 మంది హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఈ వ్యాజ్యాలతో పాటు తాజాగా దాఖలు చేసిన మరికొన్ని వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది.

రీపోలింగ్‌కు ఆదేశించండి: హైకోర్టులో వైకాపా అభ్యర్థుల వ్యాజ్యాలు

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు మంగళవారం జరిగిన ఉప ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, అధికారపార్టీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, ఈ నేపథ్యంలో రీపోలింగ్ నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించాలంటూ వైకాపా అభ్యర్థులు బుధవారం హైకోర్టులో అత్యవసరంగా వ్యాజ్యాలు వేశారు. ఈ వ్యాజ్యాలు సరైన సమయానికి బెంచ్ వద్దకు రాకపోవడంతో విచారణ సాధ్యం కాలేదు. గురువారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ తెలిపారు. అంతకుముందు పిటిషనర్లు/వైకాపా జడ్పీటీసీ అభ్యర్థులు హేమంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. 'ఉప ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని రీపోలింగ్ కోసం ఎస్ఈసీకి వినతి ఇచ్చాం. 2 పోలింగ్ కేంద్రాల్లోనే రీపోలింగ్ నిర్వహించాలని ఎస్ఈసీ బుధవారం వేకువజామున నిర్ణయం తీసుకున్నారు. దీంతో అత్యవసర వ్యాజ్యాలు వేశాం. వాటిపై వెంటనే విచారణ జరపకపోతే నిరర్థకం అవుతాయి' అన్నారు. ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది స్పందిస్తూ.. కనీసం గురువారం కోర్టు ప్రారంభమయ్యాక విచారణ జరపాలని మరోసారి అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

ఏసీబీ కోర్టు ఆదేశాలు ధిక్కరించలేదు

- కేసు కీలక దశలో ఉంది.. రిమాండును పొడిగించండి
- మద్యం కేసులో వాదనలు వినిపించిన ప్రాసిక్యూషన్స్ జేడీ
- నిందితులకు ఈ నెల 26 వరకు రిమాండు పొడిగింపు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి సీజ్ చేసిన నగదు జమ విషయంలో ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే పోలీసులు నడుచుకున్నారని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. నిందితులకు రిమాండ్ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో వారిని విజయవాడలోని అనిశా కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి మిథున్‌రెడ్డి, గుంటూరు జిల్లా జైలు నుంచి బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ, విజయవాడ కారాగారం నుంచి రాజ్ కెసిరెడ్డి, చాణక్య, శ్రీధర్‌రెడ్డి, దిలీప్, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జేడీ తన వాదనలు కొనసాగిస్తూ.. సిట్ అధికారులు ఎక్కడా బ్యాంకు అధికారులతో కుమ్మక్కు కాలేదని, అన్నీ సమయాలతో సహా నమోదు అయ్యాయని చెప్పారు. జమకు సంబంధించి కోర్టు ఆదేశాలను సాయంత్రం ఇచ్చిందని, అప్పటికే బ్యాంకు నుంచి రూ. 11 కోట్లు కరెన్సీ చెస్ట్‌కు వెళ్లిపోయాయని వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న సమయంలో నిందితులకు బెయిల్ ఇవ్వొద్దన్నారు. వాదనల అనంతరం రిమాండ్‌ను ఈ నెల 26 వరకు పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఆదేశాలిచ్చారు.



మిథున్‌రెడ్డిని కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

ఆధారాలను ధ్వంసం చేశారు..

ఏ1 రాజ్ కెసిరెడ్డి తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన వాదనలు వినిపిస్తూ.. నగదు జమకు సంబంధించి పోలీసులు బ్యాంకు అధికారులతో కలసి ఆధారాలను ధ్వంసం చేశారన్నారు. తదుపరి వాదనల నిమిత్తం ఈ నెల 18కి న్యాయాధికారి కేసు వాయిదా వేశారు.

★ ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరుపర్చిన సందర్భంగా వారిని న్యాయాధికారి సమస్యల గురించి అడిగారు. ఈ సందర్భంగా వారు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

బయటి భోజనాన్ని రెండు పూటలా అనుమతించండి: మిథున్‌రెడ్డి

జైలులో తనకు రోజుకు ఒక పూట మాత్రమే బయటి నుంచి భోజనాన్ని అనుమతిస్తున్నారని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పారు. రోజుకు రెండు సార్లు భోజనం పంపించేలా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయాధికారి జోక్యం చేసుకుంటూ.. పిటిషన్ వేసుకోవాలని సూచించారు.

వెన్ను నొప్పి చికిత్సకు 15 రోజులు కావాలి: చెవిరెడ్డి భాస్కరరెడ్డి

తాను వెన్నునొప్పితో బాధపడుతున్నానని.. చికిత్స అవసరమని డాక్టర్లు ఇప్పటికే సూచించారని వివరించారు. దీనికి 15 రోజులు అనుమతించాలని కోరారు.

సిట్, బ్యాంకు అధికారుల సీడీఆర్‌లు తీయించాలి: రాజ్ కెసిరెడ్డి

సీజ్ చేసిన రూ.11 కోట్లను వేరుగా ఉంచాలన్న కోర్టు ఆదేశాలను సిట్ అమలు చేయలేదని నిందితుడు రాజ్ కెసిరెడ్డి వివరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు కుమ్మక్కై ఆధారాలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. డబ్బు సీజ్ చేసినప్పుడే తనకు సంబంధం లేదని పిటిషన్ వేశానన్నారు. సిట్, బ్యాంకు అధికారుల సీడీఆర్‌లను తీయిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

పోలీసులు మా తల్లిని బెదిరిస్తున్నారు: నిందితుడు దిలీప్

అర్ధరాత్రి సమయాల్లో తన ఇంటికి పోలీసులు వెళ్లి తల్లిని బెదిరింపులకు గురి చేశారని నిందితుడు దిలీప్ చెప్పాడు. ఇప్పుడున్న ఇంటిని 2019లో తన తండ్రి కట్టించారన్నారు. ఆ ఇంటిని తాను కొన్నట్లు చెప్పాలంటూ పోలీసులు కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారని కోర్టులో చెప్పారు.

EENADU Vol: 52, Issue: 5 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మకరందం

makarandam@eenadu.in
మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

అసాధ్యం కాదు



కళ్లు మూసుకుంటే ఏవేవో ఆలోచనలు... ఒకదానితో ఒకటి సంబంధం లేనివి తరుముకుంటూ వస్తూ మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. అర్జునుడు కూడా అలాంటి స్థితినే అనుభవించాడు. రకరకాల చోట్లకు పరుగులు తీసే మనసును కట్టడి చేయడం చాలా కష్టమని భావించాడు. అదే మాటను 'చంచలం హి మనః కృష్ణ ప్రమాధి బలవద్దృఢమ్....' అంటూ గీతాచార్యుడితో చెప్పాడు. దానికి కృష్ణుడు అవునంటూనే 'అభ్యాస వైరాగ్యాల ద్వారా మనసును వశపరచుకోవడం సాధ్యమే'నని చెప్పాడు. ధ్యానం అందుకు ఉపకరిస్తుంది. 'అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః...' అంటే, మనసు మీద అదుపు సాధించని వారికి యోగసిద్ధి కలగదన్నది కృష్ణుడి హెచ్చరిక. కాబట్టి రోజూ కాసేపు ప్రశాంతంగా కూర్చుని ధ్యానం సాధన చేస్తే- మనసు అనే రెక్కల గుర్రాన్ని ఒక్కచోటే కట్టేయవచ్చు. తద్వారా ఆధ్యాత్మిక ఉన్నతిని అందుకోవచ్చు.

ఎప్పుడు పోరాడాలి?



బుద్ధం శరణం

బుద్ధుడు హింసను నిరసించాడు. సాటి మనుషులే కాదు, సకల జీవరాశుల పట్ల దయతో, కరుణతో వ్యవహరించాలని సందేశమిచ్చాడు. ఆ బోధలను వింటున్న సింహ సేనాధిపతికి ఒక సందేహమొచ్చింది. 'రాజ శాసనాన్ని అమలు చేయడానికి నియమితమైన సైనికుణ్ని నేను. యుద్ధం చేయడం నా కర్తవ్యం. మన ఇళ్లువాకిళ్లు, భార్యాపిల్లలు, ఆస్తి పాస్తులను రక్షించుకోవడం కోసం యుద్ధానికి వెళ్లడం తప్పా? దుర్మార్గులు రెచ్చిపోతుంటే వాళ్లకు తలొగ్గి ఊరుకోవాలా? అహింసను ప్రబోధించే సిద్ధార్థుడు నేరస్థులను శిక్షించడానికి అనుమతిస్తాడా?' అని బుద్ధుణ్నే అడిగాడు. అనుగ్రహించాల్సిన వారిని అనుగ్రహించడం, శిక్షించాల్సిన వారిని శిక్షించడంలో తప్పు లేదని గౌతముడు బదులిచ్చాడు. ఎవరైనా సరే, తాము చేసిన చెడ్డ పనుల వల్లే శిక్ష అనుభవించాలి తప్పితే మరొకరి ద్వేషం, అసూయ కారణంగా అగచాట్లపాలు కారాదని చెప్పాడు. న్యాయం కోసం, శాంతికోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడు యుద్ధానికి వెళ్లడం సమంజసం అన్నాడు. అయితే, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే పోరాడటం సమర్థనీయం కాదని బుద్ధుడు ఆ సేనాధిపతికి ఉపదేశించాడు.

సేవించే చేతులు



సిక్కుమతంలో ఎన్నో ముఖ్యమైన మార్పులు తీసుకువచ్చారు పదో గురువు 'గురుగోవింద్ సింగ్'. ఒకరోజు ఆయన ఆశ్రమానికి వచ్చిన భక్తులతో ముచ్చటిస్తున్నారు. ఆ సమయంలో ఆయనకు దాహంగా అనిపించడంతో 'నాకు ఎవరైనా తాగడానికి కాసిన్ని నీళ్లు తీసుకు రాగలరా?' అని అడిగారు. దాంతో ఓ వ్యక్తి వెళ్లి నీళ్లు తీసుకువచ్చి ఇవ్వబోతున్న సమయంలో ఆ వ్యక్తి చేతులు గురుగోవింద్‌ను తాకాయి. ఎంతో మృదువుగా ఉన్న ఆ హస్తాలను చూసి ఆయన ఆశ్చర్యపోయారు. దాంతో ఆ వ్యక్తిని 'నీ చేతులెలా ఇంత మెత్తగా ఉన్నాయ'ని ప్రశ్నించారు. అప్పుడా వ్యక్తి 'ఆచార్యా..! నాకు చాలామంది సేవకులున్నారు, నేను ఏ పనినైనా వారితోనే చేయించుకుంటాను. స్వయంగా నేను చేయాల్సినవి ఏవీ లేవు. అందుకే నా చేతులు అలా ఉన్నాయ'ని బదులిచ్చాడు. ఆ సమాధానం విన్న గురుగోవింద్ 'ఏమిటీ ఎప్పుడూ ఎవరికీ సేవ చేయలేదా?' అంటూ నోటి వరకూ వచ్చిన ఆ నీటిపాత్రని తాగకుండా పక్కకు పెట్టేశారు. మనకు ఎంత అవకాశం ఉన్నా, కొన్ని పనులు సొంతంగా చేసుకోవడం, వీలైనంత వరకూ ఇతరులకు సాయపడటం మంచి లక్షణం. అది లేని వారు దైవానికి చేరువ కాలేరని హితవు పలికారు.

దేవుడు చూస్తున్నాడు



ఇస్లాం సందేశం

మనం ఏం చేసినా దేవుడు చూస్తున్నాడు అనే ఎరుకతోనే చేయాలి అని ఇస్లాం చెబుతుంది. చేసే మంచి, చెడును ఆయన ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాడు అనేది ఖురాన్ సందేశం. ఈ ఆలోచనే పాలకులనైనా, ప్రజలనైనా సత్యంపై, ధర్మంపై నిలకడగా ఉంచుతుందని ఇందులో కొన్ని కథల ద్వారా వివరణ ఉంది. అల్లాహ్ మీద భయ భక్తులతో మనిషి చెడు పనులను వదిలేసి మంచి పనులు చేయడాన్ని తఖ్వా అంటారు. ఎవరైతే తఖ్వాతో జీవితాన్ని గడుపుతారో వారిని ఆ భగవంతుడు ఆపదల నుంచి కాపాడతాడని విశ్వాసం. ఈ తఖ్వా భావన నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంది. మదిలో దైవంపై భయ భక్తులు కలిగి ఉండటం, ఖురాన్‌లో చెప్పిన విషయాలను నిత్య జీవితంలో ఆచరించడం, మనకు ఉన్నవాటికి సంతోషంతో దేవునికి కృతజ్ఞతలు తెలపడం, ఈ భూమ్మీద గడిపిన ప్రతినిమిషానికీ లెక్క చెప్పాలనే విచక్షణతో జీవించడం. ఈ విషయాలను పాటిస్తే జీవితం

నువ్వు ముందు నడువు...

నీ వెనకే నేనుంటా!

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, సకల దేవాధిదేవుడు శ్రీమన్నారాయణుడు.

జగన్నాథుడైన ఆ మహావిష్ణువు ధరించిన దశావతారాల్లో ప్రతిఒక్కటీ ప్రత్యేకమే. అందులో అష్టమ అవతారం, దేవకీదేవి అష్టమ గర్భాన, అష్టమ మాసమైన శ్రావణమాసంలో జన్మించిన సంతానం, "ఓం నమో నారాయణాయ" అన్న అష్టాక్షరీ మంత్ర పూర్ణ స్వరూపం శ్రీకృష్ణ భగవానుడు.

"కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అన్న మహర్షుల వాక్కుకు ప్రతిగా శిష్టరక్షకుడిగా, దుష్టశిక్షకుడిగా, ధర్మపరిరక్షకుడిగా ఆయన అవతరించాడు.



'కృష్ణ' అన్న పేరు పరమ పవిత్రమైంది. అతి విశిష్టమైంది. కృష్ణ అన్న పదంలోని 'క' కారం బ్రహ్మ వాచకం. 'ఋ'కారం విష్ణు వాచకం. 'ష'కారం శివ వాచకం. 'ణ' కారం ధర్మవాచకం. ఆ పేరులో సకల దేవతలూ నిక్షిప్తమై ఉన్నారు. ఒక్క కృష్ణ నామ స్మరణం సర్వదేవతా ప్రార్థనా పుణ్య ప్రసాదితమై, ధర్మమార్గ ప్రబోధితమై, సకల పాపహరణమై నిలిచి, తలచిన వారికి ముక్తిని ప్రసాదిస్తుంది.

కృతయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో యజ్ఞం వల్ల, ద్వాపరయుగంలో పూజలు, వ్రతాల వల్ల పొందే ఫలితాలన్నీ కలియుగంలో కేవలం 'హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే' అన్న నామ మంత్ర స్మరణతో పొందగలుగుతారు. దీన్ని స్వయంగా బ్రహ్మదేవుడు నారదుడికి వివరించాడని పురాణ వచనం.

మహావిష్ణువు మహోన్నత అవతారమైన శ్రీకృష్ణుడు... అసంఖ్యాక రాక్షసుల అరాచకాలను భరించలేక, ఆ దుష్టుల భారాన్ని మోయలేక, శరణు కోరిన భూదేవి కోరికను మన్నించాడు. భూమిపై అవతరించాడు. శ్రీముఖ నామ సంవత్సరం, శ్రావణ మాసం, బహుళ అష్టమి తిథి, రోహిణీ నక్షత్రం, వృషభ లగ్నంలో అత్యంత శుభ ముహూర్తాన జన్మించాడు. కంసుడి బారినపడకుండా వాసుదేవుణ్ని గోకులంలో దించాడు వసుదేవుడు. అక్కడ పూతన, శకటాసుర, వృత్రాసుర, ధేనుకాసుర, బకాసురాది ఎందరో రాక్షసులను బాల్యంలోనే సంహరించాడు మాధవుడు. బాలకృష్ణుడిగా, చిలిపి కృష్ణుడిగా, రాధాకృష్ణుడిగా దర్శనమిచ్చాడు.

- శ్రీకృష్ణ లీలలంటే ఇష్టపడని వాళ్లుండరు. కానీ ఆ లీలలు వివరించే కథలు కేవలం కాలక్షేపం కోసం కాదు. జ్ఞాన వైరాగ్యాలతో కూడుకుని, భక్తి శ్రద్ధలకు నెలవైనవి. అందులో నివృత్తి మార్గం వివరించడం విశేషం.

- "కాళీయ మర్దనం" కేవలం ఒక సర్పసంహారం కాదు. మడుగును కలుషితం చేస్తూ, దొరికిన వారిని దొరికినట్లు కబళిస్తూ, జీవ రాశిని నాశనం చేసే కాళీయుడు నేటి దుర్మార్గులకి ప్రతీక. సమాజాన్ని నష్టపరుస్తూ హాని కలిగించే దుష్టులని అంతం చెయ్యడం అనే అంతరార్థం ఇందులో సుస్పష్టంగా కనబడుతుంది.

- "గోవర్ధనోద్ధరణం"లో చూపించింది తన బలప్రదర్శన కాదు. తన వారిని, తనను నమ్ముకున్న వాళ్లని... ఏ కష్టం వచ్చినా వదిలిపెట్టకుండా వెంట ఉండి, అండగా నిలబడి రక్షించే లక్షణం. విశ్వరూప ప్రదర్శనం శ్రీకృష్ణ అవతారంలో విశిష్టత సంతరించుకున్నది. ఇది మూడు సందర్భాల్లో కనబడుతుంది.

- బాల్యదశలో మన్ను తిని, తల్లి యశోద అడిగితే లేదంటూనే నోరు తెరిచి 14 భువనభాండాలను చూపించడం మొదటిది. రెండోది శ్రీకృష్ణ రాయబార ఘట్టం. తనను బంధించడానికి ప్రయత్నించిన కౌరవులను మూర్ఛలో ముంచి, ఆ మహాసభలో ధృతరాష్ట్రుడికి చూపు ప్రసాదించి, అతనితోపాటు నారదాది మహర్షులకు, భీష్మ ద్రోణాది సజ్జనులకు తన విశ్వరూపాన్ని దర్శించే భాగ్యాన్ని ప్రసాదించాడు. ముచ్చటగా మూడోది, ఆఖరుది కురుక్షేత్ర సంగ్రామ సమయంలో అర్జునుడి ముందు ప్రదర్శించింది. యుద్ధం ప్రారంభం కాబోతోంది. అకస్మాత్తుగా ధనుర్బాణాలు వదిలేసి, రణం చెయ్యలేనని, తన సోదరులను, బంధువులను, గురువులను చంపలేనని విరక్తుడైన విజయుడికి అనుగ్రహించిన అరుదైన విశ్వరూపం.

- భగవద్గీత బోధతో అర్జునుడి సందేహాలనే కాక మానవులందరి అనుమానాలను పటాపంచలు చేశాడు. అందుకే ఏ సమస్య వచ్చినా గీతాపఠనం చెయ్యమంటారు.

- వాసుదేవుడు తన అవతారం ద్వారా అందించిన మహోన్నత విషయాలు, విశేషాలు ఎన్నెన్నో. అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు ఉండటం, ఎంత జ్ఞాన సంపన్నుడైనా వినయంతో ఒదిగి ఉండటం, ఎన్ని క్లిష్ట సమస్యలు వచ్చినా ఎదుర్కొని ధర్మరక్షణ చెయ్యడం, తల్లిదండ్రులను, గురువులను సేవించడం, బంధుమిత్రులతో పాటు సామాన్యులను గౌరవించడం, నమ్మిన వారికి సహాయం చెయ్యడం, అందరినీ సమానంగా ప్రేమించి ఆదరించడం ఇలా ఒకటా రెండా... ఆ స్వామి ప్రబోధించిన మార్గదర్శకాలు అనేకం.

- భారతదేశంలో ఆరాధ్య దైవంగా పూజలు అందుకునే శ్రీకృష్ణభగవానుడు మధురలో బాలకృష్ణుడిగా, ద్వారకలో, ఉడుపిలో శ్రీకృష్ణుడిగా, పూరీలో జగన్నాథుడిగా, గురువాయూర్‌లో గురువాయూరప్పన్‌గా, రాజస్థాన్‌లో శ్రీనాథ్‌జీగా అనేక రూపాల్లో కొలువై, భక్తుల కొంగుబంగారమై ప్రకాశిస్తున్నాడు. కోరిన వరాలు అనుగ్రహిస్తూ, గుండె గుడుల్లో కొలువై ఉన్నాడు.

– ఆచార్య పి.వి.ఉమాశశి

ధర్మం అంటే..

పూర్వకాలంలో హిందూ దేశంలో మతాన్ని సూచించే మాట 'ఆర్ష ధర్మం'. ధర్మమంటే నిజానికి మతంకన్నా విశిష్టమైనది. 'ధర్' అనే ధాతువు లోంచి అది వచ్చింది. కలిసి ఉండటం అని దానికి అర్థం. ధర్మమంటే సమగ్రమైన ఆధ్యాత్మిక స్వరూపం. నైతిక ప్రవర్తనా విధానం, ధర్మనిరతి, న్యాయబుద్ధి, మానవుడి విధులు, బాధ్యతలు అన్నీ అందులోనే ఇమిడి ఉన్నాయి. నీ బతుకు నువ్వు బతుకుతూ, ఎదుటివాళ్లను వాళ్ల ఇష్టానుసారం బతకనివ్వు అన్నదే హిందూమత అంతస్సారం.

– 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో జవహర్‌లాల్ నెహ్రూ

పునర్వసుః

వందే విష్ణుం!

విష్ణు సహస్ర నామావళిలో 149వది. 'పునర్వసుః' అంటే క్షేత్రజ్ఞుడి రూపంలో మళ్లీమళ్లీ నివసించేవాడని అర్థం. తన సృష్టిలో స్వామి అంతటా సకల జీవరాశిలోనూ



అంతరాత్మగా ఉంటుంటాడు అని ఈ నామం వివరిస్తుంది. అంటే అన్ని ప్రాణుల్లో అనేక సార్లు విలసిల్లుతుంటాడు. అంతేకాదు, ప్రళయానంతరం మళ్లీ సృష్టి చేస్తూ అప్పుడు కూడా అంతటా ఆ స్వామి ఉంటాడని వివరిస్తుందీ నామం.

బానిసత్వం వదిలేద్దాం

క్రీస్తువాణి


మన దేశానికి లభించిన స్వతంత్రాన్ని ప్రతిసారిలాగానే ఈసారీ పండుగలా చేసుకోనున్నాం. సమాజానికి దొరికిన స్వేచ్ఛ మన పాపాల నుంచి కూడా మనకు లభించాలని బైబిల్ చెబుతుంది. చెడు కర్మలు చేయకుండా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఇతరులను ఇబ్బంది పెట్టే పనులకు దూరంగా ఉండటం ద్వారా దేవునికి చేరువ కావొచ్చు. హానికారక మాటలు, చర్యలు, ఆలోచనల నుంచి మనకి మనమే స్వేచ్ఛ ఇచ్చుకోవాలి. అలా సాధన చేసే వారిని దేవుడు ప్రేమిస్తాడని బైబిల్ చెబుతుంది. ఆంగ్లేయులు మనల్ని వందల ఏళ్లు బానిసలను చేసుకున్నట్లే, పాపాలు మనుషులను బానిసలుగా చేసుకుంటాయి. వాటి నుంచి ఎవరికి వారే స్వేచ్ఛను పొందాలి. లేకపోతే ఆ బానిసత్వం మనల్ని చెడుమార్గంలో పయనించేలా చేయగలదు. తద్వారా పూర్తిగా జీవితాన్నే ఇబ్బందుల్లోకి నెట్టేయగలదు. అందుకే వ్యసనాలకు, చెడు లక్షణాలకు లోబడటం మానేద్దాం.



కన్నవారి నుంచే..

కల్యాణ గుణాలు!

ముత్యాల్లాంటివి పసిమనసులు. కల్మషం లేని ఆ హృదయాల్లో విలువల బీజాలు పడితే, అవే మహావృక్షాలై ఎదుగుతాయి. రూ.లక్షల్లో ఫీజు కట్టామా, కావాల్సినవన్నీ కాళ్ల ముందుకు తెచ్చామా అన్నది కాదు.. వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు మనం చేయాల్సింది విలువైన సమయం ఇవ్వడం, సద్గుణాల బాటలో నడిపించడమే!



జన్మనిచ్చినవారు సత్యం, ధర్మం, ప్రేమ, సేవ, త్యాగం తమ జీవితాల్లో ఆచరించి చూపితే ఆ సద్గుణాలు పిల్లల్లోనూ అంకురిస్తాయి. స్వామి వివేకానంద 'నా జీవితాల్లో ఉదాత్తమైన గుణాలన్నీ నా తల్లిదండ్రుల నుంచి అలవరచుకున్నవే' అని సెలవిచ్చారు. మహాత్మాగాంధీ తమ తల్లిదండ్రుల నైతిక ప్రవర్తన, వారు పరిచయం చేసిన ధార్మిక గ్రంథాల ప్రభావం తనపై అమితంగా ఉందని గుర్తుచేసుకున్నారు.

అమ్మఒడి నుంచే...

'పది మంది ఉపాధ్యాయులు ఒక ఆచార్యునితో సమానం. వందమంది ఆచార్యులు ఒక తండ్రితో సమానం, ఒక తల్లి వెయ్యిమంది తండ్రులతో సమానం!' అంటోంది మనుస్మృతి. శ్రీరామచంద్రుడి నుంచి శ్రీరామకృష్ణ పరమహంస వరకు సద్గుణాలన్నింటినీ తల్లి నుంచే సంప్రాప్తించుకున్నవారే! 'కౌసల్య నందన రామా' అనగానే శ్రీరాముడు పొంగిపోతాడని భక్తుల భావన. సత్య నిష్ఠ, ధార్మిక భావనలు, సరళ జీవనం తన తల్లి పెట్టిన భిక్ష అనేవారు రామకృష్ణ పరమహంస. ఛత్రపతి శివాజీకి తన ఒడిలోనే పాఠాలు నేర్పి మహావీరునిగా తీర్చిదిద్దింది తల్లి జిజియాబాయి. మహాభారతంలో కుంతీదేవి ఆదర్శ మాతృమూర్తి. పాండవులు ధర్మాశ్రయులు కావటానికి, శ్రీకృష్ణ భక్తులై రక్షణ పొందడానికీ ఆ సాధ్వీమణే కారణం. ఎందరో మహర్షులు తమ తండ్రుల జ్ఞాన బోధతో తపోధనులయ్యారు. ఉదాహరణకు పరాశరుని శిక్షణలో వ్యాసుడు, ఆ వ్యాసుడి శిక్షణలో శుకుడు బ్రహ్మజ్ఞానులయ్యారు.

పసితనంలోనే విలువలు

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమబాటలో నడిచేలా చిన్నతనం నుంచే శిక్షణనివ్వాలని మన మహర్షులు సూచించారు. రామాయణ, భారత, భాగవతాల్లోని మహాత్ముల జీవిత గాథల్ని వారికి బోధిస్తూ ఉండాలని హితవు పలికారు. 'నాలుగేళ్ల వరకు పిల్లల్ని ఆలనగా పాలనగా చూసుకోవాలి. పదహారేళ్ల వయసులో ఉన్నతమైన పౌరులుగా ఎదిగే విద్యను నేర్పాలి' అని ప్రబోధించారు. 'మొక్కై వంగనిది మానై వంగునా?' అన్నది మనకందరికీ తెలిసిన సామెతే! చిన్నారుల శీలనిర్మాణంలో ప్రధాన పాత్ర కన్నవారిదే. నేటి ఆధునిక సమాజంలో పిల్లల పెంపకానికి తల్లిదండ్రులు కేటాయించగలిగే సమయాన్ని పెంచాలి.

తండ్రి ధైర్యస్థైర్యాలు

దశరథుని పెంపకంలో రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు సర్వ శాస్త్ర పారంగతులయ్యారు. తండ్రి సత్యధర్మపాలనే కొడుకులకూ సంక్రమించింది. అరణ్యవాసం సందర్భంగా అనసూయాదేవి రాముణ్ని 'నీకు సీత అంటే ఎందుకంత ప్రేమ?' అని అడిగింది. అప్పుడు రాముడు 'నా తండ్రి దశరథ మహారాజు ఎంపిక చేసిన వధువు కాబట్టి' అన్నాడు. అలాగే కోసల రాజ్య ప్రజలు కూడా నిండుసభలో దశరథ మహారాజు పెంపకంపై అభినందనల జల్లు కురిపించారు. ఎన్ని పనులున్నా, అన్నింటికన్నా మిన్నయిన పని భావిపౌరులను తీర్చిదిద్దడమే. అప్పుడు మనమూ ఉత్తమ తల్లిదండ్రులుగా సార్థకజీవితాన్ని సాధించగలం! – బి.సైదులు



లక్ష్య సాధనలో మార్గదర్శి

లక్ష్యసాధనలో ఎన్ని కష్టాలు ఎదురైనా పట్టిన పట్టు విడవకూడదనే నీతి ఇమిడి ఉన్న గాథ క్షీరసాగర మథనం. అది కేవలం పురాణకథ మాత్రమే కాదు. విభిన్న కోణాల్లో వ్యక్తిత్వాన్ని వికసింపజేసే ఘట్టం. ఐక్యత, నిస్వార్థం, సహనం, ఆశలను సమ్మిళితం చేసి లక్ష్యసాధనకు ముందడుగు వేయాలనే విషయాన్ని చెబుతుంది. సమష్టి కృషితో కష్టాలకోర్చి పనిచేస్తేనే అమృతం లాంటి ఉత్తమ ఫలితాలు లభిస్తాయనే సత్యం బోధపడుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవ చేస్తేనే విజయం సాధ్యమవుతుందని, కాలకూట విష ఆవిర్భావం లాంటి కష్ట సమయాల్లో సహనంతో వ్యవహరించడం ద్వారా అనుకున్న ఫలితాలు సాధించవచ్చనే సత్యదర్శనం కలుగుతుంది. మార్పునకు అవకాశం ఉన్న మనిషి అక్కడే ఆగిపోకూడదనే ప్రబోధమూ ఉంది. దేవతలు, రాక్షసులు తమ శత్రుత్వాన్ని పక్కనపెట్టి, ఒకరికొకరు సాయంగా ఐక్యంగా ఉండి, క్షీరసాగర మథనాన్ని విజయవంతం చేశారు. ఇది ఐకమత్యం విలువను తెలుపుతుంది. కష్టమైన ఈ పనిలో, ఇరుపక్షాలు అమృతం వంటి ఫలితం కోసం తమ శ్రమను నిస్వార్థంగా అందించాయి. మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని కవ్వపు తాడుగా ఉపయోగించి చిలకడం సుదీర్ఘమైన, కష్టమైన ప్రక్రియ. ఈ సమయంలో ఓపిక, సహనం అవసరం. సముద్ర మథనానికి ముందు దేవతలకు ఓటమి ఎదురైనా, అమృతం దొరుకుతుందనే ఆశతో వారు ముందుకు సాగారు. ఇటువంటి ఆశావహ దృక్పథం మనకూ అవసరమే! అలాగే మనిషి తన సహజగుణాలను అధిగమించి, తన వివేకంతో మార్పునకు సిద్ధపడాలి. కలిసి కృషి చేస్తేనే ఉత్తమ ఫలితాలు లభిస్తాయని, కష్టాలను ఓపికతో ఎదుర్కొంటే విజయం సాధించవచ్చనే సందేశాన్ని క్షీర సాగర మథనం కథలో గమనించవచ్చు.

చెక్కుల క్లియరెన్స్ ఇక వేగంగా

అక్టోబరు 4 నుంచి కొన్ని గంటల్లోనే: ఆర్‌బీఐ



ముంబయి: బ్యాంకుల్లో సమర్పించిన చెక్కులు క్లియర్ కావడానికి ప్రస్తుతం రెండు పని దినాల వరకు సమయం పడుతుండగా, దాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త వ్యవస్థను తీసుకొస్తోంది. అక్టోబరు 4 నుంచి 'కంటిన్యూయస్ క్లియరింగ్' యంత్రాంగం పని చేస్తుందని తెలిపింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ నిరంతరాయంగా సాగుతాయని ఆర్‌బీఐ వెల్లడించింది. రెండు దశల్లో ఈ యంత్రాంగం అమల్లోకి వస్తుందని, అక్టోబరు 4 నుంచి మొదటి దశ, 2026 జనవరి 3 నుంచి రెండో దశలో నిరంతర క్లియరింగ్, సెటిల్‌మెంట్ జరుగుతుందని తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు. తొలి దశలో సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ అవుతాయి. రెండో దశలో చెక్కు సమర్పించిన సమయం నుంచి 3 గంటల వ్యవధిలో క్లియర్ అవుతాయి.

గూగుల్ క్రోమ్ కోసం పర్‌ప్లెక్సిటీ భారీ ఆఫర్



దిల్లీ: భారత సంతతికి చెందిన అరవింద్ శ్రీనివాస్ నేతృత్వంలో నడుస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) కంపెనీ పర్‌ప్లెక్సిటీ మరోసారి వార్తల్లోకి వచ్చింది. ప్రముఖ వెబ్‌బ్రౌజర్ గూగుల్ క్రోమ్‌ను 34.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3 లక్షల కోట్లు)కు కొనుగోలు చేస్తామని ఆఫర్ ఇవ్వడమే ఇందుకు కారణం. పర్‌ప్లెక్సిటీ మొత్తం విలువ కంటే ఇది అధికం కావడం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో టిక్‌టాక్ అమెరికాను తమ వీడియో మేకింగ్ ప్లాట్‌ఫామ్‌లో విలీనం చేసుకుంటామని ఆఫర్ చేసి పర్‌ప్లెక్సిటీ సంచలనం సృష్టించింది. వెబ్ బ్రౌజర్ల విభాగంలో గూగుల్ క్రోమ్ గుత్తాధిపత్యం చెలాయిస్తోంది. దీంతో దాన్ని విక్రయించాల్సిందిగా గూగుల్‌పై అమెరికా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోంది.

✦ గూగుల్ క్రోమ్‌ను కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులను ప్రైవేట్ పెట్టుబడిదార్ల నుంచి పర్‌ప్లెక్సిటీ సమీకరించనుంది. నిధులు అందించేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొచ్చాయని కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ దిమిత్రి వెల్లడించారు. జులైలో 100 మి.డాలర్ల నిధుల సమీకరణ సందర్భంగా పర్‌ప్లెక్సిటీ విలువను 18 బి.డాలర్లుగా లెక్కకట్టారు.

అన్‌లిమిటెడ్ స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్లు

హైదరాబాద్: ఫ్యాషన్ దుస్తుల రిటెయిల్ సంస్థ అన్‌లిమిటెడ్, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఇండిపెండెన్స్ డే డబుల్ ఆఫర్'ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఒకటి కొంటే ఒకటి ఉచితం (బై 1 గెట్ 1 ఫ్రీ)తో పాటు రూ.3,000తో కొనుగోలు చేస్తే మరో రూ.3000కు షాపింగ్ చేసే సౌలభ్యాన్ని సంస్థ అందిస్తోంది. ఈ పరిమిత కాల ఆఫర్ ఆగస్టు 17 వరకు ఉందని అన్‌లిమిటెడ్ వెల్లడించింది. ఈ ఆఫర్‌లో 20,000కు పైగా దుస్తుల స్టైల్స్ లభిస్తున్నాయి. ప్రస్తుత పండగల సీజన్‌లో అన్ని వర్గాల వారు తమ అభిరుచులకు అనుగుణంగా విస్తృత శ్రేణిలో వస్త్రాలను ఎంపిక చేసుకోవచ్చని వివరించింది. అతి తక్కువ ధరలతో సరికొత్త ఫ్యాషన్ దుస్తులను కొనుగోలు చేసే అవకాశాన్ని వినియోగదారులు పొందాలని కోరింది. ఆఫర్‌లో భాగంగా అందిస్తున్న అదనపు బోనస్‌తో మొత్తం వార్డ్‌రోబ్‌ను మార్చుకోవచ్చని అన్‌లిమిటెడ్ తెలిపింది.

కోడి గుడ్డు

14న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	520
గోదావరి	510
విశాఖపట్నం	515
చిత్తూరు	548

భారత్ అంటే జనరిక్ ఔషధాలే కాదు

● ప్రపంచ ఆరోగ్య సంరక్షణలో కీలక భాగస్వామి

● రూ.2.65 లక్షల కోట్ల ఫార్మా ఎగుమతులు ● ఫార్మెగ్జిల్ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: భారత ఔషధ ఎగుమతులు కొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇవి 30.4 బిలియన్ డాలర్ల (రూ.2,65,870 కోట్లు)ను దాటాయి. భారత్ అంటే కేవలం జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా కాకుండా నవ్యత, నాణ్యత, ఆవిష్కరణలతో ప్రపంచ ఆరోగ్య రంగంలో కీలక భాగస్వామిగా మారింది. దేశంలో అధునాతన ఉత్పాదక సామర్థ్యాలు, అంతర్జాతీయ నియంత్రణ సంస్థల ప్రమాణాలకు తగిన విధంగా ఉత్పత్తి సామర్థ్యం.. ఇవన్నీ ప్రపంచవ్యాప్త నమ్మకాన్ని సూచిస్తున్నాయి. 2023-24లో నమోదైన 27.852 బిలియన్ డాలర్లతో పోలిస్తే 2024-25లో ఎగుమతులు 9.39% పెరిగాయని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెగ్జిల్) విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 'ఇవి కేవలం అంకెలు కాదు. భారత ఔషధ పరిశ్రమలో ఒక కీలక పరిణామానికి చిహ్నం. ఆవిష్కరణలతో సురక్షితమైన ఔషధ పరిష్కారాలను అందించే భారత సామర్థ్యంపై ప్రపంచ వ్యాప్తంగా



పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది' అని నివేదిక విడుదల సందర్భంగా ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి, డైరెక్టర్ కె.రాజా భాను పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాలుగా ప్రపంచ వ్యాక్సిన్ గిరాకీలో 60 శాతానికి పైగా భారతే సరఫరా చేస్తోంది. 200కు పైగా దేశాలకు అందుబాటు ధరలకు జనరిక్ ఔషధాలను అందిస్తోంది. ప్రస్తుతం జనరిక్ ఔషధాల సరఫరాదారుగానే కాకుండా, కాంప్లెక్స్ జనరిక్స్, బయోసిమిలర్స్, ఇంజక్టబుల్స్, అధునాతన డ్రగ్ డెలివరీ వంటి వాటిల్లోనూ సత్తా చూపిస్తోంది అని పేర్కొన్నారు.

ప్రభుత్వ మద్దతుతో..

భారత ప్రభుత్వ వ్యూహాత్మక అడుగులూ ఔషధ ఎగుమతుల వృద్ధికి కారణమయ్యాయి. భారత్-ఈఎఫ్‌టీఏ ఒప్పందంతో అధిక ఆదాయ యూరోపియన్ మార్కెట్లలోకి భారత బయోసిమిలర్స్, ఇతర ఔషధాలు ప్రవేశించేందుకు మార్గాలు తెరచుకున్నాయి. అదే సమయంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్‌ఐ) పథకం కీలక ముడి పదార్థాలను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు వీలు కల్పించింది. ఈ చర్యలు ప్రపంచంతో పోటీ పడేందుకు భారత ఔషధ పరిశ్రమకు బలాన్నిచ్చాయి అని నివేదిక తెలిపింది.

సుంకాల మినహాయింపు...

అమెరికా ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్ 1962, సెక్షన్ 232 కింద భారత ఔషధ ఎగుమతులపై పెంచిన సుంకాల నుంచి తాత్కాలిక మినహాయింపునిచ్చింది. ఈ నిర్ణయం అమెరికా ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన ఔషధాలను అందించడంలో భారత్ కీలకమన్న విషయాన్ని స్పష్టం చేస్తోందని నమిత్ జోషి తెలిపారు. టారిఫ్‌ల వల్ల మన జనరిక్ ఔషధాలపై ఆధారపడిన 40% మంది అమెరికా వినియోగదారులకే భారమన్నారు. భారత్‌లో 700కు పైగా యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ప్లాంట్లున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ఔషధ సరఫరా నిబంధనల పాటింపు కోసం పరిశ్రమ ఆర్జిస్తున్న ఆదాయాల్లో 12% వరకూ నాణ్యతా ప్రమాణాల కోసం కేటాయిస్తోందన్నారు.

ప్రధాన మార్కెట్లలో విస్తరణ


భారత ఔషధ ఎగుమతులకు అమెరికా అతి పెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది. అయినప్పటికీ ఆఫ్రికాకు చేస్తున్న ఎగుమతుల్లో 14%, లాటిన్ అమెరికా 11%, కామన్‌వెల్త్ దేశాలకు 8% వృద్ధి కనిపించింది. అధిక వృద్ధి మార్కెట్లలోకి విస్తరించడం వల్ల ఒకే భౌగోళిక ప్రాంతంపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తుందని నమిత్ జోషి వివరించారు.

నిరంతర పెట్టుబడులు కావాలి

అంతర్జాతీయ ఔషధ మార్కెట్‌తో అనుసంధానమవుతున్న నేపథ్యంలో భారత్‌లో పరిశోధన-అభివృద్ధి, ఏఐ ఆధారిత ఔషధ ఆవిష్కరణ, డిజిటల్ హెల్త్ సాంకేతికతలు, సస్టైనబిలిటీ ఉత్పత్తి విభాగాల్లో నిరంతర పెట్టుబడులు అవసరమని ఫార్మెగ్జిల్ భావిస్తున్నట్లు రాజా భాను తెలిపారు. బయోసిమిలర్స్, అరుదైన వ్యాధుల ఔషధాలు, అధిక విలువ విభాగాలపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. సేవలు అందని విభాగాల్లో ప్రాణావసర ఔషధాలను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

3-6 నెలల్లో సుంకాల సవాళ్లు తొలగిపోవచ్చు!

ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అంచనా



ముంబయి: అమెరికా సుంకాలకు సంబంధించిన సవాళ్లు వచ్చే 1-2 త్రైమాసికాల్లో తొలగిపోతాయని, దేశం ఇతర దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొంటున్నందున, ప్రైవేటు రంగం మరింత కృషి చేయాలని ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9.2 శాతంగా నమోదైన వృద్ధి, 2024-25లో 6.5 శాతానికి నెమ్మదించడం వెనక కఠినమైన రుణ పరిస్థితులు, ద్రవ్య లభ్యత సమస్యలు ఉన్నాయన్నారు. సరైన వ్యవసాయ విధానాలు పాటిస్తే స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధిలో 25% జోడించవచ్చని పేర్కొన్నారు.

✦ అమెరికా సుంకాల ప్రభావం అధికంగా పడే రత్నాలు, ఆభరణాలు, రొయ్యలు, వస్త్రాలు వంటి రంగాల గురించి ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉందని, ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ఆయా రంగాలతో చర్చలు కూడా ప్రారంభించిందని తెలిపారు. ఈ నెలాఖర్లో వాణిజ్య చర్చల కోసం అమెరికా అధికారులు మన దేశానికి రావడమే కాక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య జరుగుతున్న సమావేశం నిర్ణయించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

✦ వచ్చే 10-12 ఏళ్లలో వార్షికంగా 80 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని అనంత నాగేశ్వరన్ తెలిపారు.



పబ్లిక్ ఇష్యూకు 'ఫ్రాక్టల్ అనలటిక్స్'

ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యే తొలి భారతీయ ఏఐ కంపెనీ ఇదే

దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సొల్యూషన్లను అందించే సంస్థ ఫ్రాక్టల్ అనలటిక్స్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉంది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా రూ.4,900 కోట్లను సమీకరించేందుకు సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించింది. సెబీ అనుమతులు లభించి, ఐపీఓను విజయవంతంగా పూర్తి చేస్తే.. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యే తొలి భారతీయ ఏఐ సంస్థగా ఫ్రాక్టల్ అనలటిక్స్ నిలుస్తుంది. ప్రతిపాదిత ఇష్యూలో భాగంగా రూ.1,279.30 కోట్ల విలువైన తాజా షేర్లను కంపెనీ జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రస్తుత వాటాదార్లు రూ.3,620.70 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.

స్పోర్ట్స్ స్కూటర్ విభాగంలోకి ఓలా ఎలక్ట్రిక్

దిల్లీ: ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను విస్తరించే ప్రణాళిక సిద్ధం చేస్తున్న ఓలా ఎలక్ట్రిక్, ఆగస్టు 15న స్పోర్ట్స్ స్కూటర్ విభాగంలోకి అడుగుపెట్టబోతున్నట్లు ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కొత్త శ్రేణి స్కూటర్లను శుక్రవారం నిర్వహించనున్న 'సంకల్ప్' వార్షిక కార్యక్రమంలో ఆవిష్కరించనున్నట్లు తెలుస్తోంది. ఈ స్పోర్ట్స్ స్కూటర్లలో ఓలా కృత్రిమ్ ఆధారిత కృత్రిమ మేధ ఫీచర్లు ఉంటాయని సమాచారం. టీవీఎస్ ఎన్‌టార్క్, యమహా ఏరోక్స్, ఏప్రిలియా ఎస్ఆర్160 వంటి ఉత్పత్తుల నేపథ్యంలో మన దేశంలో స్పోర్ట్స్ స్కూటర్ విభాగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఓలా ఎలక్ట్రిక్ ఆవిష్కరించిన జెన్ 3 స్కూటర్ పోర్ట్‌ఫోలియోలో బ్రేక్-బై-వైర్, డ్యూయల్ ఏబీఎస్ వంటి ఫీచర్లను అందించింది. అలాగే సొంత 4680 సెల్‌తో వేరియంట్లను కలిగి ఉంది.

బీపీసీఎల్ లాభం రూ.6,839 కోట్లు

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రూ.6,839.02 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.2,841.55 కోట్లతో పోలిస్తే రెట్టింపునకు పైగా అధికం. విక్రయాలు రూ.1.28 లక్షల కోట్ల నుంచి రూ.1.29 లక్షల కోట్లకు చేరాయి. ముడి చమురు ధరలు తగ్గినా, రిటెయిల్ ధరలు అలాగే ఉంచడంతో మార్కెటింగ్ మార్జిన్లు పెరగడంతో లాభం రాణించిందని కంపెనీ సమాచారమిచ్చింది. బ్యారెల్ ముడి చమురును శుద్ధి చేసి పెట్రోల్, డీజిల్‌గా మార్చడం ద్వారా 4.88 డాలర్లను ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో ఇది 7.86 డాలర్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ 10.42 మిలియన్ టన్నుల ముడి చమురును శుద్ధి చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 10.11 మిలియన్ టన్నుల ముడి చమురును శుద్ధి చేసింది.

ఐఎంపీఎస్ లావాదేవీలపై ఎస్‌బీఐ స్వల్ప ఛార్జీలు

దిల్లీ: ఐఎంపీఎస్ (ఇమ్మీడియట్ పేమెంట్ సర్వీస్) ద్వారా నగదు బదిలీలపై ఛార్జీలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సవరించింది. శాఖ ద్వారా చేసే ఐఎంపీఎస్ లావాదేవీలపై ఛార్జీల్లో ఎటువంటి మార్పులేదు. ఆన్‌లైన్ ద్వారా రూ.25,000 పైబడిన నగదు లావాదేవీలపై మాత్రం రూ.2-10 శ్రేణిలో ఛార్జీలు, జీఎస్‌టీ విధించనున్నారు. ఆగస్టు 15 నుంచి ఇది అమల్లోకి రానుంది. రూ.25000 నుంచి రూ.లక్ష లావాదేవీలపై రూ.2, రూ.1-2 లక్షలపై రూ.6, రూ.2-5 లక్షలపై రూ.10 ఛార్జీలను ఎస్‌బీఐ వసూలు చేయనుంది.

ర్యాపిడో ఫుడ్ డెలివరీ యాప్ ఓన్లీ

దిల్లీ: ర్యాపిడో తన ఫుడ్ డెలివరీ యాప్ ఓన్లీ (ఓడబ్ల్యూఎన్ఎల్‌వై)ని గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ల్యాండింగ్ పేజీ స్విగ్గీ తరహాలోనే ఉన్నా బ్యాక్‌డ్రాప్ ఊదా (పర్పుల్) రంగులో ఉంది. రూ.150లోపు ఉన్న ఆహార పదార్థాలపై ఈ యాప్ దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. చాలా వరకు ఉత్తరాది ఆహార పదార్థాలైన చపాతీ, రైస్, గుడ్లు వంటి వాటి ధరలు రూ.100లోపు ఉంటాయి. బెంగళూరులోని కోరమంగళ, హెచ్ఎస్ఆర్ లేఔట్ వంటి ఎంపిక చేసిన ప్రాంతాల్లో తొలుత ఫుడ్ డెలివరీలు చేయనున్నట్లు సమాచారం. ఓన్లీ యాప్ జీరో-కమీషన్ ప్లాట్‌ఫామ్‌గా వినియోగదార్లకు ఆఫ్‌లైన్ ధరలకే ఆహార పదార్థాలు సరఫరా చేయనుంది.

సంక్షిప్తంగా

✤ నాగ్‌పూర్‌లో రూ.700 కోట్ల పెట్టుబడితో 350 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసే నిమిత్తం మహారాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన పూర్వక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు **మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్** తెలిపింది.

✤ దక్షిణ భారతదేశంలోని బెంగళూరు, కేరళ, చెన్నైలో ఏర్పాటు చేస్తున్న ఆరు హోటళ్లను నిర్వహించేందుకు **మారియట్ ఇంటర్నేషనల్‌**తో బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది.

✤ శీతాకాలం షెడ్యూల్‌కు ముందు ఐదు బోయింగ్ 737ఎస్ విమానాల కోసం డ్యాంప్- లీజ్ ఒప్పందాన్ని ఖరారు చేసినట్లు **స్పైస్‌జెట్** తెలిపింది.

✤ 280 మెగావాట్ల ఫర్మ్ అండ్ డిస్పాచ్‌బుల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వ రంగ ఆర్ఈసీ నుంచి రూ.3,184 కోట్ల నిధుల సాయాన్ని తమ అనుబంధ సంస్థ ఏసీఎంఈ హైబ్రిడ్ ఉర్జా పొందినట్లు **ఏసీఎంఈ సోలార్ హోల్డింగ్స్** తెలిపింది.

✤ గుజరాత్‌లో 300 కిలోటన్నుల వార్షిక సామర్థ్యంతో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును అభివృద్ధి చేసే నిమిత్తం జపాన్‌కు చెందిన ఐటీఓసీహెచ్‌యూ కార్పొరేషన్‌తో **ఎల్ అండ్ టీ ఎనర్జీ గ్రీన్ టెక్ లిమిటెడ్** జట్టు కట్టింది.

✤ నిధుల మళ్లింపు, పద్దు పుస్తకాల్లో అవకతవకలకు పాల్పడినందుకు గాను **డీహెచ్ఎఫ్ఎల్** మాజీ సీఎండీ కపిల్ వాధ్వాన్, మాజీ డైరెక్టరు ధీరజ్ వాధ్వాన్‌తోపాటు మరో నలుగురిని ఐదేళ్ల వరకు సెక్యూరిటీస్ మార్కెట్లలో పాల్గొనకుండా సెబీ నిషేధం విధించింది. అలాగే మొత్తంగా రూ.120 కోట్ల జరిమానా చెల్లించాలంటూ కూడా ఆదేశాలిచ్చింది.

✤ రక్షణ రంగ కంపెనీల షేర్ల పనితీరును గమనించేందుకు వీలుగా డిఫెన్స్ సూచీని ప్రారంభించినట్లు బీఎస్ఈకి చెందిన **బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్** తెలిపింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
జీఈ పవర్ ఇండియా	34.72	(9.54)	339.95	252.87
ఏషియన్ గ్రానిటో ఇండియా	7.6	(1.7)	388.20	360.1
ఇండిక్యూబ్ స్పేసెస్	(36.75)	(42.04)	324.12	251.30
టార్క్	54.21	(30.67)	295.36	9.62
జుబిలంట్ ఫుడ్‌వర్క్స్	94.33	58.02	2260.86	1933.06
సెంకో గోల్డ్	104.60	51.30	1826.20	1403.80
ఆదిత్య బిర్లా లైఫ్‌స్టైల్	24.06	22.93	1840.58	1784.47
తమిళనాడు పెట్రో	35.25	15.05	470.61	469.53
మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్	345.00	295.00	2,574.00	2,028.00
బలరామ్‌పుర్ చినీ మిల్స్	51.57	70.15	1542.27	1421.59
సీఎస్‌బీ బ్యాంక్	119.00	113.00	1286.00	1004.00
ముత్తూట్ ఫైనాన్స్	1974.00	1196.00	6485.00	4492.00
ఇన్‌సెక్టిసైడ్స్	58.10	49.37	691.13	656.68
దేవయానీ ఇంటర్నేషనల్	2.22	22.43	1356.96	1221.90
యునైటెడ్ స్పిరిట్స్	417.00	485.00	6295.00	6238.00
టెక్స్‌మాకో	29.00	58.00	911.00	1088.00

2025-26లో ద్రవ్యోల్బణం 3.5%!

క్రిసిల్ అంచనా

కోల్‌కతా: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ద్రవ్యోల్బణం 3.5 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా వేసింది. 2024-25లో ఇది 4.6 శాతంగా నమోదయ్యింది. ఈసారి ఆహార ఉత్పత్తుల దిగుబడి మెరుగ్గా ఉండనుండటంతో ద్రవ్యోల్బణం అదుపులోకి రావొచ్చని తన పరిశోధనా నివేదికలో తెలిపింది. ప్రపంచ అనిశ్చితులు అదుపులోకి వస్తే కనుక, 2025-26లో బ్రెంట్ చమురు ధర బ్యారెల్‌కు 60-65 డాలర్ల శ్రేణిలో నమోదుకావచ్చని క్రిసిల్ తెలిపింది. ఈ పరిణామం కూడా ఆహారేతర ఉత్పత్తుల ద్రవ్యోల్బణం తగ్గడానికి ఉపకరిస్తుందని నివేదిక తెలిపింది.



✦ రిటైల్ ద్రవ్యోల్బణం బాగా తగ్గితే కుటుంబాల కొనుగోళ్ల శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలకు ఇది బాగా ఉపయోగపడుతుంది. కీలక రేట్లను మరింతగా తగ్గించేందుకు కూడా ఆర్‌బీఐకు వెసులుబాటు కలుగుతుంది.

కీలక రేట్ల కోతకు అవకాశం

✦ మొత్తం మీద రెపో రేటును ఇప్పటివరకు ఆర్‌బీఐ 100 బేసిస్ పాయింట్లను ఆర్‌బీఐ తగ్గించింది. ఈ ఆర్థిక సంవత్సరం మిగతా కాలంలో మరో మారు కీలక రేట్లను ఆర్‌బీఐ తగ్గించే అవకాశం ఉందని నివేదిక తెలిపింది.

✦ ఏడాదికాలంగా రిటైల్ ద్రవ్యోల్బణం సగానికి పైగా తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ లక్ష్యంలోని దిగువ స్థాయైన 2% కంటే కూడా కిందకు వచ్చింది. జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.1% కాగా.. జులైలో 1.6 శాతానికి తగ్గింది.

భారత వృద్ధికి ఢోకా లేదు: ఎస్ అండ్ పీ

భారత వృద్ధిపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఉండకపోవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. భారత్ వాణిజ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థ కాదని, సార్వభౌమ రేటింగ్ భవిష్యత్ అంచనాలను సానుకూలంగా ఉంచింది. గత ఏడాది మేలో ఎస్ అండ్ పీ మన సార్వభౌమ రేటింగ్‌ను 'బీబీబీ-' 'స్థిరత్వం' నుంచి సానుకూలానికి మార్చింది. ఆర్థిక వృద్ధి బలంగా ఉంటుందని పేర్కొంది. అయితే మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై తొలుత 25 శాతం సుంకాన్ని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఈ నెల 27 నుంచి మరో 25 శాతం అమలు చేస్తామని తెలిపారు. రష్యా నుంచి చమురును భారత్ కొనుగోలు చేస్తున్నందునే, 25 శాతం అదనపు సుంకాన్ని విధించనున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీడీపీ వృద్ధి 6.5 శాతం నమోదు కావొచ్చని ఎస్ అండ్ పీ అంచనా వేసింది.

10% తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఓఎన్‌జీసీ రూ.8,024 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.8,938 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 10 శాతం తక్కువ. చమురు ధరలు తగ్గడం, పాత క్షేత్రాల నుంచి ఉత్పత్తి మందగమనం వంటివి ఇందుకు ప్రభావం చూపాయి. వెలికితీసిన ప్రతి బ్యారెల్ ముడి చమురుపై కంపెనీ 67.87 డాలర్లను ఆర్జించింది. ఏడాది క్రితం ఇది 80.64 డాలర్లుగా ఉంది. సహజ వాయువు ధర మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్లకు 6.5 డాలర్ల నుంచి స్వల్పంగా పెరిగి 6.64 డాలర్లకు చేరింది. కొత్త చమురు బావుల నుంచి గ్యాస్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 20 శాతం ఎక్కువకు అర్హత పొందినట్లు కంపెనీ తెలిపింది. మొదటి త్రైమాసికంలో కొత్త బావుల నుంచి గ్యాస్ ఆదాయం రూ.1703 కోట్లుగా ఉందని, ఏపీఎం గ్యాస్ ధరతో పోలిస్తే అదనంగా రూ.333 కోట్లు వచ్చాయని వివరించింది. కంపెనీ ముడిచమురు ఉత్పత్తి 4,623 మిలియన్ టన్నుల నుంచి 4,683 మిలియన్ టన్నులకు చేరింది. గ్యాస్ ఉత్పత్తిలో పెద్దగా మార్పులేకుండా 4,848 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉంది.

26 వారాల సెలవులను మూడేళ్లలో ఎప్పుడైనా వాడొచ్చు

మాతృత్వ/పితృత్వ సెలవులపై ఎటెర్నల్

దిల్లీ: తమ ఉద్యోగులకు మాతృత్వ/పితృత్వ సెలవుల(పేరెంటల్ లీవ్) కింద ఇచ్చే 26 వారాలను శిశువు జననానికి ముందు సమయంతో ప్రారంభించి మూడేళ్ల వరకు ఎప్పుడైనా వాడుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఎటెర్నల్ లిమిటెడ్ తెలిపింది. తల్లిదండ్రులు ఇద్దరికీ ఈ కొత్త విధానం వర్తిస్తుందని పేర్కొంది. అలాగే దత్తత తీసుకున్నా, సరోగసి ద్వారా సంతానాన్ని పొందే వారికి కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని వెల్లడించింది. 'నేటి తరంలో తల్లిదండ్రుల బాధ్యతలను, ఇబ్బందులను అర్థం చేసుకొని ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చాం. పని ప్రదేశంలో, ఇంటి వద్ద ప్రతి ఒక్క ఉద్యోగికి సానుకూల పరిస్థితులను సృష్టించాలన్నదే దీని వెనక మా ఉద్దేశమ'ని ఎటెర్నల్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్) నిహారిక మొహంతీ తెలిపారు. తమ ఉద్యోగుల నుంచి అభిప్రాయాన్ని సేకరించి ఈ విధానంలో మార్పులు చేసినట్లు తెలిపారు.

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.3644.43 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు.. రూ.5623.79 కోట్లు

వాహన, లోహ షేర్ల రాణింపు

● లాభాలతో ముగిసిన మన మార్కెట్లు ● రూ.2.09 లక్షల కోట్లు పెరిగిన సంపద

సమీక్ష

వాహన, లోహ, ఔషధ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మన స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు స్థిరంగా నమోదవ్వడంతో ప్రపంచ మార్కెట్లు రాణించడం కూడా సానుకూల ప్రభావాన్ని చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు పెరిగి 87.47 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడి చమురు 0.68% నష్టంతో 65.71 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు లాభాలతో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.2.09 లక్షల కోట్లు పెరిగి రూ.445.39 లక్షల కోట్లు (5.08 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

ఆద్యంతం లాభాల్లోనే...

సెన్సెక్స్ ఉదయం క్రితం ముగింపు (80,235.59)తో పోలిస్తే 256 పాయింట్ల లాభంతో 80,492.17 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ.. 80,683.74 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 304.32 పాయింట్ల లాభంతో 80,539.91 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 131.95 పాయింట్లు పెరిగి 24,619.35 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో 24,664.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 24,535.25 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది.



9 కంపెనీలు మినహా మిగతావి లాభాల్లో...

సెన్సెక్స్ 30 షేర్లలో 9 మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా బీఈఎల్ 2.25% పెరిగింది. అలాగే ఎటర్నల్ 2.08%, కోటక్ బ్యాంక్ 1.49%, టాటా మోటార్స్ 1.48%, ఎం అండ్ ఎం 1.42%, పవర్‌గ్రిడ్ 1.33%, భారతీ ఎయిర్‌టెల్ 0.96%, సన్‌ఫార్మా 1.08%, బజాజ్ ఫైనాన్స్ 0.89%, ఏషియన్ పెయింట్స్ 0.87% లాభాల్లో ముగిశాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ 0.78%, ఐటీసీ 0.58%, టైటాన్ 0.55%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.46%, యాక్సిస్ బ్యాంక్ 0.28%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.07%, మారుతీ 0.06%, ఎన్‌టీపీసీ 0.06%, టాటా స్టీల్ 0.03% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల్లో.. ఆరోగ్య సంరక్షణ, లోహ, వాహన, ఇండస్ట్రియల్స్, ఆర్థిక సేవలు పెరిగాయి. చమురు- గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగాలు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 2,230 కంపెనీల షేర్లు లాభపడగా, 1,861 కంపెనీలు షేర్లు నష్టపోయాయి. 155 కంపెనీల షేర్లు యథాతథంగా ముగిశాయి.

సెన్సెక్స్ ▲ 304 — 80540

నిఫ్టీ ▲ 132 — 24619

✦ ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి నికర లాభంలో 79 శాతం వృద్ధిని ప్రకటించడంతో నైకా మాతృసంస్థ అయిన ఎఫ్ఎస్ఎన్ ఇ-కామర్స్ షేరు దూసుకెళ్లింది. బీఎస్ఈలో 4.93 శాతం పెరిగి రూ.215.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 7.7 శాతం వరకు పెరిగి రూ.220.75 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

✦ ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా కార్యకలాపాలు నిర్వహించేందుకు పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్‌కు ఆర్‌బీఐ అనుమతినివ్వడంతో పేటీఎం బ్రాండు మాతృసంస్థ అయిన వన్97 కమ్యూనికేషన్స్ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 3.07 శాతం లాభంతో రూ.1,154.30 వద్ద ముగిసింది.

ఐపీఓ సమాచారం

✦ జెమ్ ఆరోమాటిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) ఇష్యూ ధరగా రూ.309- 325ను నిర్ణయించారు. ప్రతిపాదిత ఐపీఓ ఆగస్టు 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.451 కోట్లను సమీకరించాలని కంపెనీ అనుకుంటోంది.

✦ విక్రమ్ సోలార్ ఐపీఓకు ధరల శ్రేణి రూ.315-332. ఇష్యూ ఆగస్టు 19న ప్రారంభమై ఆగస్టు 21న ముగుస్తుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.2,079 కోట్లను సమీకరించే యోచనలో ఉంది.

✦ బ్లూస్టోన్ జ్యువెలరీ ఐపీఓకు చివరి రోజు ముగిసేనాటికి 2.7 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,65,14,421 షేర్లను విక్రయానికి ఉంచగా.. 4,46,20,386 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 1.35 రెట్ల స్పందన లభించింది.

✦ రెగాల్ రిసోర్సెస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు రెండో రోజు ముగిసేనాటికి 26.38 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 2,09,99,664 షేర్లను జారీ చేయనుండగా.. 55,40,41,008 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 21.82 రెట్ల స్పందన లభించింది.

ఈనాడు సినిమా

జింక అనుకునే సింహం ఏం చేసిందంటే?




సిరీస్: 'కానిస్టేబుల్ కనకం'
విడుదల: గురువారం
ప్లాట్‌ఫామ్: ఈటీవీ విన్

కథాంశం: జాతరలు, పండగలతో ప్రశాంతంగా ఉండేది రేపల్లె గ్రామం. కానీ అక్కడున్న అడవిగుట్టలో అమ్మాయిలు అదృశ్యమవుతూ ఉంటారు. ఆ ఊరికే మొదటి లేడి కానిస్టేబుల్‌గా వచ్చిన కనకమహాలక్ష్మి ఈ కేసును ఛేదించడానికి రంగంలోకి దిగుతుంది. మరి ఈ సమస్యను ఆమె ఎలా పరిష్కరించిందో తెలుసుకోవాలంటే 'కానిస్టేబుల్ కనకం' సిరీస్ చూడాల్సిందే. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ తెరకెక్కించిన సిరీస్ ఇది. రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. "సింహం, చిరుత.. ఇలాంటి మృగాలు ఎన్ని చేసినా ఆ జింక బెదరలేదు.. ఎందుకంటే.. అది జింకే కాదు" అంటూ ఇటీవలే జానపద పాట రూపంలో విడుదలైన ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. మరి అందరూ జింక అనుకునే ఆ సింహం ఈ కేసును ఎలా పరిష్కరించిందో మీరూ చూడండి.



ఎన్టీఆర్, హృతిక్‌రోషన్



రజనీ కాంత్

బాక్సాఫీస్ దగ్గర యుద్ధమే!

అగ్ర తారలకు ఉన్న బలం ఏమిటో... ఆకర్షణీయమైన కలయికలపై ప్రేక్షకుల్లో ఏ స్థాయిలో అంచనాలు ఉంటాయో... వాటి కోసం ఎంత ఆత్రుతగా ఎదురు చూస్తుంటారో మరోసారి బాక్సాఫీస్ రుజువు చేస్తోంది. నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్న 'వార్ 2', 'కూలీ' సినిమాల టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఆకాశమే హద్దు అనిపించేలా భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమాలు అందుకు తగ్గట్టుగానే నువ్వా నేనా అన్నట్టుగా అడ్వాన్స్ బుకింగ్స్‌తో హోరెత్తించాయి. ఇక థియేటర్లకు వెళ్లిన ప్రేక్షకుల్నీ మెప్పించాయంటే వసూళ్లలో సరికొత్త రికార్డులు ఖాయమైనట్టే!

- నేడే ప్రేక్షకుల ముందుకు 'వార్ 2', 'కూలీ'
- ఆకాశమే హద్దుగా అంచనాలు
- అందుకు దీటుగా ప్రారంభ వసూళ్లు

ఈ ఏడాది దేశంలో ఎక్కువ మంది ఆసక్తిగా ఎదురు చూసిన సినిమాల జాబితాలో 'వార్ 2', 'కూలీ' చిత్రాలు ముందున్నాయి. ఈ రెండూ ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తుండడంతో దేశవ్యాప్తంగా సినీ మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో 'వార్ 2' హవా కనిపిస్తుండగా, దక్షిణాదిలో రజనీ 'కూలీ' జోరు ప్రదర్శిస్తోంది. ప్రీమియర్ షో బుకింగ్స్ తోనే రజనీకాంత్ ఓవర్సీస్‌లో ఓ సరికొత్త రికార్డుని సృష్టించారు. ప్రీమియర్ షోలతోనే అమెరికాలో ఈ చిత్రం 3 మిలియన్ డాలర్ల మార్క్‌కి చేరువైంది. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటించిన 'వార్ 2' అటు ఉత్తరాదిలోనూ, ఇటు తెలుగులోనూ ముందస్తు టికెట్ సేల్స్‌తో దుమ్ము రేపింది.

తెర నిండా తారలే...

రెండు సినిమాలకూ తారలే ప్రధాన ఆకర్షణ. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'కూలీ'లో, మరో అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రతినాయకుడిగా నటించడం విశేషం. ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషించారు. పూజా హెగ్డే ప్రత్యేక మెరుపులు ఇప్పటికే ఆకర్షణగా నిలిచాయి. ఇదంతా ఒకెత్తైతే, రజనీకాంత్ - లోకేశ్ కనగరాజ్ కలయికలో ఈ చిత్రం రూపొందడం మరో ఆకర్షణ. నవతరం ప్రేక్షకుల్ని అలరించేలా సినిమాలు తీయడంలో సిద్ధహస్తుడైన లోకేశ్ దర్శకత్వంలో రజనీ నటించిన తొలి చిత్రమిదే. అనిరుధ్ స్వరాలు సమకూర్చారు. ఈ సినిమా ఆరంభం నుంచే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాల్ని రేకెత్తించింది. దాదాపు రూ. 400 కోట్ల వ్యయంతో రూపొందిన సినిమా ఇది. దాదాపు రూ. 53 కోట్లకు ఈ సినిమా తెలుగు ప్రదర్శన హక్కుల్ని సునీల్ నారంగ్, సురేశ్‌బాబు, దిల్‌రాజు సొంతం చేసుకున్నారు. 'వార్ 2'.. ప్రఖ్యాత యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ రూపొందిస్తున్న స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన చిత్రం. 'వార్'కి కొనసాగింపుగా రూపొందింది. కియారా అడ్వాణీ కథానాయిక. ఇందులో ఇద్దరు కథానాయకులూ సైనికులుగా కనిపించనున్నారు. వాళ్లిద్దరి మధ్య యుద్ధం ఎందుకు? ఎలా సాగిందన్నది ఇందులో కీలకం. సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో రూపొందిన ఈ సినిమా తెలుగు ప్రదర్శన హక్కుల్ని సూర్యదేవర నాగవంశీ రూ. 80 కోట్లకు సొంతం చేసుకున్నట్టు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర'... ఇలా వరుస విజయాలతో దూసుకెళుతున్న ఎన్టీఆర్ నుంచి వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలున్నాయి. అందుకు తగ్గట్టే ఈ సినిమా ప్రారంభ వసూళ్లతో సత్తా చాటుతోంది.

ఆయనకి 50... వీళ్లకు 25



భగవాన్ దాదాలో రజనీ, హృతిక్

రజనీకాంత్ ప్రయాణానికి ఈ నెల 15తో యాభయ్యేళ్లు పూర్తవుతాయి. కెరీర్‌లో ఓ కీలకమైన మైలురాయిని చేరుకున్న రజనీకాంత్‌కి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బాలీవుడ్ కథానాయకుడు హృతిక్‌రోషన్ కూడా ఎక్స్ ద్వారా స్పందిస్తూ "నటుడిగా నేను మొదటి సినిమా మీతోనే చేశా. నా గురువులలో మీరూ ఒకరు. ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నందుకు ధన్యవాదాలు" అంటూ ఫొటోతోపాటు పోస్ట్‌ని పంచుకున్నారు. హృతిక్, ఎన్టీఆర్‌లకు కూడా 'వార్ 2' మైలురాయి లాంటి చిత్రమే. హృతిక్ కథానాయకుడిగా నటించిన 'కహోనా ప్యార్ హై' 2000లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంటే ఆయనకి కథానాయకుడిగా ఇది 25వ ఏడాది. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'నిన్ను చూడాలని' 2001లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆయన కూడా 25 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన 'వార్ 2' ముందస్తు వేడుకలో తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు.

కథను గోప్యంగా ఉంచండి ప్లీజ్

హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌ల కాంబోను తెరపై చూడటానికి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా థియేటర్లలో విడుదలకానున్న నేపథ్యంలో కథానాయకులు ఇద్దరూ సినిమా ట్విస్ట్‌ని గోప్యతగా ఉంచాలని కోరారు. "'వార్ 2' సినిమాను ప్రేమతో ఎంతో సమయం వెచ్చించి చాలా అభిరుచితో నిర్మించారు. ఈ సినిమా కథలోని మలుపులు, సినిమాటిక్ దృశ్యాన్ని అనుభవించాలంటే దీనిని థియేటర్లలోనే చూడాలి. మీడియా, ప్రేక్షకులు, అభిమానులు మీ అందరికీ ఓ అభ్యర్థన.. సినిమా చూసిన తర్వాత కథాంశాన్ని గోప్యంగా ఉంచుతారని కోరుతున్నాను. అది మిగిలిన ప్రేక్షకులకు ఒక సర్‌ప్రైజ్‌గా ఉంటుంది" అని హృతిక్ రోషన్ చెప్పారు. "సినిమా చూసినప్పుడు మీరు థియేటర్లలో పొందిన ఆనందం, థ్రిల్, వినోదాన్ని ఇతరులు కూడా అనుభవించాలి. కాబట్టి కథలోని ట్విస్ట్‌లను రహస్యంగా ఉంచండి. అవి ముందే తెలిసిపోతే ఇతరులు సినిమా చూసే విధానంపై తీవ్రంగా ప్రభావితం చూపుతాయి" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. పైరసీని ప్రోత్సహించొద్దు అని ఇద్దరు హీరోలు సామాజిక మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేశారు.


ఎన్నెన్నో కబుర్లు వినిపిస్తున్నాయ్

అగ్ర కథానాయిక సమంత ఒకప్పటిలా మళ్లీ తెరపై మెరిసేందుకు సన్నద్ధం అవుతోందా? ఆమెని దృష్టిలో ఉంచుకుని దర్శకులు పాత్రల్ని సిద్ధం చేస్తున్నారా? నిజమే అనే సంకేతాలు ఇస్తున్నాయి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమ వర్గాలు. కొన్నాళ్లుగా ఆమెకు సంబంధించి రెండు పరిశ్రమల్లోనూ రోజుకొక కొత్త కబురు వినిపిస్తోంది. తన సొంత నిర్మాణంలో 'మా ఇంటి బంగారం' సినిమాని ఇప్పటికే ప్రకటించిన సమంత... ఇతర సినిమాలపై కూడా దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. కథానాయికగా ఆమె పూర్తి స్థాయి సినిమా చేయక చాలా కాలమైంది. 'ఖుషి' తర్వాత ఆమె ఇటీవల 'శుభం'లో ఓ చిన్న అతిథి పాత్రలో మెరిశారంతే. పలువురు అగ్ర కథానాయకుల సినిమాల విషయంలో ఆమె పేరు వినిపించినా, ఏదీ కార్యరూపం దాల్చలేదు. అయితే తాజాగా రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా విషయంలో ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. ఇందులోని ఓ ప్రత్యేక గీతం కోసం సమంతని సంప్రదించారని సమాచారం. 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా...' పాట చేశాక, మళ్లీ ఆమె ప్రత్యేక గీతం చేయలేదు. 'పెద్ది'లో ఆమె సందడి చేసే అవకాశాలున్నాయని సమాచారం. అలాగే తమిళం నుంచి కూడా ఓ కొత్త కబురు వినిపిస్తోంది. అక్కడ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న 'ఖైదీ 2' సినిమాలో సమంత నటించే అవకాశాలున్నట్టు ప్రచారం సాగుతోంది. 'ఖైదీ' సినిమాలో కథానాయికలెవ్వరూ ఉండరు. కానీ 'ఖైదీ2'లో ఓ నాయికని పరిచయం చేయాలనే ఆలోచనలో లోకేశ్ ఉన్నట్టు సమాచారం.



సమంత

'కెప్టెన్ ఇండియా' సన్నాహాలు



కార్తిక్ ఆర్యన్

గతేడాది 'భూల్ భులయ్యా 3'తో ప్రేక్షకుల్ని పలకరించిన బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్.. ప్రస్తుతం వరుస అవకాశాల్ని అందుకుంటూ జోరుమీదున్నారు. ఆయన ప్రధాన పాత్రలో హన్సల్ మెహతా దర్శకత్వంలో 'కెప్టెన్ ఇండియా' సినిమాను అప్పట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల ఆగిపోయిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. హన్సల్ మెహతా స్థానంలో 'చక్ దే ఇండియా' ఫేమ్ షిమిత్ అమీన్ దర్శకుడి కుర్చీలో కూర్చోబోతున్నట్లు సమాచారం. "'కెప్టెన్ ఇండియా' చిత్రం గురించి కొన్ని రోజులుగా కార్తిక్, షిమిత్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. 2026 ప్రథమార్ధంలో సెట్స్ పైకి తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని కార్తిక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ధర్మధ్వజం రెపరెపలాడాలంటే..



సత్యరాజ్, సత్యం రాజేశ్

అనగనగా ఒక అందమైన పూల తోట. అందులో తోటమాలి ప్రాణంగా పెంచుకున్న ఓ గులాబీ మొక్క. ఆ మొక్కనే మాయం చేయాలనుకున్నారు కొందరు. మరి తోటమాలి ఊరుకుంటాడా? అసలే అతను సామాన్యుడు కాదు. ఈ కథలో తాత తోటమాలి అయితే, మనవరాలు గులాబీ మొక్క. ప్రాణప్రదమైన గులాబీ మొక్కని కాపాడుకునేందుకు తోటమాలిలాంటి ఆ తాత ఎలాంటి పోరాటం చేశాడు? పురాణాల్లోని బార్బరికుడికీ, ఈ తోటమాలికీ సంబంధం ఏమిటి? తదితర విషయాలు తెలియాలంటే 'త్రిబాణధారి బార్బరిక్' చూడాల్సిందే. సత్యరాజ్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రమిది. వశిష్ఠ ఎన్.సింహా, సత్యం రాజేశ్, ఉదయభాను, క్రాంతికిరణ్, సాంచీరాయ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మోహన్ శ్రీవత్స దర్శకుడు. విజయ్‌పాల్ రెడ్డి అడిదెల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు మారుతి సమర్పకులు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. 'చూడు బార్బరిక ఈ యుద్ధం నీది... ధర్మధ్వజం రెపరెపలాడాలంటే... అధర్మం చేసేవారికి దండన లభించాలి....' అంటూ మొదలయ్యే ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. వర్తమాన అంశాలతో పురాణాల్ని ముడిపెడుతూ ఈ సినిమాని రూపొందించినట్టు ట్రైలర్ చాటుతోంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిన ఈ చిత్రం అందరినీ అలరించేలా ఉంటుందని, ట్రైలర్‌కి మంచి స్పందన లభిస్తోందని సినీ వర్గాలు తెలిపాయి.

కుదరని ఏకాభిప్రాయం.. కొలిక్కిరాని చర్చలు

సినీ కార్మికుల వేతనాల పెంపు విషయంపై జరుగుతున్న చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. పని విధానాలకు సంబంధించి నిర్మాతలు తీసుకొచ్చిన కొన్ని ప్రతిపాదనల్ని కార్మిక సంఘాలు అంగీకరించడం లేదు. వాటిపై ఏకాభిప్రాయం కుదిరితేనే చర్చలు కొలిక్కి వస్తాయని ఫిల్మ్ ఛాంబర్ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో ఎఫ్.డి.సి ఛైర్మన్ దిల్‌రాజు, సమన్వయ కమిటీ, ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో నిర్మాతలకీ, కార్మిక సంఘాలకీ మధ్య నాలుగు గంటలపాటు చర్చలు జరిగాయి. అందులో పని విధానాలకు సంబంధించి ప్రధానంగా ప్రస్తావన వచ్చినట్టు తెలుస్తోంది. వాటి విషయంలోనే ఇరు వర్గాలకీ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు ఫలప్రదం కాలేదు. దీని గురించి ఇంకా రెండు మూడు సార్లు మాట్లాడుకోవాల్సి ఉందని దిల్‌రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ "సానుకూల ధోరణిలోనే చర్చలు జరుగుతున్నాయి. వేతనాలు పెంచాలని కార్మిక సమాఖ్య డిమాండ్ చేస్తోంది. అయితే నిర్మాతల నుంచి కొన్ని ప్రతిపాదనలు ఉన్నాయి. 2018, 2022లో జరిగిన ఒప్పందంలో ఉన్న షరతులు అమలు కావడం లేదనే విషయాన్ని నిర్మాతలు కార్మిక సమాఖ్య దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటే, వేతనాలు పెంచడానికి నిర్మాతలు సిద్ధంగానే ఉన్నారు. సమాఖ్య నాయకులు అన్ని సంఘాలతో మాట్లాడుకుని వస్తేనే ఈ సమస్యకి పరిష్కారం లభిస్తుంది. ఇంకా రెండు మూడు దఫాలు కూర్చుని మాట్లాడుకోవాల్సి ఉంద"ని చెప్పారు దిల్‌రాజు.

సామాజిక అంశాలతో 'ఓఎమ్‌జీ 3'



అక్షయ్ కుమార్

'ఓఎమ్‌జీ' చిత్రాలలో పరమశివుడి పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని మెప్పించారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. దర్శకుడు అమిత్ రాయ్ తెరకెక్కించిన ఈ ఫ్రాంఛైజీ ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై సినీప్రియుల్ని అలరించింది. ఇప్పుడిందులో మూడో భాగం రాబోతున్నట్లు ప్రకటించారు దర్శకుడు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ఇప్పటికే మొదలైనట్లు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "సామాజిక అంశాలు, సమస్యలపై 'ఓఎమ్‌జీ 3'ను తీర్చిదిద్దుతున్నాం. మునుపటి రెండు భాగాల కంటే భారీగా దీన్ని రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాదిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. అక్షయ్ కూడా ఇందులో భాగమవుతున్నార"ని చెప్పుకొచ్చారు.

బెంగాలీ నటి బసంతి ఛటర్జీ మృతి



సీనియర్ బెంగాలీ నటి బసంతి ఛటర్జీ (88) కన్నుమూశారు. కొంత కాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆమె మంగళవారం కోల్‌కతాలోని తన నివాసంలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుల్లితెరపై విశేష ప్రేక్షకాదరణను సొంత చేసుకున్న బసంతి.. 'తగిని', 'మంజరి ఒపెరా', 'అలో' లాంటి చిత్రాల్లో వెండితెరపై మెరిసి తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా చిత్రసీమలో రాణించిన ఆమె 100కి పైగా సినిమాల్లో నటించి మెప్పించారు. "ఆమె మరణం సినిమా, రంగస్థల ప్రపంచానికి తీరని లోటు. బసంతి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి" అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు పలువురు సినీ ప్రముఖులు బసంతి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఆమె ముందు కాదు మీ ఎత్తుగడలు!

బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేశ్, దివ్య ఖోస్లా కుమార్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఏక్ చతుర్ నార్'. ఉమేశ్ శుక్లా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. కానీ మీరు అర్థం చేసుకునేటప్పటికి ఆలస్యం అయిపోతుంది. ఇందులో చాలా ఎత్తుగడలు ఉన్నాయి. కానీ ఆమె ముందు ఇవేవీ పనిచేయవ" నే వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో తెలివైన అమ్మాయిగా దివ్య.. ఆమె చేతిలో ఇరుక్కుపోయిన పాత్రలో నీల్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 12న రానుందీ చిత్రం.



దివ్య ఖోస్లా కుమార్, నీల్ నితిన్ ముఖేశ్



ఘన వ్యర్థాల నిర్వహణ - ఆర్థికాభివృద్ధి

పారిశ్రామికీకరణతో పెరిగిన.. ఘన వ్యర్థాల ముప్పు!



ప్రస్తుత కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి.. ఆధునిక జీవన శైలిని అలవరచుకున్నారు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వారి స్థితిగతులను ఎంతగానో ప్రభావితం చేశాయి. వస్తువుల వినియోగం అధికమైంది. ముఖ్యంగా 'యూజ్ అండ్ త్రో' పద్ధతిలో వస్తువులను తయారు చేస్తుండటంతో వాటి ఉత్పత్తి పెరిగింది. ఫలితంగా ఘన వ్యర్థాల సమస్య తీవ్రమైంది. వీటిలో కొన్ని సేంద్రియ ప్రక్రియ వల్ల సహజంగా క్షయం చెందితే, మరికొన్ని అదే పరిమాణంలో విచ్ఛిన్నం కాకుండా, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణ ప్రధాన సమస్యగా మారింది. ఘన వ్యర్థాల రకాలు - వాటి నిర్వహణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

ఘన వ్యర్థాల నిర్వహణ

వ్యర్థాల నిర్వహణ అనేది ప్రజారోగ్య, పర్యావరణ సుస్థిరతకు ప్రధానం. ముఖ్యంగా భారత్ లాంటి వేగంగా పట్టణీకరణ జరుగుతున్న దేశాల్లో ఇది ఎంతో ముఖ్యమైంది.

- 'జాతీయ కాలుష్య నియంత్రణ బోర్డు' నివేదిక ప్రకారం మన దేశంలో రోజుకు సుమారు 1.60 లక్షల టన్నుల వ్యర్థాలు పోగు పడుతున్నాయి. ఇందులో 95.4% సేకరిస్తున్నారు. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోతే అనేక రకాల పర్యావరణ, ఆరోగ్య, ఆర్థికపరమైన దుష్ప్రభావాలు తలెత్తుతాయి.
- ఘన వ్యర్థ పదార్థాల ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో ఇప్పటి వరకు కేంద్ర పర్యావరణ అడవుల మంత్రిత్వశాఖ అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది. 2006లో నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ పాలసీని విడుదల చేసింది.
- పర్యావరణ పరిరక్షణలో కార్పొరేట్ సంస్థల బాధ్యతను ప్రతిబింబించే విధంగా ఒక చార్టర్‌ను కూడా ఈ విధానంలో పొందుపరిచారు. ఘన వ్యర్థాల విడుదలకు కారణమవుతున్న 17 ప్రధాన పరిశ్రమలను గుర్తించారు.
- 2024, అక్టోబరు 2న జరిగిన స్వచ్ఛభారత్ మిషన్ 10వ వార్షిక సమావేశంలో Swabhav Swachhata Sanskaar Swachhata (4S) క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

నిర్వచనాలు

- ఒక్కసారి మాత్రమే వినియోగానికి వీలున్న వస్తువులు, అవశేషాలను ఘన వ్యర్థాలంటారు. పరిశ్రమలు, గనులు, వ్యవసాయం, వాణిజ్య సంస్థల నుంచి విడుదలయ్యే ఘన, పాక్షిక ఘన పదార్థాలు; పాడైన సిలిండర్లు - వస్తువులు; నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, కాలుష్య నియంత్రణ ప్రక్రియల్లో వెలువడే చెత్తను (sludge) ఘన వ్యర్థాలుగా నిర్వచిస్తారు. డ్రైనేజీలు, జలవనరుల్లో కరిగిన చెత్తను ఘన వ్యర్థాలుగా పరిగణించరు.
- వృథా ఆహారం, పాడైన ధాన్యం - కూరలు - మాంసం - కోడిగుడ్ల పెంకులు, కూరగాయ తొక్కలు, గడ్డకట్టిన పెయింట్లు, ఖాళీ సీసాలు, పాడైన ఎలక్ట్రిక్ ఉపకరణాలు, నిర్మాణ భవనాలను కూల్చడం వల్ల వచ్చే అవశేషాలు, వ్యవసాయ పారిశ్రామిక వ్యర్థాలు, గనుల తవ్వకాల ద్వారా వచ్చే భౌతిక పదార్థాలన్నీ ఘన వ్యర్థాలే.

ఘన వ్యర్థాల పెరుగుదలకు కారణం



జనాభా వృద్ధి, పారిశ్రామికీకరణ, జీవన ప్రమాణాలు మెరుగవడం మొదలైనవన్నీ ఘన వ్యర్థాల పరిమాణం పెరగడానికి ప్రధాన కారణాలు.

- వివిధ పరిశ్రమలు కొత్త ఆవిష్కరణలతో అనేక విలాసవంతమైన వస్తువులను మార్కెట్లలోకి విడుదల చేస్తున్నాయి. వాటిలో చాలావరకు తక్కువ నాణ్యత కలిగినవి, మన్నికలేనివే ఉంటున్నాయి. అవసరం లేకపోయినా ప్రజలు వాటిని కొంటున్నారు. అందులో చాలా భాగం ఉపయోగించకుండా ఇంకొకరికి ఇవ్వడం లేదా పారేయడం జరుగుతోంది. దీంతో వ్యర్థాల సంఖ్య అధికమవుతోంది.

ఘన వ్యర్థాల వర్గీకరణ

ఏర్పడే మూలాల ఆధారంగా ఘన వ్యర్థాలను - గృహ, వ్యవసాయ, గనులు - పరిశ్రమల వ్యర్థాలు, వాణిజ్య, ఇ-వ్యర్థాలు, న్యూక్లియర్, అంతరిక్ష వ్యర్థాలుగా వర్గీకరించారు.

గృహ వ్యర్థాలు: వృథా ఆహారం, కూరలు, పండ్ల తొక్కలు, గుడ్ల పెంకులు, పాడైన మాంసం, ఆహార దినుసులు; నాన్-డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్లు, స్పూన్లు, టూత్‌బ్రష్‌లు, వాడేసిన పేస్టులు, నూనెలు, షాంపూ ప్యాకెట్లు, డైపర్లు, శానిటరీ ప్యాడ్స్ మొదలైనవి గృహ సంబంధ వ్యర్థాలకు ఉదాహరణ. అలంకరణ సామగ్రి, బ్యాగులు, చెప్పులు, పగిలిన గాజులు, పింగాణి సామగ్రి, పనికిరాని స్టీల్ - అల్యూమినియం వంట పాత్రలు, అరిగిపోయిన చీపుర్లు, ప్లాస్టిక్ కవర్లు కూడా ఇందులో భాగమే.



వ్యవసాయ వ్యర్థాలు: పాడైన ధాన్యం, గడ్డి, ఆకులు, కొమ్మలు, మొక్కలు, కలుపు మొక్కలు, పశు వ్యర్థాలు, జంతు కళేబరాలు, నిరుపయోగ యంత్రాలు, బోరింగు పంపులు, మోటర్లు, పైపులు, ఎరువులు - క్రిమిసంహారక మందుల సంచులు, ప్లాస్టిక్ క్యాన్లు మొదలైనవి వ్యవసాయ వ్యర్థాలకు ఉదాహరణ.

పారిశ్రామిక వ్యర్థాలు: ఘన వ్యర్థాల పరిమాణం పెరగడానికి ముఖ్య కారణం పరిశ్రమలు. వస్తూత్పత్తి కారణంగా విభిన్న దశల్లో, హెచ్చు పరిమాణంలో ఘన వ్యర్థాలు ఏర్పడతాయి. ఇనుము, ఉక్కు, అల్యూమినియం కర్మాగారాలు; రబ్బరు, ప్లాస్టిక్, గాజు తయారుచేసే కర్మాగారాల్లో మిగిలిపోయిన వ్యర్థాలు; సిమెంట్ పరిశ్రమల నుంచి వెలువడే ఫ్లైయాష్ లాంటి పారిశ్రామిక ఘన వ్యర్థాలు భూమిని, జలాలను కలుషితం చేస్తాయి.

మైనింగ్ వ్యర్థాలు: గనుల తవ్వకాల్లో, ఖనిజాల్లోని మలినాలు తొలగించినప్పుడు ఏర్పడిన స్లాగ్ కూడా భారీగా పోగుపడిన ఘన వ్యర్థమే. బొగ్గు, ఇనుప గనుల నుంచి వెలువడే ధూళి తీవ్రస్థాయి శ్వాసకోశ వ్యాధులకు దారితీస్తుంది.

రేడియోధార్మిక వ్యర్థాలు: యురేనియం, థోరియం మూలకాలను భూమి నుంచి వెలికి తీసినప్పుడు లేదా వాటిని శుద్ధి చేసినప్పుడు వెలువడే వ్యర్థాలను నీటిలో/ భూమిలో కలపకూడదు. భూమి లోపల ప్రత్యేక జాలీల్లో భద్రపరచాలి.

ఇ - వ్యర్థాలు (ఎలక్ట్రానిక్ వేస్ట్): సాంకేతిక విప్లవం, నవీకరణల ప్రభావంతో ఉత్పన్నమయ్యే వ్యర్థాలు. కాలం చెల్లిన, పాడైపోయిన కంప్యూటర్లు, టెలివిజన్లు, ప్రింటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉపయోగించే విష పూరిత రసాయనాలు; లోహ సంబంధ భాగాల ద్వారా చేరిన వ్యర్థాలను ఈ-వేస్ట్/ఎలక్ట్రానిక్ వేస్ట్ అంటారు. వీటి నుంచి ఆర్సెనిక్, బేరియం, కాడ్మియం, కోబాల్ట్, సీసం, పాదరసం, జింక్ లాంటి హానికర మూలకాలు విడుదలై తిరిగి మానవ జీవనంపై దుష్ప్రభావం చూపుతాయి.

అంతరిక్షంలో ఘన వ్యర్థాలు: అంతరిక్షంలో ప్రయాణిస్తున్న అనేక స్పేస్‌షిప్‌లు, రాకెట్లు, శాటిలైట్లు, అంతరిక్షంలో ఇతర గ్రహాలపై అనేక ఘన పదార్థాలను విడుదల చేస్తున్నాయి. అంతరిక్షంలోని కాలం చెల్లిన టెలిస్కోప్‌లు, పరిశోధన సామగ్రి, వ్యోమగాములు వాడిన వస్తువులన్నీ అంతరిక్ష ఘన వ్యర్థాలే. వీటిని తొలగించడం అసాధ్యం. ఇవి భూగోళంపై ఏ ప్రాంతంలోనైనా పడి మానవులు, జీవవరణానికి ప్రమాదం కలిగించవచ్చు.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

741 Word of the Day

Bathetic

Telugu meaning: అధిక భావోద్వేగ, అతితో కూడిన ప్రవర్తన

English meaning: The word 'bathetic' (బ్యాథెటిక్) is an adjective that describes something overly sentimental or insincerely emotional, often in a way that falls short of being truly moving.

Synonyms: Sentimental, Overemotional

Antonyms: Sincere, Authentic

Usage: 1. The movie's ending turned unexpectedly bathetic, trying too hard to make the audience cry.

2. What was meant to be a powerful speech came off as bathetic and clichéd.

Current Affairs



The Parliament has passed the Income-Tax Bill, 2025 and the Taxation Laws (Amendment) Bill, 2025 with Rajya Sabha returning both the legislations to the Lok Sabha after discussion on 12 August 2025. Union Finance Minister Nirmala Sitharaman said, the new income tax legislation has been made taxpayer friendly. Sitharaman said, the new bill which will replace the 1961 Act is a milestone that this country's financial system will face.

The Unique Identification Authority of India (UIDAI) has signed an agreement with the Indian Statistical Institute (ISI) for joint research and development to further enhance the robustness, security and reliability of Aadhaar operations on 12 August 2025. The agreement effective for a period of five years.

The 8th High-Level Meeting between the Indian Coast Guard (ICG) and the Sri Lanka Coast Guard (SLCG) was held in New Delhi. The discussions centred on strengthening cooperative engagements in the fields of marine pollution response, maritime search and rescue, and maritime law enforcement, along with enhanced capacity building and technical assistance initiatives.

The Union Cabinet on 12 August 2025 approved four additional semiconductor manufacturing projects under the India Semiconductor Mission (ISM), marking a significant boost to the country's semiconductor ecosystem. With six projects already underway, the four new approvals bring the total to ten semiconductor initiatives with cumulative investments of approximately Rs.1.60 lakh crore across six states.

For more Current Affairs: Scan QR code

ఓఎన్‌జీసీ డే

ఆగస్టు 14
చరిత్రలో ఈనాడు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 14న 'ఓఎన్‌జీసీ డే'గా నిర్వహిస్తారు. ఓఎన్‌జీసీ అనేది మన దేశంలో అతిపెద్ద చమురు, గ్యాస్‌ను అన్వేషించే, ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగ సంస్థ. ఇది భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అధీనంలో పని చేస్తుంది. దేశీయ ముడి చమురు, సహజ వాయువులో దాదాపు 71% ఇదే ఉత్పత్తి చేస్తోంది. 2010 నుంచి ఈ కంపెనీ మహారత్న హోదాలో ఉంది. దేశాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేయడంలోనూ ఇది ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఇంతటి ఘన కీర్తి కలిగిన సంస్థను భారత ప్రభుత్వం 1956, ఆగస్టు 14న ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన ముఖ్య విషయాలను పరిశీలిద్దాం..!

- దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా భారత్‌లో ప్రధానంగా ప్రైవేట్ కంపెనీలే చమురు నిక్షేపాలను అన్వేషించడం, వెలికితీయడం లాంటివి చేపట్టాయి. 1867లో మొదటిసారి అస్సాంలోని మాకూమ్‌లో ముడి చమురు నిక్షేపాలను గుర్తించారు. 1889లో అస్సాంలోని డిగ్బాయ్‌లో తొలుత చమురు వెలికి తీశారు.
- ప్రభుత్వం 1948లో పారిశ్రామిక విధాన తీర్మానాన్ని రూపొందించేటప్పుడు దేశంలో పెట్రోలియం పరిశ్రమ అభివృద్ధి అత్యంత ఆవశ్యకమని పరిగణించింది. దీనికి అనుగుణంగానే దేశంలో చమురు నిల్వలను అన్వేషించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం 1955లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసింది.
- 1956లో భారత ప్రభుత్వం పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ఆమోదించడంతోపాటు చమురు, గ్యాస్ రంగాన్ని షెడ్యూల్-ఎ పరిశ్రమల్లో చేర్చింది. అదే ఏడాది ఆగస్టు 14న దీని పేరును ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్‌గా మార్చింది. అప్పటి నుంచి దేశంలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత అనేది దీని పర్యవేక్షణలోనే జరుగుతుంది.
- 1974లో 'బాంబే హై' వద్ద చమురు నిక్షేపాలను గుర్తించడంలో ఇది కీలకపాత్ర పోషించింది. ఇది దేశంలోనే అతిపెద్ద ఆఫ్‌షోర్ చమురు క్షేత్రంగా ఉంది.
- 1994లో దీని పేరును 'ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్'గా మార్చారు.
- 2024, సెప్టెంబరు నాటికి దేశంలో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా వెలికితీసింది 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.
- ఓఎన్‌జీసీ ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది. సుమారు 26,000 సిబ్బంది సంస్థలో పనిచేస్తున్నారు.
- ఓఎన్‌జీసీ ప్రస్తుత ఛైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ (2022, డిసెంబరు నుంచి ఈ పదవిలో ఉన్నారు.)

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ రచన

ప్రపంచంలోని అనేక దేశాలు తమ రాజ్యాంగానికి అత్యున్నత స్థానాన్ని కల్పించాయి. రాజ్యాంగం లేకపోతే పాలన అస్తవ్యస్తమవుతుంది. ఇది దేశ నాయకులు, పాలకులు, పౌరులకు దిశానిర్దేశం చేస్తుంది. భారత్‌లో స్వాతంత్ర్యానికి పూర్వమే రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది. దీనిలోని సభ్యులు అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, దేశానికి అవసరమైన రాజ్యాంగ రచనను పూర్తి చేశారు. పోటీపరీక్షార్థులు రాజ్యాంగ పరిషత్ ఎన్నిక విధానం, అధ్యక్షులు, ఆమోదం, అమలు తదితర విషయాలపై అవగాహన ఏర్పర్చుకోవాలి.


- భారతదేశానికి ఒక రాజ్యాంగ నిర్మాణ సభ ఉండాలని మొదటిసారిగా కమ్యూనిస్టు ఉద్యమకారుడు, రాడికల్ డెమోక్రటిస్ సిద్ధాంతవాది ఎం.ఎన్.రాయ్ ప్రతిపాదించారు.
- భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కోసం మొట్టమొదటిసారిగా డిమాండ్ చేసిన రాజకీయ పార్టీ - స్వరాజ్‌పార్టీ.

రాజ్యాంగం ఆమోదం

- రాజ్యాంగ పరిషత్ సభ్యులు సుమారు 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి రాజ్యాంగం రాశారు. దీన్ని రాసేందుకు అయిన మొత్తం ఖర్చు రూ.64 లక్షలు. రాజ్యాంగం రాయడానికి పట్టిన సమయం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు.

రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

- గవర్నర్ జనరల్ వేవెల్ ఆదేశానుసారం రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబరు 9న పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది.
- ఈ సమావేశానికి 211 మంది సభ్యులు హాజరయ్యారు.



భారత రాజ్యాంగానికి ఆధారాలు, భారత రాజ్యాంగంలోని షెడ్యూళ్లు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Para Medical Jobs

Railway Recruitment Board (RRB) has released a notification for the recruitment of 434 vacancies in various Para Medical categories. These include posts like Nursing Superintendent, Dialysis Technician, Health & Malaria Inspector Grade-2, Pharmacist, ECG Technician. The application fee is Rs. 500. The last date for receipt of online applications is 8 September 2025.

Medical Consultant Jobs

Singareni Collieries Company Limited (SCCL) in Bhadradri Kothagudem is inviting applications for the recruitment of General Medical Consultant posts on a contract basis. The total no. of posts is 33. Eligible candidates can apply online before 25 August 2025.

Apprentices Posts

Eastern Coalfields Limited (ECL) is inviting applications for the recruitment of Graduate and Diploma Apprentices for the year 2025-26. The total no. of posts is 1,123. The last date for online applications is 11 September 2025.

Did You Apply..?

Today (August 14) is the last date for the following Jobs

- 129 Sales Person posts in ICSIL, New Delhi. *Eligibility:* 8th class, Intermediate.
- 10 jobs at ICMR-NIE. *Eligibility:* Degree or Intermediate.

For more information and other notifications - scan QR code

Bank Exams
Reasoning

Scheduling

Directions (Qs. 1 - 5): Read the following information and answer the questions.

Six plays - A, B, C, D, E and F are to be staged, one on each day from Monday to Saturday. The schedule of the plays is to be in accordance with the following:

i) Play C cannot be staged on Tuesday.
ii) Play A is to be staged on a day following the day on which F is staged.
iii) D must be staged on Friday only and should not be immediately preceded by B.
iv) E must not be staged on the last day of the schedule.

1. Which of the following plays immediately follows B?
A) A B) C C) D D) E E) F

2. Which of the following plays is on Monday?
A) E B) F C) A D) C E) A

3. Play D is between which of the following pairs of plays?
A) B and E B) E and F C) A and E D) C and E E) C and F

4. What is the sequence of the plays, with the order of their staging from Monday?
A) F, A, E, B, D, C
B) A, F, B, E, D, C
C) A, F, B, D, E, C
D) E, B, D, F, A, C E) None of these

5. Play C cannot be definitely staged on which of the following days in addition to Tuesday?
A) Monday B) Wednesday C) Friday D) Thursday E) Saturday

Directions (Qs. 6 - 9): Read the following information and answer the questions.

i) Eight doctors - P, Q, R, S, T, U, V and W visit a charitable dispensary every day except on a holiday i.e. Monday.
ii) Each doctor visits for one hour from Tuesday to Sunday except Saturday. The timings are 9 a.m. to 1 p.m. and 2 p.m. to 6 p.m.; 1 p.m. to 2 p.m. is lunch break.
iii) On Saturday, it is open only in the morning i.e. 9 a.m. to 1 p.m. and each doctor visits for only half an hour.
iv) No other doctor visits the dispensary before doctor Q and after doctor U.
v) Doctor W comes immediately after lunch break and is followed by R.
vi) S comes in the same order as P in the afternoon session.

6. Doctor P visits in between which of the following pairs of doctors?
A) S and V B) U and W C) R and W D) P and S E) None of these

7. At what time the visit of doctor R is over on Sunday?
A) 1 p.m. B) 3 p.m. C) 4 p.m. D) 5 p.m. E) None of these.

8. At what time the visit of doctor P would be over on Saturday?
A) 10 a.m. B) 11 a.m. C) Either 10 a.m. or 11 a.m. D) Data inadequate E) None of these

9. If the lunch break and subsequent visiting hours are reduced by 15 minutes, at what time doctor U is expected to attend the dispensary?
A) 3.15 p.m. B) 4 p.m. C) 4.15 p.m. D) 4.45 p.m. E) None of these

Directions (Qs. 10 - 11): Read the following information carefully and answer the questions.

Five men - A, B, C, D and E read a news paper. The one who reads first gives it to C. The one who reads last had taken from A. E was not the first or last to read. There were two readers between B and A.

10. A passed the newspaper to whom?
A) A B) C C) D D) E E) None of these

11. Who read the newspaper last?
A) A B) B C) C D) E E) None of these

Directions (Qs. 12 - 13): Read the following information carefully and answer the questions.

Seven executives - P, Q, R, S, T, U and W reach office in a particular sequence. U reaches immediately before P, but does not immediately follow S. R is the last one to reach office. T follows immediately after P and is subsequently followed by W.

12. Among the executives, who reaches the office first?
A) Q B) S C) U D) Can't be determined E) None of these

13. Who ranks fourth in the sequence of reaching office?
A) W B) U C) T D) P E) None of these

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

జనరల్ స్టడీస్ - చరిత్ర

ప్రాక్టీస్ బిట్స్

1. 'త్వరలో బ్రిటీష్ పాలన అంతం కాగలదు' 'ఈ యుద్ధం జిహాద్' అన్న నినాదాలు చేసింది?
   1) మౌల్వి అహ్మదుల్లా
   2) మౌల్వి లియకత్ ఖాన్
   3) రెండో బహదూర్‌షా జాఫర్
   4) నవాబ్ వాజిద్ అలీ షా
2. 1857 తిరుగుబాటుకి ప్రధాన కారణం?
   1) సైన్య సహకార విధానం
   2) ఎన్‌ఫీల్డ్ రైఫిల్స్
   3) రాజ్య సంక్రమణ సిద్ధాంతం
   4) పైవన్నీ
3. కింది విప్లవకారుడికి మరొక పేరు రామచంద్ర పాండురంగ.
   1) జగన్నాథ పాయకరావు
   2) తాంతియా తోపే
   3) ఆత్మారామ్ పాండురంగ
   4) సుఖ్‌దేవ్
4. స్వదేశీ ఉద్యమ కాలంలో స్థాపించిన బెంగాల్ జాతీయ కళాశాల ప్రిన్సిపల్ ఎవరు?
   1) అరవిందుడు
   2) దయానందుడు
   3) వివేకానందుడు
   4) గోపాలకృష్ణ గోఖలే
5. ఆంధ్రాలో స్వదేశీ ఉద్యమ వ్యాప్తి చేసినవారు?
   1) గాడిచర్ల హరిసర్వోత్తమరావు
   2) గొల్లపూడి సీతారామ రావు
   3) అయ్యదేవర కాళేశ్వరరావు
   4) పైవారందరూ
6. స్వదేశీ ఉద్యమ సమయంలో ఆంధ్రాలో పర్యటించినవారు?
   1) బాల గంగాధర్ తిలక్
   2) బిపిన్ చంద్రపాల్
   3) అరవింద్ ఘోష్
   4) లాలాలజపతి రాయ్
7. స్వదేశీ ఉద్యమ సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గేయం?
   1) జనగణమన 2) వందేమాతరం
   3) అమర్ సోనార్ బంగ్లా 4) పైవన్నీ

సమాధానాలు: 1-1; 2-3; 3-2; 4-1; 5-4; 6-2; 7-3.

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

సంక్షేమానికి.. సంతులిత అభివృద్ధికి!

మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అనుసరిస్తున్న భారతదేశంలో ప్రభుత్వ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. సామ్యవాద సమాజ స్థాపనే ధ్యేయంగా 1956 పారిశ్రామిక తీర్మానంలో ప్రభుత్వ రంగానికి పెద్దపీట వేశారు. ఆ విధంగా దేశంలో పారిశ్రామిక వ్యవస్థకు బలమైన పునాది పడింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు అంచెలంచెలుగా ఎదుగుతూ ఆర్థిక ప్రగతికి అండగా నిలిచాయి. మూలధన కల్పన, అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధి, ఉపాధి, ప్రాంతీయ అసమానతల తగ్గింపు తదితర లక్ష్యాల సాధనలో విజయం సాధించడంతో వాటి ప్రాముఖ్యత మరింతగా పెరిగింది. ఆర్థిక సంస్కరణల తర్వాత పోటీతత్వంతో పనిచేస్తూ ప్రపంచ స్థాయి సంస్థలుగా వృద్ధి చెందుతున్నాయి. దేశంలో ప్రభుత్వరంగ సంస్థల ప్రస్థానం, వాటి అవసరం, విస్తరణ పరిధి, మార్పును అందిపుచ్చుకుంటున్న తీరు, సంక్షేమానికి, సంతులిత వృద్ధికి దోహదపడుతున్న విధానం, అందుకు అనువుగా ఉన్న ప్రభుత్వ పాలసీలపై పోటీ పరీక్షార్థులకు పూర్తి అవగాహన ఉండాలి. సంస్కరణల లక్ష్యాలు, ఎదురవుతున్న అవాంతరాల గురించి తెలుసుకోవాలి.



భారతదేశంలో ప్రభుత్వరంగ

(సంస్కరణల తర్వాత ప్రభుత్వరంగ విధానం)

ప్రభుత్వ రంగం: పారిశ్రామిక, వ్యవసాయ, విత్త, వాణిజ్యసంస్థల్లో ప్రభుత్వ యాజమాన్యం, నిర్వహణను ప్రభుత్వరంగంగా పేర్కొనవచ్చు. ఏ సంస్థ మూలధనంలోనైనా ప్రభుత్వానికి 51% లేదా అంతకంటే ఎక్కువ వాటా ఉంటే, దాన్ని ప్రభుత్వరంగ సంస్థగా పరిగణిస్తారు. అలాంటి సంస్థలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థలు - లక్ష్యాలు: * దేశ పారిశ్రామిక ఆర్థిక అభివృద్ధికి తోడ్పడటం. * మెరుగైన ఉపాధిని సృష్టించడం. * దేశంలో ప్రాథమిక, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం. * ప్రభుత్వానికి అవసరమైన విత్త వనరులను అందించడం. * ఆదాయ సంపదలను పునర్ పంపిణీ చేయడానికి దోహదపడటం. * ఎగుమతుల పెరుగుదల, దిగుమతుల ప్రతిస్థాపనను ప్రోత్సహించడం. * సంతులిత ప్రాంతీయవృద్ధిని సాధించడం.

ప్రభుత్వరంగ సంస్థలు-వర్గీకరణ

శాఖాపరమైన సంస్థలు (డిపార్ట్‌మెంటల్ అండర్‌టేకింగ్స్): వీటిని ప్రభుత్వ శాఖలు, సంబంధిత మంత్రిత్వ శాఖల అధీనంలో నేరుగా నిర్వహిస్తారు. అవసరమైన ద్రవ్యాన్ని బడ్జెట్ కేటాయింపుల ద్వారా సమకూరుస్తారు. ఆ బడ్జెట్ నియంత్రణకు లోబడే పనిచేస్తాయి. **ఉదా:** తంతి తపాలా, రైల్వే.



ప్రభుత్వ కార్పొరేషన్లు: ప్రత్యేక చట్టం ద్వారా వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ సంస్థల నిర్వహణ విధానం, విధులు, అధికారాలు వంటి విషయాలన్నీ చట్టంలో ఉంటాయి. వీటికి స్వయంప్రతిపత్తి ఉంటుంది. **ఉదా:** ఎల్ఐసీ, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.



ప్రభుత్వ కంపెనీలు: కంపెనీల చట్టం నిబంధనల ప్రకారం జాయింట్ స్టాక్ కంపెనీ పద్ధతిలో ఏర్పాటైన ప్రభుత్వ సంస్థలను ప్రభుత్వ కంపెనీలు అంటారు. వీటిలో ప్రభుత్వం ఏకైక వాటాదారుగాను, అత్యధిక వాటాలు ఉన్న వాటాదారుగా ఉండవచ్చు. **ఉదా:** హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు: 1951, మార్చి 31 నాటికి కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో 5 ప్రభుత్వ రంగ సంస్థలు ఉండేవి. వీటిలో పెట్టుబడి రూ.29 కోట్లు. 2021, మార్చి నాటికి అలాంటి సంస్థల సంఖ్య 365కు చేరి, వీటిలో పెట్టుబడి రూ.16.41 లక్షల కోట్లకు పెరిగింది.

సంస్కరణల తర్వాత ప్రభుత్వరంగ విధానం: 1991లో సంస్కరణలు ప్రారంభమైన తర్వాత సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) దిశగా ప్రభుత్వ విధానం మారింది. దీంతో పలు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు రంగానికి బదిలీ అయ్యాయి. పీఎస్ఈలపై ప్రభుత్వ నియంత్రణ తగ్గించేందుకు, వీటిలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు.

డీ-రిజర్వేషన్: 1956 పారిశ్రామిక తీర్మానంలో షెడ్యూల్-ఎ లో 17 పరిశ్రమలను ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేశారు. 1991 తీర్మానం నాటికి వీటిని 8కి తగ్గించారు. ప్రస్తుతం అణుశక్తి, రైల్వే నిర్వహణ మాత్రమే ప్రభుత్వ రంగానికి రిజర్వ్ అయ్యాయి.

భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థల పాత్ర

భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు, ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తాయి. దేశానికి ప్రాథమిక సేవలను అందించడంలో, అసమానతలను తగ్గించడంలో, ప్రజలకు ప్రాథమిక వస్తు సేవలు అందించడంలో తోడ్పడతాయి.

ఆర్థికాభివృద్ధి: పీఎస్‌యూలు మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి కల్పనలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.

ప్రభుత్వ రంగం మూలధన నిర్మాణం: భారత ఆర్థికవ్యవస్థలో మూలధన ఉత్పత్తికి ఈ రంగం కీలకం. ప్రభుత్వరంగ యూనిట్ల నుంచి పెద్దమొత్తంలో మూలధనం లభిస్తుంది.

ఉపాధి అవకాశాల సృష్టి: దేశంలో ఉపాధి రంగంలో మార్పు తీసుకురావడంతో పాటు వివిధ రంగాల్లో అవకాశాలను అందిస్తాయి.

అసమానతల తగ్గింపు: పీఎస్‌యూలు ఏర్పాటైన ప్రాంతాల్లో అసమానతలను తగ్గిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధిని ప్రోత్సహిస్తాయి.

మౌలిక సదుపాయాల కల్పన: పీఎస్‌యూలు రోడ్లు, రైల్వేలు, విద్యుత్తు ప్లాంట్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.

పరిశోధన, అభివృద్ధి పెరగడం.: ప్రభుత్వరంగ సంస్థల్లో అధునాతన సాంకేతికత, ఆటోమేటిక్ పరికరాలను ప్రవేశపెట్టడానికి భారీ పెట్టుబడులు పెడుతున్నారు.

> "ప్రణాళిక లేని ప్రభుత్వ రంగం కొంతవరకూ అభివృద్ధి సాధించ గలుగుతుంది. కానీ ప్రభుత్వ రంగం లేని ప్రణాళిక కాగితాలకే పరిమితమవుతుంది.
> - హెన్సన్, ఆర్థికవేత్త



అవగాహన ఒప్పందం (ఎంఓయూ)


అర్జున్‌సేన్ గుప్తా

అర్జున్‌సేన్ గుప్తా కమిటీ సిఫార్సుల మేరకు 1986లో ఎంఓయూలను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ప్రభుత్వరంగ సంస్థలకు లక్ష్యాలను నిర్దేశించి వాటి సాధనకు స్వయంప్రతిపత్తి కల్పిస్తారు. 1991 తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఈ విధానంలోకి తీసుకొచ్చారు.

మహారత్న, నవరత్న, మినీరత్న లాంటి హోదాల కల్పన

ప్రభుత్వరంగ సంస్థలకు మరింత స్వయంప్రతిపత్తి, ఆర్థిక స్వేచ్ఛ కల్పించేందుకు ఈ హోదాలను ఇస్తున్నారు. తద్వారా అవి పోటీతత్వాన్ని పెంపొందించుకొని లాభదాయకంగా మారతాయి.

మహారత్న: 2010లో ప్రభుత్వం ఈ హోదాను తీసుకొచ్చింది. ప్రభుత్వరంగ సంస్థలు కార్యకలాపాల విస్తరణతో అంతర్జాతీయ సంస్థలుగా ఎదిగేందుకు 'మహారత్న' హోదా దోహదం చేస్తుంది.

అర్హతలు: * నవరత్న హోదా ఉండాలి. * స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదై ట్రేడింగ్ అవుతూ ఉండాలి. * గత మూడేళ్లలో పన్ను తర్వాత సగటు వార్షిక నికర లాభం రూ.5000 కోట్లపైగా ఉండాలి. * 3 సంవత్సరాల్లో సగటు వార్షిక టర్నోవర్ రూ.25,000 కోట్లు. * 3 సంవత్సరాల్లో వార్షిక నికర విలువ రూ.15,000 కోట్లు. * ప్రపంచవ్యాప్త ఉనికి ఉండాలి.

ప్రయోజనాలు: * అధిక స్వయంప్రతిపత్తి: మహారత్న హోదా ఉన్న కంపెనీలు ప్రభుత్వ అనుమతి లేకుండానే పెద్ద మొత్తం పెట్టుబడి పెట్టడానికి, విలీనాలు చేసుకోవడానికి, కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడానికి వీలుంటుంది. * ఒకే ప్రాజెక్టులో రూ.5000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. * కంపెనీ కార్యకలాపాలు మరింత సులభతరంగా నిర్వహించడానికి, వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీలుంటుంది. * మహారత్న హోదా వల్ల ప్రపంచ మార్కెట్‌లో మెరుగైన పోటీని ఎదుర్కోవడానికి అవసరమైన వనరులు, సౌకర్యాలు లభిస్తాయి. * 2024, అక్టోబరు 14 నాటికి 14 మహారత్న కంపెనీలు ఉన్నాయి.

నవరత్న: 1997లో తులనాత్మక ప్రయోజనాలు ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను (సీపీఎస్ఈ) ఎంపిక చేసి వాటిని దిగ్గజ కంపెనీలుగా మార్చడానికి ప్రభుత్వం నవరత్న ప్రణాళికను ప్రారంభించింది. ప్రస్తుతం 26 నవరత్న కంపెనీలున్నాయి.

అర్హతలు: * మినీరత్న-1, షెడ్యూల్-ఎ కంపెనీగా ఉండాలి. * వరుసగా మూడేళ్లుగా సగటున రూ.1000 కోట్లు లాభం ఆర్జించాలి. * రుణాల వడ్డీ చెల్లింపులో విఫలమై ఉండకూడదు. * ప్రభుత్వం సూచించిన 6 సూచీల్లో 100కు 60 మార్కులు రావాలి. * నిర్వహణ ఖర్చుల కోసం బడ్జెట్‌పై ఆధారపడకూడదు.

ప్రయోజనాలు: * ఈ హోదా పొందితే రూ.1,000 కోట్ల వరకు ప్రభుత్వ అనుమతి లేకుండా పెట్టుబడి పెట్టవచ్చు. * దేశీయ, విదేశీ మార్కెట్‌లో మూలధనం సమకూర్చడంలో స్వేచ్ఛ కలిగి ఉంటుంది.

మినీరత్న-1: అర్హతలు: * గత మూడేళ్లలో వరుసగా లాభాలు ఆర్జించిన సీపీఎస్ఈలు. * వరుసగా మూడేళ్లు పన్నుకు ముందు లాభం కనీసం రూ.30 కోట్లు. * నిర్వహణ ఖర్చులకు బడ్జెట్ కేటాయింపులపై ఆధారపడకూడదు.

మినీరత్న-2: అర్హతలు: కనీసం మూడేళ్లలో పన్నుకు ముందు లాభం రూ.30 కోట్ల కంటే తక్కువ ఉంటే ఈ హోదా ఇస్తారు.

ప్రయోజనాలు: మినీరత్న కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి, మూలధనాన్ని సేకరించడానికి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడానికి స్వయంప్రతిపత్తి పొందుతాయి. * ప్రస్తుతం మొత్తం మినీరత్న కంపెనీలు 73, అందులో కేటగిరీ-1 కింద 61, కేటగిరీ-2 కింద 12 ఉన్నాయి.

ప్రభుత్వరంగ సంస్కరణలు - ప్రాముఖ్యత:

ఆర్థిక వృద్ధిని పెంచడం: సమర్థ ప్రభుత్వరంగ సంస్థలు ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతాయి. అవి ఉద్యోగాలను సృష్టిస్తాయి. వస్తు సేవల ఉత్పత్తితో ప్రభుత్వానికి ఆదాయాన్ని సృష్టిస్తాయి.



ప్రజాసేవలను మెరుగుపరచడం: డిజిటలైజేషన్ లాంటి సంస్కరణలు ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు పొందే విధంగా చేస్తాయి.

పెట్టుబడులను ఆకర్షించడం: ప్రభుత్వ నియంత్రణలను తగ్గించే సంస్కరణలన్నీ దేశంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయి.

ప్రభుత్వ ఆర్థిక భారాన్ని తగ్గించడం: నిర్వహణ సరిగాలేని ప్రభుత్వ సంస్థలు నష్టాలు సృష్టిస్తాయి. అలాంటి వాటిని ప్రైవేటీకరించడం లేదా మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వం తన ఖర్చులను తగ్గించుకుంటుంది.

ప్రపంచ పోటీతత్వాన్ని పెంపొందించడం: సమర్థ ప్రభుత్వరంగ సంస్థలు ప్రపంచ సంస్థలతో పోటీ పడతాయి. ఈ పరిణామం అంతర్జాతీయ మార్కెట్‌లో భారతదేశ స్థానాన్ని మెరుగుపరచుకునేందుకు దోహదం చేస్తుంది.



రచయిత: వమరవల్లి రమణయ్య

ఏడు దేశాల ఉమ్మడి సంగీతం సప్తసుర్!

అరుదైన రక్త గ్రూపులుగా పేరు పొందిన బాంబే బ్లడ్, గోల్డెన్ బ్లడ్ తరహాలో క్రిబ్ అనే రక్త గ్రూపు ఉన్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. సామాజిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ పట్టుదల, ఆత్మవిశ్వాసంతో కలలను నెరవేర్చుకోవచ్చని చాటిన ఒక సినిమా జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచింది. శత్రువుల దాడులపై మెరుపు వేగంతో స్పందించి తిరిగి ప్రతిదాడులు చేసేందుకు రుద్ర, భైరవ్ అనే ప్రత్యేక యూనిట్లను సైన్యం ఏర్పాటు చేస్తోంది. హైడ్రోజన్‌తో నడిచే రైలును చెన్నైలో విజయవంతంగా పరీక్షించారు. సౌరవిద్యుత్తు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది. వార్తలుగా నిలిచిన ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ వర్తమాన వ్యవహారాలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకోవాలి. రక్షణరంగ కార్యకలాపాలు, విదేశీ వ్యవహారాలు, దేశంలో జరిగిన, జరగబోతున్న అంతర్జాతీయ స్థాయి సదస్సులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ముఖ్య ప్రకటనలు, కీలక నియామకాలు, వార్తల్లోని వ్యక్తులు, ప్రముఖులపై వెలువడిన పుస్తకాలు, అంతర్జాతీయ క్రీడాంశాలు, రాజకీయ పరిణామాలన్నింటినీ గమనిస్తూ ఉండాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. ఇటీవల మరణించిన సత్యపాల్ మాలిక్ కింది ఏ రాష్ట్రాల గవర్నర్‌గా పని చేయలేదు?
   1) జమ్మూ-కశ్మీర్, గోవా 2) గోవా, మేఘాలయ
   3) బిహార్, మేఘాలయ 4) రాజస్థాన్, గుజరాత్
2. ఇటీవల మరణించిన శిబూ సోరెన్ జేఎంఎం పార్టీని ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1973 2) 1979 3) 1983 4) 1976

   నోట్: ☛ శిబూసోరెన్ ఝార్ఖండ్‌కు 3 సార్లు సీఎంగా పనిచేశారు. లోక్‌సభకు 8 సార్లు ఎన్నికయ్యారు.
   ☛ జేఎంఎం పార్టీ గుర్తు - విల్లు, బాణం (బౌ అండ్ యారో)
3. 71వ జాతీయ చలన చిత్ర అవార్డులు-2023కి సంబంధించి సరైనవి.




   ఎ) ఉత్తమ చిత్రం - 12th ఫెయిల్ (హిందీ)
   బి) ఉత్తమ నటుడు - షారుఖ్ ఖాన్ (జవాన్ - హిందీ), విక్రాంత్ మెస్సే (12th ఫెయిల్ - హిందీ)
   సి) ఉత్తమ నటి - రాణీ ముఖర్జీ (మిస్టర్ చటర్జీ వర్సెస్ నార్వే - హిందీ)
   డి) ఉత్తమ దర్శకుడు - సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ - హిందీ)
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, డి
4. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
   1) అరుణ్ కుమార్ 2) పద్మ కుమార్
   3) శ్యామ్‌నాథ్ 4) అరవింద్ కిరణ్

   నోట్: సశస్త్ర సీమాబల్ కొత్త డైరెక్టర్ సంజయ్ సింఘాల్
5. 'బోల్డ్ కురుక్షేత్ర - 2025' 14వ ఎడిషన్ సైనిక విన్యాసాలు జులై 27 నుంచి ఆగస్టు 4 వరకు రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌లో ఏ దేశాల మధ్య జరిగాయి?
   1) ఇండియా - బ్రిటన్ 2) ఇండియా - సింగపూర్
   3) ఇండియా - అమెరికా 4) ఇండియా - ఫ్రాన్స్
6. అర్జెంటీనాకు చెందిన ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ 70 అడుగుల విగ్రహాన్ని భారత్‌లో ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు?
   1) దిల్లీ 2) ముంబయి 3) చెన్నై 4) కోల్‌కతా
7. 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు-2023కి సంబంధించి సరైనవి?
   ఎ) ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ చిత్రం - హనుమాన్ (తెలుగు)
   బి) ఉత్తమ గేయ రచయిత - కాసర్ల శ్యామ్ (ఊరు పల్లెటూరు... బలగం)
   సి) ఉత్తమ తెలుగు చిత్రం - భగవంత్ కేసరి
   డి) ఉత్తమ తమిళ చిత్రం - పార్కింగ్
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
8. సింగపూర్‌లో జరిగిన ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2025లో మొదటి స్థానంలో నిలిచిన దేశం ఏది?
   1) అమెరికా 2) చైనా 3) జపాన్ 4) జర్మనీ

   నోట్: ☛ అమెరికాకు 29 పతకాలు వచ్చాయి.
   ☛ ఆస్ట్రేలియా 20 పతకాలతో 2వ స్థానంలో నిలిచింది.
9. భవిష్యత్తులో శత్రువుల నుంచి ఎదురయ్యే దాడులను ఎదుర్కోనేలా, తిరిగి వాటిపై దాడులు చేసేందుకు సైన్యం ఏ పేరుతో యూనిట్లు ఏర్పాటు చేయనుంది?
   1) శివ, ఆరుద్ర 2) విష్ణు, శివ
   3) రుద్ర, భైరవ్ 4) శక్తి, అగ్ని
10. ఇటీవల భారతదేశంలోనే మొదటి హైడ్రోజన్ రైల్ కోచ్‌ను ఎక్కడ విజయవంతంగా పరీక్షించారు?
    1) వడోదరా 2) కోల్‌కతా
    3) జైపుర్ 4) చెన్నై

    నోట్: ☛ చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో విజయవంతంగా పరీక్షించారు.
    ☛ జర్మనీలో 2018లో హైడ్రోజన్ రైలును మొదటిసారిగా ప్రవేశపెట్టారు. దీని పేరు - కొరాడియా ఐలింట్.
11. కిందివాటిలో సరైంది?



    ఎ) అధునాతన గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్ యుద్ధ నౌక హిమగిరి ఇటీవల భారత నౌకాదళంలో చేరింది.
    బి) కోల్‌కతాలోని గార్డెన్ రీచ్‌షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ సంస్థ దీన్ని రూపొందించింది.
    సి) ప్రాజెక్ట్-17ఎ కింద ఈ సంస్థ నిర్మించే మూడు యుద్ధనౌకల్లో ఇది మొదటిది.
    డి) హిమగిరి యుద్ధ నౌక పొడవు 149 మీటర్లు, బరువు 6670 టన్నులు.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి,
    3) ఎ, బి, డి 4) ఎ, సి, డి
12. 'ది మ్యాన్ హూ బికేమ్ సినిమా: దిలీప్ కుమార్' అనే పుస్తకాన్ని రచించిందెవరు?
    1) కిరణ్ చంద్ర 2) నందిని గుప్తా
    3) అశోక్ చోప్రా 4) నళిని గుప్తా
13. ఇటీవల వార్తల్లో నిలిచిన 'క్రిబ్' అనేది?
    1) అధునాతన ఏఐ రోబో
    2) అత్యంత అరుదైన బ్లడ్ గ్రూప్
    3) అధునాతన యుద్ధ నౌక
    4) అత్యంత అరుదైన చేప
14. ఇటీవల రాజీనామా చేసిన గింటౌటాస్ పలుకాస్ ఏ దేశ ప్రధాని?
    1) లిథువేనియా 2) పరాగ్వే
    3) ఉరుగ్వే 4) చిలీ
15. 2026లో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఏ దేశంలో జరగనుంది?
    1) రష్యా 2) కెనడా 3) చైనా 4) ఇండియా
16. కోపా అమెరికా మహిళల ఫుట్‌బాల్ కప్ 10వ ఎడిషన్ విజేత ఎవరు?
    1) కొలంబియా 2) బ్రెజిల్
    3) చిలీ 4) ఈక్వెడార్



17. ఇటీవల వార్తల్లో నిలిచిన జపోరిజియా అణు విద్యుత్తు కేంద్రం ఏ దేశంలో ఉంది?
    1) రష్యా 2) ఇజ్రాయెల్
    3) ఉక్రెయిన్ 4) కెనడా
18. ప్రపంచంలోనే సౌర విద్యుత్తు ఉత్పత్తిలో భారత్ ఎన్నో స్థానంలో నిలిచిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల తెలిపారు?
    1) 5వ 2) 4వ 3) 2వ 4) 3వ

    నోట్: 1,08,494 గిగావాట్లను ఉత్పత్తి చేసి 3వ స్థానంలో నిలిచింది.
19. ఏ నదిపై ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టు 'సావల్‌కోట్' పునరుద్ధరణకు భారత్ సిద్ధమవుతోంది?
    1) రావి 2) చీనాబ్
    3) బియాస్ 4) సట్లెజ్
20. 'ఎ ట్రిబ్యూట్ ఫర్ ది రిమార్కబుల్ రోహిత్' పుస్తక రచయిత ఎవరు?
    1) కె. ప్రసాద్ శర్మ 2) ఎం. రవివర్మ
    3) ఆర్. కౌశిక్ 4) కె.ఎం. కుమార్
21. 'సప్తసుర్: సెవెన్ నేషన్స్, వన్ మెలోడీ' అనే మొదటి బిమ్‌స్టెక్ సంప్రదాయ సంగీత కార్యక్రమాన్ని ఏ నగరంలో నిర్వహించారు?



    1) ముంబయి 2) హైదరాబాద్
    3) పనాజీ 4) న్యూదిల్లీ
22. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ కొత్త డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు?
    1) ఎ. రాజరాజన్ 2) కె. పద్మశర్మ
    3) ఆర్. కిరణ్ 4) ఎస్. నాయర్
23. ఏ రాష్ట్ర ప్రభుత్వం గోమతినగర్ రైల్వే స్టేషన్‌ను ఆ రాష్ట్ర మొదటి ప్రైవేట్ రైల్వే స్టేషన్‌గా ప్రకటించింది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) ఉత్తర్‌ప్రదేశ్ 4) బిహార్
24. పీఎం - మిత్ర పథకం కింద 2027-28 వరకు ఏడేళ్ల వ్యవధిలో 7 టెక్స్‌టైల్ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన మొత్తం ఎంత?
    1) రూ.3,500 కోట్లు 2) రూ.4,445 కోట్లు
    3) రూ.5,800 కోట్లు 4) రూ.89,600 కోట్లు
25. ఇటీవల మరణించిన మైయింట్ స్వే' ఏ దేశ అధ్యక్షుడు?
    1) మయన్మార్ 2) క్యూబా 3) బంగ్లాదేశ్ 4) ఫిజి



26. ఆసియా రగ్బీ ఎమిరేట్స్ అండర్ - 20 సెవెన్స్ ఛాంపియన్‌షిప్ 2025 మస్కట్ పేరు?
    1) నందిని 2) బుద్ధ 3) అశోక 4) విష్ణు
27. ఏ సంవత్సరం నాటికి అందరికీ కంటి సంరక్షణ సేవలు అందించేందుకు గ్లోబల్ స్పెక్స్ అనే కొత్త కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్‌ఓ చేపట్టింది?
    1) 2025 2) 2029
    3) 2030 4) 2045
28. కిందివాటిలో సరైంది.
    ఎ) ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సదస్సు న్యూదిల్లీలో జరిగింది.
    బి) ఆహారం, శాంతి కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలకు ఈ సందర్భంగా అవార్డులు ఇవ్వడం ప్రారంభించారు.
    సి) మొదటి అవార్డును నైజీరియాలో ఆకలిని ఎదుర్కోవడంలో కృషి చేసిన నైజీరియా శాస్త్రవేత్త డాక్టర్. అడెమోలా ఎడిన్లేకు ప్రదానం చేశారు.
    డి) ఎం.ఎస్. స్వామినాథన్‌కు 2024లో భారతరత్న అవార్డు వచ్చింది.
    1) ఎ, బి, సి 2) బి, సి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
29. ఎం.ఎస్. స్వామినాథన్ జీవిత చరిత్ర పై 'ద మాన్ హూ ఫెడ్ ఇండియా' అనే పుస్తకాన్ని రాసింది?
    1) సౌమ్య స్వామినాథన్
    2) ప్రియంబద జయకుమార్
    3) దయానంద కిరణ్ 4) సత్యనారాయణ రావు
30. గ్లోబల్ ఏఐ సిటీ ఇండెక్స్ 2025లో మొదటి మూడు ర్యాంకుల్లో ఉన్న నగరాలు?
    1) దుబాయ్, శాన్‌ఫ్రాన్సిస్కో, బీజింగ్
    2) సింగపూర్, సియోల్, బీజింగ్
    3) సింగపూర్, న్యూదిల్లీ, దుబాయ్
    4) దుబాయ్, సింగపూర్, బీజింగ్
31. జాతీయ చేనేత దినోత్సవం ఏ రోజున జరుపుకుంటారు?
    1) ఆగస్టు 10 2) ఆగస్టు 8
    3) ఆగస్టు 6 4) ఆగస్టు 7

    నోట్: 11వ జాతీయ చేనేత దినోత్సవం 2025 థీమ్ 'హ్యాండ్లూమ్స్ ఎంపవరింగ్ ఉమెన్, ఎంపవరింగ్ ది నేషన్'



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-4; 2-1; 3-2; 4-2; 5-2; 6-4; 7-3; 8-1; 9-3; 10-4; 11-1; 12-3; 13-2; 14-1; 15-4; 16-2; 17-3; 18-4; 19-2; 20-3; 21-4; 22-1; 23-3; 24-2; 25-1; 26-3; 27-3; 28-4; 29-2; 30-2; 31-4.

కార్పొరేట్ కెరియర్‌కు నెట్‌వర్కింగ్ ముఖ్యం!



కార్పొరేట్ సంస్థల్లో అధికారిక పనివేళలు ఉన్నప్పటికీ కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు హ్యాండిల్ చేస్తున్నప్పుడు సమయంతో ప్రమేయం లేకుండా తక్షణమే స్పందించాల్సి వస్తుంది. ఇదో అప్రకటిత నియమం. మీ నిబద్ధత, సంస్థ ప్రయోజనాలకు మీరెంత ప్రాముఖ్యం ఇస్తున్నారన్నది దీనిద్వారా స్పష్టమవుతుంది!

అజయ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఒక కార్పొరేట్ సంస్థలో చేరాడు. అతడికి ఏ ప్రాజెక్ట్ అప్పగించినా టైంలైన్స్‌లో, డెలివరబుల్స్‌లో తేడా ఉండదని యాజమాన్యం నమ్మకం. అయితే అతడు రెగ్యులర్ ఆఫీస్ టైమింగ్స్ తర్వాత పూర్తిగా తన వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యమిస్తాడు.

అతని సీనియర్లు టీమ్ మెంబర్లు తరచూ లేట్ నైట్స్‌లో మెయిల్స్ పంపటం, టీమ్ చాట్‌బాక్స్‌లో మెసేజ్‌లు పెట్టి, వాటికి వెంటనే సమాధానమివ్వమని అడిగేవారు. వాటికి స్పందించేవాడు కాదు. ఒకరోజు ఒక ముఖ్యమైన ప్రాజెక్టుకు సంబంధించి రాత్రి ఎనిమిది గంటలకు మెయిల్ పంపి వెంటనే సమాధానం ఇవ్వాలని మెసెజ్ చేశాడు మేనేజర్. ఆ మెయిల్‌కు ఆ మరుసటి రోజు ఆఫీస్‌కి వెళ్లి సమాధానం పంపాడు అజయ్. ముఖ్యమైన ప్రాజెక్టుకు సంబంధించి సమయానికి స్పందించకపోవడంతో క్లయింట్ నుంచి ప్రతికూల వ్యాఖ్యలు వచ్చాయి. ఫలితంగా తనను టీం నుంచి తప్పించడంతో అజయ్ కెరియరే ప్రశ్నార్థకమైంది.

సంస్థల్లో రాతపూర్వకంగా చెప్పని నియమాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసుకొందాం

1 సమాచార పంపిణీ సంస్కృతి: ప్రతి సంస్థకూ ఒక కమ్యూనికేషన్ కల్చర్ ఉంటుంది. ఇది అధికారికంగా స్పష్టంగా ఉండకపోవచ్చు. సంస్థలో ఉద్యోగులు ముఖాముఖి మాట్లాడటానికి ఇష్టపడతారా, ఈ-మెయిల్/ వాట్సాప్ ద్వారా కమ్యూనికేట్ చేస్తారా గమనించండి. కొన్ని సంస్థల్లో 'కాన్ఫిడెన్షియల్' విషయాలను ముఖాముఖీ చర్చించుకుంటారు. కొన్ని సంస్థలు ఏ సమాచారమైనా ఈ-మెయిల్ ద్వారా చేరవేయటానికి ప్రాధాన్యమిస్తాయి. మీ టీం సభ్యులు ఎలాంటి కమ్యూనికేషన్‌ను పాటిస్తున్నారో గమనించి ఆ పద్ధతిని అనుసరించడం వల్ల బృందంలో సభ్యులుగా ఇమిడిపోతారు. ఇది సంస్థ మీ నుంచి ఆశించే ఒక లక్షణం.

2 మీ సమస్యలను సంస్థకు ఆపాదించవద్దు: ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో పని ఒత్తిడి, టీమ్ సభ్యులతో ఏర్పడే సమన్వయ లోపాలతో కొందరు అసంతృప్తికి లోనవుతుంటారు. కానీ ఈ పరిణామాలకు సంస్థ వాతావరణాన్ని కారణంగా చూపడంవల్ల భవిష్యత్తులో కెరియర్‌పై ప్రతికూలత ఏర్పడవచ్చు. సంస్థలోని అప్రకటిత నియమాలను అర్థం చేసుకోలేకపోవడంతో అంచనాలను అందిపుచ్చుకోలేకపోవచ్చు. నిరంతరం లోపాలను విశ్లేషించుకుని, తనను తాను సరిదిద్దుకుంటూ పనిచేసే ఉద్యోగులను కార్పొరేట్ సంస్థలు విలువైన సిబ్బందిగా భావిస్తాయి.

3 వినడం నేర్చుకోండి: కార్పొరేట్ సంస్థల్లో స్థానం కోరుకొనే అభ్యర్థులు చురుకుగా వినడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎదుటివారి మాటలు శ్రద్ధగా వినకపోతే సరైన పద్ధతిలో స్పందించలేరు. ఇది టీమ్ వర్క్‌పైనా, క్లయింట్ మీటింగ్స్‌పైనా ప్రతికూల ప్రభావం చూపే ఇబ్బంది ఉంది. మాట్లాడటం ఒక నైపుణ్యం. అయితే వినగలగడం గొప్ప నైపుణ్యం. ఎదుటి వారి మాటలూ, అభిప్రాయాలూ శ్రద్ధగా విని తగిన విధంగా స్పందించేవారికి విలువ ఉంటుంది. వినడం అంటే మాటల వెనుక ఉన్న భావనను కూడా అర్థం చేసుకోవడం.

4 నిశ్శబ్ద వీక్షకులుగా.. సంస్కృతిని గమనించండి: కార్పొరేట్ ప్రపంచంలో అడుగుపెట్టే యువ గ్రాడ్యుయేట్లు తొలిరోజు నుంచీ తమ ప్రతిభతో ఇతరుల కంటే మెరుగుగా కనిపించాలనుకుంటారు. దాంతో ప్రతి సమావేశంతోనూ ఎక్కువగా మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటారు. కానీ సంస్థ పని సంస్కృతిని అర్థం చేసుకోవడానికి మొదటి మూడు నెలలూ ఎంతో కీలకం. విజయం సాధించాలంటే మొదట 'నిశ్శబ్ద వీక్షకులు'గా ఉండటమే సరైనది.

5 సహోద్యోగులతో సత్సంబంధాలు: కార్పొరేట్ సంస్థల్లో మీ సామర్థ్యాన్ని నిరూపించుకొని కెరియర్లో ఎదగడానికి నెట్‌వర్కింగ్ అవసరం. ఇతర డిపార్ట్‌మెంట్ సిబ్బందితో మంచి సంబంధాలు పెంచుకోవడం వృత్తి జీవితాన్ని మెరుగుపరుస్తుంది.

ఉదా: రమ్య కామర్స్ గ్రాడ్యుయేట్. చురుగ్గా, సమర్థంగా పని చేస్తూ తక్కువ కాలంలోనే తన ప్రత్యేకత నిరూపించుకుంది. అయితే ఆమె తన టీం సభ్యులతో గానీ, ఇతర విభాగాల ఉద్యోగులతో గాని కలిసేది కాదు. తాను హ్యాండిల్ చేసే ఒక ప్రాజెక్టులో కంటెంట్ క్రియేషన్, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్ల మధ్య సమన్వయం అవసరమైంది. ఆమెకు డిజిటల్ మార్కెటింగ్ తప్ప ఇతర విభాగాలతో పరిచయాలు లేక ఇతరులతో సమన్వయ లోపం తలెత్తింది. ప్రాజెక్టు డెలివరీ ఆలస్యమైంది. టీం లీడర్ ద్వారా కౌన్సెలింగ్ పొందాక మంచి నెట్‌వర్కింగ్‌తో తనను తాను సరిదిద్దుకొంది.



దొరైరాజ్, ప్రముఖ కార్పొరేట్ సంస్థలో సీనియర్ జనరల్ మేనేజర్

కంప్యూటర్ సైన్స్‌తో కేవలం ప్రైవేటు జాబ్స్?

ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) చేస్తున్నాను. కానీ ఈ కోర్సుతో ప్రైవేటు ఉద్యోగాలే ఎక్కువంటున్నారు. నిజమేనా? – మానస



■ ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, బీటెక్ కంప్యూటర్ సైన్స్/ ఐటీ పూర్తిచేసినవారికి చాలా ప్రైవేటు ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటుతో పోలిస్తే ప్రభుత్వ రంగంలో నియామకాలు చాలా ఆలస్యంగా జరుగుతాయి కాబట్టి ఈ కొలువులు తక్కువ సంఖ్యలో ఉన్నట్లుగా అనిపిస్తుంది. మీరు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాక బోధన, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, అడ్మినిస్ట్రేషన్ లాంటి విభాగాలలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందొచ్చు. బోధన రంగంపై ఆసక్తి ఉంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా, యూజీసీ నెట్ అర్హతతో డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా స్థిరపడవచ్చు. పీహెచ్‌డీ పూర్తిచేసి యూనివర్సిటీల్లో అధ్యాపకులుగా, బీఈడీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఉపాధ్యాయులుగా చేరవచ్చు.

ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదివినవారికి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోనూ అవకాశాలున్నాయి. రైల్వే, రక్షణ, అంతరిక్ష పరిశోధన, అణుశక్తి, ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక శాఖల్లో కంప్యూటర్ సైన్స్ నిపుణుల కోసం ప్రత్యేక నియామకాలు జరుగుతుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో విద్య, పంచాయతీ, మునిసిపల్ లాంటి విభాగాల్లో డేటా నిర్వహణ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ కార్యక్రమాలకు నిపుణులను నియమిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో, యూనివర్సిటీల్లో, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా, సిస్టమ్స్ అనలిస్ట్‌గా, సిస్టమ్స్ మేనేజర్‌గా అవకాశాలు ఉంటాయి.

రక్షణ రంగంలో సాంకేతిక విభాగాలకు సంబంధించి సైన్యం, నౌకాదళం, వాయుసేన విభాగాల్లో కంప్యూటర్ సైన్స్ అభ్యర్థులను వివిధ హోదాల్లో నియమిస్తారు. ప్రజా రంగ సంస్థలు కూడా తమ సాంకేతిక ప్రాజెక్టుల కోసం కంప్యూటర్ నిపుణులను నియమించుకుంటాయి. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే సుదీర్ఘ సన్నద్ధత, క్రమశిక్షణ, సహనం అవసరం. ముందుగా ఏదైనా ప్రైవేటు ఉద్యోగాన్ని చేస్తూ ప్రభుత్వ పరీక్షలకు సిద్ధం కావడం ఉపయోగకరంగా ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఏఏఐలో సీనియర్ అసిస్టెంట్లు

ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ).. 32 సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలను భర్తీచేయనుంది.

సీనియర్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)-ఎలక్ట్రానిక్స్-21, ఎస్‌ఏ (అకౌంట్స్)-10, ఎస్‌ఏ-అఫిషియల్ లాంగ్వేజ్-1 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు: ఎస్‌ఏ (ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్/ రేడియో ఇంజినీరింగ్ డిప్లొమా. సంబంధిత రంగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. ● ఎస్‌ఏ (అకౌంట్స్): బీకాం, ఎంఎస్-ఆఫీస్ పరిజ్ఞానం. సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం. ఈ రెండు పోస్టులకూ ఎంఎస్-ఆఫీస్ కంప్యూటర్ లిటరసీ టెస్ట్ ఉంటుంది. వ్యవధి రెండు గంటలు.
● ఎస్‌ఏ (అఫిషియల్ లాంగ్వేజ్): హిందీలో మాస్టర్స్, డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి / ఇంగ్లిష్‌లో మాస్టర్స్ చేసి.. డిగ్రీ స్థాయిలో హిందీ ఒక సబ్జెక్టుగా చదివివుండాలి. లేదా ఏదైనా సబ్జెక్టులో మాస్టర్స్ చేసి.. డిగ్రీ స్థాయిలో హిందీ, ఇంగ్లిష్ చదివుండాలి. ఎంఎస్-ఆఫీస్ పరిజ్ఞానం, రెండేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: 01.07.2025 30 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్), మాజీ సైనికోద్యోగులకు మూడేళ్లు సడలింపు ఉంటుంది. **దరఖాస్తు ఫీజు:** రూ.1000. ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, ఏఏఐలో ఏడాది అప్రెంటిస్‌షిప్ చేసినవారికి ఫీజు లేదు.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. ప్రశ్న పత్రం 100 మార్కులకు ఉంటుంది. వ్యవధి రెండు గంటలు. నెగటివ్ మార్కులు ఉండవు. ● సీనియర్ అసిస్టెంట్ ఎలక్ట్రానిక్స్, ఫైనాన్స్ పోస్టులకు..70 శాతం ప్రశ్నలు విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌ల నుంచి 30 శాతం ప్రశ్నలు అడుగుతారు. ● సీనియర్ అసిస్టెంట్ (అఫిషియల్ లాంగ్వేజ్).. 50 శాతం సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు, మరో 50 శాతం ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌ల నుంచి ఇస్తారు. ● రాత పరీక్షలో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ● కంప్యూటర్ ఆధారిత పరీక్షలో ప్రతిభ చూపినవారిని కంప్యూటర్ లిటరసీ టెస్ట్ (ఎంఎస్-ఆఫీస్)కు ఎంపిక చేస్తారు. దీని వ్యవధి రెండు గంటలు. ఈ రెండు పరీక్షల్లోనూ అర్హత సాధించినవారిని శిక్షణకు తీసుకుని, నెలకు రూ.25,000 స్టైపెండ్ చెల్లిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26.08.2025
వెబ్‌సైట్: http://www.aai.aero/

దూరవిద్యలో.. యూజీ, పీజీ కోర్సులు

తెలుగు రాష్ట్రాల్లో దూరవిద్యకు చిరునామా.. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. అధిక సంఖ్యలో కోర్సులు, స్టడీ మెటీరియల్ నాణ్యత, అధ్యయన కేంద్రాలు అందుబాటులో ఉండటం.. ఇవన్నీ బీఆర్ఏఓయూ ప్రత్యేకతలు. ఈ సంస్థలో.. యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. వీటికి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఆరోగ్యం లేదా ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడం, ఇప్పటికే ఉద్యోగంలో స్థిరపడటం.. ఇలా ఎన్నో కారణాలతో దూరవిద్యలో చేరేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ చదువుల కోసమే ప్రత్యేకంగా సార్వత్రిక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశారు. దూరవిద్య డిగ్రీలతో కొన్ని మినహా దాదాపు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకూ పోటీ పడవచ్చు. ప్రవేశ పరీక్షలూ రాసుకోవచ్చు.

ఇవీ కోర్సులు

యూజీలో..

బీఏ, బీఎస్సీ, బీకాంలను ఈ విశ్వవిద్యాలయం తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో అందిస్తోంది. కోర్సుల వ్యవధి మూడేళ్లు. వీటికి ట్యూషన్ ఫీజు మొదటి ఏడాది రూ.3200, తర్వాత రెండేళ్లకు ఏటా రూ.3000 చెల్లించాలి. సైన్స్ కోర్సుల్లో చేరినవారికి ల్యాబ్ ఫీజు అదనం. యూజీ కోర్సులను ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) విధానంలో నిర్వహిస్తున్నారు. ఏడాదికి రెండు సెమిస్టర్లు.

విభాగాలవారీ సబ్జెక్టుల వివరాలు...

కళలు (ఆర్ట్స్): తెలుగు సాహిత్యం, ఆంగ్ల సాహిత్యం, హిందీ సాహిత్యం, ఉర్దూ సాహిత్యం.
సోషల్ సైన్సెస్ (సామాజిక శాస్త్రాలు): అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, ప్రభుత్వ పాలనశాస్త్రం, సమాజశాస్త్రం, జర్నలిజం.
విజ్ఞానశాస్త్రాలు (సైన్స్): వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, గణితశాస్త్రం, గణాంకశాస్త్రం, భూగర్భశాస్త్రం.
వాణిజ్యశాస్త్రం: కామర్స్.
అర్హత: రెగ్యులర్ విధానంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్నవారు, ఓపెన్ స్కూల్ ద్వారా ఉత్తీర్ణత పొందినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సులు చదివినవారు, రెండేళ్ల డిప్లొమా పూర్తయినవాళ్లు, ఇంటర్మీడియట్‌కు సమాన విద్యార్హత ఉన్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీలో..

ఎంఏ: ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఉర్దూ కోర్సులు ఉన్నాయి. వీటిని ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. లాంగ్వేజీ కోర్సులు సంబంధిత భాషలో ఉంటాయి. కోర్సుల ఫీజు మొదటి ఏడాదికి రూ.5300. రెండో ఏడాదికి రూ.5000. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌కు మొదటి ఏడాది రూ.7800. రెండో సంవత్సరానికి రూ.7500. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లు. నాలుగేళ్లలోపు పూర్తి చేసుకోవాలి. ప్రతి కోర్సులోనూ 6 నెలలకు ఒకటి చొప్పున 4 సెమిస్టర్లు ఉంటాయి.
అర్హత: ఏదైనా యూజీ డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు.
ఎమ్మెస్సీ: మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, సైకాలజీ. వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. కెమిస్ట్రీకి మొదటి సంవత్సరం రూ.18,300. రెండో ఏట రూ.18,000. మ్యాథ్స్‌కి రెండేళ్లూ వరుసగా రూ.7800, 7500. మిగిలినవాటికి మొదటి ఏడాదికి రూ.15,300. రెండో సంవత్సరానికి రూ.15,000 ఫీజు చెల్లించాలి.
అర్హత: సంబంధిత సబ్జెక్టులను బ్యాచిలర్ డిగ్రీలో చదివుండాలి. సైకాలజీకి ఏదైనా డిగ్రీ ఉంటే సరిపోతుంది. డిగ్రీలో సైన్స్ గ్రూపులవారు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులో చేరవచ్చు.
ఎంఎల్ఐఎస్సీ: 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. ట్యూషన్ ఫీజు రూ.10,300.
బీఎల్ఐఎస్సీ: గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే 45 శాతం. కోర్సు వ్యవధి ఏడాది. ఫీజు రూ.5300.
ఎంకాం: బీకాం, బీబీఏ, బీబీఎం, బీఏ (కామర్స్) వీటిలో ఏదైనా కోర్సు చదివినవారు చేరవచ్చు. ఫీజు మొదటి సంవత్సరం రూ.7800, రెండో ఏడాది రూ.7500. ఈ కోర్సు ఆంగ్ల మాధ్యమంలో అందిసున్నారు. వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.
డిప్లొమా: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషనల్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమెన్స్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, డిజిటల్ జర్నలిజం ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. కొన్ని కోర్సులను రెండు సెమిస్టర్లలో అందిస్తున్నారు. ఎంచుకున్న కోర్సు ప్రకారం ఫీ మారుతుంది.
అర్హత: ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ. సైకలాజికల్ కౌన్సెలింగ్‌కు మాత్రం డిగ్రీ లేదా పీజీలో సైకాలజీ చదివుండాలి.
సర్టిఫికెట్: ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్జీవోస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్. కోర్సుల వ్యవధి ఆరు నెలలు. కోర్సును బట్టి వీటిని పదోతరగతి/ ఇంటర్/ ఎలాంటి విద్యార్హతలు లేకుండా అందిస్తున్నారు.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 20.08.2025
వెబ్‌సైట్: https://online.braou.ac.in/login

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

ఇన్‌సైడ్ సేల్స్
సంస్థ: టీచ్ మవెన్ నైపుణ్యాలు: అడాప్టబిలిటీ, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సేల్స్
స్టైపెండ్: రూ.20,000-27,000
☛ https://shorturl.at/vfBVh

ఫ్లట్టర్ డెవలప్‌మెంట్
సంస్థ: అప్టాగ్రిమ్ కన్సల్టింగ్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, డార్ట్, ఫ్లట్టర్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.13,000-15,000
☛ https://shorturl.at/JamvN

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: రిక్వెస్ట్ ఐటీ సపోర్ట్ నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ రిలేషన్‌షిప్, కంప్యూటర్ స్కిల్స్, ఇంగ్లిష్, తెలుగు మాట్లాడటం, రాయడం, మార్కెటింగ్, సేల్స్, వెబ్ డెవలప్‌మెంట్ స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/JVKrf

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 18

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్
సంస్థ: యాడ్‌వర్గో ప్రై.లి. నైపుణ్యం: మార్కెటింగ్ స్టైపెండ్: రూ.7,000-26,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 16
☛ https://shorturl.at/nOkWm

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: డెలిమేట్
నైపుణ్యాలు: అడోబ్ ప్రీమియర్ ప్రో, క్రియేటివ్ థింకింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 20
☛ https://shorturl.at/1zfmI

ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్
సంస్థ: ఎంబోనిక్స్ సిస్టమ్స్ ల్యాబ్
నైపుణ్యం: ఎంబెడెడ్ సిస్టమ్స్
స్టైపెండ్: రూ.5,009-8,000
☛ https://shorturl.at/aBqWM

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: ఫ్రిటో ఏఐ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.13,000-25,000
☛ https://shorturl.at/8rFVr

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 3

విశాఖపట్నంలో

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: జోపర్ నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, సేల్స్ మేనేజ్‌మెంట్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.12,000-25,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 25
☛ https://shorturl.at/20fre

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: క్లౌడ్ఐ టెక్నాలజీస్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: ఫ్లట్టర్, లారావెల్, మాంగోడీబీ, మైఎస్‌క్యూఎల్, నోడ్.జేఎస్, పీహెచ్‌పీ, రియాక్ట్
స్టైపెండ్: రూ.6,000-10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 30
☛ https://shorturl.at/FwWa8

సేల్స్ అండ్ మార్కెటింగ్
సంస్థ: కాంట్రాక్ట్‌స్పాన్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 1
☛ https://shorturl.at/05239

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 500 జనరలిస్ట్ ఆఫీసర్లు

ప్రభుత్వ అనుబంధ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో 500 జనరలిస్ట్ ఆఫీసర్ (స్కేల్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
జనరలిస్ట్ ఆఫీసర్ (స్కేల్–2): 500 పోస్టులు (ఎస్సీ: 75, ఎస్టీ: 37, ఓబీసీ: 135, ఈడబ్ల్యూఎస్: 50, యూఆర్: 203)
విద్యార్హత: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/పీడబ్ల్యూబీడీలకు 55 శాతం) లేదా చార్టర్డ్ అకౌంటెంట్ డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరం. సీఎంఏ/ సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ, జేఏఐఐబీ/సీఏఐఐబీ ఉన్న వారికి ప్రాధాన్యం. **వయసు:** 22 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. (ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూతో
వేతన శ్రేణి: రూ.64,820- రూ.93,960
దరఖాస్తు ఫీజు: యూఆర్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీలకు రూ.1180; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.118.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 30.08.2025
వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. ఏపీ దేవాదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-3 ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతోంది.
● **ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్–3:** 07
అర్హత: డిగ్రీ **వయసు:** 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 ఏళ్లు వయసులో సడలింపు ఉంటుంది.
ఎంపిక: రాత పరీక్షతో
వేతన శ్రేణి: నెలకు రూ.25,220 - రూ.80,910.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02.09.2025
వెబ్‌సైట్: https://portal-psc.ap.gov.in/HomePages/RecruitmentNotifications

టెక్నికల్ అసిస్టెంట్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. జలవనరుల శాఖలో టెక్నికల్ అసిస్టెంట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● **టెక్నికల్ అసిస్టెంట్(జియోఫిజిక్స్):** 04
అర్హత: సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ/ఎంటెక్
వయసు: 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 ఏళ్లు వయసులో సడలింపు ఉంటుంది.
ఎంపిక: పరీక్షతో **వేతన శ్రేణి:** నెలకు రూ.54,060 - 1,40,540. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.09.2025
వెబ్‌సైట్: https://portal-psc.ap.gov.in/HomePages/RecruitmentNotifications

అగ్రికల్చర్ ఆఫీసర్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అగ్రికల్చర్ సర్వీస్‌లో ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● **అగ్రికల్చర్ ఆఫీసర్:** 10
అర్హత: అగ్రికల్చర్ డిగ్రీ **వయసు:** 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 ఏళ్లు వయసులో సడలింపు ఉంటుంది.
ఎంపిక: రాత పరీక్షతో **వేతన శ్రేణి:** నెలకు రూ.54,060 - 1,40,540. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 08.09.2025
వెబ్‌సైట్: https://portal-psc.ap.gov.in/HomePages/RecruitmentNotifications

ఎన్‌హెచ్ఏఐలో.. యంగ్ ప్రొఫెషనల్స్

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా.. ఒప్పంద ప్రాతిపదికన 44 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● **యంగ్ ప్రొఫెషనల్(లీగల్):** 44
అర్హత: లా డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 10.09.2025 నాటికి 32 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.60,000 - రూ.65,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.09.2025
వెబ్‌సైట్: https://nhai.gov.in

ఎన్టీపీసీలో మేనేజర్లు

ఎన్టీపీసీ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో 25 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఇంజినీరింగ్, రెగ్యులేటరీ, ప్లానింగ్, కమర్షియల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, సీఅండ్ఐ.
▼ జనరల్ మేనేజర్: 04 ▼ అడిషనల్ జనరల్ మేనేజర్: 03 ▼ సీనియర్ మేనేజర్: 10 ▼ మేనేజర్: 08 **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** జనరల్ మేనేజర్‌కు 55 ఏళ్లు, అడిషనల్ మేనేజర్, మేనేజర్‌కు 35 ఏళ్లు. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూతో **వేతన శ్రేణి:** నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000 - రూ.2,60,000, అడిషనల్ మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000, మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 26.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.300. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://careers.ntpc.co.in/recruitment/

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏపీ వైద్య, కుటుంబ సంక్షేమ శాఖలో.. అసిస్టెంట్ ప్రొఫెసర్ డెంటల్ స్పెషాలిటీస్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● **అసిస్టెంట్ ప్రొఫెసర్ డెంటల్ స్పెషాలిటీస్:** 15
విభాగాలు: ఓరల్ పాథాలజీ, ఓరల్ మ్యాక్సిలోఫేషియల్ సర్జరీ, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, పబ్లిక్ హెల్త్ అండ్ డెంటిస్ట్రీ, ఆర్థోడాంటిక్స్, పెడోడోంటిక్స్, ప్రోస్థోడోంటిక్స్.
అర్హత: బీడీఎస్‌తోపాటు పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీఎస్ **వయసు:** ఓసీలకు 42 ఏళ్లు, ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/బీసీలకు 47 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో. **వేతన శ్రేణి:** నెలకు రూ.68,900 - రూ.2,05,500. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 28.08.2025 **దరఖాస్తు ఫీజు:** ఓసీలకు రూ.1000. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.750.
వెబ్‌సైట్: https://apmsrb.ap.gov.in/msrb/

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లో..

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, కోల్‌కతా గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● **గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ:** 27
విభాగాలు: మైనింగ్, జియాలజీ, మెటలర్జీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సిస్టం **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ లేదా పీజీ **వయసు:** 01.08.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్, ఇంటర్వ్యూతో. **వేతన శ్రేణి:** నెలకు రూ.40,000 - రూ.1,40,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.09.2025 **దరఖాస్తు ఫీజు:** రూ 500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/Page/Career_New

భాజపా నేతల మధ్యే పోటీ

- కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఎన్నికల్లో ప్రతిపక్షాల మద్దతుతో రూడీ గెలుపు

దిల్లీ: దేశ రాజధానిలో మంగళవారం రాత్రి ఒక ఆసక్తికరమైన ఎన్నిక జరిగింది. ఇద్దరు భాజపా నేతలు ఢీకొన్న ఈ ఎన్నికలో ప్రతిపక్షాల మద్దతుతో కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ తిరిగి ఎన్నికయ్యారు. ప్రభుత్వం పోటీకి నిలిపిన అభ్యర్థి ఓడిపోయారు. కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కార్యదర్శి పదవి కోసం భాజపాకు చెందిన రూడీతో అదే పార్టీకి చెందిన ఎంపీ సంజీవ్ బాల్యాన్ పోటీపడ్డారు. రహస్య బ్యాలెట్ ద్వారా జరిగిన ఈ ఎన్నికలో రూడీకి 391 ఓట్లు లభించగా సంజీవ్ బాల్యాన్‌కు 291 వచ్చాయి. క్లబ్‌కు సంబంధించిన 11 కార్యనిర్వాహక పదవుల కోసం జరిగిన ఎన్నికల్లో రూడీ తరఫున బరిలో నిలిచిన 10 మంది అభ్యర్థులు గెలిచారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గంలో భాజపా, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్‌లకు చెందిన సభ్యులు ఉన్నారని, గడచిన 25 ఏళ్లుగా క్లబ్ కార్యదర్శిగా కొనసాగుతూ తిరిగి విజయం సాధించిన రూడీ తెలిపారు. ఈ ఎన్నికలో ఓటేసిన వారిలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులున్నారు.

82% ఘటనల్లో ప్రశాంతమే

- భారత్‌లో కుక్కలపై అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: భారత్‌లో మనుషులు, వీధి కుక్కలు పరస్పరం తారసిల్లిన 82శాతం ఘటనల్లో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని తేలింది. కేవలం 2 శాతం ఘటనల్లోనే కుక్కలు అరవడం, కరవడం, వెంటపడటం చేస్తాయని వెల్లడైంది. వీధి కుక్కలపై బ్రిటన్‌కు చెందిన ఎడిన్‌బరో విశ్వవిద్యాలయం తరఫున ప్రొఫెసర్ కృతికా శ్రీనివాసన్ జరిపిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. ఆ అధ్యయన నివేదిక ప్రకారం.. భారత్‌లోని 15 రాష్ట్రాల్లో ఈ అధ్యయనం జరిగింది. గత రెండు దశాబ్దాల్లో రేబిస్ కేసులు 75శాతం తగ్గిపోయాయి. 2005లో 274 ఉండగా.. 2022 నాటికి 34కు పడిపోయాయి. కుక్కలకు టీకాలతో ఇది సాధ్యమైంది. ప్రతి వేయి మందిలో 4.7 మంది కుక్క కాట్లకు గురవుతున్నారు.

రోజురోజుకూ ఆత్మలేని వాళ్లమవుతున్నాం

- వీధి కుక్కల విషయంలో సుప్రీం తీర్పుపై సోనాక్షి సిన్హా నిరాశ



దిల్లీ: దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలను తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా విమర్శించారు. రోజురోజుకూ మనం ఆత్మ లేని వాళ్లమవుతున్నామని వాపోయారు. ఈమేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ నోట్‌ను పంచుకున్నారు.

ఇరాన్‌పై మళ్లీ ఐరోపా ఆంక్షలు!

బెర్లిన్: ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు ఈ నెలాఖరుకల్లా పునఃప్రారంభం కాకపోతే మళ్లీ ఆర్థిక ఆంక్షలు విధిస్తామని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ హెచ్చరించాయి. ఈ మూడు దేశాలను ఈ3 అంటారు. గత శుక్రవారం ఐక్య రాజ్య సమితికి రాసిన లేఖలో ఈ సంగతి తెలిపాయి. ఈ లేఖను ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జాన్ నోయెల్ బారో బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 11 మంది భక్తుల మృతి

జైపుర్: రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దౌసా జిల్లాలో మనోహర్‌పుర్ రోడ్డుపై బుధవారం ఉదయం ఆగి ఉన్న వ్యానును కంటైనర్ లారీ ఢీకొనడంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు, నలుగురు మహిళలున్నారు. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన భక్తులు. సాల్సర్ బాలాజీ, ఖాటూశ్యామ్ ఆలయాల దర్శనం అనంతరం వీరు స్వరాష్ట్రానికి వెళుతుండగా ఈ విషాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

లాస్ ఏంజెలెస్‌లో సిక్కు మతస్థుడిపై దాడి

న్యూయార్క్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో సిక్కు మతానికి చెందిన హర్పాల్ సింగ్ (70)పై దాడి జరిగింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఈ నెల 4న సిక్కు గురుద్వారా సమీపంలో హర్పాల్ ఉదయపు నడకకు వెళ్లిన సమయంలో ఆయనపై 44 ఏళ్ల బో రిచయి విటగ్లియోనో దాడిచేశాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆస్తి తగాదాలే దాడికి కారణమని అనుమానిస్తున్నారు.

ఉగ్రవాదుల చొరబాటు యత్నం భగ్నం

- జవాను దుర్మరణం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని ఉరీ ప్రాంతంలో నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వెంబడి ఉగ్రవాదులు బుధవారం చొరబాటుకు యత్నించగా సైన్యం తిప్పికొట్టింది. ఆ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ సైనికుడు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు.

విభజన గాయాలపై రైల్వేస్టేషన్లలో నేడు ఎగ్జిబిషన్

దిల్లీ: స్వాతంత్ర్యం లభించే క్షణాన జరిగిన దేశ విభజన వల్ల వివిధ వర్గాలకు కలిగిన గాయాలను స్మరించుకునేలా గురువారం దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లలో ఎగ్జిబిషన్లు నిర్వహించాలని రైల్వే మంత్రిత్వశాఖ నిర్ణయించింది. 'విభజన దారుణాల స్మరణ దినం' పేరుతో సాంస్కృతిక మంత్రిత్వశాఖ దీనిని సిద్ధం చేసింది. ఆనాటి పరిణామాల గురించి ప్రజల్లో, ముఖ్యంగా ప్రస్తుత తరంలో అవగాహన కల్పించేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను ప్రజలకు చూపించాలని అన్ని జోన్లకు రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది.



భారీ వర్షాల కారణంగా బిహార్‌లోని కైమూర్‌లో ఓ ఆసుపత్రిలోకి చేరిన నీరు

ఏమార్చలేని ఏఐ నిఘా

సరిహద్దుల్లో సైన్యం వినియోగం • 'ఆపరేషన్ సిందూర్'లో విజయవంతం • వెల్లడించిన ఆర్మీ అధికారులు

సుందర్బనీ (జమ్మూకశ్మీర్): ఏఐ ఆధారిత సాంకేతికతలో వేగంగా వస్తున్న మార్పులు భద్రత ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. మన సైన్యం దీనిని అందిపుచ్చుకుని సరిహద్దు రక్షణలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన అత్యాధునిక కంచె వ్యవస్థ, నాలుగు కాళ్ల జీవుల్లా పనిచేసే రోబోటిక్ మ్యూల్‌లు, అన్ని రకాల భూభాగాలపై ప్రయణించగలిగే వాహనాలను వినియోగిస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ వెంట భద్రతను బలోపేతం చేసేందుకు వినియోగించింది. ఈ విషయాలను అధికారులు తాజాగా వెల్లడించారు. కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఉపకరణాలను పాకిస్థాన్‌పై మే 7 నుంచి 10 వరకూ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం విస్తృతంగా పరీక్షించి, విజయవంతంగా వినియోగించింది. వాటిలో మానవ రహిత క్వాడ్ కాప్టర్లు, అధునాతన నిఘా పరికరాలు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, నైట్ విజన్ పరికరాలు ఉన్నాయి.

రోబోటిక్ మ్యూల్‌తో విప్లవాత్మక మార్పులు



దేశీయంగా అభివృద్ధి పరచిన రోబోటిక్ మ్యూల్ నాలుగు కాళ్లు కలిగివుండి మంచు పర్వతాల్లో తనకు నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా ఛేదించింది. యుద్ధరంగంలో గేమ్‌ఛేంజర్‌గా అవతరిస్తోంది. ఎడారులు, జల మార్గాల్లో కూడా పనిచేసే సామర్థ్యం కలిగిన మ్యూల్‌ను 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా ఏరోఆర్క్ సంస్థ రూపొందించింది. ఆపరేషన్ సిందూర్‌లో నిఘా, రవాణా అంశాల్లో రోబోటిక్ మ్యూల్‌లు కీలక పాత్రపోషించాయని సైనికాధికారులు వెల్లడించారు. అడ్వాన్స్డ్ సెన్సర్లను కలిగిన ఇవి పేలుడు పదార్థాలను కూడా గుర్తించగలవన్నారు. వీటి ద్వారా ఏర్పరచే మినీ రోబో ఆర్మీ సైనికులకు ముప్పును తగ్గించడం ద్వారా ఆపరేషన్లలో సమర్థతను గణనీయంగా పెంచుతాయి.

చొరబాట్లను అడ్డుకుని..



అత్యాధునిక వాహనాలైన ఆర్మడో, ఆల్ టెర్రైన్ వాహనాలు అత్యంత కఠినమైన పర్వత మార్గాల్లో సైన్యానికి ఎంతో ప్రయోజనం కలిగించాయి. ఈ పరికరాల కారణంగా సైన్యం చొరబాటుదార్లపై సత్వరం చర్యలు చేపట్టగలిగింది.

దాడి.. నిఘాకు..డ్రోన్లు



సైనిక కార్యక్రమాల్లో డ్రోన్లకు సైన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నిఘాతోపాటు దాడికి అవకాశం ఉండే మిషన్లలో వినియోగిస్తోంది. వాటితో పాటు మినీ మానవ రహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), నిఘా డ్రోన్లు కీలక ప్రాంతాల్లో నిఘా పర్యవేక్షణలో ముఖ్యభూమికను పోషిస్తున్నాయి. సైన్యం వినియోగిస్తున్న మరిన్ని అత్యాధునిక ఉపకరణాలను పరిశీలిస్తే.. సైనికుల ప్రమేయం లేకుండానే నిఘాతో పాటు శత్రు లక్ష్యాలపై గ్రెనేడ్లు, అధునాతన పేలుడు పదార్థాలను జారవిడిచే డ్రోన్లు ఉన్నాయి.

తూచ్.. రాహుల్‌గాంధీ అనుమతి తీసుకోలేదు

- ప్రాణాలకు ముప్పంటూ వేసిన దరఖాస్తును వెనక్కి తీసుకుంటానన్న కాంగ్రెస్ నేత న్యాయవాది

పుణె: వినాయక్ దామోదర్ సావర్కర్, నాథూరాం గాడ్సేల భావజాలం కలిగిన వ్యక్తులతో తనకు ముప్పు ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరఫున బుధవారం పుణెలోని కోర్టులో ఓ దరఖాస్తు దాఖలైంది. అయితే కొన్ని గంటల్లోనే దాన్ని ఉపసంహరించుకోనున్నట్లు ప్రకటన విడుదలైంది. రాహుల్ అనుమతి లేకుండా ఆ దరఖాస్తును తాను కోర్టు సమర్పించానని, అందులోని అంశాలపై కాంగ్రెస్ నేత తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారని. గురువారం దాన్ని ఉపసంహరించుకుంటానని న్యాయవాది మిలింద్ పవార్ ఒక ప్రకటన విడుదల చేశారు. లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సావర్కర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై పరువునష్టం దావాను పుణె కోర్టులో రాహుల్ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో విచారణ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రాహుల్ తరఫు న్యాయవాది మిలింద్ దరఖాస్తు దాఖలు చేశారు. ఇందులో ఫిర్యాదుదారుడైన సాత్యకి సావర్కర్. నాథూరాం గాడ్సే అమ్మతరఫు బంధువని పేర్కొన్నారు. సాత్యకి సావర్కర్ వంశస్థులు రాజ్యాంగ వ్యతిరేక, హింసాత్మక ధోరణులు కనబరిచారని తెలిపారు. సావర్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరిస్తున్న వారు ప్రభుత్వంలో కూడా ఉన్నారన్నారు. ఆ ఆలోచనా విధానాన్ని అనుసరిస్తున్న వారు రాహుల్‌పై తప్పుడు ఆరోపణలు చేయడంతో పాటు హాని తలపెట్టే అవకాశం ఉందని మిలింద్ పేర్కొన్నారు.

వెయ్యి ప్రసవాల్లో ఆరింట మృత శిశువులు

- ఉత్తర భారతంలోనే అధికం
- అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: భారత్‌లో ప్రతి వెయ్యి ప్రసవాల్లో ఆరు కంటే ఎక్కువ మృత శిశువుల జననాలు నమోదవుతున్నాయని ఓ అధ్యయనం వెల్లడించింది. ఉత్తరాది రాష్ట్రాల్లోనే శిశువుల మృత్యు రేటు అధికంగా ఉందని తెలిపింది. జాతీయ గణాంకాలు, పౌర రిజిస్ట్రేషన్ వ్యవస్థ 2020 నివేదిక నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఎయిమ్స్ గోరఖ్‌పుర్, దిల్లీలోని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్)లోని పరిశోధకులు ఈ అధ్యయనాన్ని రూపొందించారు. దీన్ని లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా జర్నల్ ప్రచురించింది. అధ్యయనం మేరకు...ఉత్తరాదిలోని ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్, రాజస్థాన్‌లో అత్యధికంగా మృత శిశువుల జననాలు నమోదయ్యాయి. "2020లో ప్రతి వెయ్యి మందిలో 6.548 శాతం మృతు శిశు జననాలు నమోదయ్యాయి. గ్రామీణ స్త్రీలల్లో కంటే పట్టణాల్లో జీవించే మహిళల్లోనే ఇది అధికంగా కనిపిస్తోంది" అని పరిశోధకులు తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో సిజేరియన్ శస్త్రచికిత్స అధికంగా అందుబాటులో ఉన్న కారణంగా ఆయా రాష్ట్రాల్లో మృత శిశు జననాలు తక్కువగా ఉన్నాయని అధ్యయనం తెలిపింది. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల్లో శిశు మరణాలు అధికంగా కనిపిస్తున్నాయని వివరించింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి మందులను తీసుకోవడం వల్ల ఈ సమస్యను పరిష్కరించవచ్చని, గర్భిణులు ప్రసవానికి ముందు కనీసం నాలుగు సార్లు అయినా పరీక్షలు చేయించుకోవాలని సూచించింది.

15న మాంసం దుకాణాల మూతపై మహారాష్ట్రలో భిన్న స్వరాలు

ముంబయి: స్వాతంత్ర్య దినోత్సవం నాడు మాంసం దుకాణాలను మూసి ఉంచాలన్న ఆదేశంపై మహారాష్ట్ర అధికార కూటమి భాగస్వామ్య పక్షాలైన భాజపా, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లు భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆహార ఎంపికల్ని నియంత్రించాలన్న ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ బుధవారం పేర్కొన్నారు. అయితే ఆగస్టు 15న తమ పరిధిలోని ప్రాంతాల్లో జంతు వధశాలలు, మాంసం దుకాణాలు మూసి ఉంటాయని నాగ్‌పుర్, నాసిక్, మాలేగావ్, ఛత్రపతి సంభాజీ నగర్, కళ్యాణ్-డోంబివలీ నగరపాలక సంస్థలు ప్రకటించాయి. ఎన్సీపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఈ మూసివేతను వ్యతిరేకిస్తున్నారు. అధికార కూటమి ప్రధాన భాగస్వామి భాజపా మాత్రం మూసివేత నిర్ణయాన్ని సమర్థిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు మాంసం దుకాణాల మూసివేతను 1988లో శరద్ పవార్ ముఖ్యమంత్రిగా ఉండగా అమలు చేశారని ఆ పార్టీ గుర్తు చేసింది.

ద.కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ భార్య అరెస్టు

- స్టాక్స్‌లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణ

సియోల్: దక్షిణ కొరియాలో జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్ భార్యను పోలీసులు అరెస్టు చేశారు. స్టాక్ మార్కెట్‌లో అవకతవకలు, లంచం తీసుకున్నట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి సుమారు నాలుగు గంటలపాటు కిమ్‌ను విచారించారు. దక్షిణ కొరియాలో బీఎండబ్ల్యూ డీలర్‌గా కిమ్ వ్యవహరించారు. ఈ క్రమంలో ఆమె యునిఫికేషన్ చర్చ్‌లో జరిగిన వ్యాపార భేటీలో అత్యంత ఖరీదైన బ్యాగ్‌లు, డైమండ్ నెక్లెస్‌లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



గాజా సరిహద్దు రఫాలో వివిధ దేశాల నుంచి మానవతాసాయం కింద తరలివచ్చిన ట్రక్కులు

అన్నార్తులపై ఇజ్రాయెల్ దళాల కాల్పులు

- 25 మంది మృతి

టెల్ అవీవ్: ఆకలితో ఆహారం కోసం సహాయ పంపిణీ కేంద్రాల దగ్గరకు వస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దళాలు కాల్పులు జరపడం ఆపడం లేదు. ఈ తరహా కాల్పులు ఇప్పటికే గాజాలో దాదాపు 1,000 మందిని బలిగొన్నాయి. బుధవారం మరో 25 మంది ప్రాణాలు కోల్పోయారు.

✦ త్వరలో తాము గాజాలోని కొన్ని ప్రాంతాల్లో సైనిక చర్య చేపట్టనున్నామని.. ఈ సందర్భంగా గాజాను విడిచి ఎవరైనా వెళ్లాలనుకుంటే వారికి అవకాశం కల్పిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు.

ఏఐతో సహజ నైపుణ్యాల క్షీణత

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)ను అదేపనిగా ఉపయోగించే వైద్యుల స్వతస్సిద్ధ నైపుణ్యాలు క్షీణిస్తాయని ఐరోపా దేశాలలో జరిగిన అధ్యయనం హెచ్చరించింది. కొలనోస్కోపీ సాయంతో క్యాన్సరేతర కణితులను (ఎడినోమా) కనిపెట్టే సామర్థ్యం వీరిలో 20 శాతానికి పైగా తగ్గిపోయిందని వెల్లడించింది. కొన్ని వ్యాధులను గుర్తించడంలో ఏఐయే ఎక్కువ సునిశితత్వం, నైపుణ్యం ప్రదర్శిస్తోంది. 1,400 కొలనోస్కోపీలను ఈ అధ్యయనానికి తీసుకున్నారు. వాటిలో 650 పరీక్షలను మాత్రమే ఏఐ సాయంతో నిర్వహించారు. ఏఐను వాడకముందు మూడు నెలలు, వాడిన తరవాత మూడు నెలలకు కొలనోస్కోపీ విశ్లేషణలను వైద్యులు పరిశీలించారు. ఏఐను వాడిన తర్వాత వైద్యులకు ఎడినోమాను గుర్తించే నైపుణ్యం తగ్గిపోయింది. ఏఐ సాయంతో కొలనోస్కోపీ చేస్తే ఎక్కువ సంఖ్యలో కణితులను గుర్తించవచ్చని తేలింది.

అవినీతి ఆరోపణల కేసుల్లో హసీనాపై మొదలైన విచారణ



- మరో 17 మందిపై కూడా..

ఢాకా: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు మరో 17 మందిపై ఢాకా కోర్టులో బుధవారం విచారణ మొదలైంది. వారిలో ప్రధాని మేనకోడళ్లైన అజ్మీనా సిద్ధిఖ్, బ్రిటిష్ ఎంపీ తులిప్ సిద్ధిఖ్‌లు కూడా ఉన్నారు. ఫిర్యాదు దారుడైన అవినీతి నిరోధక కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ నస్ జన్నత్ కేయా మధ్యాహ్నం స్పెషల్ జడ్జెస్ కోర్టు-4లోని జస్టిస్ ఎండీ రబియుల్ అలం ముందు సాక్ష్యాన్ని తెలిపారు. మరో మూడు కేసుల్లో వాంగ్మూలాల నమోదు ప్రక్రియ ఆగస్టు 11న ప్రారంభమైంది. ఈ కేసుల్లో హసీనాతో పాటు ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్, కుమార్తె సైమా వాజెద్ పుతుల్‌లు ఉన్నారని తెలుస్తోంది. పూర్వాంచల్ న్యూ టౌన్ ప్రాజెక్టులో నిబంధనలకు విరుద్ధంగా నివాసస్థలం కేటాయించారని వచ్చిన ఆరోపణల కారణంగా జనవరి 12 నుంచి 14 మధ్యలో హసీనా, ఆమె కుటుంబసభ్యులపై 6 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో మార్చి 25న ఏసీసీ 6 అభియోగ పత్రాలను సీనియర్ స్పెషల్ జడ్జెస్ కోర్టులో దాఖలు చేసింది. హసీనాను 6 కేసుల్లోనూ నిందితురాలిగా నమోదు చేసింది. నిందితులందరినీ కాందిశీకుల జాబితాలో చేర్చింది. ఇదిలా ఉండగా తనపై మోపిన అవినీతి ఆరోపణలపై విచారణను తులిప్ సిద్ధిఖ్ తోసిపుచ్చారు. అది రాజకీయ కక్షతో వండివార్చిన కేసని అభివర్ణించారు.

అత్యాచార బాధితురాలి పేరు వెల్లడి కేసు..

స్వాతి మాలీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు

దిల్లీ: ఆప్ ఎంపీ స్వాతి మాలీవాల్‌పై దిల్లీ పోలీసులు నేరారోపణ చేసిన కేసులో కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటించింది. 2016 జులైలో ఓ బాలిక అత్యాచారానికి గురై తీవ్రగాయాలతో మృతి చెందింది. బాలిక వివరాలను పేరుతో సహా మీడియాకు స్వాతి మాలీవాల్ బహిరంగపరిచారని, జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం అత్యాచార బాధితురాలి పేరు వెల్లడించడం నేరమంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో స్వాతి మాలీవాల్ దిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నేహా మిత్తల్ బుధవారం తీర్పు వెలువరిస్తూ మాలీవాల్‌పై కేసు కొట్టివేశారు.

వరద మైదానాలకు కొత్త నియంత్రణలు

దిల్లీ: వరద మైదానాలలో అభివృద్ధి కార్యకలాపాలకు పరిమితులు నిర్ణయించే నిబంధనావళిని రాష్ట్రాల పరిశీలనకు కేంద్రం పంపింది. దీనికింద వరద మైదానాలను రక్షిత, నియంత్రిత, హెచ్చరిక ప్రాంతాలుగా వర్గీకరించారు. ప్రతి అయిదేళ్లలో ఒకసారి వరదలకు గురయ్యే ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించారు. అందులో వంతెనలు, కరకట్టలు, వరదల నుంచి రక్షణ కల్పించే నిర్మాణాలు మినహా మరే శాశ్వత కట్టడాలను నిర్మించకూడదు. డంపింగ్ యార్డులను కానీ, ప్రమాదకర పదార్థాల నిల్వ గిడ్డంగులను కానీ ఏర్పాటు చేయకూడదు. దేశవ్యాప్తంగా వరద మైదానాల మ్యాపింగ్ పూర్తయ్యేంత వరకు నది నుంచి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలనూ చేపట్టకూడదు. ఉపగ్రహ సమాచారం, నదీ ప్రవాహంపై కంప్యూటర్ ఆధారిత అంచనాలు, వాతావరణ మార్పుల అంచనాలను ఉపయోగించి వరద ప్రాంతాల మ్యాపింగ్‌కు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలి. పాతికేళ్లకోసారి వరద పాలయ్యే ప్రాంతాలను నియంత్రిత ప్రాంతాలుగా వర్గీకరించారు. వందేళ్లలో ఒకసారి వరదపాలయ్యే ప్రాంతాలను హెచ్చరిక ప్రాంతాలుగా ప్రకటించారు. ఈ రెండుచోట్ల నిర్మాణాలపై రక్షిత ప్రాంతంలో ఉన్నన్ని నియంత్రణలు ఉండవు. కొండలు, హిమాలయ ప్రాంతాలలో ఆకస్మిక వరదలు, మట్టిపెళ్లలు విరిగిపడటం, హిమానీనదాలు కట్టలు తెంచుకోవడం వంటివి సంభవిస్తాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక చర్యలను ప్రతిపాదించారు. వరద మైదానాలలో ఆక్రమణలను తొలగించడం, అక్కడి జనావాసాలను తరలించడం, వరద హెచ్చరికలు జారీచేయడం కూడా నిబంధనావళిలో అంతర్భాగాలు.

ఉగ్రవాదంపై పోరాటానికి గట్టి మద్దతిస్తున్న

సింగపూర్‌కు రాష్ట్రపతి ప్రశంస



సింగపూర్ ఉప ప్రధాని యాంగ్‌తో రాష్ట్రపతి ముర్ము

దిల్లీ: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత ఉగ్రవాదంపై పోరాటానికి గట్టి మద్దతిచ్చిన సింగపూర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశంసించారు. ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లోనూ భారత్, సింగపూర్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యం వికసించడాన్ని కొనియాడారు. రెండు దేశాల మినిస్టీరియల్ రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన సింగపూర్ ఉప ప్రధాని గాన్ కిమ్ యాంగ్ నేతృత్వంలోని బృందం బుధవారం రాష్ట్రపతిని కలిసింది. యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ (మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఎక్రాస్ రీజియన్స్) విజన్, ఇండో పసిఫిక్ విజన్‌లలో సింగపూర్ కీలక భాగస్వామి అని ఈ సందర్భంగా రాష్ట్రపతి పేర్కొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంస్కృతిక, విద్యా రంగాల్లో రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఉందని తెలిపారు. ✦ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్యం, కమ్యూనికేషన్, డిజిటలీకరణ రంగాల్లో సహకార వృద్ధిపై భారత్, సింగపూర్ బుధవారం చర్చలు జరిపాయి.

భూ వివాదంలో కేంద్రమంత్రి కీర్తివర్ధన్ సింగ్

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశం

గోండా: భూ వివాదానికి సంబంధించి విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్, ఆయన అనుచరుడు రాజేష్ సింగ్, మరో ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఉన్న ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు ఆదేశించింది. పిటిషనర్ అజయ్‌కుమార్ కోర్టుకు చెప్పిన ప్రకారం.. ఆయన తన భార్య పేరు మీద బిట్టన్ దేవి అనే మహిళ నుంచి ఓ భూమిని కొనుగోలు చేశారు. అయితే కేంద్రమంత్రి అనుచరుడు రాజేష్ సింగ్.. భూ యజమానిని బెదిరించి పాత తేదీతో కొత్త సేల్ డీడ్‌ను రూపొందించారు. తద్వారా అజయ్ సింగ్ కంటే ముందుగానే ఆ భూమిని తాము కొనుగోలు చేశామని భ్రమింపజేసేలా నకిలీ పత్రాలు సృష్టించారు. దీనిపై బాధితుడు గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు మోసం జరిగిందని గుర్తించారు. తర్వాత కేసులు కూడా నమోదు చేసినప్పటికీ కొంతకాలం తరువాత మూసేశారు. దీంతో అజయ్ కోర్టును ఆశ్రయించగా కేసు దర్యాప్తును కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది. దీంతో పాటు తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారని, సెటిల్‌మెంట్‌కు ఒప్పుకోకపోతే చంపేస్తామని బెదిరించారని పిటిషనర్ వాపోయారు. ఈ వ్యవహారంపై ఆయన గోండా కోర్టును ఆశ్రయించగా అనుకూల నిర్ణయం వెలువడింది.

గుజరాత్‌లో పరువుహత్య.. నీట్‌లో ఉత్తీర్ణురాలైన ఆ యువతి



పాలన్‌పుర్: గుజరాత్‌లోని బనాస్‌కాంఠా జిల్లాలో పరువుహత్యకు గురైనట్లుగా భావిస్తున్న చంద్రిక (18) నీట్ పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఈ యువతిని ఆమె తండ్రి, ఇద్దరు బాబాయిలు హత్య చేసినట్లుగా ఆరోపణలు ఉన్నట్లు దంతా డివిజను ఏఎస్పీ సుమన్ నాలా బుధవారం తెలిపారు. నీట్ కోచింగు కోసం పాలన్‌పుర్ హాస్టలులో ఉన్న సమయంలో వివాహితుడైన హరేశ్ చౌధరి అనే యువకుడితో ఈమె ప్రేమలో పడి సహజీవనం ప్రారంభించింది. ఈ విషయం ఇంట్లో తెలిసి ఆమెను కట్టడి చేశారు. ఇదే సమయంలో పోలీసులు ఓ పాత కేసులో హరేశ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. జూన్ 21న విడుదలైన హరేశ్ ఆమె ఆచూకీ కోసం గుజరాత్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషను దాఖలు చేశాడు. ఈ పిటిషను జూన్ 27న విచారణకు రానుండగా, 24వ తేదీ రాత్రి చంద్రిక మృతి చెందింది. మరుసటిరోజు ఉదయాన్నే హడావుడిగా అంత్యక్రియలు కూడా పూర్తి చేశారు. "ఆమెకు పాలలో నిద్రమాత్రలు కలిపి ఇచ్చారు. నిద్రపోయాక గొంతు నులిమి చంపారు'' అని ఏఎస్పీ వివరించారు. హరేశ్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి నిందితులు ఇద్దరిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మూడో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

బెట్టింగ్ యాప్ కేసులో మాజీ క్రికెటర్ రైనాను ప్రశ్నించిన ఈడీ



దిల్లీ: నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్)తో ముడిపడిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ప్రచారం కేసులో మాజీ క్రికెటర్ సురేశ్ రైనాను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రశ్నించారు. ఉదయం 11 గంటల సమయంలో రైనా దిల్లీలోని ఈడీ కార్యాలయానికి వచ్చారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం నిర్వహించడం, వాటితో రైనాకు ఉన్న సంబంధం, తీసుకున్న రుసుములు తదితర అంశాల గురించి రైనాను అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్‌ల అక్రమాల కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం ఈడీ పలు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించింది. ఇప్పటికే పలువురిని ప్రశ్నించింది.

మరోసారి ప్రచారం చేయను

ఈడీ ముందు మంచు లక్ష్మి



ఈనాడు, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కేసును విచారిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట సినీనటి మంచు లక్ష్మి బుధవారం హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు ఈడీ కార్యాలయానికి చేరుకున్న ఆమె నాలుగు గంటలపాటు కార్యాలయంలో ఉన్నారు. తాను గేమింగ్ యాప్‌నకు ప్రచారం చేశానని ఆమె వాంగ్మూలమిచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ప్రచార ఒప్పందానికి సంబంధించిన పత్రాలతోపాటు బ్యాంకు ఖాతాలను ఈడీ పరిశీలించినట్లు సమాచారం. యాప్ నిర్వాహకుల కార్యకలాపాలపై తనకు సరైన సమాచారం లేదని ఆమె విన్నవించినట్లు.. మరోమారు ఇలాంటి ప్రచారం చేయనని చెప్పినట్లు తెలిసింది. విచారణ అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆమె ఈడీ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు.

సీఎం ఇంటి వద్ద నిర్మాణ పనులకు రూ.36 లక్షలు

ఈనాడు, అమరావతి: ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు ఇంటి వద్ద నిర్మాణ పనులకు రూ.36 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీ చేసింది. ప్రోటోకాల్ సెల్/ ప్యాంట్రీ ఏర్పాటు చేసేందుకు రూ.16.5 లక్షలు, యాంటీ టెర్మినేట్ ట్రీట్‌మెంట్, ఇంటి చుట్టూ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణానికి రూ.19.5 లక్షలు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే ఉత్తర్వు జారీ చేశారు.

రబీ అవసరాలకు 23.08 లక్షల టన్నుల ఎరువులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రబీ పంట అవసరాలకు కేంద్రం 23.08 లక్షల టన్నుల ఎరువులు కేటాయించిందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. నానో యూరియా, డీఏపీ వాడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. గతం కన్నా ఎరువుల కేటాయింపులు పెరిగాయన్నారు. ఎరువుల అమ్మకాలు, నిల్వలను తప్పని సరిగా ఈపోస్ యంత్రాల్లో నమోదు చేయాలని ఆదేశించారు. రబీ కాలంలో 44.05 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందుకుగానూ యూరియా 9.38 లక్షల టన్నులు, డీఏపీ 2.20 లక్షలు, ఎంఓపీ 1 లక్ష, కాంప్లెక్స్ ఎరువులు 9.50 లక్షలు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 1 లక్ష టన్నులు అవసరమని నివేదించగా ఆ మేరకు కేటాయింపులు చేసింది.

'పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి'

ఈనాడు, అమరావతి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున పశుపోషకులంతా అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ టి.దామోదర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు కొన్ని సూచనలు చేశారు. 'పశువులు సహా ఇతర జీవాల షెడ్లను పొడిగా ఉంచి వాటి చుట్టూ బ్లీచింగ్ పౌడర్ వంటివి చల్లాలి. ఈ కాలంలో సంభవించే వ్యాధుల నుంచి వాటిని రక్షించుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా అందించే నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి. పశువులకు సురక్షిత నీటిని అందించాలి. తడిసిన దాణా పెట్టకూడదు. లేగ దూడలకు వెచ్చని వాతావరణం కల్పించాలి. పశువులకు అనారోగ్య లక్షణాలు కనిపించినా లేదా చనిపోయినా సమీప పశువైద్యశాలలో తెలియజేయాలి' అని దామోదర్ వివరించారు.